
సౌందర్యానికి సోపానం
సంతోషానికి మణిహారం
గాంధి టెక్స్ ©
కాటన్ శారీస్

వీక్లీపోస్ట్

మేనక

మీనాక్షి శేషాద్రి ముఖచిత్రంతో వెలువడిన మీ(మా) ఆంధ్రపత్రిక సింప్లీ సూపర్బ్. ఐదు కథలు మా మనసు దోచుకున్నాయి. మా కెంతో నచ్చాయి. ప్రచురిస్తున్న ఐదు సీరియల్స్ నిజంగా 'సీ'రియల్సే. ప్రారంభమయిన హాస్యనవల 'నవ్వుల నదిలో' సూపర్.

–శీలం నరసింగరావు (అలమండసంత)

సెక్స్ కథలు

భానుప్రియ ముఖ చిత్రంతో ఏతెంచిన మా (మీ) పత్రికలో ప్రతి పేజీ సర్వాంగ సుందరంగా వుంది. ఈవారం మీరు ప్రచురించిన సెక్స్ కథలమీద పాఠకుల అభిప్రాయాలు బాగున్నాయి. నా అభిమాన శీర్షిక టిట్ ఫర్ టాట్‌ను ఈమధ్య ఒకపేజీకి పెంచారు. చాలా సంతోషం. ఈ శీర్షిక రాబట్టి దాదాపు సంవత్సరంపైగా అయ్యింది. టా నా, ఆంధ్ర సచిత్ర వార పత్రికల సాహితీ సంబరం పోటీలో బహుమతి పొందిన కథలు, కవితలు బాగున్నాయి. పత్రికలోని సీరియల్స్ వేటికవే పోటీ పడుతున్నాయి. డాక్టర్ నేనేం చేయాలి, యువతా-కవితా, వీక్లీ పోస్ట్ మొదలగు ఎన్నో పాఠక శీర్షికలున్న మా (మీ) పత్రిక నిస్సందేహంగా నెంబర్-1 పత్రిక.

-టి. రాంప్రసాద్, ప్రొద్దుటూరు

ఔ-భార్యలు

మీనాక్షి శేషాద్రి ముఖ చిత్రంతో వెలువడిన "ఆంధ్ర సచిత్ర వార పత్రిక" చాలా బాగుంది. మన్నెం శారదగారి "సూపర్ హీరో", "ఔరంగజేబు భార్యలు" వ్యాసం బావున్నాయి.

శ్రీధర సుధాకర్ (బరంపురం)

(80 వ పేజీ చూడండి)



పదండి లోపలికి

ముఖచిత్రం:
"ముస్తాబుకూడా అవసరమే" అంటున్న
రూపిణి
(ఫొటో: జి.కె. నరసింహం)

ఈ వారం ప్రత్యేకం!

కథలు:

సీరియల్ నవలలు!

వ్యాసాలు, శీర్షికలు!

పై వారం: తుఫాన్ వెలిసింది (టానా బహుమతి కథ)

విడిప్రతి వెల నాలుగు రూపాయలు

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తనమనంబునకగు దా
నొరులకునవి సేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్

THE ANDHRA PATRIKA
GROUP OF
MAGAZINES

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు

సంపుటం- 82; సంచికలు 38, 39

11/18-5-'90

శక సం. 1912 వైశాఖ మాసం.
21, 28 తేదీలు.

PRINTER, PUBLISHER &
SANCHALAKUDU:
CHAKRAPANI

EDITORS:
VEERAJI
M MADHAVA RAO

ASSOCIATE EDITORS:
POTLURI VENKATA RAO
Dr GUMMANURU RAMESH BABU

SUB-EDITORS:
P PRAMEELA
K S B TILAK
BHISETTY LAXMANA RAO

ARTISTS:
KASI
CHALAM

PRODUCTION &
ADMINISTRATIVE MANAGER:
M THYAGARAJ

SENIOR ADVERTISEMENT MANAGER:
K RAMACHANDRAIAH

CIRCULATION MANAGER:
S APPADORAI

Printed and Published for
Nageswara Rao Estates Ltd., by
VAMARAJU CHAKRAPANI at the
Andhra Patrika Press, Gandhinagar,
Vijayawada-520 003,
Editor: VEERAJI
Phones: Business: 61247, 61248,
Editorial: 75667.

సంపాదకీయం...

మద్రాసులో శ్రీలంక 'టెర్రరిస్టులు!'

శ్రీలంకలో భారత శాంతి సేన వనవాసం చేసినంత కాలం యిప్పటి శ్రీలంకేశుడైన ప్రేమదాసగారు వారి పట్ల "ద్వేష దాస"గా వ్యవహరించి తమిళ ఉగ్రవాదులైన యల్.టి.టి.ఇ. పులులను "దువ్వి" "దువ్వి" యిప్పుడు పీకల మీదికి తెచ్చుకున్నాడు. అక్కడ గడిచిన రెండు వారాలుగా తీవ్ర అరాచకం, అంతర్యుద్ధ పరిస్థితి యేర్పడిపోయి-ఈశాన్య రాష్ట్రంలో తమిళుల ధన,మాన ప్రాణాలకు, సింహళీయుల వల్ల, తమిళ సంస్థలలో హింసావాదుల మధ్య గల వర్గ, స్వార్థ వైషమ్యాల వల్ల కూడా అపారనష్టం జరుగుతున్నది! జాత్యహంకార హింసాత్మక "ఘోరకలి" యించుమించు ఎనిమిది సంవత్సరాలుగా అక్కడ విజృంభించగా పోగు సంబంధం తెంచుకున్నా-ప్రేగు సంబంధం త్రెంచుకోలేక, శ్రీలంక తమిళుల సంక్షేమం కోరిన భారతదేశం తినరాని తిట్లు తిన్నది-పడరాని నిందలు మోసింది. భారత-శ్రీలంకల మధ్య శ్రీ రాజీవ్‌గాంధీ చేసుకున్న వొప్పందం భారత్‌కు చాలా ఇబ్బందుల్ని కొని తెచ్చింది కాని-యింత జరిగిన తరువాత కూడా శ్రీలంక సాగర కల్లోలం తరగలేదు, రక్తపాతం ఆగలేదు.


ఇ.పి.ఆర్.యల్.యఫ్. గ్రూపుకి తమిళ యీళం టైగర్స్‌కీ మధ్య అధికార దాహంతో జరిగే అంతః కలహాలు-సాయుధ పోరాటాలు ఒక ప్రక్క-తమిళ ఉగ్రవాదులకి, సింహళ ఉగ్రవాదులకీ మధ్య మరొక ప్రక్క నిత్య సంకుల సమరం-వీటి ప్రతిధ్వనులు, తమిళ రాష్ట్రమైన 'మద్రాసు'లో 1982 నుంచి అడపాతడపా వినపడుతూనే వున్నాయి. 1984 "నాటి మీనంబాక్కం" విమానాశ్రయం ప్రేలుడు దుర్ఘటన తరువాత ఈ జూన్ మూడోవారంలో జనసమ్మర్దం గల పట్టణ ప్రాంతంలో "ఇ.పి.ఆర్.యల్.యఫ్." నాయకుల మీద జరిగిన దారుణ కాల్పులు-15 మందిని విగత జీవుల్ని చేశాయి. పాతిక మంది దాకా గాయపడ్డారు. ఎ.కె-47 రైఫిళ్లతో ప్రత్యర్థి వర్గం మీద విచ్చలవిడిగా, నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపిన ఈ టెర్రరిస్టు ముఠా ఎల్.టి.టి.ఇ. వారే అవ్వాలి కదా! ఇ.పి.ఆర్.యల్.యఫ్. నాయకుడు కె. పద్మనాభను చంపడమే ఈ దాడి ప్రధాన లక్ష్యం అయి ఉండవచ్చును-అయితే ఈ దారుణ హింసాకాండ- శ్రీలంకలోని ఈశాన్య ప్రాంతంలోనో-మరో చోటనో జరిగితే ఆశ్చర్యపోనక్కరలేదు. మనదేశంలో మద్రాసులో పౌరజీవితాన్ని, పట్టణ వాసుల భద్రతను అస్తవ్యస్తం చేస్తూ జరిగింది కనుకనే ఇంత ఆవేదన, ఇంత ఆరాటం!

శ్రీలంకలో జరుగుతున్న 'పోరాటం' ఆ దేశ అంతరంగిక సమస్య అవ్వొచ్చునేమోకాని, మనకు తీరని ఆందోళన భరించలేని తలనొప్పిగా పరిణమించింది-టెర్రరిస్టు ఆగడాలు. కెనడాలో, ఇంగ్లాండులో, అమెరికా సంయుక్త రాష్ట్రాల భూభాగం మీద జరుగుతూనే ఉంటాయి. కాని అంతమాత్రాన మనం ఈ టెర్రరిస్టు ముఠాలకు ఆయా ప్రభుత్వాలే వత్తాసు పలుకుతున్నాయి, అవి మద్దతు నిస్తున్నాయని అనడం లేదు- కాని శ్రీలంక రక్షణ మంత్రి శ్రీ విజేరత్నే నాలుక ఒక అకురాయి! అది ఎట్లాబడితే అట్లా భారతదేశం మీద అవాకులు చెవాకులు వదరుతూనే వుంటుంది. పైగా డి.ఎమ్.కె. వారు ఒక నాడు [ఈనాటి సంగతి ఏమిటో శ్రీ కరుణానిధి చెప్పాలి] తమిళ పులులను బాగా దువ్వి చేరదీసిన వారు-ఈ నేపథ్యంలో చూస్తే, భారతదేశంలో కేంద్ర, తమిళనాడు రాష్ట్రాల మధ్య స్పర్థలు-అపార్థాలు రాగల ప్రమాదం ఇనుమడించింది. శ్రీలంక తమిళ గ్రూపులు- తమలో తాము యాదవకుల మొసలంగా యిట్లా, యింటా బయటా చంపుకుంటూ- తమకీ-తమ జాతికి మూల భూమి అయిన భారతదేశానికి కూడా తలవొంపులు తెచ్చుకోవడం చాలా తప్పు. శ్రీలంక తమిళులకు ఇది చేసే 'కీడు' కొన్ని తరాల దాకా తొలగిపోదు. శ్రీలంకలో ప్రేమదాస పోలీసు బలగాలతోను-యితర తమిళ ఉగ్రవాదులతోను జె.వి.పి. ముఠాలతోను తలపడుతున్న రక్తపిపాసువులైన ఈళం టెర్రరిస్టులు-సంయమనంతో తాపీగా ఆలోచిస్తే-వారు వర్తమాన భవిష్యత్‌లను "రక్తసిక్తం" చేసుకోడం మానుకుంటారు. తమిళనాడులో వున్న డి.ఎమ్.కె. గవర్నమెంట్ ఈ విషయంలో అప్రమత్తంగా వుండి-అవసరమైన ప్రత్యక్ష పరోక్ష చర్యలు తీసుకుంటే తప్ప అపార్థాల పాలైపోతుంది! దేశంలో అనర్థాలకు కారణం కూడా అవుతుంది! కేంద్రంలోని ఫ్రంట్ ప్రభుత్వం, రాష్ట్రంలోని తమిళ ప్రభుత్వం ఈ విషయంలో అతి జాగ్రత్తగా వ్యవహరించాలి. కేంద్ర, రాష్ట్ర నాయకులు యిరువురు కూడా సరియైన అవగాహనకు రావాలి. మద్రాసు మహానగరంలో భద్రతా చర్యలు ఇంకా అధ్వాన్నం కాకమునుపే శ్రీ కరుణానిధి స్థానికుల మీద కరుణ వహించి సరియైన కట్టుబాట్లు చేస్తారని అందరు ఆశిస్తున్నారు-శ్రీలంక తలనొప్పిని నివారించే మార్గాలను డి.ఎమ్.కె. ప్రభుత్వం ఒక్కటే కాదు-తమిళనాడు రాజకీయ పార్టీల యితర నాయకులు కూడా బాగా యోచించి రూపొందించాలి!

(22-6-90) ●

అంతర్దర్శనం

'సంఘమిత్ర



"తమరు బోర్డు మెంబరని తెలిసింది. అంతే మాటిచ్చేసాను"– గురవయ్య గొణిగాడు.

"బోర్డు మెంబరేం ఖర్మ. బోర్డుకు నేనే పెద్ద"– రాజారావు నవ్వుతూ చెప్పాడు.

"అదే... అదే... తమరీ వుపకారం చెయ్యాలి తప్పదు"

కాసేపు యిరువురి మధ్యా ఎయిర్ కండిషనర్ సన్నగా చేస్తున్న శబ్దం.

"నీకు తెలుసా మా అమ్మాయి పెళ్లి నిశ్చయమైంది" రాజారావు కాఫీ చప్పరిస్తూ మాట మార్చాడు.

గురవయ్యకు సంతోషమైంది. డివిజినల్ ఇంజినీరు రాజారావు తీరే అంత. తన ఉద్దేశ్యాన్ని సూటిగా చెప్పడు. కేసు నెగ్గినట్టే అనుకున్నాడు, గురవయ్య.

"సంతోషం పెండ్లి రెండ్రోజులూ విందు, వినోదాలకయ్యే ఖర్చు ఉడతా భక్తిగా నేను భరిస్తాను. కాదనకండి"– అన్నాడు గురవయ్య.

రాజారావు ఆలోచించాడు. రెండ్రోజులకయ్యే ఖర్చు సుమారుగా పాతిక వేలకు మించే వుంటుంది.

"అబ్బె... బ్బే..." రాజారావు డిప్లొమసీ ప్రదర్శించాడు. ఇంజినీరింగులో 'డిప్లొమసీ' చెప్పరు. జీవితంలో గెలవడానికి డిప్లొమసీ అవసరం తప్పనిసరియని గ్రహించి, రాజారావు చాల కష్టపడి నేర్చుకున్నాడు.

"విందు గురించి కాదు. డెకరేషన్ ఏర్పాట్ల గురించి ఆలోచిస్తున్నాను."

"మీరేం కంగారు పడకండి మనుష్యుల్ని పంపుతాను. ఏం చేయాలో చెప్పండి. అంతా వాళ్లు చూసుకుంటారు" కంట్రాక్టరు గురవయ్య గొంతులో బిల్లు ప్యాసైన ఆనందం.

రాజారావు నవ్వుతూ అడిగాడు, "అతను మీకు బంధువా"

గురవయ్య సమాధానంగా చిన్నగా నవ్వి, చిన్న చీటీపై వివరాలు వ్రాసి యిచ్చి, పనుందంటూ సెలవు తీసుకున్నాడు.

బేరం ఒకమారు సెటిల్ అయ్యాకా గురవయ్య వంటి పెద్ద కంట్రాక్టర్లు ఒక్కక్షణం కూడా నిలువరు. రాజారావుకు తెలుసు, ఆ కుర్రవాడు గురవయ్యకు అల్లుడు కాబోతున్నాడని. ఏమైతేనేం? తనక్కూడా బాగానే కిట్టింది. అసలు గురవయ్య ఊరికనే యీ పని చేయాలని పట్టుపట్టినా రాజారావు చేసి పెట్టవలసిందే. ఆ యిరువురికీ వున్న సంబంధం అటువంటిది మరి. ఒకరి వల్ల ఒకరు బాగుపడ్డారు. ఒకర్నొకరు వాడుకున్నారు. మొత్తానికి గురవయ్య పాతిక వేలు ఖర్చుతో అల్లుడ్ని ఇంజినీరు చేసేస్తున్నాడు, అనుకున్నాడు రాజారావు.

* * * *

'గెస్ట్‌హవుస్' కిటకిట లాడుతోంది.

వరద ముంపుకు గురైన ప్రాంతాన్ని దర్శించి వస్తున్న మంత్రిగారు మందీ మార్బలంతో అక్కడ బస చేసారు. మంత్రిగారి గౌరవార్థం విందును ఏర్పాటు చేసిన హౌస్టుకు వరదలో కొట్టుకొచ్చినట్లు మంత్రిగారి వెంట వచ్చిన జనాన్ని చూసి మతిపోయినంత పనైంది. మంత్రులు యిటువంటి సందర్భాలలో పార్టీ కార్యకర్తలతో చాలా ఫ్రీగా వుంటారని, పూర్తి లిబర్టీ యిస్తారనీ క్రొత్తగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి, రాబోయే ఎన్నికలలో పార్టీ టికెట్ సంపాదించాలని అనుకుంటూన్న హౌస్టుకు పాపం! తెలీదు. ఎలాగైతేనేం విందు పూర్తయింది.

విందారగించిన మంత్రిగారు కాసేపు వరండాలో కూర్చున్నారు. ఒక్కొక్కరే మంత్రిగారి చుట్టూ చేరారు. అందరూ వచ్చాక మంత్రిగారు మాట్లాడేరు.

"మనిషికి ప్రేణం వొప్పుడు పోద్దో తెలీదు. వొరుసం వొప్పొస్తదో ఎరికుండదు. నేను సేతున్న యీ మంతిరి పదవీ అంతే. ఎప్పుడొస్తదో, ఎణగపోద్దో టికానీ లేదు. అందుకే నాకు ఓట్లు ఏయిచ్చిన మీకు ఏధైన మంచి సెయ్యాలనుకుంటే యిలాటప్పుడే సెయ్యాల. ఎవురెవురికేటికావాలో కాయితా రాసి సెక్రెటీ బాబుకివ్వండి. నేను సెయ్యో దగింది సేతాను. యిక మర్నాకు చెలవ"

మాట్లాడడం పూర్తి చేసి భుక్తాయాసం తీర్చుకునేందుకు మంత్రిగారు లోపలికి నడిచారు. రాజారావుకు మంత్రిగారు చెప్పింది నిజమే ననిపించింది. వీరి వెలుగు అయిదేండ్లు. మహా అయితే పదేండ్లు! ఈలోగా అదృష్టం వక్రిస్తే

అవిశ్వాస తీర్మానం లేదా హైకమాండ్ చిన్నచూపు ఎలానూ వుండనే వున్నాయి. మరి అధికారుల సంగతో?- కొంచెం జాగ్రత్తగా వుండి పనుల్ని చక్కదిద్దుకుంటే జీవితం పొదవునా సంపాదించుకోవచ్చు. రాజారావు తనెంతో అదృష్టవంతుడ్ననుకున్నాడు.

"మిమ్మల్ని పిలుస్తున్నారు" ఎవరో వచ్చి చెప్పారు.

"ఎవరూ"- అంటూ ఆ మాట చెప్పిన వ్యక్తి చూపిన దిశగా చూసాడు. సెక్రటరీ, చిన్నగా నవ్వుతు తనను రమ్మని సైగ చేసాడు.

రాజారావు దగ్గరకు వెళ్ళి వినయంగా నిల్చున్నాడు.

"ఉండండి. మీతో కాస్త మాట్లాడాలి"- సెక్రటరి రాజారావు నుద్దేశించి చెప్పాడు. కాసేపటికి సోఫాలోంచి లేచి రాజారావును కొంచెం ప్రక్కకు తీసుక వెళ్లాడు.

"మీరు పెట్టుకున్న దరఖాస్తు ప్రస్తుతం మా పరిశీలనలో వుంది" సెక్రటరి రాజారావును కాకుండా మరెవర్నో ఉద్దేశిస్తున్నట్లు ఎటో చూస్తూ చెప్పాడు.

రాజారావు అటువైపు చూసాడు. అక్కడెవరూ లేరు. సెక్రటరీలు యిలానే మాట్లాడుతారు కాబోలు అనుకున్నాడు. అతడికి ఏం చెప్పాలో వెంటనే తట్టిందికాదు. రావలసిన చీఫ్ ఇంజినీరు పోస్టు ఎలిగేషన్లు వున్నాయనే కారణంగా యింకొకరి కిచ్చారు. రాజారావుకు కోపం వచ్చి, యిన్నాల్లూ తను డిపార్టుమెంటుకు ఎలా సేవ చేసింది తెలియజేస్తూ ప్రమోషనుకు తను అన్ని విధాలా యోగ్యుడని విన్నవించుకున్నాడు.

"మరేం ఫరవాలేదు. నేను చేయవలసిన దంతా చేస్తాను"-సెక్రటరీ భరోసా యిచ్చారు.

"బేరం పెడతాడా?"- అనుకున్నాడు రాజారావు. బోడి ప్రమోషను ఎవడిక్కావాలి? పైగా ఆ పోస్టుకుపోతే సంపాదన కూడా తగ్గిపోతుంది. ఇలా అనుకోవడమైతే అనుకున్నాడు గానీ, రాజారావుకు మనసులో ఏదో మూల చీఫ్ యింజినీర్ కావాలనే కోరిక ఉంది.

సెక్రటరి రాజారావులో వచ్చిన మార్పును గుర్తించి, చిన్నగా నవ్వుతూ, "ఈ కేసు మీరు స్వయంగా చూడాలి. నాకు బాగా కావలసినవాడు. మినిష్టరుగారితో నే చెప్పివుందును. గానీ అంతవరకూ ఎందుకూ"- అంటూ చిన్న స్లిప్ రాజారావు చేతికి అందించాడు.

సెక్రటరీ యిచ్చిన స్లిప్ అందుకుని, ఒమారుచూసి పదిలంగా జేబులో పెట్టుకుని, శలవు తీసుకున్నాడు రాజారావ్.

* * * * * *

గెస్ట్ హవుస్ నుండి బయలుదేరి రాజారావు సరాసరి ఆఫీసుకు వచ్చాడు.

అప్పటికే పి. ఎ. రావలసిన ఫైలు సిద్ధం చేసి టేబిలుమీద ఎదురుగా వుంచాడు. "ఈరోజు దీని సంగతి తేల్చకపోతే కాంపిటిషన్ యింకా పెరిగి మంత్రులు రంగ ప్రవేశం చేస్తారు". అనుకొంటూ రాజారావు ఎదురుగా వున్న ఫైలు అందుకున్నాడు.

ఫైలు కవరుమీద "రిక్రూట్‌మెంట్ టు ది పోస్టు ఆఫ్ అసిస్టెంట్ ఇంజనీర్"- అని గుండ్రంగా వ్రాసివుంది. ఫైలు తెరిచి కాగితాలు ఒక్కొక్కటీ తిరగవేసాడు. "డ్రాఫ్టు ఆర్డరు ఆఫ్ మెరిట్ లిస్ట్" మాత్రం పూర్తయింది. ఒక్కొక్క అభ్యర్థికి వ్రాత పరిక్షలో వచ్చిన మార్కులూ, ఓరల్ ఇంటర్‌వ్యూలో ఆప్టిట్యూడ్ పరిక్షించి తమకు తోచిన విధంగా తతిమ్మా నలుగురు బోర్డు మెంబర్లు వేసిన మార్కులూ వేర్వేరు కాలమ్స్‌లో వేసి వున్నాయి. రాజారావు అసెస్‌మెంటుకు సంబంధించి మార్కులు వేయడానికి ఓ కాలమ్ ఖాళీగా వుంది. ఈ పద్ధతంతా పకడ్బందీగా రాజారావ్ స్వయంగా నిర్వహిస్తాడు.

'డ్రాఫ్టులిస్టు' ఓమారు పరిశీలనగా చూస్తూ, జేబులోంచి సెక్రటరీగా రిచ్చిన స్లిప్ తీసాడు. ఉదయం కంట్రాక్టరు గురవయ్య చెప్పిన కేసు కూడా చూసాడు. ఒకటీ, రెండూ తేడాల్తో ఇద్దరికీ ఒకేలా మార్కులు వచ్చాయి. పెన్సిలు అందుకుని, రెండు పేర్లకు ఎదురుగా తను మార్కులు వేయవలసినచోట చిన్న చుక్కల్ని పెట్టాడు. తర్వాత పేర్లని క్యాజువల్‌గా చూసాడు.

ఒక పేరువద్ద రాజారావు చూపులు నిలిచాయి. ఆ అభ్యర్థికి వ్రాత పరీక్షలో అందరికంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. రాజారావుకి ఆ పేరు బాగా జ్ఞాపకం వుంది. మరోమారు చూసాడు. బోర్డు మెంబర్లు ఓరల్ ఇంటర్‌వ్యూలో తగ్గించి అసెస్‌మెంట్ వేసినా మొత్తంమీద అందరికంటే ఎక్కువ మార్కులే వచ్చాయి. రాజారావు యిబ్బందిగా కుర్చీలో కదిలాడు.

"వెధవ మరీ యింత తెలివిగా లేకపోతేనేం?" అనుకున్నాడు.

అతనికి ఇంటర్‌వ్యూ రోజు గుర్తొచ్చింది. ఆ రోజు కూడా యింతే. ఈ అభ్యర్థి రాజారావుకు బాగా యిబ్బంది కలిగించాడు. నలుగురి బోర్డు మెంబర్లు అడగవలసినవి పూర్తయ్యాక రాజారావు వంతు వచ్చింది. రాజారావు సూటిగా చూసా డతడ్ని. ఎర్రని ఛాయ, సన్నగా చురుగ్గా బలంగా వున్న శరీరం, కళ్లల్లో కొట్టొచ్చినట్లు కనిపించే తెలివి పెదాలపై చిరునవ్వు. విజయగర్వం తొణికిసలాడుతున్న పలుచని ముఖం.

ఆ అభ్యర్థిని ఏం అడగాలో రాజారావ్‌కు ఏ పట్టాన తో చిందికాదు.

"ఈ ఉద్యోగం నీకు వస్తుందనుకుంటున్నావా?"

"అవును"- నిశ్చయంగా చెప్పాడా యువకుడు.

"రావాలనుకుంటే మాకు నచ్చిన విధంగా ప్రయత్నించి వుండాల్సింది"- రాజారావు మనసులో అనుకున్నాడు.



మిథున్!

మిథున్‌చక్రవర్తి వ్యక్తిత్వం అంత మంచిదికాదట. శక్తిసామంత నిర్మించి అతి త్వరలో విడుదల చేస్తున్న 'దుష్మన్'లో తనకు అవకాశం దొరికేందుకు చుంకీపాండేని వెళ్ల గొట్టాడు. సినిమాలో అవకాశం పోతే పోయింది. చుంకీ మాత్రం చాలా సంతోషంగా వున్నాడు. కారణం ఈ చిత్రానికి సంతకం చేసే ముందే 75 వేలు తీసుకున్నాడట. అవి తిరిగి యివ్వటంలేదు. అందుకే సినిమా పోయినా డబ్బు దక్కిందని సంతోష పడుతున్నాడు.

''ఒకవేళ రాకపోతే''- రాజారావు ప్రశ్నించాడు.

''ఇప్పుడు చేస్తున్నదే చేస్తాను. ట్యూషన్లు చెప్పుకోవటం''- ధీమాగా నవ్వుతూ సమాధానం చెప్పాడు యువకుడు.

రాజారావు యిబ్బందిగా సీట్లో కదిలాడు. ఒక్కక్షణం తన తండ్రి జ్ఞప్తి కొచ్చాడు. అతడిలో గత పాతికేండ్లుగా ఎన్నడూ కలుగని భావం కలిగింది. స్వయంగా అప్రూవ్‌చేసి బిల్లు పేమెంట్ చేయించిన రోడ్డు ఒక్క వాన జల్లుకే తుడిచి పెట్టుక పోయినప్పుడూ, భవనాలు అమాంతం కూలి ప్రాణనష్టం కలిగినప్పుడూ- అతడిలో ఎప్పుడూ యిట్టి భావం కలుగలేదు.

రాజారావ్ తండ్రి మధ్య తరగతి కుటుంబీకుడే. ఎన్నో కష్టాలకు ఓర్చి కొడుకును బి. ఇ. చదివించాడు. ఆ రోజుల్లో డిమాండు బావుండంవల్ల రాజారావును ఉద్యోగం వెతుక్కుంటూ వచ్చింది. తర్వాత రాజారావు ఉద్యోగంలో తనకు కావలసిన దేమిటో వెతుక్కున్నాడు. అయితే అలా వెతుక్కుంటూన్న క్రొత్తలో రాజారావుకు తను తప్పు చేస్తున్నానేమోననిపించేది. కాన్షస్, అంతరాత్మ, పాపం, అన్యాయం, యిత్యాది అగోచర పదార్థాలు అడ్డు తగుల్తుండేవి. అయితే ఆ యా పదార్థాలకు ఫిజికల్ ఎగ్జిస్టెన్స్ లేనందున వర్తమాన ప్రపంచంలో వాటికి స్థానం లేదని రాజారావు కొద్దికాలంలోనే గ్రహించగలిగాడు. ఇలా గ్రహించాక

అంతర్దర్శనం

రాజారావుకు తను చేస్తున్నవన్నీ ఒప్పులుగానే కనిపించాయి. అతడు అనతికాలంలోనే అంచెలంచెలుగా పైమెట్లకు చేరుకున్నాడు. భౌతిక ప్రపంచంలో బాగా సుఖ పడుతున్నాడని నలుగురూ ఆధార సహితంగా చెప్పుకునేందుకు కావలసిన హంగామా సమకూర్చుకున్నాడు. పెద్ద బంగ్లా, ఖరీదైన రెండు కార్లు, అర డజను పెద్ద కంపెనీల్లో షేర్లు, చక్రవృద్ధితో పెరుగుతూన్న బ్యాంకు బ్యాలెన్సులూ వగైరా చాలా వాటికి స్వంత దారుడయ్యాడు.

కొడుక్కి తగిన ఉద్యోగం దొరికినందుకు తండ్రి క్రొత్తలో చాలా సంతోషించాడు. క్రమేపీ రాజారావులో వస్తూన్న మార్పు, విచిత్ర మనస్తత్వం కొద్ది రోజుల్లోనే అర్థం చేసుకున్నాడు తండ్రి. వాదన పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఒకనాడు కొడుకు తండ్రిని 'నీమా నాననీ వూరుకో' అని హెచ్చరించాడు. ఆరోజే రాజారావు తండ్రి వేరుగా పోయాడు. తర్వాత కొన్నాళ్లకి పుణ్య క్షేత్రాలు తిరిగి రావడానికి బయలుదేరాడు. అంతే! మళ్లీ తిరిగి రాలేదు.

మనసు పొరల లోతులో చిన్నగా కదిలి బలంగా బయటకు తన్నుక వస్తున్న అనిర్వచనీయమైన భయంతో హృదయం గట్టిగా చప్పుడు చేసింది... ఎదురుగా వున్న అభ్యర్థిని చూస్తూ కాసేపు కళ్ళు మూసుకున్నాడు.

''పోనీ ఈ ఒక్కడ్ని సెలక్టు చేస్తేనేం?'' అనిపించింది.

వెంటనే రాజారావుకు జ్ఞాపకం వచ్చింది. ''ఉన్నదే ఒక్క పోస్టుకదా!- అని. అంతే మరుక్షణంలో రాజారావు సర్దుకున్నాడు. తనకు తాను తమాయించుకుని, ఇంటర్వ్యూ పూర్తయినట్లు ప్రకటించాడు. ఇంటర్వ్యూ పూర్తయింది. అందరూ లేచి వెళ్ళిపోబోతున్న తరుణంలో రాజారావ్ ఆ అభ్యర్థిని వెనక్కు పిలిచాడు, ఎలాగైనా ఓడిద్దామని.

అందరూ వచ్చి యథా స్థానాల్లో కూర్చున్నారు.

''ఇంటర్వ్యూ''- అంటే అర్థం రాజారావు అడిగాడు.

''అంతర్దర్శనం''- ఈ అభ్యర్థి తక్కున జవాబిచ్చాడు నవ్వుతూ.

''ఇక- నీ వెళ్ళొచ్చు'' అన్నాడు రాజారావ్ మిగిలిన మెంబర్ల వైపు నవ్వుతూ చూస్తూ. ఆ అభ్యర్థి వెళ్తూ, వెళ్తూ రాజారావ్‌కేసి పిచ్చివాడ్ని చూసినట్లు చూసి మరీ వెళ్లాడు.


అదే- ఆ చూపు రాజారావు పెన్సిలుని ఆ పేరుమీద నిలిపింది. రాజారావు చూపు ఆ పేరు మీదుగా కదిలేముందు అతడి చేతిలో పెన్సిలు అప్రయత్నంగా అక్కడో చుక్క పెట్టింది.

* * * * * *

రాజారావు ఆలోచించాడు. ఆలోచనంటే లాభనష్టాలు బేరీజు వేసుకున్నాడు. తనకింకా సంవత్సర కాలం మాత్రం సర్వీసువుంది. చీఫ్ ఇంజనీరు కాకుండానే రిటైరయిపోతానను కున్నాడు. మంత్రిగారి సెక్రటరీ భరోసాయిచ్చాడు. కంట్రాక్టరు గురవయ్యకు యిచ్చిన మాట నిలబెట్టుకోకపోతే యిద్దరిమధ్యా పదేండ్లుగా వస్తూన్న సంబంధం పుటుక్కున తెగిపోతుంది. రాజారావుకు అది భరించలేని విషయంగా తోచింది. తెగించిన మనసు కనీసం ఈమారైనా ఓ మంచి పని చేయమని పదేపదే చెబుతోంది. ''చేస్తే మనకు జరిగే మంచేముంది''?- రాజారావు మనసును ప్రశ్నించాడు. ''జరిగే చెడు కూడా లేదుకదా''- మనసు ఎదురు జవాబిచ్చింది.

* * * * * * *

డ్రాఫ్టు లిస్టు పై నుండి క్రింది వరకూ చూస్తే రాజారావుకు మూడు పెన్సిలు చుక్కలు కనిపించాయి. ప్రతీ చుక్కకూ ఓ ప్రత్యేకతవుంది. రాజారావుకు ఏం చేయాలో తోచడం లేదు. వయసు పెరగడం వలన సరిగ్గా ఆలోచించ లేక పోతున్నానేమో నని రాజారావు అనుకున్నాడు. వయసు ప్రస్తావన వచ్చేసరికి- రాజారావుకు మెరుపులా ఆలోచన తట్టింది. అంతే! ఒక నిర్ణయం తీసుకున్నాడు. మరుక్షణం క్వీన్- ఎక్స్ కలిపిన చెక్‌పాక్ వారి క్రిమ్సన్ వయొలెట్ యింకు నింపిన పార్కర్ పెన్ రాజారావు జేబు నుండి బయటకు వచ్చింది. పచ్చగా మెరుస్తున్న దాని బంగారు పన్నె పాళీ ఓ చుక్క వద్ద వయ్యారంగా నిలిచింది. ●



తల్లి కాబోతున్న పూనమ్

పూనమ్‌ధిల్లాన్ త్వరలో తల్లి కాబోతున్నదట. ఇదేమంత ఆశ్చర్య కరమైన విషయం కాకపోవచ్చు కాని ఇంగ్లండ్‌లో పురుడు పోసు కుంటుందంటున్నారు. అందు కోసం ధిల్లాన్ దంపతులు ఇంగ్లండ్ పయనమై వెళ్లారు. అదే రూట్లో వున్న రేఖను తన విషయం గురించి ఆరా తీస్తే నేను మాత్రం బొంబాయిలోనే పురుడు పోసుకుంటానని ఖచ్చితంగా చెప్పేసింది! బొంబాయి వాతావరణానికి బాగా అలవాటుపడింది కదా! అందుకేనేమో!



ఫారెక్స్–ఎగ్.
పాల లాగే సులభంగా
జీర్ణమవుతుంది
ఆరు నెలల వయసునుంచీ మీ పాపాయికి ఒకే ఉత్పాదన ద్వారా గ్రుడ్లు మరియు పాలు ఈ రెండింటిలోని ప్రోటీన్ సమృద్ధమైన పోషణను అందించండి.
ఫారెక్స్-ఎగ్ ముందుగానే వండబడి మీ పాపాయి యొక్క సున్నితమైన జీర్ణకోశం సులభంగా జీర్ణించుకునేలా తయారుచేయబడింది.
PROTEIN-RICH
Farex-egg®
WITH CEREAL, EGGS AND MILK
ప్రోటీన్ సమృద్ధి
ఫారెక్స్:
పెరుగుదలకు రుచికరమైన విధానం

Gx/188.89 Tel.

శ్రద్ధ



దౌర్భాగ్యం అండతో చీకటి యింటిని కబళించే ప్రయత్నంలో వుంది. అంతవరకూ చీకటిని గది మూలకు నెట్టి వుంచిన కిరోసిన్ బుడ్డీ ఎగశ్వాసతో ఉక్కిరి బిక్కిరవుతోంది - ఆస్మారోగిలా.

ఆ డౌట్ హౌస్ తప్పతాగి ఒళ్లు మరచి పడున్న తాగుబోతులా నిశ్శబ్దంగా వుంది. ప్రతీ రోజూ ఆసరికి ఆయింట్లోంచీ అరుపులూ, కేకలూ, ఏడుపులూ-మొరలూ విన వస్తుంటాయి. ఏ చప్పుడూ లేని రోజులు నెలాఖరు రోజులే అని చుట్టు పక్కల వాళ్లు యిట్టే పసిగట్టేస్తారు.

ఆ యింటి యజమాని రత్తయ్య. రత్తయ్యకు బంగారం లాంటి రైల్వే ఉద్యోగంతో పాటూ, వెండి లాంటి మనసు గల భార్య, రత్నాల్లాంటి మర్యాదకు తలొగ్గే బిడ్డలూ వున్నారు. అన్నీ సవ్యంగా వున్న రత్తయ్య మహారాజులా బతకాలే, కానీ అతను అలవర్చుకున్న ఒకే ఒక్క వ్యసనం, అతని జీవితాన్ని చిందర వందర చేసేసింది. ఆర్థికంగానూ, శారీరకంగానూ, దిగజార్చేసింది. గొప్పింటి పిల్ల, భర్తను కొంగును ముడేసుకొని కన్నవారికి కాకుండా చేసేసినట్టే, రత్తయ్యనా వ్యసనం కుటుంబ సభ్యుల అభిమానానికి దూరం చేసేసింది.

డ్యూటీ నుండి మంచి మత్తులో తుళ్లుతూ, పేలుతూ, ఇంటికి చేరుతాడు రత్తయ్య. అలా ఇల్లు చేరిన రత్తయ్య ఏదో వంకతో భార్యను చిదగ్గొట్టాకగానీ, పిల్లల చెవ్వులు ఎత్తి పెట్టాకగానీ ఊరుకోడు. ఏదో వంకతో ఇంట్లో గందరగోళం సృష్టించి తినాలంటే నాలుగు మెతుకులు తిని, లేకపోతే మాని, లలానే కుక్కి మంచంలో పాత సినిమా పాట అందుకొని, కూరుకుపోతాడు. ఆ మత్తు పూర్తిగా దిగక మునుపే తెల్లవారడంతో డ్యూటీకి పోతాడు, మందు పడకపోతే మధ్యాహ్నం ఇంటికి వస్తాడు లేకపోతే రాడు. రత్తయ్య దిన చర్య యించుమించు యిలానే వుంటుంది-నెలాఖరు రోజుల్లో తప్ప.

రత్తయ్య జీతంలో ఎక్కువ శాతం సారా కొట్ల యజమాన్ల జేబుల్లోకీ, వడ్డీ వ్యాపారుల తిజోడీల్లోకీ చేరిపోతుంటుంది. జీతాల్నాడు వారం రోజుల గ్రాసం వేయించుకుందుకు ఆ యింట్లో వాళ్లు స్వాతంత్ర్యం కోసం కాంగ్రెసు వారు కష్టపడినంతగా కష్టపడాలి.

పొయ్యి దగ్గర రత్తయ్య భార్య, అతికష్టం మీద నాలైదు గడపలు ఎక్కి దిగి, అప్పు పుట్టించుకొచ్చిన, పావు బియ్యం ఉడకేసే ప్రయత్నంలో కళ్ళుపాడు చేసుకొంటోంది. బుడ్డీ ఆరిపోవడం గమనించి "పెద్దోడా...సాయిబు...కొట్టుకెళ్లి పావల కిరసనూనె అరువోయించుకు....రారా," అని కేకేసింది రాములమ్మ.

వీదరుగు మీద కూర్చొన్న పదిహేనేళ్ళ పెద్దోడు "అరువా?.....నే నెళ్లను" చిరాగ్గా జవాబిచ్చేడు. వాళ్ళు ఆసరికే ఆ కొట్టు వాడికి బాగా బకాయిపడున్నారు. అది తీర్చక అరువడిగితే కసిరేస్తాడేమోనన్న భయమే వాడిచేత ఆ జవాబు చెప్పించింది.

పెద్దోడ్ని తిట్టుకుంటూ, ఏడేళ్ల చిన్నోడికా పని అప్పగించింది రాములమ్మ. చిన్నోడిలా సీసాతో గడప దాటేడో లేదో "అమ్మా! రామ్మూర్తి మామొస్తున్నాడే...." గొంతు చించుకున్నాడు పెద్దోడు.

చీకటీ, పొగా, పోటీపడి ఇంటిని

బూర్లె నరసింహశాస్త్రి

చుట్టబెట్టుకు పోతున్నాయి. "రామ్మూర్తి మామా?... .స్టూల్ తీసుకెళ్లి వీధిలో వెయ్యి.....నేనొస్తున్నా" పొయ్యిలోకి ఊదుతూ అరించింది.

రామ్మూర్తి గడపలో అడుగుపెట్టే సరికే స్టూల్ తెచ్చి ములగ చెట్టు క్రింద వేసి "కూర్చో మామా....ఈ మధ్య బొత్తిగా కన పడ్డం మానేశావు" పలకరింపుగా ప్రశ్నేశాడు.

"తీరిక లేదురా?...అమ్మేది?"రామ్మూర్తి జవాబు చెప్తూ ఒద్దికగా స్టూల్ మీద కూర్చొ న్నాడు. పెద్దోడు మరో కేక వేసిన తరువాత రాములమ్మ కళ్లొత్తుకుంటూ బైటకొచ్చింది. వస్తూనే కొడుకేసిన ప్రశ్నే విస్తారం జోడించి వేసింది. జవాబు మాత్రం ఇది వరకటిలానే యిచ్చేడు రామ్మూర్తి.

రామ్మూర్తి రత్తయ్య దృష్టిలో తప్ప మిగి లిన ఆ యింటి సభ్యుల అందరి దృష్టిలో ఆప ద్బాంధవుడు. ప్రతీ నెలా అడిగినంత సొమ్ము చేబదులు క్రింద యిచ్చి సహాయపడ్తుంటాడు. కానీ, ఆ సొమ్ములో రత్తయ్యకు వేలు పెట్టని య్యడు. అందుకే రామ్మూర్తంటే రత్తయ్యకు తగని కోపం.

గడప మీద తాను కూర్చొంటూ, "బాబూ ఈ మధ్య బోనస్ ఇస్తారంటగా...ఆ మనిషి నడిగితే ఉస్సుమన్నాడే తప్ప....చెప్ప లేదు. నీ దగ్గరికే కుర్రోడ్ని పంపుదామ నుకుంటున్నా....యింతలో మీరే వచ్చినారు" అంది రాములమ్మ.

"ఆ విషయం చెప్పాలనే నేను పని గట్టుకు వచ్చేను. రత్తయ్యకు జీతం, బోనస్ రెండూ ఒకే రోజు దొరుకుతాయి. అది గాక...."

అంతలోనే వచ్చిన సీతాలు రామ్మూర్తి మాటకి అడ్డం పడింది. "ఏం, మావా ఈ మధ్య బొత్తిగా రావడం మానేసావు" అంది. ఆ మాటలో 'రోజూ నీ గురించే ఎదురు చూస్తున్నాను' అన్న భావం వుంది. అది పసిగట్టేశాడు రామ్మూర్తి. రామ్మూర్తి నెల క్రిందట 'మీ అత్తనడిగి పాత చీర తెచ్చిస్తానే' అని సీతాలుకు మాటిచ్చి వున్నాడు. "వీలుకుద రడం లేదే...రెపొచ్చినప్పుడు నీకు తెచ్చిస్తానన్న చీర తప్పక తెస్తా.... వెళ్లేటప్పుడు మరోసారి జ్ఞాపకం చెయ్యి..." నొచ్చుకుంటూ అన్నాడు రామ్మూర్తి.

రత్తయ్య కుటుంబం వుంటున్నది మధు సూదనరావుగారి 'ఔట్ హౌస్'లో. వారింట సీతాలు పనిచేస్తుంది. ఆ కష్టానికి జీతం లేదు. వారుంటున్న ఇంటికి అద్దెలేదు. దాని కిది చెల్లు. పదహారేళ్లకే చీర కట్టిన సీతాలు వారింటి నుండే పని ముగించుకొచ్చింది.

రాములమ్మ కూతురు మీద కసురు కుంది. "చెప్పు బాబూ చెప్పు....మధ్యలో ఆపేశావేంటి.." అంది రామ్మూర్తి వైపు చూస్తూ.

"నీకాయన చెప్పండడు...నాకూ మొన్నే తెల్సింది....రత్తయ్య 'పి.యఫ్. లోన్' పెట్టా డట. మంజూరయి పోయిందట కూడా.... జీతం...బోనస్....లోను....అన్నీ ఒకేరోజు దొర కొచ్చు."

చిన్నోడు కిరోసిన్ పోసి వెలిగించిన బుడ్డీ గుప్పున వెలిగింది....

రాములమ్మ, చిన్నోడు, పెద్దోడు, సీతాలు అందరి ముఖాల్లోనూ ఆశ రెపరెపలా డింది. అందరూ నిటారయ్యారు. యింకేం చెప్పనున్నాడోనని అందరూ చెవులప్పగించేరు.

"ఎంత దొరుకుతుందేటి?" ఆతృతగా ప్రశ్నించింది రాములమ్మ.

"ఐదువేలు పైనే...."

"ఎంత దొరికితేటి ఆ తాగుబోతు సచ్చి నోడు మా కంటపడనిస్తేగా, నువ్వే కాస్త పుణ్యంకట్టుకొని మమ్మల్ని ఆదుకుంటేగానీ, ఆ డబ్బులో కొంతయినా ఇంటికి చేరదు బాబూ.....ను...నువ్వే దిక్కు" అని ప్రాధే యపడింది రాములమ్మ.

పిల్లలు కూడా ప్రాధేయపడ్డారు. పండుగ రోజు నీ పేరు చెప్పుకొని 'పప్పన్నం' తింటామ న్నారు. రామ్మూర్తి కరిగిపోయేడు. 'అలాగే' నని మాటిచ్చేడు. పదిహేను వందలు ఇంటికి తెచ్చే ప్రయత్నం చేస్తానని చెప్పి కదిలాడు.

రామ్మూర్తి వెళ్లిపోయిన ఎంతో సేపు దాకా ఆ ఇంటి సభ్యులు కదల్లేదు. కోరికల రెక్కలుకట్టుకొని విహరించే విహంగాలయ్యారు.

ఈసారి దసరా ఘనంగా జరుపుకో వాలి....పిల్లలకు ఒకొక్క జత చొప్పున తీసినా, ఆయనకు మాత్రం రెండు జతలు తియ్యాలి. ఆ మనిషికి తాగుడు మీద తప్ప మరోదాని మీద ధ్యాసుండదు....పండుగ మ్యాద్రోజులూ ఏదైనా తీపి చేసుకోవాలి. చిన్నోడికి కజ్జి కాయలంటే ప్రాణం. అవి ఎలా అయినా ఈసారి చేసి తీరాలి. ఇటువంటి ఆలోచనలతో రాములమ్మ సతమతమవుతుంటే, పెద్దోడి ఆలోచనలు యింకోదార్ని పట్టుకున్నాయి. 'ఎప్పుడూ సెకెండ్ హాండ్ డ్రస్సులే...అదీ పేంటోసారీ, షర్టోసారీ. ఈసారి డ్రస్ తీసి కుట్టుకియ్యాలి. మార్కెట్లో అయితే కుట్టు ఛార్జీలు ఎక్కువ. మన సత్యంగాడికిస్తే తక్కు వకి కుట్టిపెడ్తాడు.'

'పట్టుమని పదహారేళ్లు నిండలేదు. అప్పుడే ముసలమ్మలా పాత చీరలా?...ఛీ....ఛీ.. పాడు జీవితం, ఈసారి పంజాబీ డ్రస్ తీయిం చుకొని తీరాలి' అని తవలోతాను సీతాలు చర్చించుకుంటే...ఏడేళ్ల చిన్నోడు 'ఈసా రైనా పుస్తకాలు కొనిపించి, స్కూల్ డ్రస్ తీయించుకొని....ఫీజ్ కట్టించి స్కూల్లో భర్తీ అవ్వాలి' అన్న ఊహల్లో తేలుతున్నాడు.

*** *** *** ****

వెలుగులో వారి ముఖాలు చూసే ధైర్యం లేక కాబోలు, మర్నాడు అదే సమ యాని కొచ్చాడు రామ్మూర్తి. ఆశ నిండిన చూపులతో ఆ సరికే ఆ యింటి సభ్యులు రామ్మూర్తి రాకకోసం స్టూల్ వేసి గడప మీదే ఎదురుచూస్తూ దర్శనమిచ్చారు.

రామ్మూర్తి-ఉలుకూ, పలుకూ లేకుండా వచ్చి స్టూల్ మీద కూలబడి పోయాడు వారి

సంతానవతి సవాల్!



ఒకళ్లిద్దరు పిల్లల్తోనే ఫుల్‌స్టాప్ పెడుతున్న ఈ రోజుల్లో నాకు పిల్లలు పుట్టే అవకాశం వున్నంత మటుకు నేను కంటూనే వుంటాననే వాళ్ళున్నారంటే ఆశ్చర్యంగా వుంటుంది కదూ! ఆశ్చర్య మేమిటి? ఇజ్రాయిల్‌లో యిది వాస్తవంగానే జరిగిందట. 41 సంవత్సరాల వయసు వచ్చేప్పటికే 15 మంది బిడ్డల్ని కన్న మల్కా అమర్ అనే ఆమె తన భర్త మరణించటంతో మధ్య వయస్కుడైన మరొకతన్ని పెళ్లి చేసుకొని మరో ఇద్దర్ని కన్నది. మొత్తం 17 మందికి జన్మనిచ్చిన ఈ మహా యిల్లాల్ని కుటుంబనియంత్రణ చేయించుకోమని నగరపాలక సంస్థ వేడుకుందట. కాని ఆమె ససేమిరా అన్నదట. ఆమెను కనకుండా ఆదేశించాలని కోర్టుకువెళ్లారట. కాని అది కూడా సాగకపోయేసరికి మత గురువును ఆశ్రయించారట. ఎవరెన్ని చెప్పినా వినేదిలేదు నాకు పిల్లలు పుట్టే అవకాశం వున్నంతవరకూ నేను కంటూనే వుంటాను. ఎవరు అడ్డు వస్తారో చూస్తాను అంటూ సవాల్ విసురుతోందట. నారు పోసినవాడు నీరు పోయడా అనేమో ఈమె ధీమా!ఇదెక్కడి ఒపికండీ బాబూ!



వినోద్‌ఫ్లాప్స్ రహస్యం

డబ్బుకోసమే సినిమాలలో నటిస్తూ మేము దానికోసంకాదు పేరు ప్రతిష్టల కోసం అంటూంటారు చాలామంది నటీ నటులు. కాని వినోద్‌ఖన్నా మాత్రం నేను డబ్బుకోసమే యాక్టింగ్ చేస్తున్నానని బహిరంగంగా ఒప్పుకుంటాడట. తనకు అసలు నటనంటే ఉత్సాహంలేదని డబ్బుకోసమే తాను నటిస్తున్నానని అందుకే తన సినిమాలు భారీగా ఫ్లాప్ అవుతున్నాయని అంటున్నాడు. సినిమాలు ఫ్లాప్ అయితే మటుకేం అతని డబ్బులు అతనికి వస్తున్నాయి కదా!

గద్ద

కోరికల్ని తృంచి వేసే మాటలు ఎలా మొదలుపెట్టాలో అర్థం కాక.

రామ్మూర్తి మౌనం వార్ని భయపెట్టింది. వినరానిదేదో వినవల్సి వస్తుందన్న అనుమానంతో వారి గుండెలు పరువులిడే రైలు పట్టాలే అయ్యాయి. కాలం కొంత సేపు వీద గుండెల చప్పుడు వింటూ గడిపింది.

ఆర్చుకుపోయిన రామ్మూర్తి గొంతే ముందు పెగిలింది. "రత్తయ్య చాలా చోట్ల అప్పులు వాడున్నాడు.....అందరికీ ఈ సొమ్ము అందితే యిస్తానని కూడా మాటిచ్చి వున్నాడు కూడా....అందబోయే సొమ్ము కోసమే వాళ్ళందరూ రాబందుల్లా కాచుకొని కూర్చొనున్నారు...నా ప్రయత్నం నే చేశాను....కానీ...."

"కొంత సొమ్మైనా ఇంటికి రాదా....." మధ్యలోనే కలగజేసుకొని కరకర మంది కన్న తల్లి ప్రేమ.

"ఎనిమిది వందలు రావచ్చు అంతకంటే ఎక్కువ వచ్చే మార్గం లేదు...ఎంతో ప్రయత్నించాను" తలదించుకొని జవాబిచ్చాడు రామ్మూర్తి.

గాలిపోయిన బెలూన్‌లా వాళ్ళు డీలా పడిపోయినా....కొంతసేపటి తరువాత సర్దుకొని బెలూన్‌లా తమ కోరికలు పేలిపోలేదు కదా అని తృప్తి పడ్డారు.

రాములమ్మ రాబోయే సొమ్ము ఈసారి ఎలా ఖర్చు పెట్టాలా? అని ఆలోచించలేదు. కానీ సీతాలు పంజాబీ డ్రస్ మాట మరచి వాయిల్ చీరతో తృప్తి పడే స్థితికి దిగితే, పెద్దోడు డ్రస్ తీసి కుట్టుకియ్యాలన్న నిర్ణయాన్ని సెకెండ్ హేండ్ డ్రస్‌తో సర్దుకుపోదామనుకున్నాడు. ఆఖరికి చిన్నోడు కూడా ఓ మెట్టు దిగి ఫీజుకట్టి స్కూల్లో భర్తీ అయితే అదే పది వేలనుకున్నాడు ఎవర్నైనా పాత డ్రస్ అడిగి సంపాదించుకోవచ్చునన్న నమ్మకంతో.

కొంత సేపు రామ్మూర్తి తానా మాత్రం సొమ్ము మిగల్చడానికైనా ఎంత కష్టపడిందీ చెప్పి కదిలాడు.

రాములమ్మ ఆ సొమ్ము తన చేతిలో పడిన దాకా ఆశలు పెంచుకో కూడదనుకుంది.

*** *** *** ***

రామ్మూర్తి ధర్మాన ఎనిమిది వందల చిల్లర రాములమ్మ చేతిలో పడ్డాయి. తల్లీ, పిల్లల కళ్ళన్నీ జిగేల్‌న మెరిసాయి.

"ఇంకో పాతిక ఎక్కువే మిగిలుండేది.... మొన్న అర్థరాత్రి పోయి...ఓ సారా కొట్టువాడ్ని బ్రతిమాలి సొమ్మొస్తే యిస్తానని చెప్పి పాతిక రూపాయిల సారా తాగేశాడు. ఆ కొట్టువాడు ఆఫీస్ దగ్గరకొచ్చి నానా రభసా చేసి పాతికా లాక్కున్నాడు" జరిగింది చెప్పాడు రామ్మూర్తి.

"ఈ తాగుబోతు సచ్చినోడింతే...." కసురుకుంది.

"నువ్వేం పెద్ద మనిషివోయ్...నాకింత అన్యాయం చేసేశావు....జీతాల్నాడే నయం.... జీతం, బోనస్, లోనూ యిన్ని దొరికినా-సారా చుక్కకి నోచుకోకుండా చేసేసినావు" భోరున ఏడ్చాడు రత్తయ్య.

రామ్మూర్తి కరిగిపోయాడు "రాములమ్మా పాతికపారెయ్ వీడికి...." అన్నాడు.

రామ్మూర్తి మాట కొట్టలేక పాతిక రూపాయిల మొత్తం సొమ్ములోంచి తీసి రత్తయ్య చేతిలో పెట్టింది మిగిలిన సొమ్ము ఎలా ఖర్చు పెట్టాలా అన్న ఆలోచనలో పడుతూ.

రత్తయ్య ఆ సొమ్ముతో గడపదాటి పోతూంటే రత్తయ్య తల్లి కావమ్మ కేక వేసింది.

తల్లి కేక విని చిరాకుపడుతూ "ఏంటే" అంటూ తల్లి దగ్గరకు నడిచాడు రత్తయ్య.

"ఏర్రా....ఆ కోపం....నీకేదో సొమ్ము వచ్చినాదటగా....ఎంతొచ్చినాదిరా...." మెల్లగా అడిగింది రత్తయ్య తల్లి.

"ఎంతొస్తే....ఏటి లాభమే. నా కర్సుకే లేక అల్లాడిపోతున్నా....నీ కోడలే అంతా లాక్కొంది యింతకీ సొమ్ముతో నీకేంపనే."

"అబ్బే...నాకెందుకురా...గుక్కెడు నీళ్ళు గొంతుకులో పొయ్యి చాలు..." అంది మంచం పట్టిన ముసలమ్మ.

భార్యను కేకేసి నీళ్ళు తెప్పించి తల్లి గొంతుకలో పోశాడు. ఒక్క గుటక వేసిన ఆ ముసల్ది రెండో గుటక వెయ్యలేదు.

ఆ ఎనిమిది వందలూ ఆ ఇంటి సభ్యుల కోరికల్ని కూడా పాడె కట్టి బాజా భజంత్రీలతో వల్లకాటికి సాగనంపడానికి పనికొచ్చేయి.

నూతన యవ్వనం పొందండి! సంతానవంతులుకండి చర్మవ్యాధులు నుండి విముక్తులుకండి!



హస్త ప్రయోగము వలన కలిగిన నరముల బలహీనత, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి దాంపత్య సుఖం లేక పోవుట, సంతానము లేకపోవుట, ఉబ్బసం, సొరియాసిన్ పొడలు, దురద, తెలుపు (బొల్లి), నలుపు, ఎరుపు మచ్చలు, రసిప్పుండ్లు, సుఖసంబంధమైన వ్యాధులు, ఫిస్టులా, మూలశంకలు, స్త్రీలకుసుమ వ్యాధులు, బ్లడ్‌ప్రషర్, పక్షవాతము, మేహపొడలు, సమస్త దీర్ఘ వ్యాధులకు, చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్స, పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు.

ప్రతినెల క్యాంపులు :-

ప్రతినెల క్యాంపులు:

రాజమండ్రి: 1,16 తేదీలలో "అశోకాలాడ్జి", కోటగుమ్మం వద్ద,
కాకినాడ : 2,17 తేదీలలో "వీనస్ AC లాడ్జి", కల్పనాటాకీస్ ఎదుట
భీమవరం: 3,18 తేదీలలో "షణ్ముఖ లాడ్జి"
ఒంగోలు: 9 వ తేదీ "హోటల్ పూర్ణిమ" AC, బస్టాండ్ దగ్గర
ఖమ్మం : 25 వ తేదీ "హోటల్ కిన్నెర" AC, బస్‌స్టాండ్ దగ్గర

Note: ప్రతికేంద్రంలో ఉ॥ 10-00 గం॥ నుండి రాత్రి 10-00 గం॥ వరకు. పై తేదీలు మినహా మిగిలిన దినములలో డాక్టరుగారు గుడివాడలోని క్లినిక్‌లో వుంటారు.

SHAH.

డా॥ డి. మార్కండేయులు

ఆయుర్వేదభిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్
పార్కురోడ్, గుడివాడ-521301 * ఫోన్స్: 2522 & 2540.

తెల్లజుట్టు నల్లబర్చును

హెయిర్ డై అవసరం లేదు. మా ఆయుర్వేదిక్ చికిత్స వల్ల, చిన్న వయస్సులో తల నెరుపును, వెంట్రుకలు రాలిపోవడంను అరికట్టును. తెల్లజుట్టు సహజ నల్ల రంగుకు మారును. మీ వెంట్రుకలను మెరిసేటట్లు చేసి పొడవుగా పెరుగుటకు తోడ్పడును. మెదడుకు చల్లదనం యిచ్చును. కళ్లజబ్బులకు శ్రేష్టము. ఒక కోర్సు వెల (లోపలికి, పై పూతకు వాడుటకు) రు. 45/ పోస్టేజి అదనం.

SHRI AYURVEDIC PHARMACY (AP. 85)
P.O Katrisarai (Gaya) Pin: 805 105.

తెల్ల మచ్చల చికిత్స

తెల్లమచ్చలు నివారణ సాధ్యమే. ఇతర అన్నిరకాల జబ్బులనయం చేసినట్లే ఈ జబ్బును కూడా సకాలంలో సరియైన వైద్యం ద్వారా తగ్గించవచ్చును. నిరంతరమైన పరిశోధనల మూలంగా తెల్లమచ్చను నయం చేయుటలో మేము విజయం సాధించగలిగాము. శక్తివంతమైన, సమర్థవంతమైన చికిత్స ద్వారా, మందు వాడిన వెంటనే మచ్చల రంగుమారి, సమూలంగా నివారణ జరిగి సహజ రంగుకు మారును. ఇతర చికిత్సల ద్వారా మీరు విసుగు చెంది వుంటే మా వైద్యం కూడా ఒకసారి పరీక్షించిన సంతృప్తి చెందగలరు. మీ జబ్బు వివరాలు పూర్తిగా తెలియజేస్తు ఒక పాకెట్ మందు ఉచితంగా పంపమని వ్రాయండి.

SHRI AYURVEDIC PHARMACY (AP 81)
P.O. KATRI SARAI (Gaya) Pin: 805 105

ఆయుర్వేదం ద్వారా క్యాన్సర్‌కు చికిత్స



బెంగుళూరులో వుంటున్న నాపేరు **శ్రీమతి కమలానాగరాజారావు.** భర్త శ్రీ ఆర్. నాగారాజారావు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజరుగా రిటైర్ అయ్యారు. నేను గైనకాలజిస్ట్ దగ్గరకు వెళ్లగా, వారు క్యాన్సర్ ఆఫ్ సెర్విక్స్ కోసం బొంబాయిలోని క్యాన్సర్ఇన్‌స్టిట్యూట్‌ను సంప్రదించవలసిందిగా సలహా ఇచ్చారు. నేను భారతదేశంలోని మరికొన్ని క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వద్దకు నిమిత్తం వెళ్లాను. అయితే గుణం కనిపించలేదు.

1977 సంవత్సరం డిసెంబర్ నెలలో హైదరాబాద్‌లో **డా. ఎం. బాబూరావు** అనే క్యాన్సర్ ఇన్‌ఫార్మరీ ఉన్నారని, ఆయన అనేక క్యాన్సర్ రోగులకు విజయవంతంగా చికిత్స చేసి బాగుచేశారని ఒక వ్యక్తిద్వారా తెలిసికొన్నాను. అయినప్పటికి హైదరాబాద్‌లో స్థానికంగా వుంటున్న కొంతమంది నా స్నేహితులను నేను అడిగాను వారి ప్రోత్సాహంతోనే **డా. ఎం. బాబూరావు** దగ్గర చికిత్స చేయించుకొన్నాను. కోర్సు పూర్తియైన తరువాత, గైనకాలజిస్ట్ దగ్గరకు పరీక్షకోసం వెళ్లాను. వారు నా పరిస్థితి చూసి చాలా సంతోషించారు. క్యాన్సర్ సూచనలేమీ లేవని చెప్పారు. నేను ప్రస్తుతం చాలా ఆరోగ్యంగా వున్నాను.

క్యాన్సర్ రోగులను బాగు చేయడానికి **డా. ఎం. బాబూరావు** గారు ఎంతో కృషి చేశారు. వారికి పునర్జన్మనిస్తున్నారు.

శ్రీమతి కమలానాగరాజారావు,
ఆర్. కమలమ్మ.
1224, 34వ క్రాస్,
జయనగర్, బెంగుళూరు.

ప్రోగ్రామ్స్ షెడ్యూల్

చిరునామాలు	ఫోన్లు	సంప్రదించే రోజులు
నివాసం		
డా. ఎం. బాబూరావు, క్యాన్సర్ ఇన్‌ఫార్మరీ, 2-1610, పెదంరోడ్, మోమలకోటమ్, జగదంబా పెట్రోల్ బంక్ దగ్గర గుల్బర్గా, (కర్ణాటకరాష్ట్రం).	21452	ప్రతి సోమ, మంగళవారాలు మాత్రం.
Co/హోటల్ మిడ్‌టౌన్, అంధేరి రైల్వేస్టేషన్, (వెస్ట్) ఎదుట, బొంబాయి.	6288882 6286635	ప్రతిబుధవారం
క్యాన్సర్ ఇన్‌ఫార్మరీ, 1-1-271/3, చిక్కడపల్లి బస్‌స్టాప్ దగ్గర, హైదరాబాద్ - 20.	64735	ప్రతిశుక్రవారం
Co/రామ్ ఇంటర్నేషనల్, 114, కోడంబాకం హైరోడ్ మద్రాస్-600 034.	473350 473420	ప్రతిశనివారం
Co/హోటల్ బృందావన్, ఎం.జి.రోడ్, బెంగుళూరు	573271	ప్రతిఆదివారాలు మాత్రం

కొత్త సీరియల్ ప్రారంభం!

కోటాలు కోరింతలు

ఎమ్.హరి

పరీక్ష హాల్లో కుదురుగా కూర్చున్నా, ధీర మనసు అల్లకల్లోలంగా వుంది. క్వశ్చెన్ పేపరు చూసి ఆమె కలవరపడలేదు. గత రాత్రి ఇంట్లో జరిగిన గొడవ తలుచుకుని మరింత కుమిలిపోతున్నది. కోపంతో కమిలిపోతున్నది.

ఈసారైనా గట్టిగా చదివి పరీక్ష గట్టెక్కి ఉద్యోగం సంపాదించాలనుకుంది. తీరా హౌ టూ ఈజ్ హౌ బుక్ ముందేసుకునేసరికి తండ్రి పెళ్లి ప్రస్తావన తెచ్చాడు. మాటలు పెంచాడు. తండ్రితో వాదించి వాదించి చివరికి ఏం చదవలేక ముక్కుతూ, మూలుగుతూ ముసుగు తన్నేసింది. అవును మరి ఏం చేస్తుంది పాపం! ధీర ఈ దేశపు సగటు స్త్రీ మరి.

తానెంత చదివినా విజ్ఞానం (?!) వస్తుందిగాని ఉద్యోగం రాదని గత ఇరవై రిటెన్ టెస్టుల, ఇంటర్వ్యూలవల్ల అనుభవపూర్వకంగా తెలుసుకుందామె. అందుకే గత రాత్రి పుస్తకం ముఖం చూడకపోయినా యాంత్రికంగా పరీక్షకి హాజరయింది.

తాను రాసే జవాబులే తన జీవితమని, చేతివ్రాతపై తలరాత ఆధారపడివుందని, వొళ్ళు దగ్గరుంచుకుని సమాధానాలు రాయాలని నిశ్చయించుకుంది.

అయినా ఆమె ప్రయత్నాలు ఫలించలేదు. క్వశ్చన్ పేపరు చూస్తున్న ఆమె శరీరంపై తేళ్ళూ జెర్రులు పాకుతున్నాయి.

తాజ్ మహల్ నిర్మాణపు ఖర్చూ, ఈస్టిండియా కంపెనీ జమా, గజనీ దండయాత్ర లెక్కలు, చిత్రాంగి ప్రేమపురాణం, అక్బర్ పరిపాలనా, విక్టోరియా కాలంనాటి ప్రశ్నలు చూడగానే ఆమెకి చిర్రెత్తింది. గత రాత్రి సంఘటన తాలూకు కోపం, ఉక్రోషంతో ఉడికిపోతూ చకచకా సమాధానాలు రాయసాగింది.

'ఏ దేశ మేగినా ఎందుకాలిడినా
దేశమును ప్రేమించుమన్నా'

ఈ గేయ రచయిత పేరు -

పై ప్రశ్న చదవగానే ఆ పదాలు ఎక్కడో చదివినట్లు ఆమెకి తోచాయి. రాయప్రోలూ, గురజాడ గేయాల ప్రథమ పంక్తులని పోల్చుకుంది. ఎవరి పేరు రాయాలి? రాయప్రోలు అప్పారావా? లేక గురజాడ సుబ్బారావా?

గ్రంథ చౌర్యం విరివిగా జరిగే ఈ రోజుల్లో ఏ తలమాసినవాడో రాసివుంటాడని, నేటి మేటి కాపీ రచయిత - అని సమాధానం రాసి తరువాత ప్రశ్నవంక చూసింది ధీర.

అమీబా - అంటే - జవాబు ఎనిమిది అక్షరాలుండాలి.

నిలువ నీటిలో బురదలో క్షణం క్షణం ఆకారం మార్చే అతి సూక్ష్మజీవి గురించి ఎనిమిది అక్షరాల్లో ఎలా జవాబివ్వాలని తల పట్టుకుని మెరుపులాంటి ఆలోచనతో 'రాజకీయ నాయకుడు' అని ఆన్సర్ రాసింది.

ఏ ఋతు పవనాలవల్ల ఆంధ్రప్రదేశ్‌కి వానలు ఎక్కువగా వస్తాయనే ప్రశ్నకి, నైఋతినా, ఈశాన్యమా అని జుత్తుపీక్కోకుండా 'తుఫానులవల్ల' అంటూ సరైన సమాధానం రాసింది.

ఇరవై పర్సంట్ వడ్డీపై అప్పు యిస్తే అసలంత వడ్డీ మీరెంత కాలంలో సంపాదిస్తారు?

పై ప్రశ్న చదవగానే ఆర్థికంగా దెబ్బతిని వున్న ఆమె బక్క కోపానికి తిక్క రేగింది. అప్పు ఇవ్వడానికి డబ్బు ఉంటే, తలాతోకా లేని ఇటువంటి పరీక్షలు రాయనంటూ తన అక్కసునంతా తీర్చుకుంది.

తన పరీక్ష ఇలా తగలడింది. ఇక శౌరి ఇంటర్వ్యూ ఎలా వెలగబెడుతున్నాడో అనే ఆలోచన రాగానే ఆమె వొళ్ళు జలదరించింది.



**టానా-ఆంధ్ర సచిత్ర వారపత్రిక సాహితీ సంబరంలో
రు. 5 వేల బహుమతి పొందిన నవలిక**

తనలాగే అతనూ ఓడితే, ఇక ఈ జన్మకి తనకీ, శౌరికి పెళ్లికాదు. అలా జరగడానికి వీలులేదు. శౌరి నెగ్గాలి.

రెండు దశాబ్దాల వయసు దాటిన ధీర చూడచక్కగా వుంటుంది. ఏదో తెలీని దుగ్ధతో, చదువ కంపుకొట్టే విధంగా అక్ష రాలు బరుకుతూనే వుంది. అవును మరి ఉద్యోగం కోసం పరీక్ష రాయక తప్పదు. కుటుంబ నియంత్రణా, పిల్లల పెంపకంపై వ్యాసాలు రాస్తున్నది.

** ** ** ** ** **

సౌత్ కొరియా ప్రెసిడెంట్ ఎవరు?

కోతుల్ని ఎక్కువగా ఎగుమతిచేసే దేశం?

గాలిలో నైట్రోజన్ పర్సెంట్ ఎంత?

ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లు అడుగు తున్న ప్రశ్నలకి గబగబా పరుగు సమాధా నాలిస్తున్నాడు శౌరి.

మొదటి మెంబర్ మాజీ సర్పంచ్ పంచె కట్టి విగ్గుపెట్టాడు. డొనేషన్ కాలేజీలో చదివిన రెండో మెంబర్‌ది తిరుపతి గుండు. లంచం లేకుండా ఫైలు ముట్టని మూడో మెంబర్ ఆఫీసర్‌ది బట్టతల.

లంచాలకీ, సిఫార్సులకి సలాంచేసే ఆ మెంబర్లు శౌరి వాగ్ధాటికి 'వ హవ్వా' అని అబ్బురపడలేదు సరికదా, అతని శక్తి సామ ర్థ్యాలపై దెబ్బతీయాలని కుట్ర చేయసాగారు.

రిటెన్ టెస్టులో ఫస్టుగా వచ్చిన శౌరి ఆ ఇంటర్వ్యూలో నెగ్గితే ఉద్యోగం ఖాయం. చూస్తూ చూస్తూ అతనికి జాబ్ ఇవ్వడం ఆ మెంబర్లకి సుతారామూ ఇష్టంలేదు. కారణం మామూలే.

అతన్ని తిరుగుముఖం పట్టించాలని, అతి తెలివితో చొప్పదంటు ప్రశ్నలు గుప్పించారు మెంబర్లు, ఆ చాటు దెబ్బలకి కాపుకాయలేక తన తెలివి వ్యర్థమైపోతున్నదని విలవిల్లాడాడు శౌరి. తనకి ఎటూ ఉద్యోగయోగం లేదని మొండికెత్తాడు.

"148 సెం.మీ. పొడవుగల వ్యక్తి 67 కిలోల బరువున్నాడు. పొడవుకి తగ్గ బరు వుండాలంటే అతను ఎన్ని కిలోలు తగ్గాలి" తూచి తూచి అడిగాడు బట్టతల ఆఫీసర్.

"అతను బరువుతగ్గవలసిన పనిలేదు. వు రేసుకుని ఇంటి చూరుకి వ్రేలాడి 30 సెం.మీ. సాగితేచాలు. వైట్‌కి తగ్గ హైట్ వుంటాడు."

ఆ కొంటె జవాబుకి కిమ్మనలేక గుడ్లు రిమి నిప్పులు కురిపించాడు.

"ఈ దేశంలో విద్యాధికులు ఉద్యోగా లకై పరాయి దేశాలకి ఎందుకు ఎగబడు తున్నారు."

"ఇంటర్వ్యూల పేర ఇలా సజీవ సమాధి కావడం ఇష్టంలేక" ఖంగున మ్రోగింది శౌరి కంఠం.

"1938 బ్యాడ్ ఇయర్. అదే 1938 చాలా చెడ్డ సంవత్సరమని ఎలా చెప్పగలవు" మధ్యలో అందుకున్న తిరుపతి గుండు గింజు కుంది.

"తమలాంటి తెలివైనవారు చాలామంది పుట్టారుగాబట్టి"

స్వరం మారిన సమాధానానికి కరంట్ షాక్ తగిలినట్లు మెంబర్ల ముఖాలు ఎర్ర బడి నల్లగా మాడాయి. కోపాన్ని తమా యించుకోలేక పిడికిళ్లు బిగించారు. అయినా తొందరపడక తాపీగా ఆలోచించసాగారు.

అయోగ్యుడికి పట్టంగట్టి, యోగ్యుడి చేత పాదాభి వందనం చేయించాలంటే మాటలా?

అందుకే మాజీ సర్పంచ్ విగ్గు సవరిం చుకుంటూ ప్రశ్న గుప్పించాడు.


"జీలకర్రని ఇతర భాషల్లో ఏమం టారు?"

"ఫ్రెంచిలోనా, పైశాచిక భాషలోనా?" చిరచిరలాడుతున్న శౌరి సందేహం.

"భారతీయ భాషల్లో చెప్పు చాలు" చేతనున్న పుస్తకంతో టేబుల్‌పై తాటిస్తూ అంది విగ్గు.

"నా కివ్వబోయే గుమాస్తా ఉద్యోగానికీ, జీలకర్రకి సంబంధం తెలుసుకోవచ్చా?"

"నీ సైన్స్ చదువుకీ, విత్ రిఫరెన్స్ టు యువర్ లెటర్ అండ్ డెబిట్, క్రెడిట్‌కి ఏమైనా పొంతన వుందా?" తెలివితేటలు



"ఉత్తర అమెరికా తెలుగు సంఘం ("టానా") ఆంధ్ర సచిత్ర వార పత్రికల సంయుక్త సాహితీ సంబరం" పేరిట మేము నిర్వహించిన నవలికల పోటీలో రచయితలు యెందరో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ పోటీకి వచ్చిన నవలికలలో బహుమతికి "కెఱటాలు-కేరింతలు" ఎంపికయినది. నవలికా రచయిత శ్రీ ఎమ్. హరాకి మా అభినందనలతో వారి పరిచయం క్రింద యిస్తున్నాము.

ఈ పోటీలో పాల్గొన్న వారందరికీ "టానా" తరపున, ఆంధ్ర సచిత్ర వార పత్రిక తరపున అభినందనలు.



శ్రీ ఎమ్. హరా పరిచయం

శ్రీ ఎమ్. హరా అసలు పేరు శ్రీ మారెళ్ల హనుమంతరావు. పుట్టి పెరిగిందీ, విద్యాభ్యాసం గుంటూరులో. ప్రస్తుతం హైదరాబాద్‌లో లోకల్ ఫండ్ ఆడిట్ డిపార్టుమెంట్‌లో సీనియర్ ఆడిటర్‌గా పనిచేస్తున్నారు. వీరు 'జిగిబిగి' నవల ద్వారా ఆంధ్ర సచిత్ర వార పత్రిక పాఠకులకు సుపరిచితులే. వీరి కథలు నూరు దాటాయి, చిన్న నవలలు నాలుగు నాటికలు రెండు ప్రచురణ పొందాయి. 'స్వయం వరమే', 'వలపు విలాసం', 'జిగిబిగి', 'దోబూచి', సీరియల్స్‌గా వచ్చాయి.

మొదటి నవలకి ఓ ప్రముఖ వార పత్రికలో ప్రథమ బహుమతి వచ్చింది. రచనలు చేయడం వీరి హాబీ. వీరు తన నవలికకి బహుమతి యిచ్చి ప్రోత్సాహించిన టానా-ఆంధ్ర సచిత్ర వార పత్రికలకి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

-ఎడిటర్

కెరటాలు-కేరింతలు

వెలగబెట్టాడు మాజీ సర్పంచ్.

గాఢంగా నిట్టూర్చాడుగాని పెదవి విప్పలేదు శౌరి. నేటి విద్యావిధానంపై అతను విరుచుకుపడతాడని, ప్రభుత్వాన్ని ఏకి పారేస్తాడని, బూర్జువా పెట్టుబడి విధానాలంటూ నినాదాలు చేస్తాడని....అప్పుడు ఇంచక్కా.....యూ నక్సలైట్....గెట్ అవుట్ అంటూ అతన్ని మెడబట్టి కటకటాల వెనక్కి నెట్టాలని తెగ ముచ్చటపడుతున్న మెంబర్లకి నిరాశ ఎదురయింది.

రెండు క్షణాలు నిశ్శబ్దం రాజ్యమేలేకా, ఓటి కుండకి మోత ఎక్కువని, పుస్తకం వంక చూస్తూ "ఈమాత్రం తెలియదా.... జీలకర్రని హిందీలో జీరా, కన్నడంలో జిరిగి, మళయాళంలో జీరగమ్, బెంగాలీలో జిరా, మరాఠీలో జిరె, గుజరాతిలో జీరూ, మన పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో సీరగమ్ అంటారు" దండకంలా చదివి గుక్క తిప్పుకున్నాడు విగ్గు మెంబర్.

"అరవంలో ఏ మంటారో చెప్పారుగాదు" పెదవి దాటని మందహాసంతో అడిగాడు శౌరి.

మాజీ సర్పంచ్, నేటి ఇంటర్వ్యూ కమిటి మెంబర్, తన చేతిలోవున్న పుస్తకాన్ని తిరగేసి, మరగేసి కళ్ళల్లో వొత్తులు వేసుకున్నాడు.

తోటి మెంబర్ మానం కాపాడాలని గొంతు సవరించుకుని "హైడ్రో ఫోబియా అంటే ఏమిటి?" దారి మళ్ళించాడు తిరుపతి గుండు.

"పిచ్చెక్కిన కుక్కలు, నక్కలు, కోతుల లాలాజలంలో విషం వుంటుంది. అవి కరిస్తే 'హరి' అనడం ఖాయం. మీ నోటి తుంపరలు నా వొంటిని తాకితే నా ప్రాణాలకే ముప్పు. చాలు చాలు యిక వస్తాను. మీ పిచ్చాళ్ళకే ఉద్యోగా లిచ్చుకోండి" అని 'ఫీ'కొట్టి విసురుగా రోడ్డెక్కాడు శౌరి.

రెండు పుష్కరాల వయసు దాటిన శౌరి మగతనం ఉట్టిపడే ఆజానుబాహుడే. అయితే ఏం లాభం? ఈ జీవిత మింతేలే అని రాజీపడక, ఈ జీవితమింతే లే, అని తిరగబడక, త్రిశంకులా వ్రేలాడుతున్నాడు.

నిర్జీవంగా కాళ్ళీడ్చుకుంటూ చిరు సాయంవేళకి పార్క్‌కి చేరాడు శౌరి. వేపచెట్టు క్రింద మోకాళ్ళపై తల ఆన్చి దిక్కుముఖంతో కూర్చున్న ధీరని చూడగానే ఉలిక్కిపడ్డాడు.

ఈసారి ఉద్యోగం తథ్యం. రిటెన్ టెస్టులో సెంట్ పర్సంట్ వస్తుందని, కుందేలు పరుగుతో ఆమె తన కౌగిలిలో ఇముడుతుందని ఆశపడ్డ శౌరి అవసరానికి మించి నిరుత్సాహపడ్డాడు.

అతని ఉదాసీనపు తాబేటి నడక చూసి ఈసారి కూడా ఇంటర్వ్యూ తగలేశాడని తల్లడిల్లింది ధీర.

తమ పరాభవాలు తలుచుకుని పొర్లిపొర్లి బావురుమనలేదు ఇద్దరూ. తమ వునికి నలుగురి కంట్లో పడుతుందని దుఃఖాన్ని దిగమింగేశారు. తమ రహస్య సమావేశం బహిరంగమవుతుందని భయపడుతున్నారు. తమ ప్రేమ బ్రతికి బట్టగట్టదని హడలిపోతున్నారు.

అయినా వాళ్ళిద్దరి ప్రేమని పెద్దలు హర్షించకపోవడానికి కారణం కులం, మతం కాదు. వాళ్లిద్దరిదీ ఒకే కులం, మతం. పోనీ వర్గ భేదం వుందాంటే అదీ లేదు. ఇద్దరూ పరమ ధనవంతుల బిడ్డలు.

శౌరి తండ్రి శ్రీశైలం, ధీర తండ్రి సప్తగిరి ఒకే సందులో ఎదురు బదురు ఇళ్లల్లో వుంటున్నారు. కడుపారా తిని, హాయిగా కునుకుదీయడానికి వీలుగా, పూర్వీకు లిచ్చిన శమంతకమణి లాంటి ఆస్తి వాళ్లకుంది.

ఏదో కాలక్షేపం కోసం పేదల పార్టీలో చేరారు సప్తగిరి, శ్రీశైలం. కాలక్రమేణా స్థానికంగా ఆ పార్టీ తలలో నాలుకైనారు. పేదల పేరుతో పదవీ, పైకం పెంచుకోవాలనే దురద వాళ్లకి పట్టుకుంది.

మునిసిపాలిటినీ, పంచాయితి సమితిని, కోపరేటివ్ బ్యాంక్‌ని,శివాలయాన్ని, గ్రంథాలయసంస్థని, అనాథ ఆశ్రమాన్ని, కాలేజీ కమిటీని వగైరాలని సమానంగా పంచుకుని ఏలసాగారు వాళ్లిద్దరూ.

తండ్రులు పదవులు పంచుకుంటే పిల్లలు ప్రేమని పెంచుకున్నారు. ధీర నా కోడలని మురిసిపోయేవాడు శ్రీశైలం. శౌరి వా అల్లుడని నీలిగేవాడు సప్తగిరి.

దురద పుట్టినప్పుడు గోకినకొద్దీ హాయి మరింత పెరుగుతుంది. ఉన్న పదవులతో తృప్తిపడని సప్తగిరీ, శ్రీశైలం, ఎం.ఎల్.ఏ. నిచ్చెనెక్కి మంత్రులుగా స్థిరపడా లనుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్‌కై నేనంటే, నే నంటూ పోటీలు పడి పేచీలకి దిగారు.

శ్రీశైలానికి పేదలపార్టీ టికెట్ దొరికింది. తనకి మొండిచేయి చూపించేసరికి ఆ పార్టీపై అలిగి పేద బీదల పార్టీ అంటూ కొత్త జెండా ఎగరేసి ఎన్నికల రంగంలోకి దూకాడు సప్తగిరి.

అంతే. వాళ్ల సందులోవున్న మురిక్కాలవలో గ్యాస్ పుట్టింది. వాళ్ళిద్దరి మధ్యా అగ్ని ప్రజ్వరిల్లింది. ప్రచార సమయంలో వాళ్ళిద్దరూ వ్యక్తిగత దూషణకి దిగారు. వొకరినొకరు బండబూతులతో ఆడిపోసుకున్నారు. బద్ధ విరోధులైనారు. ఏదోవిధంగా ఎం.ఎల్.ఏ.గా నెగ్గాలని తమ ఆస్తినంతా కరిగించి పోటీలు పడసాగారు. మూర్ఖత్వపు పట్టుదలతో దౌర్జన్యానికి ప్రాణం పోశారు. సప్తగిరి గూండా గరుడని చేరదీస్తే, శ్రీశైలం రౌడీ నందికి ఆశ్రయమిచ్చాడు.

(ఇంకా వుంది)

శ్రీపాద సు. శాస్త్రిగారి కథాముద్రలు!

"నేటి తెనుగు కథా రచయితలలో, మును ముందుగా జ్ఞప్తికందు కొందఱిలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారొకరనుట కంటే, మొదటి వారనుటయు నతిశయోక్తం కారాదు. కారణము, ఆయన వ్రాసిన ప్రత్యక్షరము సహజ ప్రతిభ నుండి పొటమరించినది. ఆయన చేసిన ప్రతి కల్పనము ప్రత్యక్షమున కవిరుద్ధమైనది. ఆయన పాత్రలచే బలికించిన ప్రతి పదము, ఇరుగు పొరుగుల మనము వినుచున్నది. ఆయన ప్రదర్శించిన ప్రతి సంవిధానము మన యనుభూతులకు దవ్వుగానిది. ఈ తీరున సుబ్రహ్మణ్య శాస్త్రిగారు అచ్చమైన తెనుగు దనమును వలచి వచ్చిన రచయిత."

– ఇవి 1950లో "ఆంధ్ర రచయితలు" గ్రంథంలో శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారిని గురించి కళాప్రపూర్ణ మధునాపంతుల వారు సత్య సన్నిహితంగా పలికిన పలుకులు. అందుకే జరుక్ శాస్త్రిగా పిలువబడే జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి గారు కూడా ఈయనను "కథకులలో ఘనాపాఠీ" అని ప్రశంసించారు.

23-4-1891లో తూర్పు గోదావరి జిల్లా-రామచంద్రపురం తాలూకా పొలమూరు గ్రామంలో జన్మించిన శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి ప్రతిభ పీఠికాపుర ఆస్థాన కవులయిన రామకృష్ణ కవుల సాహచర్యం వల్ల మరింత రాణించింది. శ్రీ పాదవారి వ్యక్తిత్వం విలక్షణమైంది. విశిష్టమైంది.

ఆత్మ గౌరవం కల శ్రీ పాదవారు "కళాభివర్ధనీ పరిషత్తు" స్థాపించారు. స్వయంగా నటులైన శ్రీ పాదవారు నాటకాలను ప్రదర్శింప చేశారు. కవుల జయంతులను పండితుల సన్మానోత్సవాలను జరిపించారు. సంగీత సాధన చేశారు. ఆయుర్వేద ఔషధాలు తయారు చేసి మందుల వ్యాపారం



(శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి శతజయంతి సందర్భంగా)

చేశారు. ఇన్ని విశిష్ట గుణాలు గల శ్రీ పాదవారికి హిందీ- గాంధీ- ఖద్దరు

ఈ మూడూ గిట్టనివి. విజాతీయమైన వాటిని వ్యతిరేకిస్తూ, హిందీ వల్ల ఆంధ్ర భాష ప్రాముఖ్యాన్ని కోల్పోతుందని విశ్వసించేవారు. ఖద్దరు వల్ల జాతీయత వస్తుందనుకోవటం భ్రమ అనేవారు. ఈ విశ్వాసాలపై స్వయంగా "ప్రబుద్ధాంధ్ర" పత్రిక నడిపి పుంఖాను పుంఖంగా వ్యాసాలు రాసేవారు. "హిందీ వల్ల తెలుక్కి జరుగుతూన్న అపకారం" శీర్షికతో వ్యంగ్యంగా సీరియస్‌గా వ్యాసాలు రాశారు.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ప్రధానంగా కథకులు. "శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి చిన్న కథలు" అనే పేరున వీరి కథాసంపుటాలు వెలువడ్డాయి. అయితే వీరి చిన్న కథలు నిజానికి చిన్నవి కాదు-పెద్ద కథలు లేదా నవలికలు అనాలి. వీరి ప్రతి కథలోని ఇతివృత్తం సహజమైంది. సామాన్యమైంది. జీవితంలోంచి తీసుకున్నదే. "సామాజిక స్పృహ"

శ్రీపాద వారిలో ఉన్నంతగా మరో కథకుడిలో లేదనవచ్చు. శ్రీపాద వారి కథల పేర్లే విచిత్రంగా-వైవిధ్యంగా తోస్తాయి. చూడండి:

"ఇరువురమొక్క చోటికే పోదాము", "వయస్సూ బుద్ధీ కూడా పెరుగుతాయి," "ఇలాంటి తవ్వాయి వస్తే...", "యావజ్జీవం హోష్యామి", "షట్కర్మయుక్తా", "ఏ-క్క-డా లంగరందలేదు".


ప్రేమపాశము, వారకాంత, శ్మశానవాటిక, రాజరాజు వంటి నాటకాలు, 'పాణిగృహీత శ్రవణానంద శృంఖల' వంటి విమర్శలు, 'ఆత్మబలి' నవల, 'భారతనారీమణులు' రచన శ్రీపాద వారి బహుముఖ ప్రజ్ఞను వెల్లడించేవిగా నిలుస్తాయి. వాల్మీకి రామాయణాన్ని మొదటిసారిగా వాడుక భాషలో అనువదించిన తొలి రచయిత అనీ, కనకాభిషేకం గౌరవం పొందిన తొలి తెలుగు కథకులనీ శ్రీపాదవారి పైన పరిశోధన చేసిన కనక్‌ప్రవాసి గారు సిద్ధాంతం చేశారు. శ్రీపాదవారు కవులు కూడా. అచ్చమైన వ్యావహారికంలో కథలు రాసిన అచ్చమైన తెలుగు కథకుడైన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు 25-2-1961లో మరణించారు. శ్రీపాదవారి రచనలన్నీ ఈ శతజయంతి సంవత్సరంలో ముద్రింపబడటం అవసరం.

- ద్వా. నా. శాస్త్రి



బచ్చన్ హుషారు

శశికపూర్ నిర్మిస్తున్న 'అజూబా' చిత్రాన్ని త్వరగా పూర్తి చేయాలన్న సంకల్పంతో అందులో హీరోగా నటిస్తున్న అమితాబ్ అవిశ్రాంతంగా పని చేస్తున్నాడట. ఎన్నో సమస్యలున్నప్పటికీ బొంబాయి ఎండల్ని కూడా లెక్క చేయకుండా ఆరు గంటలసేపు నిర్విరామంగా షూటింగ్‌లో పాల్గొంటున్నాడట మొహంలో అలసట ఏమాత్రం కనబడనీయకుండా. ఏమిటో మరి ఆ హుషారు! అది హీరోయిన్ డింపుల్ సహకారమేమో!



గౌరి

గౌరి గంగిగోవు లాంటి పిల్ల. ఆమె ఏ ఇంటికి వెళుతుందో గాని ఆ ఇల్లు నిత్యకళ్యాణం పచ్చతోరణంగా ఉంటుందని ఆమెని చూసిన వాళ్లంతా అనేవారు. గౌరి నెమ్మదైన పిల్ల. నెమ్మదిగా మాట్లాడేది. మితంగా, స్మితంగా, తియ్యగా మాట్లాడేది. ఆమె పెద్ద కళ్లు ఎప్పుడూ వినయం, వివేకమూ తొణికిసలాడుతూ ఉండేవి.

ఆమె తండ్రి వెంకటశాస్త్రి పోలికతో పుట్టింది. వెంకటశాస్త్రి ఊళ్లో ఆడా మగా అందరికీ తల్లో నాలుకలా ఉంటాడు. అతడు పెద్ద పండితుడూ కాదు, విశేషించి పెద్ద లౌక్యమూ లేదు. మామూలు పురోహితుడు, అంతే. అయినా నోరు మంచిది అయితే ఊరు మంచిదవుతుంది కదా! అంచేత గౌరి అదృష్టవంతురాలంటారు చూసిన వాళ్లంతా. తండ్రి పోలికతో పుట్టిన ఆడపిల్ల అదృష్టవంతురాలు కాకమరేమిటి?

అయితే గౌరివి సాధారణమైన తెలివితేటలు కావు. అసాధారణమైన తెలివితేట్లు. కాని అది మబ్బుల్లో మెరుపులాంటి చురుకుతనం కాదు. పున్నమి నాటి వెన్నెల లాంటి చల్లని కాంతి. ఆమె తల్లి-దండ్రులు గాని, స్కూల్లో ఉపాధ్యాయులు గాని, ఊళ్లో ఇంకెవరూ గాని ఆమె ప్రతిభను సరిగా అంచనా వెయ్యలేక పోయారు. ఆమె ఒక పల్లెటూళ్లో సంప్రదాయ కుటుంబాల్లో పుట్టి పెరిగే మామూలు ఆడపిల్ల లాంటిది కాదని ఎవరికీ తట్టలేదు.

పరమేశ్వరశాస్త్రి మాత్రం గౌరిని చూడగానే ఆమె ప్రత్యేకతల్ని ఇట్టే పోల్చుకున్నాడు. అతడు గౌరికి మేనమామ. పట్నంలో ఉంటూ, పెద్ద పెద్ద వాళ్లతో తిరుగుతూ, రెండు చేతులా సంపాదిస్తున్న వాడు. పల్లెటూళ్లో పెంతల్లి కూతుర్ని చూడడానికి వచ్చి, పెళ్లికి ఎదిగిన పదిహేడేళ్ల గౌరిని చూడగానే అతడికి తన కొడుకు గోపాలశాస్త్రి మనసులో మెదిలేడు. ఈ మేనకోడలు తన కోడలైతే ఇల్లు పట్టకుండా తిరుగుతున్న గోపీని ఒకదారికి తెస్తుందని అతడికి అనిపించింది. ఎనిమిదేళ్ల తరవాత చూస్తే బాగా పొడుగు ఎదగడమే కాదు, గౌరి సంసార బాధ్యతలు నిర్వహించే పరిపక్వత కూడా పొందిందనిపించింది అతడికి.

కె. గోదావరిశర్మ



అంచేత అతడు గౌరిని తనతోబాటు కొన్నాళ్ళు మద్రాసు పంపించమంటే, వెంటనే కాకపోయినా కొంచెం ఆలోచించిన మీదట ఒప్పుకున్నారు పార్వతమ్మ, వెంకటశాస్త్రి. పరమేశ్వరశాస్త్రి కొడుకు పెళ్ళికొడుకని వాళ్ళకి తెలుసు. అయితే అతడి ఇటీవలి ఘనకార్యాల గురించి మాత్రం తెలీదు. బతకనేర్చిన తండ్రి కొడుక్కి కూడా బతుకు తెరువు చూపించే ఉంటాడని వాళ్ళ నమ్మకం. ఆ ఇంటికి కోడలయితే గౌరి భవిష్యత్తు కూడా భద్రంగా ఉంటుందని వాళ్ళకి అనిపించింది. పెద్ద కట్నాలు పోసి పెళ్ళి చేసే తాహతు లేనప్పుడు, ఉన్న ఒక్కపిల్లా అత్తవారింట్లో సుఖపడాలంటే ఇదొక్కటే మార్గమని భర్తకి నచ్చజెప్పింది పార్వతమ్మ. దేవుడు చల్లగా చూసి ఈ సంబంధం కుదరాలే గాని అంతకంటే వాళ్ళు కోరుకునేదేమీ వుండదు. అయిన సంబంధం కనక పిల్ల వాళ్ళ ఆకులో అన్నం తీసుకు తినవచ్చు. అంచేత కాబోయే మామగారితో గౌరిని పంపించడంలో వాళ్ళు చాలా ముందుచూపు ప్రదర్శించారనే చెప్పాలి. పెళ్ళికాని పిల్లని, కాబోయే అత్తవారింటికే అయినా, పంపించడం లోకం దృష్టిలో ఆమోదయోగ్యం కాకపోయినా, కూతురు భవిష్యత్తు దృష్ట్యా ధైర్యం చేశారు ఆ దంపతులు. పోనీ వెళ్ళనీ, ఆ ఇల్లూ ఈ ఊరూ అలవాటవుతాయి, జీవితాంతమూ అక్కడ మెలగవలసిందే కదా అని అనుకున్నారు.

ఆ విధంగా గౌరి మద్రాసులో తన అదృష్టాన్ని వెతుక్కోవడానికో, స్థిరపరచుకోవడానికో ప్రయాణం అయింది. పుట్టి పెరిగిన పల్లెటూరిని విడిచి వెళ్ళడం ఆమెకి చాలా కష్టంగా తోచింది. ఊరి చెరువు, కోవెల, అందులో దేవుళ్ళు, వీధులు, వీధరుగుల మీద పలకరించే మొహాలు, ఇరుగు పొరుగులు, పాడి పశువులు, ఆమె బొమ్మలు, పుస్తకాలు— ఇవన్నీ ఆమె నిత్యజీవితంలో ఒక భాగమై పోయాయి. వాటిని వదలి దూరంగా వెళ్ళడం అంటే శరీరంలోని ఒక అవయవాన్ని కోసి తీసేసినట్టే. ఇంతకీ ఈ హంగామా అంతా ఫలప్రదవౌతుందా? పట్నంలో ఇంతకంటె ఆనందకరమైన జీవితం దొరుకుతుందా? ఏమో, ఎవరికి తెలుసు? సందేహాలతో సతమతమవడం గౌరి లక్షణం కాదు. ఆమెకి తెలిసిందల్లా తల్లిదండ్రులకి విధేయత చూపించడం. వాళ్ళు తన శ్రేయోభిలాషులు. తనకి కష్టం కలిగించే పని వాళ్ళెందుకు చేస్తారు?

ప్రయాణపు రోజున ఆ ఇంట్లో హడావిడి అంతా ఇంతా కాదు. పార్వతమ్మ, వెంకటశాస్త్రి కుమార్తెకి వెయ్యి సలహాలిచ్చారు. మేనమామగారింట్లో ఎలా మసలుకోవాలో. గౌరి, అవన్నీ తనకీ తెలిసినవీ, పుస్తకాల్లో చదివినవే అయినా వెయ్యి సలహాలూ వినయంగా వింది. కణ్వాశ్రమం విడిచి నగరానికి వెళ్ళే శకుంతలలా ఉంది ఆమె స్థితి. ఇరుగు పొరుగులు కూడా యథావిధిగా కళ్ళొత్తుకుని ఆమెకి వీడ్కోలు చెప్పేరు. చూసిన వాళ్ళకి, పెళ్ళి అయిపోయి గౌరి శాశ్వతంగా అత్తవారింటికి వెళుతూందేమో అనిపించింది.

అయితే ఇటీవల కొన్నేళ్ళ పల్లెటూరి పద్ధతులకి దూరమైన పరమేశ్వర శాస్త్రికి మాత్రం ఇదంతా మోటుగా, హాస్యాస్పదంగా అనిపించింది. అయినా ఏమీ అనకుండా చెల్లెలు, బావగార్ల చాదస్తాన్ని భరించాడు. అతనికి కావలసినది వాళ్ళు కాదు, 'వన్నె మైపైడి తులతూగు' మేనకోడలు కదా? అంతే కాదు, తన కొడుక్కి ఒక్క పైసా కూడా కట్నం పుచ్చుకోనని ఉదారంగా చెప్పేశాడు. "మనం మనం ఒకటి. మధ్యలో పాపిష్టి డబ్బు ప్రవేశించి మనని విడదియ్యాలా ఏమిటి?" అన్నాడు. ఆడపిల్లని ఇచ్చుకునే వాళ్ళకి అంతకన్నా ఏం కావాలి? వాళ్ళు ఆనందబాష్పాలు తుడుచుకున్నారు.

మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో సర్కార్ ఎక్స్‌ప్రెస్ దిగిన గౌరికి అదంతా మరేదో లోకం లాగా అనిపించింది. నిద్రలో నడుస్తున్న దానిలాగా మామయ్య వెనకనే అడుగులు వేసింది. రైల్వే స్టేషన్ చెదిరిన చీమల పుట్టలా ఉంది. ఆమె అంతమంది మనుషుల్ని ఒకేసారి ఒకే దగ్గర, వాళ్ళ ఊరు ముత్యాలమ్మ పండుగనాడు కూడా చూళ్ళేదు. బయటకొచ్చేక ఎత్తైన భవనాలు, విశాలమైన వీధులతో ఆ నగరం గౌరిని మరింత మంత్రముగ్ధని చేసింది. ఆ నగరంలో తనూ ఒక భాగం కాబోతున్నందుకు ఆమెకి కొంచెం భయం, కించిత్ గర్వం కలిగేయి. అక్కడ సినిమా తారలు ఉంటారని తప్ప అంతకు మించి ఆమెకి మద్రాసు గురించి ఇంకేమీ తెలియదు. అయితే వెండి తెరమీద, పత్రికల్లో వర్ణ చిత్రాల్లోనూ మెరిసిపోయే తారలు పెట్టి పుట్టిన వాళ్ళు అని ఆమెకి తెలుసు. కాని మద్రాసులో మామూలు మనుషులు ఎలా బతుకుతారో మాత్రం తెలియదు.

పరమేశ్వర శాస్త్రి ఇంటిలో గౌరికి సాదరమైన స్వాగతం లభించింది. ఇంతకీ స్వాగత మివ్వడానికి ఎవరున్నారు గనక? శాస్త్రిని, కొడుకు గోపీనీ మినహాయిస్తే ఇంటిలోని ఏకైక స్త్రీ నరసమ్మ. ఆమె శాస్త్రికి దూరపు బంధువు. వంటపని, ఇంటిపనీ చూస్తుంది. శాస్త్రి భార్య మద్రాసు వచ్చిన రెండేళ్ళకి కాలధర్మం చెందింది. ఆ తరవాతే గోపీ సంరక్షణ, పెంపకం ఓ సమస్య అయిపోయాయి. మద్రాసు వచ్చేటప్పుడు శాస్త్రి తలలో ఎన్నో ఊహలతో, కళ్ళలో ఎన్నో కలలతో వచ్చాడు. అందులో ఒకటి గోపీని తన వృత్తిలో తనని మించిన వాడుగా చేసి స్థిరంగా నిలబెట్టడం. కాని త్వరలోనే గోపీకి పౌరోహిత్యం మీద శ్రద్ధ, ఆసక్తి లేవని గ్రహించాడు. అయినా మద్రాసు వదిలి మళ్ళీ గ్రామం వెళ్ళడానికి మాత్రం ఇష్టపడలేదు. వెళితే ఏముంది, పూర్వపు గొర్రెతోక జీవితమేగా?

పరమేశ్వర శాస్త్రికి కొంచెం జ్యోతిషం కూడా తెలుసు. అదే అతడిని మద్రాసు తీసుకొచ్చింది. వాళ్ళ ఊరి భూస్వామి ఒకడికి శాస్త్రి పాండిత్యం మీద గురి. అతడి ఇంట్లో ప్రతి పండగా ప్రతి పూజా శాస్త్రే చేయించేవాడు. అతడికి ఓ సారి ఎలా పుట్టిందో గాని సినిమా తియ్యాలనే కోరిక పుట్టింది. మద్రాసు వెళ్ళి సినిమా తీశాడు. తీసినన్నాళ్ళూ దానికీ దీనికీ శాస్త్రినే సలహా అడిగేవాడు. అతడి అదృష్టమో, శాస్త్రి అదృష్టమో గాని ఆ సినిమా బాగా హిట్ అయింది. దానితో అతడు మద్రాసు మకాం మారుస్తూ, తనతో బాటు శాస్త్రిని కూడా వచ్చెయ్య మన్నాడు. సినిమా రంగంలో తనకి చేతినిండా పని దొరుకుతుందని గ్రహించిన శాస్త్రి మద్రాసు కాపురం మార్చేశాడు. లౌక్యుడు కావడాన అందిస్తే అల్లుకుపోయి త్వరలోనే సినీ పెద్ద లందరికీ తలలో నాలుక అయ్యాడు. చాలామంది జ్యోతిష్కుల లాగే శాస్త్రి విజయానికి కారణం కూడా అతడి జ్యోతిష శాస్త్ర పాండిత్యం కాదు— అతడి సమయస్ఫూర్తి, పరేంగిత జ్ఞానం. ఏం చెపితే, ఎలా చెపితే ఎదుటి మనిషి సంతోషిస్తాడో, నాలుగు డబ్బులు రాలతాయో, అలా మెలగడం. అలా అన్ని విధాలా పైకి వస్తున్న శాస్త్రికి భార్యా వియోగం చెప్పుకోదగ్గ కష్టమే. అప్పటి నుండి గోపీకి కట్టడి,



డింపుల్ నవ్వు

డింపుల్ కపాడియాలోని స్వభావం ఏమిటంటే- నవ్వటం లేదా కోపం తెచ్చుకోవటం. "అజూబా" చిత్రానికి సంబంధించి బొంబాయిలోని ఒక సరస్సులో షూటింగ్ జరుగుతుండగా నీళ్ళలోంచి ఒక పాము బయటకు వచ్చిందట. అమితాబచ్చన్- డింపుల్‌ను చూసి జోక్ చేశాడట- అరే డింపుల్ పారిపోతోంది పట్టుకోండని.

కాని డింపుల్‌కి ఆ క్షణంలో కోపం రాలేదు సరికదా జోక్‌గా తీసుకొని నవ్వేసిందట. ఇది కూడా వింతేనా!

క్రమశిక్షణా లేకుండా పోయాయి. అతడు సులువుగానే తళుకు బెళుకుల సినిమా రంగంపై వ్యామోహం పెంచుకున్నాడు. అతడికి తండ్రి చేసే పౌరోహిత్యం నచ్చక పోవడానికి కారణం. పురోహితులు చాలా అన్ హీరోయిక్‌గా, అన్ రొమాంటిక్‌గా ఉండడమే. సినిమాల్లో నటించి పాపులర్ హీరో కావాలన్నది అతడి ఆశయం. అందుకు గాను తండ్రిపేరు వాడుకుని స్టూడియోల చుట్టూ, దర్శకుల చుట్టూ తిరుగుతూంటాడు. కాని ఎవరూ అతణ్ణి సీరియస్‌గా తీసుకోలేదు. తండ్రికి కనిపిస్తే తనవెంట 'రౌండ్స్'కి రమ్మంటాడేమో నని ఇంటా బయటా కూడా తండ్రిని తప్పించుకు తిరుగుతున్నాడు గోపీ. తండ్రి లేని సమయంలో ఇంటికొచ్చి గబగబా ఇంత తిని, నరసమ్మని బెదిరించి అయిదో పదో దొరక బుచ్చుకుని మళ్ళీ రోడ్డున పడతాడు. శాస్త్రి ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు, కాని తల్లి లేని పిల్లణ్ణి గట్టిగా మందలించడానికి అతడికి నోరు రాలేదు.

గౌరి ప్రవేశించే సమయానికి ఆ ఇల్లు చుక్కాని లేని నావలా ఉంది. ఇల్లాలు లేని ఇల్లు మరి! వచ్చీ రాగానే గౌరి ఇంటి పెత్తనం కైవసం చేసుకుంది. ఇల్లు సర్ది అందంగా ఉంచడం, ఆదాయ వ్యయాలు సరి చూడడం, అతిథుల్ని, ఆ గంత కుల్ని సమాధాన పరచడం, శాస్త్రి కార్యక్రమాల్ని సకాలానికి గుర్తు చెయ్యడం– ఒకటేమిటి, ఇంటిని ఓ దారికి తెచ్చింది. త్వరలోనే. శాస్త్రి తన జోస్యం నిజమయినందుకు సంతోషించి, ఆమెకు పూర్తి స్వేచ్ఛనిచ్చాడు.

తమ ఇంటికి కొత్తగా వచ్చిన ఈ అమ్మాయిని ఎలా చూడాలో తెలియక ఇబ్బంది పడ్డవాడు ఒక్క గోపీయే. యువకుడు కాబట్టి, అంత దగ్గరగా ఒక అందమైన అమ్మాయి మసలుతూ ఉండడం అతడికి ఒక కొత్త థ్రిల్‌ని ఇచ్చింది. బయటికి చెప్పుకోకపోయినా వారి మధ్య ఒక సున్నితమైన

గౌరి

అనుబంధం ఏర్పడింది. తనకి ఆమె మీద ఒకరకమైన హక్కు ఉన్నట్టు అనిపించేది గోపీకి. కాని అతడికి నచ్చని విషయాలు కొన్ని ఉన్నాయి. గౌరి అందమైనదే గాని పల్లెటూరి పిల్ల. సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగింది. పట్నవాసపు ఫ్యాషన్లు తెలియవు. ఆమె జీన్సు, మిడ్డీలు వేసుకోవాలని, తనతో బీచిలకీ సినిమాలకీ రావాలని, పార్లర్స్‌లో ఐస్‌క్రీం తినాలనీ అతడి కోరిక, గౌరికి సినిమా తారల్ని చూపిస్తానని షూటింగులకి రమ్మనేవాడు. ఆమె ఏమీ ఆసక్తి చూపించేది కాదు. చాలా ఠీవిగాను, ఉదాత్తంగానూ ప్రవర్తించేది. గోపీతో ఎప్పుడూ కఠినంగా మాట్లాడకపోయినా, ఎంతో అభిమానంతో అతణ్ణి మందలించేది. అతడు కూడా గౌరి తనకన్న చాలా తెలివైనదని గ్రహించి, ఆమె ఎదుట తన కుర్ర తరహా ప్రవర్తనకి తనే సిగ్గు పడేవాడు. క్రమంగా తను ఆమెకి సరిపోలడని ఒక భయం, ఒక ఆత్మ న్యూనతా భావం అతడిలో బలపడజొచ్చాయి. ఆమె అతడిని తల్లిలా ఆదరించి, స్నేహితురాలిలా సలహాలిచ్చేది. అతడి మీద ఆమె వింత ప్రభావం ఎంతగా పడిందంటే, ఆమెను ఎదిరించి ఏమీ మాట్లాడలేకపోయే వాడు. ఆమె చెయ్యమంటే ఏ పని చెయ్యడానికైనా సిద్ధపడేవాడు. సుగుణాల రాసి అయిన గౌరితో పోల్చితే ఇంతకుముందు తనతో తిరిగిన గర్ల్ ఫ్రెండ్స్ అంతా షోకేసులో బొమ్మల్లా అనిపించారు అతడికి.

"ఇరవై నాలుగ్గంటలూ అలా రోడ్ల మీద తిరుగుతా వెందుకూ నువ్వు?" అని అడిగిందో రోజు మామూలుగా.

"ఇంకేం చెయ్యమన్నావు? అయినా నేను ఊరికే ఏం తిరగడం లేదు. నా అదృష్టం ఎలా ఉందో చూసుకుంటున్నాను...." అంతకంటె ఏమీ చెప్పలేదు గోపీ. ఎందుకనో, తను సినిమా హీరో కావాలనుకుంటున్నాడని ఆమెతో చెప్పడానికి సిగ్గుపడ్డాడు.

కాని ఆమెకి తెలుసు. అతడికి దగ్గరగా వచ్చి సానుభూతిగా అంది. "చూడు, అదంతా ఎండమావుల వెంట పరిగెత్తడమే. ఎన్ని వందల, వేల మంది సినిమా ఛాన్సుల కోసం మద్రాసు వచ్చి, కోరిక తీరక, వట్టి చేతులతో వెనక్కి వెళ్ళడం లేదు? ఈ మిథ్యా విలువల జీవితం పట్ల నీ కెందుకంత వ్యామోహం?"

గోపీ నిశ్శబ్దంగా తలవంచుకున్నాడు. ఇవన్నీ అతడికే తెలియకపోలేదు. కాని... అదంతే! మధ్యతరగతి మనుషులకి ఉండే బలహీనత అది– అర్హత, కృషి లేకుండానే అన్నీ సమకూరాలని కోరుకోవడం! ఓ రాయి విసిరి చూద్దాం, మన అదృష్టం బాగుంటే తగలవచ్చు– అనే తత్వం అది. మన అదృష్టం ఎక్కడో గ్రహాలు, నక్షత్రాల్లో కాక, మన చేతుల్లోనే ఉందని గ్రహించరు. "నీకు ఏ వృత్తి ఇష్టం?" అన్నాడు, మాట మార్చడానికి.


గౌరి అతడి కళ్ళలోకి చూస్తూ "పౌరోహిత్యం" అంది.

గోపీ ఆమె వైపు అనుమానంగా చూశాడు. "అంటే నీ ఉద్దేశ్యం– నేను కూడా నుదుటిని వీభూది పూసుకుని, మెళ్ళో జంధ్యం కనబడుతూ ఒంటి మీద చొక్కా లేకుండా వీధుల్లో తిరగాలనా?" అన్నాడు, కొంచెం కోపంగా.

గౌరి చిరునవ్వు దాచుకుని, దయగా అంది. "ఉహుం! నీకు నచ్చని పని చెయ్యమని నేను ఎలా బలవంతం చెయ్యగలను? కాని అసలు నీ కా వృత్తి అంటే అంత చిన్నచూపు ఎందుకో చెప్పు?"

గోపీ సమాధానం చెప్పలేదు.

"గోపీ, నీదంతా అపోహ. నేను ఎక్కువ గౌరవించే వృత్తి పౌరోహిత్యం అన్నాను కదూ? నిజమే. నేను హాస్యమాడటం లేదు. మీ నాన్నని చూడు. మా నాన్నని చూడు. వాళ్ళు స్వచ్ఛమైన బ్రాహ్మణులు. పరువూ మర్యాదా ఉన్నవాళ్ళు. ఉన్నంతలో సంతృప్తిగా, సంతోషంగా జీవితాలు గడుపుతున్న వాళ్ళు. ఊళ్ళో అంతా వాళ్ళని గౌరవిస్తారు. వాళ్ళు లక్షలు గడించకపోవచ్చు, సూట్లూ బూట్లూ వేసుకోక పోవచ్చు. కాని వాళ్ళు సంస్కార వంతులు కాదా? సంస్కారం అన్న పదానికి అంతకన్న అర్థం ఏమిటి? వాళ్ళని మనుషులూ దేవుళ్ళూ కూడా మెచ్చుకుంటారు. వాళ్ళ వాక్కు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో, వాళ్ళ మనసు, పని ఎంత విశ్వశ్రేయస్సుని కాంక్షిస్తాయో ఒక్కసారి ఆలోచించు. అంతకంటె ఎవరైనా సాధించే దేమిటి? గోపీ, నేను ఒక్క మాట చెప్తాను విను. నీ చేతులతో నువ్వు చక్కని భవిష్యత్తు పాడు చేసుకోకు. పైపై మెరుగులకి భ్రమసిపోయి ఆత్మ సంస్కారాన్ని, ఆత్మ సంతృప్తినీ ఇచ్చే ఈ దివ్యమైన వృత్తిని వదులుకోకు. ఎంతో పూర్వజన్మ సుకృతం కొద్దీ ఈ ఇంట్లో పుట్టేవు. మీ నాన్నదగ్గర చిన్నప్పుడు



సంస్కృతం చెప్పుకున్నావు. మరి ఆ అధ్యయనం, అభ్యాసం అంతా వ్యర్థం కావలసిందేనా? ఈ రోజుల్లో ఏదైనా మంచి ఉద్యోగం సంపాదించుకోవడం, ఒక కొత్త వృత్తిలో స్థిరపడడం ఎంత కష్టమో తెలుసా నీకు? దానికి కావలసినంత ఓర్పూ నేర్పూ ఉన్నాయా నీకు?"

గోపీ వంచిన తల ఎత్తలేదు.

"గోపీ, నా మీద నీకేమైనా అభిమానం ఉంటే నేను చెప్పే మాటలు విను. ఏ శ్రమా లేకుండా చేపట్టగల ఈ వృత్తిని ఎందుకు వదులుకుంటావు? మొదట్లో నీకే ఇబ్బంది వచ్చినా అండగా మామయ్య ఉంటారు కదా! పౌరోహిత్యం ఫ్యాషన్ కాదని నీ ఉద్దేశ్యం, ఔనా? పురోహితుడివైతే ఎంచక్కా రకరకాల డ్రస్సులు వేసుకోవడానికి వీలవదనేనా? సరే, ఆ మాట ఒప్పుకుంటాను. పోనీ, నీకు నచ్చినట్టే కానీ. నేను మామయ్యతో మాట్లాడనా? ఆయనకున్న పలుకుబడి అంతా ఉపయోగించి నీకు ఒక సినిమాలో వేషం ఇప్పించమని నీ తరఫున నేను అడగనా?" అంది గౌరి, వరాలిస్తున్న దేవత తీరులో.

గోపీ మెరిసే కళ్లతో ఆమె వైపు చూశాడు. ఆమె గట్టిగా చెపితే తండ్రి ఆ ప్రయత్నం చేస్తాడని అతడికి తెలుసు. "నిజంగా అడుగుతావా? నా కోసం ఆ మాత్రం కష్టపడుదూ" అన్నాడు, ఆందోళన, అభ్యర్థనా కలగలిపిన స్వరంతో.

"అడుగుతాను. ఇది నీ పని కాదు, నా పని అనుకుని చెయ్యమంటాను. నే నడిగితే మామయ్య కాదనరు. మామయ్య తల్చుకుంటే పని జరగడమూ కష్టం కాదు" అంది గౌరి, స్థిరంగా.

"ఔనౌను. నాన్న తలుచుకోవాలే గాని, అదేమీ కష్టం కాదు" అన్నాడు గోపీ కూడా.


"సరే అలాగే అడుగుతాను గాని, నీకు దొరికే వేషం పురోహితుడి వేషం అనుకో– చేస్తావా?"

ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు గోపీ. "చేస్తాను. నా క్కావలసింది సినిమాల్లో నటించడం. ఏ వేషం అయినా సరే. పురోహితుడు కాదు. బిచ్చగాడి వేషమైనా సరే. ఆర్టిస్టు అన్నవాడు ఏ రోల్ వెయ్యడానికైనా సిద్ధపడే ఉండాలి."

గౌరి నవ్వింది అతడి మాటలకి. "అంటే లక్షలాది ప్రేక్షకులకి నువ్వు గుండు, పిలక, విభూది పిండికట్టుతో కనిపించడానికి నీకు అభ్యంతరం లేదు గాని, కొద్ది మంది ముందు అలా తిరగడానికి నామోషీ అన్నమాట" అంది.

అతడికి ఆ మాటలు అర్థమవడానికి కొంతసేపు పట్టింది. అతడు ఏదో అనబోయేంతలో ఆమే మళ్లీ మాట్లాడింది. "చూడు గోపీ, పురోహితుడిగా నటించడానికి నీకు లేని అభ్యంతరం పురోహితుడిగా జీవించడానికి ఎందుకు? అసలు ప్రపంచమే పెద్ద నాటక రంగం అనీ, మనమంతా వివిధ పాత్రలు పోషిస్తున్న నటులం అనీ పెద్దలంటారు కదా!నువ్వన్నట్టు, మనకి దొరికిన పాత్రతో మనం సంతృప్తి పడి దానికి పూర్తి న్యాయం చెయ్యాలి గాని–"

గోపీ ఆమె మాటలకి మధ్యలోనే అడ్డుపడుతూ,



"అయితే మా నాన్నతో మాట్లాడి వేషం ఇప్పిస్తానన్న మాటలన్నీ అబద్ధమే నన్నమాట" అన్నాడు కోపంగా.

"కాదు కాదు. అదికాదు నా ఉద్దేశ్యం" అంది గౌరి. "నా మీద ఊరికే అలగకు. నేను చెప్పే మాటలు కొంచెం ఓర్పుగా, శ్రద్ధగా విను. నేను నీ శ్రేయోభిలాషినని, నీ మేలు కోరుతాననీ నమ్ముతావా?" అంది, సూటిగా.

గోపీ తల ఊపేడు.

"అయితే విను. నా సలహా ఏమిటంటే, రేపటి నుంచి మామయ్యకి అసిస్టెంటుగా ఆయనతో బాటే నువ్వు తిరుగుతూ ఉండు. డ్యూటీలో ఉన్నంతసేపే ఆ వేషం. తరవాత మామూలుగా ప్యాంటు, షర్టు వేసుకోవచ్చు. మామయ్యతో కలిసి ఉంటే సినిమారంగంలోని పెద్దలందరి దగ్గరకీ నీకు ప్రవేశం సులువుగా లభిస్తుంది. నీ జీవిక కోసం నువ్వు వేరే ఉద్యోగం ఏదీ చూసుకో అక్కర్లేదు. ఈ లోగా వ్యాయామం అదీ చేసి నీ శరీరాన్ని ఆకర్షణీయంగా అభివృద్ధి చేసుకో. నీకు పెద్దల దగ్గర ప్రవేశం, చనువు బాగా ఉన్నాక సరదాగా ముందు పురోహితుడి వేషం ఇమ్మని అడుగు. ఆ వేషంలోనే నిన్ను ఎప్పుడూ చూస్తూ ఉంటారు కనక దర్శకులూ నిర్మాతలూ అందుకు సులువుగానే ఒప్పుకోవచ్చు. అందులో రాణిస్తే తరవాత మంచి వేషాలు వాటంతట అవే వస్తాయి. నువ్వు రోడ్డు పట్టి తిరుగుతున్నంతసేపూ రోడ్డుమీదే ఉంటావు. నువ్వు ఈ పౌరోహిత్యం గనక ప్రారంభించావా, నీకు నిలకడ కుదురుతుంది. బాధ్యత తెలుస్తుంది. మామయ్యా సంతోషిస్తారు. ఆయన మీద ఎక్కువగా ఆధారపడకుండా నీ కోరిక నువ్వు తీర్చుకోవచ్చు. ఇది నీ సినిమా ప్రయత్నాలకి అవరోధం కాదు సరికదా, ఆ ప్రయత్నం సులువుగా నెరవేరేందుకు చక్కని అవకాశం. ఆలోచించు మరి...."

గౌరి వంక మెచ్చుకోలుగా చూస్తూ ఉండిపోయాడు గోపీ. ఆమె చెప్పింది నిజం. ఇన్నాళ్లూ తనెందుకు ఇలా ఆలోచించలేదు?

నెల రోజులు తిరక్కుండా గోపాలశాస్త్రి తండ్రికి జూనియర్‌గా స్థిరపడ్డాడు. పరమేశ్వర శాస్త్రి ఆనందాశ్చర్యాలకి మేరలేదు. ఈ ఆకస్మిక మార్పు ఎలా వచ్చిందో అతనికి తెలియలేదు గాని, దాని వెనుక గౌరి అదృశ్య హస్తం ఉందని మాత్రం అతడు గ్రహించాడు.

కొన్ని రోజుల తరవాత గౌరి బట్టలు సర్దుకుని, "ఇక నేను వెళ్తాను మామయ్యా. శలవిప్పించండి" అంది.

అంతా ఆశ్చర్య పోయారు. వొద్దన్నారు, బ్రతిమాలేరు. "మా తెల్లావు చూలుతో ఉంది. ఈనే రోజులు దగ్గర పడ్డాయి. నేను వెళ్లాలి. అదీగాక మా ఊరి అమ్మవారి సంబరం ఇంకెన్నాళ్లో లేదు. నన్ను వెళ్లనివ్వండి" అని మాత్రం అంది గౌరి.

పరమేశ్వర శాస్త్రి, గోపాల శాస్త్రి గౌరిని సెంట్రల్ స్టేషనుకితీసుకు వెళ్లి టికెట్ కొని సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కించారు. పరమేశ్వర శాస్త్రి ఆమె తల నిమురుతూ మనసులోనే మౌనంగా ఆశీర్వదించాడు. గోపీ ఆమె వంక సభక్తికంగా చూస్తూ ఉండిపోయాడు. ఆమె మరింక మద్రాసు రాదని వాళ్లిద్దరికీ తెలుసు.

●

హలో! డాక్టర్ నేనేం చెయ్యాలి?



డా. కొత్త రవీంద్రబాబు

ఎ. సుధాకర్, పొద్దుటూరు.

గోడ ఎక్కిన తర్వాత బీజము వాసినది. రతిలో పాల్గొనవచ్చా? ఆపరేషన్ చేయించుకోవాలా?

డాక్టరుగారికి చూపించుకోండి. వరిబీజం వుంటే ఆపరేషన్ చేయించుకోండి. నొప్పి లేకపోతే రతిలో పాల్గొనవచ్చు.

కె.రాజేష్, హిందూపూర్.

జుట్టు వూడిపోయి ఆందోళనగా వుంది.

జెబెక్స్ బిళ్ల రోజు కొకటి భోజనానంతరం రెండు నెలలు వాడండి. మింటాప్ మందు ఉదయం 1 సి సి. సాయంత్రం 1 సి సి తలకు స్నానానంతరం రాసుకోండి.

ఇ. వెంకటేశ్వరరావు, భీమవరం.

ముఖంలో తేజస్సు లేదు. కళ్ళక్రింద మచ్చలు.

వినోఫిట్‌జిన్‌సింగ్ గొట్టం రోజు కొకటి వేసుకోండి. పండ్లు ఎక్కువగా తిని పాలు తాగండి.

రావు, విజయవాడ.

సెక్స్ పుస్తకాలు ఎక్కువ చదివి స్వరతి కలవడ్డాను. వివాహం కాలేదు.

బ్లూ ఫిల్మ్స్, సెక్స్ పుస్తకాలు జోలికి వెళ్లవద్దు. శరీర శ్రమ చేయండి. ఇన్‌డిరాల్ 10 మిల్లీ గ్రాముల బిళ్ల ఉదయం, సాయంత్రం డెప్సొడయాక్ బిళ్ల రాత్రిపూట రెండు నెలలు వాడి చూడండి. మనసు నిగ్రహించుకొనడంలో ఆనందం పొందండి.

ఆర్. సి. రజని, హిందూపూర్.

చెస్ట్ తక్కువగా వుంది.

పండ్లు, పాలు, కోడిగుడ్లు తీసుకోండి.ఒరబోలిన్ బిళ్ళ, వినోఫిట్ జిన్సింగ్ గొట్టం రోజు కొకటి చొప్పున మూడు నెలలు వాడండి.

పి. సుధ, వైజాగు.

16 సంవత్సరములు. లావుగా వుంటాను.అన్నం తగ్గించుకోమనవద్దు. రాత్రి నిద్ర పట్టదు. పెళ్లి కాలేదు. సెక్స్ కోరిక లెక్కువ.

ఏదో ఒక వ్యాపకం కల్పించుకొన్నందువలన సెక్స్ కోరిక లదుపులో వుండవచ్చు. ఆకలి అయినప్పుడు పల్చటి మజ్జిగ ఒక గ్లాసు తాగండి. పాండోరాక్స్ బిళ్ల ఉదయం ఒకటి రాత్రి ఒకటి వేసుకోండి రెండు నెలలపాటు. ఆకలి తగ్గుతుంది.

డి. కె. విశ్వనాథ్, తుని.

మా ఆవిడకు పచ్చకామెర్లు వచ్చాయి. ఎన్నాళ్లు కలవకుండా వుండాలి.

ఆమె ఆరోగ్యం బాగు పడ్డాక నిరోధ్ వాడి పాల్గొనవచ్చు. ఆరు నెలలపాటు యిలా వాడాలి.

కె. ఫణి రాజ్యలక్ష్మి, తుమ్మపాల.

తరచు కక్కులు, ఆకుపచ్చ విరోచనములు. వడదెబ్బ తగులకుండా నివారణ వ్రాయండి.

పూర్తి వివరాలు లేకుండా మందులు వ్రాయలేను. డాక్టరుగారికి చూపించుకోండి. ఎండలో అనవసరంగా తిరుగకుండా ఉప్పు వేసిన మజ్జిగ నిమ్మరసం వాడినందువలన వడదెబ్బను తప్పుకోవచ్చు. మంచినీ రెక్కువగా తాగాలి.

జి. రాజకుమార్, హైదరాబాద్.

వయసు 24. కళ్లు మసక. పియర్స్ సబ్బుతో రోజూ తలస్నానం చేయవచ్చా? బీర్ తాగవచ్చా?

కళ్ల మసకకు కంటి డాక్టరుగారికి చూపించండి. వారానికి రెండు సార్లు తల స్నానం చేయవచ్చు. పియర్స్ సబ్బు వాడవచ్చు. లావెక్కడం కోసం బీరు తాగవద్దు!

ఆర్. సత్యనారాయణ, విశాఖ.

కూలింగ్ అద్దాలు వాడుతున్నా ఎండలో కెడితే తలనొప్పి.

కళ్ళద్దాలు వాడకండి.

స్నేహలత, శ్రీశైలం.

మా బంధువుల అమ్మాయి జుట్టు పీక్కుంటుంది. వయసు 19 సంవత్సరములు.

దగ్గరలో వున్న సైకియాట్రిస్ట్‌ను సంప్రదించండి. పూర్తి వివరాలు తెలియనిది మందులు తెలుపలేను.

ఎం. నర్సింగ్‌రావ్, ఆదిలాబాద్.

19 సంవత్సరాలు ఒక్కగా కళ్ళు పీక్కుపోయినవి. తలుచుకున్నది జరిగే వరకు తోచదు.

లివోట్రిప్ బిళ్ల ఒకటి జిన్‌సింగ్ గొట్టం ఒకటి రాత్రి భోజనానంతరం రెండు నెలలు వాడండి.

కె. స్. రావు, విశాఖ.

సంవత్సరం క్రితం స్త్రీతో కలిశాను. ఇప్పుడు అంగం చివర పొక్కులేచి తగ్గుతున్నది.

సంవత్సరం తర్వాత సుఖవ్యాధి వచ్చే అవకాశాలు తక్కువ. అయినా వి.డి.ఆర్. ఎల్. రక్తపరీక్ష చేయించుకోండి.

పి. ఐ. రాజు, విశాఖ.

కంట్లో తెల్లటి మచ్చలు తుడిస్తే పోతున్నది.

మీ అంత మీరా మచ్చలు తుడువకుండా కంటి డాక్టరుగారికి చూపించుకోండి.

కుమార్, ఖమ్మం.

నుదిటిమీద కాల్చారు. మచ్చ పోవాలి.

ప్లాస్టిక్ సర్జన్‌కు చూపించుకోండి. మచ్చ పోగొట్టే వీలున్నది. హైదరాబాద్‌లో వరంగల్లులో విజయవాడలో ప్లాస్టిక్ సర్జన్లున్నారు.

రాజు, విశాఖ.

బరువు తక్కువగా వుంటాను. నీరసం. అలసట. స్ట్రాంబా బిళ్లలు దొరకడం లేదు.

ఒరబాలిన్ బిళ్ల రోజుకొకటి వాడండి. పండ్లు, పాలు, గుడ్లు, పప్పు వున్న సమీకృతాహారం తీసుకోండి.

నీనా గుప్తాకు రిచర్డ్స్ లేఖ

నీనాగుప్తాకు వెస్టిండీస్ క్రికెట్ జట్టు క్యాప్టెన్ వివియన్ రిచర్డ్స్ ఈమధ్య ఒక రహస్యలేఖ వ్రాశాడట. అసలు నీనా గుప్తాకు- రిచర్డ్స్‌కు మధ్య ఏ విధమైన సంబంధంవుందో మనకు తెలియదుకాని ఆ లేఖ సారాంశం మాత్రం ఖంగుతినేదిగా వుంది. నీనాకు పుట్టిన బిడ్డకు తండ్రిని నేనేనని రిచర్డ్స్ ఉత్తరం వ్రాశాడు. స్కూల్లో చేర్చే ముందు ఈ బిడ్డకు తండ్రెవరని అడుగుతారని కాబోలు రిచర్డ్స్ ఈ లేఖ వ్రాశాడు. ఈ లేఖ రహస్యం ఎంతవరకు నిజమోకాని బొంబాయి నగరంలో మాత్రం గుప్పుమందట!



సీరియల్

సూపర్ హీరో



మన్నెం శారద

గణేశన్ ఆందోళనగా అటూ ఇటూ తిరుగుతున్నాడు.ఇప్పుడే వస్తానంటూ ఇంటికెళ్ళిన విజయేంద్ర ఇంతవరకూ రాలేదు. ఇవతల దమయంతి ప్రాణం అటూ ఇటూ ఊగులాడుతోంది.

"సర్! విజయేంద్రని పోలీసులు తీసుకెళ్ళేరట!" అంటూ గబ గబా వచ్చి గణేశన్ గారికి చెప్పేడు శ్యామ్‌సుందర్.

గణేశన్ స్థాణు వైపోయి "అడడ! ఎన్నదా ఈ ఘోరం! ఏమిదా జరిగింది!" అన్నాడు నెత్తి నోరు బాదుకొంటూ.

"అదే తెలియడం లేదుసర్! చిన్న స్టేట్ మెంట్ కోసమని తీసుకెళ్ళేరట. ఇన్ని గంటలయినా. వదలలేదని ఆయన తల్లిగారు బాధపడుతున్నారు. అసలతన్ని ఎక్కడ వుంచేరో కూడ తెలియలేదట!" అన్నాడు శ్యామసుందర్.

గణేశన్‌కి మతిపోయినట్లయింది.వెంటనే రాయుడు కోసం ట్రయ్ చేసేడు ఫోన్లో. ప్రొద్దుట ఫ్లయిట్‌కే అతను స్టేట్ బార్డర్స్‌లో నక్సలైట్ల ఏక్టివిటీస్ గురించి చర్చించడానికి మహారాష్ట్ర వెళ్ళేడని తెలిసింది.

అతను దిక్కుతోచనట్లు నిలబడి వుండగా డాక్టర్ చిన్నగా బయటకొచ్చి "గణేశన్ గారూ!" అని పిలిచేడు.

గణేశన్ వెనుతిరిగి చూసి "ఏమి డాక్టరుగారూ! మా దమయంతి పొన్నుకెలా వుంది?" అనడిగేడు.

"మీరొకసారి ఇలా రండి!"

డాక్టర్ పిలుపుకి గణేశన్ గబగబా అతని దగ్గరకి నడిచేడు.

"నేను మాగ్జిమమ్ ట్రయ్ చేసేను. అయినా ఫలితం లేకపోయింది. అయామ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ! బాడీ హేండోవర్ చేసుకోవచ్చు" అని తన బాధ్యత తీరినట్లు వెళ్ళిపోయాడు.

గణేశన్ స్థంభించిపోయేడా మాట విని.

(గత సంచిక తరువాయి)

అతని కన్నులు కాల్వలు కట్టేయా మాట వినగానే.

అలానే శిలలా నిలబడిపోయాడు.

జరగలవలసిన తతంగం జరిగిపోయింది. పోస్ట్‌మార్టమ్ చేయబడిన దమయంతి దేహం తీసుకొని ఇల్లు చేరేసరికి రాత్రి ఏడుగంటలు దాటింది.

శ్యామసుందర్ ఆ విషాద ఉదంతం నిఖిలేశ్వరికి ఫోను చేసి చెప్పేడు. ఆమె వెంటనే పి.ఏ. ప్రసాద్‌ని తీసుకొని దమయంతి ఇంటికి వెళ్ళింది. అప్పటికే జనం బాగా మూగిపోయేరా ప్రాంతమంతా. దమయంతి చెల్లెళ్ళు, తమ్ముళ్ళు జరిగిందేమిటో తెలియని అయోమయ పరిస్థితిలో పడి గణేశన్‌గారిని గట్టిగా పట్టుకొని "అంకుల్! అక్క ఇక రాదా! ఇంక లేవదా!" అని అయోమయంగా అడుగుతున్నారు.

నిఖిలేశ్వరి వాళ్ళని దగ్గరకి తీసుకొని అక్కున చేర్చుకొంది.

"శవాన్ని త్వరగా ఎత్తేయండి. లేకపోతే పిల్లల్ని పట్టుకోలేం" అని ఎవరో సలహా ఇచ్చేరు.

"ఎలా! విజయేంద్ర చూడందీ!" అన్నాడు గణేశన్.

"లాభం లేదు సార్! నేను ఎన్నిసార్లు ఫోను చేసినా కమీషనర్ కార్యాలయం నుండి సరైన జవాబు లేదు. ప్రస్తుతానికి దమయంతి గారి దహన క్రియలు జరిపించక తప్పదు" అన్నాడు శ్యామసుందర్.

మొత్తానికి దమయంతి మృతదేహం ఆ రాత్రి అంతా ఉంచేరు. ఆమె శరీరమింకా దహనం కాకుండానే లోకంలోకి ఎవరి సత్తా కొద్ది వారు రచయితలని మించి అల్లిన కథలు ప్రచారం లోకి వెళ్ళేయి.

ప్రొద్దుటే దమయంతి ఆఖరి పయనం మొదలవ్వగానే నిఖిలేశ్వరి పట్టలేక గట్టిగానే ఏడ్చేసింది.

తనకే మాత్రం అనుభవంలేని 'సినిమా రంగంలో పొట్టకూటికై ప్రవేశించి ధనాధన్ దమయంతి అని పేరు గడించుకొన్న ఆ అమాయకురాలు ప్రేమ వలలో చిక్కి ఘోరంగా వంచింపబడి ఆయుషు తీరకుండానే ఆఖరి ప్రయాణం కట్టిందని చాల మందికి తెలియదు.

**** *** *** ***

విజయేంద్రని కమీషనర్ కార్యాలయంలో ఒక హాల్లో సోఫాలో కూర్చోబెట్టి పద్దెనిమిది గంటలు దాటింది.

"ఇలా ఎంత సేపు కూర్చోవాలి! అవతల నాకు అర్జెంటు పని వుంది. త్వరగా స్టేట్‌మెంటు తీసుకోండి" అన్నాడు విజయ్ అసహనంగా.

"కమీషనర్‌గారు రావాలి. అందాక మీరు వెయిట్ చెయ్యక తప్పదు" అన్నారు పోలీసాఫీసర్స్.

"అయితే నేనొకసారి హోం మినిష్టరుగారికి ఫోను చేస్తాను" అని అడిగాడు విజయ్.

"కుదరదు సర్!" అన్నారు వాళ్ళు నిక్కచ్చిగా.

<u>ఇంతవరకూ సాగినకథ - 16</u>: కాంట్రాక్టరు గోపాలరావుతో వివాహమై మనస్పర్ధలు కారణంగా విడిపోయిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నిఖిలేశ్వరి అనతి కాలంలోనే బిజీ హీరో అయిన తన కొడుకు విజయేంద్ర విజయావకాశాలను చూసి మురిసిపోతుంటుంది. సుధీర్ మాటలు నమ్మి హోటల్‌కు వెళ్ళిన దమయంతిని వ్యభిచార నేరం క్రింద అరెస్టు చేయటంతో ఆత్మహత్యా ప్రయత్నం చేసుకుంటుంది. విజయేంద్ర యింట్లో బాంబు వుందని సోదా చేయటానికి వచ్చిన పోలీసులు అతన్ని స్టేషన్‌కు తీసుకువెళ్ళారు.

సూపర్ హీరో



"కనీసం గవర్నమెంటు ఆస్పత్రి కన్నా చెయ్యనివ్వండి" అని అడిగేరు విజయేంద్ర.

"లోపల నుండి మీరు బయటికి ఫోను చెయ్యడానిగ్గాని, బయట ఫోన్సు మీకు ఇవ్వడానిగ్గాని వీల్లేదని కమీషనర్‌గారి ఉత్తర్వు!"

విజయేంద్ర ఆ మాటవిని నివ్వెరపోయేడు.

"అన్యాయం. ఏమిటి నేను చేసిన నేరం?" అనడిగేడు విజయేంద్ర ఆవేశంగా.

"కమీషనర్‌గారు రావాలి" అని మాత్రమే చెప్పేరు వాళ్ళు.

విజయేంద్ర అలాగే అస్థిమితంగా కూర్చున్నాడు సోఫాలో. జరుగుతున్నదేమిటో, జరగబోయే దేమిటో ఎంతగా ఆలోచించినా అతనికి అర్థం కావడం లేదు. కమీషనరు తన మీద వ్యక్తిగత ద్వేషంతో స్టేట్‌మెంటు అంటూ తీసుకొచ్చి ఇలా నిర్బంధించేడా! బయట నుండి తనకెలాంటి కమ్యూనికేషన్ లేకుండా చేయడంలోని ఆంతర్యమేమిటి? తనెవర్ని న్యాయం చెయ్యమని అడగగలడు! అసలింతకీ దమయంతి కెలా వుందో! ఎలా ఆ విషయం తెలుస్తుంది! బాధగా కళ్ళు మూసుకున్నాడతను.

మూసిన కనురెప్పల వెనుక తనకోసం తల్లిడిల్లి పోతున్న తల్లి రూపం కనిపించి అతన్ని అస్థిమితుణ్ణి చేసింది. ఇంత సేపుగా తను వెనక్కి రాకపోవడం ఆమెనెంతగా కృంగదీస్తోందో! హాస్పిటల్లో గణేశన్‌గారు ఎంతగా కంగారు పడుతున్నారో!

విజయేంద్ర తన ఆలోచనల్లో తానుండగానే మూడు రాత్రులు గడిచిపోయేయి.

నాల్గో రోజు ఉదయం అతను కమీషనర్ ఆఫ్ పోలీసు ఉత్తర్వు ప్రకారం గూండా ఏక్ట్ క్రింద అరెస్టు చేయబడ్డాడు.

ఆ వార్త వినగానే నిఖిలేశ్వరి నిలువునా కూలిపోయింది.

యావత్ సినిమా పరిశ్రమ 'అన్యాయం' అని ఆక్రోశించింది.

తమ ఎదుగుదలకి అతని ప్రగతి అడ్డం అని భావించే కొందరు హీరోలు మాత్రం విజయేంద్ర అరెస్టు కాబడ్డాడన్న వార్త విని ఎంతగానో సంతోషించేరు. వీలయితే ఈ అగ్నిలో కొంత ఆజ్యం పోసి ఆ మంటని ఆరనివ్వకుండా చేయాలని కూడ నిర్ణయించుకొన్నారు.

తెల్లవారే సరికి పత్రికలన్నీ అతను సంకెళ్ళతో వున్న సినిమాల్లోని స్టిల్స్ ప్రముఖంగా వేసి ఆ వార్తని రాసేసేయి.

అతను బ్లూఫిల్మ్‌లు నిర్మిస్తున్నాడని, కొత్తగా సినిమాల్లోకి వచ్చిన అమ్మాయిల్ని చెరచి అందుకు ఉపయోగించుకుంటున్నాడని, అతని అభిమానులుగా వచ్చిన అమాయిక కన్నెపిల్లల శీలాల్ని అతను అపహరిస్తున్నాడని-ఇం

దుకు అతని తల్లి సహకారం ఉందని పత్రికలు వ్రాసేసేయి. కొన్ని వార పత్రికలు అతని కథని రకరకాలుగా రాసి సొమ్ము చేసుకోవడం ప్రారంభించేయి.

విజయేంద్ర అరెస్టు వార్త ఇరవైనాలుగ్గం టల్లో దావానలంలా ఆంధ్రదేశమంతా పాకి పోయింది.

*** *** *** *** ***

ఆ రోజు రాజన్న ఇంట్లో అతని కూతురి పెళ్ళి రిసెప్షన్. గాంధీ పెళ్లికి వెళ్లడానికి తయారయ్యాడు. నిజానికతనికి ఆ పెళ్లికి వెళ్లేంత తీరుబడిగాని, అవకాశం కానీ లేవు. విజయేంద్ర అరెస్టు మీద రకరకాల పుకార్లు ఆంధ్రదేశమంతటా తలెత్తుతున్నాయి. లక్ష లాది అభిమానులు అతని అరెస్టుని సహించలేక గొడవ చేస్తున్నారు. అరెస్టు చేసి కార ణాలు చూపించలేక వదిలేస్తే అది తనకే అవమానం అవుతుంది. అందుకే అతని చుట్టూ ఇనుప చువ్వలు అతను బ్రతికినంత కాలం చెక్కు చెదరనివ్వకుండా చెయ్యాలంటే తాను పకడ్బందీ అయిన సాక్ష్యాల్ని సిద్ధం చేసుకోవాలి. తన కూతురికి అవి తెలిసి మనసు విరిగిపోవాలి!

అతను సూట్‌లో రాజన్న ఇంటికి చేరు కున్నాడు. వేలాది ఆహూతులతో, వెలిగిపోతున్న దీపాలతో రిసెప్షన్ హాలు వెలిగిపోతున్నది. దూరం నుండే రాజన్న గాంధీని కళ్లతోనే పలుకరించి దగ్గరికి వచ్చేడు.

"రండి, రండి మీ కోసమే ఎదురు చూస్తున్నాను" అన్నాడు రాజన్న అతనితో కరచాలనం చేస్తూ.

గాంధీ క్రీగంట స్టేజి మీద సోఫాలో కూర్చున్న జంట వైపు చూశాడు. తంతే బూరెల బుట్టలో పడ్డ ఆనందంతో వెలిగి పోతున్నాడు కరుణాకర్.

"మొత్తానికి కాంప్రమైజ్ అయిపోయేర న్నమాట?" అన్నాడు గాంధీ రాజన్న వైపు చూసి చిరునవ్వుతో.

"తప్పలేదు. కడుపు తీపి అలాంటిది!"

"ఇట్సాల్‌రైట్. ఒకసారి కొత్త జంటని విష్ చేసి వస్తాను" అన్నాడు గాంధీ.


"తప్పకుండా!" రాజన్న మరొకరి వైపు తిరిగి ఆహ్వానిస్తుంటే గాంధీ స్టేజీ మీద కెళ్ళేడు.

రజని అతన్ని గుర్తుపట్టి నమస్కరించి "పీయూషని, ఆంటీని తీసుకురాలేదేంటి అంకుల్!" అంది.

ఆంటీకి ఆరోగ్యం బాగుండలేదు. అంటూ కరుణాకర్ వైపు నిశితంగా చూశాడు గాంధీ.

"అంకుల్ పేరు వినే వుంటారు. కమీ షనర్ ఆఫ్ పోలీస్, కరంచంద్ గాంధీ....." అంటూ భర్తకి పరిచయం చేసింది రజని.

కరుణాకర్ కృతకమైన నవ్వుతో భుజాలె గరేసి "విన్నాను, విన్నాను. చూసే అదృష్టం మాత్రం ఇప్పుడే కల్గింది" అన్నాడు గాంధీ చెయ్యి పట్టుకొని అదే పనిగా ఊపుతూ.



"మమ్మల్ని చూడటం అదృష్టంగా భావించరు చాల మంది!" అన్నాడు గాంధీ అదోలా నవ్వుతూ.

ఆ మాటకే ఎంతోనొచ్చుకుంటున్న ట్లుగా మొహభంగిమ మార్చి "ఎంత మాట! మీలాంటి పెద్దల్ని కలవడం నేను అదృష్టం గానే భావిస్తాను" అన్నాడు కరుణాకర్.

"అలా అయితే రేపొకసారి మనం స్టేషన్లో కలుద్దాం!"

గాంధీ మాటకి కంగుతిన్నట్లయి "వ్వాట్ రాజన్న గారి అల్లుడు పోలీస్ స్టేషన్‌కి రావటం గౌరవమైన పనంటారా?" అన్నాడు కరుణా కర్.

"స్టేషనంటే స్టేషన్ కాదులే! కమీష నర్ కార్యాలయం. అదీ రాజన్నగారి అల్లుడిగా వద్దు. జే. ఆర్. వీడియో లైబ్రరీ వోనర్‌గా!"

కరుణాకర్ నొసలు చిట్లించి చూశాడు.

"ఒన్ మినిట్!" గాంధీ రెండడుగులు వెనక్కేసేడు.

కరుణాకర్ రజని వైపు చూశాడు.

రజని చూడవచ్చిన ఫ్రెండ్స్‌తో మాట్లా డుతోంది. కరుణాకర్ గాంధీ దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

"రేపు పదకొండు గంటలకి నువ్వు కమీ షనర్ కార్యాలయంలో వుండాలి. లేకపోతే నీ వీడియో పార్లర్‌లో దొరికిన బ్లూఫిల్మ్....."

"ష్యూర్! ష్యూర్! తప్పక వస్తాను" అన్నాడు కరుణాకర్ పాలిపోయిన మొహంతో.

గాంధీ రాజన్న నుండి వీడ్కోలు తీసుకొని ఇంటికి బయల్దేరేడు వెయ్యి ఆలోచనలతో.

*** *** *** *** ***

"మా అమ్మగారి నొకసారి చూడాలి!"

విజయేంద్ర వైపు పరిహాసంగా చూశాడు ఇన్‌స్పెక్టర్ జేమ్స్.

"బహుశ మూడు రోజుల క్రితం నువ్వు నీ తల్లిని చూసొచ్చేవే, అదే నీకు ఆఖరి జ్ఞాపకం మిస్టర్ విజయేంద్రా. నోరెత్తకు" అన్నాడు జేమ్స్.

విజయేంద్ర అతని వైపు నిశితంగా చూసి "నేనేం చేసేనని?" అన్నాడు కోపాన్ని అణ చుకొంటూ.

బదులుగా అతను కొన్ని తెల్లకాగితాల్ని అతని ముందుంచి "వీటి మీద సంతకం పెట్టు" అన్నాడు.

"ఎందుకు?"

"ఎదురు ప్రశ్నలు ఇక నీ జీవితంలో ఉండకూడదు. నువ్వు ప్రాణాలతో బ్రతికి వుండాలంటే మర్యాదాగా మేము చెప్పిన పని చెయ్యడ మొక్కటే నీకు గతి."

విజయేంద్రకి జరుగుతున్నది అర్థం

హీరో సుమన్‌తో సూపర్‌హీరో రచయిత్రి మన్నెం

ప్ర: మీ సినీజీవిత చరిత్రలో చాల విజయాలున్నాయి. అయినా నేటి భారతం మీ జీవితంలో మరపురాని సినిమా. మరి కథల పట్ల ఏదైనా ప్రత్యేక శ్రద్ధ వహించి నటించాలనుకొంటున్నారా?

జ: ఇప్పుడు నేను చేస్తున్న వాటిలో కొన్ని మాస్ ఎంటర్‌టెయిన్‌మెంటు వున్నాయి. కొన్ని సీరియస్‌వి వున్నాయి. రాముడు కాదు రాక్షసుడు కమర్షియల్లో కొద్దిగా విభిన్నమైన చిత్రం. అలాగే బాలు మహేంద్రగారి చిత్రం చక్రవ్యూహం, కోడి రామకృష్ణగారి 20వ శతాబ్దం ఆఫ్‌బీట్ ఎండ్ పొలిటికల్ చిత్రాలు. నటనకి మంచి స్కోప్ వున్నాయి. సబ్జక్టు మంచిదయితే డేట్స్ ఇవ్వడానికి నాకెలాంటి అభ్యంతరమూ లేదు. నా కెరీర్ నిలబడాలని మాత్రం చెబుతున్నాను.

ప్ర: నటన కాకుండా మీ హాబీలు ఏమిటి?

జ: మా అమ్మగారు వీణ. గిటార్ నేర్పించేరు. వెస్టర్న్, ఇండియన్ కూడ నేర్చుకున్నాను. పెయింటింగ్ చాల ఇష్టం. చిన్నప్పుడు అంటే ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో వైల్డ్ లైఫ్ పెయింటింగ్‌లో ప్రయిజులు నాకే వచ్చేయి. తర్వాత మోడరన్ ఆర్ట్ నేర్చుకున్నాను. మా అమ్మగారు చాల

[గత సంచిక తరువాయి]

మంచి ఆర్టిస్టు. కాలేజీలో ఏ ఫంక్షన్ అయినా ఏ టైప్ డిజైన్ చేయాలో ఆమెనే సంప్రదిస్తారు.

ప్ర: మీ నిర్మాతలకి మీరు మంచి సహకారం అందజేస్తారని విన్నాను. అలాగే రాష్ట్రంలో వరదలొచ్చినప్పుడు లక్షలాది రూపాయలు విరాళం ఇచ్చేరు. అలాగే ప్రముఖ నిర్మాత సారధి చనిపోయినప్పుడు ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. జీవితంలో ఇంకా ఏమైనా మంచి పనులు చేయాలన్న ఆశయం మీకుందా?

జ: రాష్ట్రం కష్టంలో వున్నప్పుడు నా వైపునుండి నేను చేయగల సహాయం నేనందజేసాను. పేరు కోసం కాదు. నెల్లూరులో సాయిబాబా మందిర్ నిర్మించేను. రెలిజియన్ అంటే నాకు నమ్మకముంది. సూపర్ నేచురల్ పవర్ వుందని నమ్ముతాను. బదులుగా నేను కోరుకొనేది దీవెనలు మాత్రమే. ముందు ముందు కూడా నాకు తోచింది నేను తప్పక చేస్తాను.

ప్ర: మీకు రాజకీయాల్లో ప్రవేశించాలన్న ఆసక్తి ఏమైనా వుందా?

జ: నాకందులోఎ.బి.సి. తెలియదు. అందులో ప్రవేశించడం తప్పేమీ కాదు. కాని నేను ముందు చలనచిత్రరంగంలో నిలదొక్కుకోవాలి. పొలిటీషియన్ ఎంతో బాధ్యతగా వ్యవహరించాలి. పూర్తి కాలాన్ని అందుకే వినియోగించాలి. అందుకు తగిన పరిపక్వత నాకింకా రాలేదనే అనుకుంటున్నాను.

ప్ర: మీ హీరోయిన్ల పట్ల మీ ప్రవర్తన ఎలా వుంటుంది?

జ: జనరల్‌గా నామీద సుమన్ సరిగ్గా కలవడం లేదు. చాల రిజర్వ్‌డ్‌గా వుంటారనే నింద వుంది. దానిక్కారణం సెట్స్‌మీద నేనెక్కువ కేరక్టర్ గురించే ఆలోచిస్తుంటాను. షూటింగ్ అయ్యేక 'హలో' అనడం మించి రిలేషన్ పెట్టుకోను. హీరోయిన్స్ అందరూ నిజానికి నైస్‌గానే వుంటారు. మంచి కోపరేషన్ ఇస్తారు. ఆర్టిస్టులమధ్య అవగాహన లేకపోతే సీన్ బాగా రాదు.

ప్ర: ఏ రంగంలోనైనా ఒక వ్యక్తి పైస్థాయి చేరినప్పుడు చుట్టూ మంచి వ్యక్తులు, దుష్ట వ్యక్తులు కూడ చేరుతారు. మీ చుట్టూ ఎలాంటి వ్యక్తులు ఉండాలని మీరు కోరుకుంటున్నారు?

జ: రెండు రకాలూ ఉంటేనే బెటర్. జనరల్‌గా మంచివారే చెడ్డవారుగా మారుతుంటారు. ఒకసారి డిసీవ్ అయ్యేకనే ఎలర్ట్ అవుతాము. అందువలన చెడుని దూరంగా వుంచాల్సిన అవసరం లేదని భావిస్తున్నాను.

ప్ర: ఒకప్పుడు తెలుగు కథల్ని ఇతర

రవిశంకర్‌కు అవార్డు

ప్రముఖ సితార్ విద్వాంసుడు పండిట్ రవిశంకర్‌కు 'స్వాతంత్ర్య ప్రేరణ' అవార్డు లభించింది. హైదరాబాద్ లోని వజీర్ సుల్తాన్ టుబాకో ఇండస్ట్రీస్ లిమిటెడ్ వారు ఈ అవార్డును ఏర్పాటు చేశారు.

ప్రముఖ షెహనాయ్ విద్వాంసుడు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ ఈ అవార్డును అందజేశారు. ఈ అవార్డు బహూకరణ సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటైన ఉత్సవాలకు అనేక మంది సంగీత విద్వాంసుల హాజరయ్యారు.



కావటం లేదు. తనేం చేసేడని ఇంత దారుణంగా వ్యవహరిస్తున్నారో అంతుబట్టడం లేదు.

అతను మౌనంగా సంతకాలు చేసి పేపర్లు ఇచ్చేసేడు.

ఆ వెంటనే అతన్ని భారీ ఎత్తు పోలీసు బందోబస్తుతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేరు.

ఒక సామాన్య నటుణ్ణి ఒక గొప్ప టెర్రరిస్టులా స్టెన్‌గన్ గురి పెట్టి వందలాది పోలీసు బలగంతో తీసుకెళ్తుంటే జనం విరగబడి చూశారు.

కావాలని జేమ్స్ పోలీస్ వేన్‌ని అతనింటి ముందునుండే తీసుకెళ్ళేడు. జనకోలాహలం చూసి నిఖిలేశ్వరి కిటికీ దగ్గర కొచ్చి నిలబడింది.

అప్పుడే విజయేంద్ర తన ఇంటివైపు చూశాడు.

"మీ అమ్మ అదిగో! బాగా చూడు. లేక

శారద ఆంధ్రసచిత్ర వారపత్రిక కోసం ఇంటర్వ్యూ!

భాషల్లోకి తీసుకొనేవారు. కాని ఇప్పుడు ఇతర భాషా చిత్రాల్ని తీసుకొని తెలుగులో పునర్ నిర్మిస్తున్నారు. తెలుగులో మంచి కథలు, రచయితలు లేరని మీరు భావిస్తున్నారా?

జ: ఈవేళ ట్రెండ్ మలయాళం నుండి తెలుగుకి సినిమా కథలు దిగుమతి



అవుతున్నాయి. కారణం మలయాళ కథలు నిజ జీవితానికి దగ్గరగా వుంటు న్నాయి. పాటలు లేకపోయినా, ఫైట్స్ లేకపోయినా కథ పవర్‌ఫుల్‌గా వుండ టంతో ఆ సినిమాల్ని ప్రేక్షకులు ఆద రిస్తున్నారు. వాళ్లకున్న బ్రెయిన్స్ మనకి వున్నాయి. కాని వాళ్ల ఎఫర్ట్స్ వేరు. కాని మనం ఎఫర్టు చేసే ఓపిక లేక డబ్బులిచ్చి కథని కొనేసుకొంటున్నాం.

ప్ర: మీరు ఒక తెలుగు అమ్మాయిని వివాహం చేసుకుంటానని స్టేట్‌మెంట్ ఇచ్చే రొకసారి. అది ప్రేమ వివాహమవుతుందా? మీ అమ్మగారు సెలక్టు చేసిన అమ్మాయిని చేసుకుంటారా?

జ: నేను మా అమ్మగారి ఛాయి స్‌కే వదిలేసేను. కారణం పెద్దలు తమ అనుభవంతో తీసుకొనే నిర్ణయాలు బాగుంటాయన్న నమ్మకం నాకుంది. నేను నటుణ్ణి. నన్ను చేసుకొనే అమ్మా యికి బ్రాడ్ అవుట్‌లుక్ ఉండాలి. లేక పోతే ప్రోబ్లెమ్స్ వస్తాయి. నేను బ్యూటీ కన్నా డ్యూటీకి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తాను. డబ్బు క్రేజ్ నాకు లేదు. నా జీవితంలో అప్ అండ్ డౌన్ చూశాను. ప్రస్తుతం నా దృష్టి అంతా నా కెరీర్ గురించే. పెళ్లి గురించి ఇప్పుడాలోచించ దలుచుకోలేదు.

ప్ర: మీకు ఆర్ట్ ఫిల్మ్‌స్‌లో చేసి అవార్డు పొందాలన్న ఉద్దేశ్యం ఉందా?

జ: ఆర్ట్ ఫిల్మ్స్ మీద నాకేమంత ఆసక్తిలేదు. ఎవార్డు నటనకి రావడం ఆశిస్తాను. నిజానికి ఎవార్డులు ఇచ్చే విధానం మీద నాకు సంతోషం లేదు. బెస్ట్ ఏక్టర్ ఎవార్డు హీరోకి మాత్రం ఇస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. ఒక చిత్రంలో మంచి నటనని విలన్ ప్రదర్శించవచ్చు. కమేడియన్ ప్రదర్శిం చవచ్చు. కాని ఫారిన్‌లో అలా కాదు. ఎవరు బాగా చేస్తే వారికి ఎవార్డు వెళ్తుంది. ఆ సిస్టమ్ సరైనదని నేను భావిస్తున్నాను.

[అయిపోయింది]

పోతే తర్వాత చూడలేకపోవచ్చు" అన్నాడు జేమ్స్ వెటకారంగా.

విజయేంద్ర అతని మాటలు పట్టించు కోలేదు.

ఈ సన్నివేశాన్ని తన తల్లి ఏ విధంగా తట్టుకోగలదో అతని ఊహకి అందడం లేదు.

కావాలనే వేన్‌ని ఆ ఇంటి ముందు స్లో చేయించేడు జేమ్స్.

నిఖిలేశ్వరి స్థాణు వైపోయింది ఆ దృశ్యాన్ని చూసి.

చిన్నప్పటి నుండి కొడుకుని ఎంతో క్రమ శిక్షణతో, చదువు సంస్కారాలతో పెంచింది తను. సున్నితంగా, సుకుమారంగా పాలు గారే తన తనయుడు ఈ విధంగా కటక టాల పాలై అప్రతిష్టకి లోనవుతాడని ఆమె ఎన్నడూ ఊహించి ఎరుగదు.

సినిమాల గురించిగాని, ఎన్నడూ చౌక బారు విషయాల గురించి గాని తమ ఇంట్లో

సూపర్ హీరో

ప్రసంగాలు జరిగేవి కావు. లిటరేచర్‌కి సంబంధించిన పుస్తకాలు, సైన్స్‌కి సంబం ధించిన జర్నల్స్, రెలిజియన్‌కి సంబంధించిన సాహిత్యం మాత్రమే తమ ఇంట్లో వుండేది. మిలటరి ఆఫీసర్ కావాలని కలలు కనే తన కొడుకు అనుకోని విధంగా సినిమా హీరో అయ్యేడు. ఆ లైన్ తను ఆశించింది కాకపో యినా ప్రయత్నాలు లేకుండానే పైకి ఎదు గుతోన్న తన కొడుకుని తనే ఆశీర్వదించి ప్రోత్సహించింది. ఆ ప్రొఫెషన్‌ని సీరియ స్‌గా తీసుకోమని సలహా ఇచ్చింది. ఎంత ఎత్తుకి ఎదిగినా ఇప్పటికి పసిపిల్లాడి మన స్తత్వం వీడని తన కొడుకు ఏం అపకారం చేసేడని ఇంత భారీ ఎత్తున అల్లరి చేసి శిక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఆమె గుండె వేడెక్కి కరిగి కళ్లని చేర బోయే లోపున ఆమె చటుక్కున కిటికీ రెక్కలు మూసి పూజగదిలో కెళ్లి దేవుడి మందిరం ముందు కూర్చొంది.

'భగవంతుడా, నాకు ఎదురౌతున్న సమ స్యల్ని ఎదుర్కొనే మనస్థయిర్యం ఇవ్వు! చాలు' అని ఆమె పెదవులు సన్నగా ఉచ్ఛ రించేయి.

అదే సమయానికి విజయేంద్ర కూడ కళ్లు మూసుకొని "దేవుడా, నా తల్లే ఇంత వరకు నాకు ప్రత్యక్ష దైవం! ఆమె మనసు నీరయిపోకుండా కాపాడమని నిన్ను మొద టిసారి కోరుకొంటున్నాను" అనుకున్నాడు మనసులో.

జేమ్స్ వెటకారంగా విజయేంద్ర వైపు చూసి "దేవుడు గుర్తొస్తున్నాడనుకొంటాను" అన్నాడు.

విజయేంద్ర మౌనంగా అతనివైపు చూసి

సూపర్ హీరో

తల తిప్పుకొన్నాడు.

జేమ్స్ ఆ నిర్లక్ష్యాన్ని భరించలేనట్లు కోపంతో రెచ్చిపోయి "చూస్తాను చూస్తాను. నీ పొగరు నిలువునా గోతిలో పాతిపెట్టలేక పోతే నా పేరు జేమ్స్ కాదు" అన్నాడు.

విజయేంద్ర దానికక్కడ జవాబు చెప్ప లేదు.

మరికొన్ని క్షణాల్లో జనరల్ ఆస్పత్రి లోని ఒక గదిలోకి విజయేంద్రని తీసుకెళ్లేరు. జేమ్స్‌ని బయట ఉండమని తలుపు దగ్గర కేసేడు డాక్టరు.

"ప్లీజ్ బి సీటెడ్" అన్నాడు డాక్టర్ విజయేంద్ర వైపు చూస్తూ.

విజయేంద్ర కుర్చీలో కూర్చొని అతని వైపు అయోమయంగా చూశాడు.

డాక్టర్ అతని వైపు సానుభూతిగా చూసి "మా అమ్మాయి చెబితే ఏంటో అనుకున్నాను గాని యూ ఆర్ వెరీ హాండ్ సమ్! అందుకే అంత క్రేజ్ అనుకొంటాను" అన్నాడు.

ప్రస్తుతం ఆ కాంప్లిమెంట్స్‌ని అందుకొనే స్థితిలో లేదు అతని అంతరంగం.

"నన్నెందుకిక్కడికి తీసుకొచ్చేరో చెప్పగ లరా డాక్టర్?" అని సూటిగా ప్రశ్నించేడు విజయేంద్ర.

డాక్టర్ ఓ క్షణం మూసిన తలుపుల వైపు చూసి లేచి మెల్లిగా అతని దగ్గరగా వచ్చి "డాక్టర్ పరీక్ష నిమిత్తం" అన్నాడు.

"ఏ పరీక్ష?"

"నువ్వో అమ్మాయిని రేప్ చేసేవని నిరూపించేందుకు సెమెన్ టెస్ట్ చెయ్యాలి!"

ఆ మాట విని ఉలిక్కిపడ్డాడు విజ యేంద్ర.

"ఏమిటి మీరంటున్నది?" అన్నాడు.

డాక్టర్ ఉదాసీనంగా నవ్వి "నేను చెయ్య గల్గిందేమీ లేదు విజయేంద్రా! జరుగుతున్నది నీకు తెలియబర్చడం తప్ప. ఈ నాటకం ఎవరెందుకు ఎలా మొదలు పెట్టినా ఫలితాలు మాత్రం నువ్వు భరించక తప్పదు" అన్నాడు సర్టిఫికెట్ రాస్తూ.

"అదేంటి, నన్ను టెస్ట్ చెయ్యకుం డానే...." విజయేంద్ర దిగ్భ్రమగా అడిగేడు డాక్టర్ని.

"వెరీసారీ మిస్టర్ విజయ్! ఇందాకే చెప్పేను జరుగుతున్నదొక గొప్ప డ్రామా అని. నా చేతులెప్పుడో బంధింపబడి పోయేయి. ఈ నాటకంలో నాదొక గెస్ట్‌రోల్. కాని నీ చేతు లకి సంకెళ్లు బిగించే చాల కీలకమైన పాత్ర. ఆ అమ్మాయిని నువ్వు రేప్ చేసావని నేను ఇస్తున్న సర్టిఫికెట్ ఇది!" అన్నాడు డాక్టర్.

విజయేంద్రకి పరిస్థితి అర్థమయ్యింది.

"ఇంతకీ ఆ అమ్మాయి ఎవరు?" అన్నాడు మనసుని అదుపులోకి తెచ్చు కొంటూ.

"అసలుంటే కదా!"

"మరి రేపు కోర్టు కెవరు వస్తారు?"


డాక్టర్ విజయేంద్రని పిచ్చివాడిలా చూసి "రాజు తలచుకొంటే దెబ్బలకి కొదవా మిస్టర్ విజయ్! కోర్టుకి ఒక్కరు కాదు - గూండా యిజానికి, డబ్బుకి లొంగి వందమందయినా వస్తారు. నేను కోరుకొనేది ఒకటే! నిన్నా దేవుడే రక్షించాలి!" అన్నాడు లేచి నిలబ డుతూ.

మరో పావుగంట తర్వాత ఇన్‌స్పెక్టర్ జేమ్స్ లోనికొచ్చి డాక్టర్ దగ్గర సర్టిఫికెట్ తీసుకొని విజయేంద్ర వైపు చూస్తూ "పద" అన్నాడు కఠినంగా.

విజయేంద్ర అతని వెనుక నడుస్తూ డాక్టర్ వైపు తిరిగి "థాంక్యూ డాక్టర్! వస్తాను!" అన్నాడు చిరునవ్వుతో.

డాక్టర్ చలించి పోయినట్లు చూశాడ తని వైపు.

(ఇంకా వుంది)



అరె నువ్వేనా? చీకట్లో తడిమి ఎవరోఅనుకున్నా!

ఇది ఓ వాగ్బాణం అనుకోండి. దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి- ఆ "రిపార్టీ" గుచ్చుకోవాలే గాని బాధించకూడదు. రసభరితంగా వుండాలేగాని అశ్లీలం కొట్టవ చ్చినట్లుండరాదు. కార్డు మీద మాత్రం రాయాలి. ఈ వాక్యం పైనరాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి. మీ పూర్తి చిరునామా ముఖ్యం. ప్రచురించిన రెంటికి రు. 25, రు. 15 చొప్పన బహుమతి వుంటుంది!- ఈ విషయంలో సంపా దకునిదే తుదినిర్ణయం.

14-7-'90లోగా రిపార్టీలు పంపించాలి!

టిట్ ఫర్ టాట్-52ఫలితాలు

"అబ్బా! అమ్మా!...యిస్సూ...ఉస్సూ!"

* రు. 25 బహుమతి పొందిన రిపార్టీ:

"అయిపోయింది...ఆ.... వచ్చేసింది.... యిదిగో ముల్లు! చూడు!"

-ఎం. కృష్ణారెడ్డి (పెనుగొండ)

* రు. 15 బహుమతి పొందిన రిపార్టీ:

"అహో! బుద్ధ భగవానుడా! నడుమేమైనా విరిగిందా?"

-సి. రాధ (హిందూపురం)

మరి కొన్ని వాగ్బాణాలు

"ఇది మీ మగతనమేనని మురిసిపోతున్నారా? కాదండీ బాబు ఎండల ప్రభావం?"

-కె. ఓంశివ (అనకాపల్లి)

"మీక్కూడా వడదెబ్బ తగిలిందా ఏం?"

-దుగ్గరాజు నాగలక్ష్మి (మణు గూరు)

"ష్!.....ఎంత పవర్ కట్ అయితే మాత్రం ఏంటా గొణుగుడు? ఎవరైనా అపార్థం చేసుకుంటారు?"

-వి. రమేష్ (సోంపేట)

"వేడి వేడిగా తింటే నోరు కాలదూ? మరి!"

-ఎస్. భాగ్యలక్ష్మి (కర్నూలు)

"నిలబెట్టి లక్షగుంజారు! ఒక్క బిందె నీళ్లు తేవడానికి యిన్ని మూల్గులా?!"

-వడ్లమూడి దుర్గాంబ (శ్రీశైలం ప్రాజెక్టు)

"మన సినిమాలో బ్రేక్ డాన్స్‌కి పాట రాయించుకొచ్చా-బావుందా డైరెక్టరూ!"

-కె.ఎస్. మాచన్న (తాళ్లపూడి)

"అమ్మయ్యా! తెలుగు సినిమా పాటకి మొదటి వాక్యం రాసేసారు!"

-మొవ్వ బాబూరావు (హైదరాబాద్)

"సరసమైన పాట తీస్తే సెన్సార్ అయి వచ్చేసరికి అది మిగిలిందా!?"

-ఎస్.శ్రీనివాసరావు (పాదిరి)

"ఈ వయస్సులో స్టెప్పులు వేయొద్దని మొత్తుకున్నా నా మాట విన్నారూ!"

-ఎం.ఎస్.నాయుడు (బందరు కోట)

"ఈ వయసులో వద్దండీ.....కష్టమంటే విన్నారు కాదు!"

-బి. రాధాకృష్ణ (వరంగల్)



లక్కీ పేర్లు

సత్యశ్రీధర్, ఎ. (యలమంచిలి), ఆర్. శ్రీజ్యోతి (ఏలూరు), ఎమ్.శివగణేశ్ బాబు (కాకినాడ), బి. శైలు (ఇచ్ఛాపురం), ఎస్. భానుమతి (మద్రాసు), వై. వెంగళరావు (శ్రీశైలం ప్రాజెక్టు), ఎం.ఎల్. నిర్మల (వైజాగ్), ఎం. శేతన్నాయుడు (మచిలీపట్నం), ఎం. శ్రీనివాసరావు (విజయవాడ), వి.కె. విశ్వనాథ్ (వరంగల్), పి. దుర్గాప్రసాద్ (పార్వతీపురం), జి.వి. శ్రీధర్ (మద్రాసు), పి. శ్రీనివాసులు (అనంతపురం), జి. సత్యనారాయణ (బరూచ్), జి. సింహాచలం (రాజమండ్రి).

సీరియల్

హాట్‌లిన్స్

జి.వి.అమరేశ్వరరావు

(గత సంచిక తరువాయి)



తన ఎదురుగ్గా నిలబడి ఉన్న కురియన్, ఎఱ్ఱతేలు, నల్లముత్తుల వంక చూస్తూ చెప్పాడు కాశీప్రసాద్.

"ఈ రోజు నుంచీ మన ఫోన్ అబ్జర్వేషన్‌లో ఉంటుంది. మన బిజినెస్‌కు సంబంధించిన విషయాలు గురించి మీరు ఫోన్ చెయదల్చుకుంటే మోహని యింటికి ఫోన్ చేయండి. పొరపాటున కూడా మా ఇంటికి చేయవద్దు."

ముగ్గురూ తలలు ఊపారు.

"వెంటనే వెళ్ళండి. పబ్లిక్ టెలిఫోన్ బూత్స్ నుండి బెదిరింపు ఫోన్లు చేయండి."

ఆ మాటతో కురియన్, నల్లముత్తు, ఎఱ్ఱతేలు బయటకు నడిచారు.

కాశీప్రసాద్ ఇంటికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉందొక పబ్లిక్ టెలిఫోన్ బూత్.

ముగ్గురూ టెలిఫోన్ బూత్ దగ్గిర ఫియట్ ఆపారు.

నల్లముత్తు కొన్ని నాణాలు పైకి తీశాడు. కురియన్ కాశీప్రసాద్ ఇంటి నెంబర్ డయల్ చేశాడు. టెలిఫోన్ రింగ్ అవుతున్న శబ్దం వినపడింది.

నిమిషం తర్వాత రిసీవర్ లిఫ్ట్ చేసిన శబ్దం వినబడింది.

"హలో!" నల్లముత్తు కాయన్స్‌స్లాట్‌లో వేశాడు.

కాశీప్రసాద్ లైన్‌లోకి వచ్చాడు. మౌత్‌పీస్‌కు అడ్డంగా పల్చటి ఉలిపిరి కాగితం పెట్టుకున్న కురియన్ భయంకరంగా నవ్వాడు.

"ఈ హ్హాహ్హాహ్హాహ... ఓహ్హోహ్హోహ్హోహ్హో..."

"ఎవరు మీరు! ఎందుకు అలా నవ్వుతున్నారు?" కంగారు, భయం మెళవించిన స్వరంతో అడిగాడు కాశీప్రసాద్.

"తీవ్రవాదులం... ఓరే కాశీప్రసాద్! నీకూ, నీ కుటుంబానికీ చావు మూడిందిరా. ఈ హ్హాహ్హాహ్హాహ్హా... అందుకే మేం ఫోన్ చేస్తున్నాం."

"ఎవరు మీరు... మీకేం కావాలి.. చెప్పండి. ఎవరు మీరు మీకేం కావాలి."

కురియన్‌కు తనను కాశీప్రసాద్ కొట్టిన విషయం గుర్తుంది. అతడు తనివితీరా తిట్టసాగాడు.

"ఏంకావాలో చెప్తాంరా బద్మాష్! నీలాంటి లోఫర్ వెధవలకు, డాఫర్ వెధవలకు బుద్ధి రావడానికే మేం రంగంలోకి దిగాంరా వెర్రిపీనుగా! నీ పాపం పండిందిరా దొంగ బాడ్‌కవ్... నీ యవ్వ, నీ పేగులు మెళ్ళో వేసుకుంటాన్రా గాడిద కొడకా."

ఈసారి కాశీప్రసాద్ కంఠంలో కోపం మిళితమయ్యింది.

"అసలు నీకు ఏం కావాలో చెప్పు... అంతేగాని ఇలా బూతులు తిడితే మర్యాదక్కాదు జాగ్రత్త."

"నోర్మూసుకోరా బచ్చా!"

"అదికాదు"

"మరొక్కమాట పైకి వచ్చిందంటే గుండు గీసి సున్నం బొట్లు పెట్టి గాడిదమీద ఊరేగించాల్సి వస్తుందిరా కొజ్జానాయాలా."

కురియన్ ఓవర్ యాక్షన్ చేస్తున్నాడని తను నోరు విప్పితే బంద బూతులు తిడతాడనీ గ్రహించేశాడు కాశీప్రసాద్. దాంతో వినయంగా అడిగాడు.

"మీకేం కావాలో చెప్పండి తీవ్రవాదిగారూ... అపతల భయంతో నా నాలుక పిడచ కట్టుకుపోతోంది."

"మరో గంట ఆగింతర్వాత ఫోన్ చేస్తాంరా గొట్టాం... ఎక్కడికీ వెళ్ళకుండా ఫోన్ దగ్గిరే ఉండరా వెధవా."

కురియన్ రిసీవర్ క్రెడిల్ చేసి బయటకు నడిచాడు. అతడి మాటలు విన్న ఎఱ్ఱతేలు, నల్లముత్తు భయంతో కట్టిల్లా బిగదీసుకుపోయారు.

రెండు నిమిషాల తర్వాత ఇద్దరూ మామూలు మనుషు లయ్యారు. ఎఱ్ఱతేలు నోరు పెగుల్చుకుని అడిగాడు.

"బాసుగాడిని తిట్టిన తిట్టు తిట్టకుండా వాయించేశావ్. ఇక వాడికి ఎలా ముఖం చూపిస్తావ్ గురూ?"

కురియన్ నర్మగర్భంగా నవ్వి అర్జునుడికి హితబోధ చేస్తున్న కృష్ణుడి ఫోజులో చెప్పాడు.

"మీకాభయం అక్కర్లేదు. లేకపోతే నన్నే చంపడానికి రివాల్వర్ తీస్తాడా! నాకు ఫోన్‌లో బెదిరించే ఛాన్స్ వచ్చినప్పుడల్లా వాడిని నానా బూతులూ తిట్టకపోతే నా పేరు..."

"కురియనేకాదు" నల్లముత్తు అందించాడు.

"అవును కురియనే కాదు" తను చెప్పదల్చుకున్నమాట పూర్తి చేశాడు కురియన్.

సరిగ్గా అరవై నిమిషాల తర్వాత కురియన్ ఫోన్ చేశాడు. ఆ ఫోన్ కోసమే ఎదురు చూస్తున్న కాశీప్రసాద్ లైన్‌లోకి వచ్చాడు. కురియన్ చాలా సీరియస్‌గా చెప్పసాగాడు.

"చూడుబే! నేన్చెప్పేది జాగ్రత్తగా విను. ఈ ఫోన్ అందిన ఇరవైనాలుగు గంటల్లో మాకు పాతిక లక్షల రూపాయలు ఇవ్వాలి. లేకపోతే నీ ప్రాణాలకు, నీ పెళ్ళాం ప్రాణాలకు గ్యారంటీ ఉండదు."

"పాతిక లక్షలు మీకు తెచ్చి ఇవ్వాలా... చూడబోతే నువ్వేదో ప్రాక్టికల్ జోకర్‌లా ఉన్నావ్... ముందు ఫోన్ పెట్టెయ్."

సమాధానం కోసం ఎదురుచూడకుండా కాశీప్రసాద్ ఫోన్ పెట్టేశాడు. తర్వాత తనను ఆఫీసులో కలిసిన కురియన్‌ను ఛడామడా తిట్టేశాడు కాశీప్రసాద్. అతడు పూర్తిగా తిట్టడం అయిపోయిన తర్వాత అన్నాడు కురియన్.

ఇంతవరకూ సాగినకథ -: 7 మారుపేర్లతో మోసాలకు అలవాటుపడి వచ్చినదాంట్లో సమానంగా పంచుకుంటూ కాలం గడుపుతుంటారు శివాజీ-రజని. అసలు భార్య పార్వతిని స్వర్గానికి పంపి తనను భార్యగా స్వీకరిస్తానని ఉంపుడుకత్తె మోహినికి మాట యిచ్చిన బిజినెస్ మాగ్నెట్ కాశీప్రసాద్ ప్రయత్నాలు విఫలమవుతుంటాయి. కాశీప్రసాద్ అమ్మిన హెరాయిన్ తాలూకు పదిలక్షలు శివాజీ చాకచక్యంగా కొట్టేస్తాడు.

'అదికాదు బాస్. మనం చేసే పని చాలా పకడ్బందీగా ఉండాలి. తీవ్రవాదులు బ్లాక్‌మెయిల్ చేసేటప్పుడు అయ్యా. బాబూ అంటూ బ్రతిమలాడరు. కల్లు తాగి, నిప్పు తొక్కిన కోతిలా రెచ్చిపోతారు. చూడండి కాశీప్రసాదరావుగారూ మాకు అర్జంటుగా పాతిక లక్షలు కావలసివచ్చి ఫోన్ చేస్తున్నాం. దయచేసి ఇస్తారా? అని గౌరవంగా ఏం మాట్లాడరు. అందుకే అలా కాస్త రాష్‌గా మాట్లాడాల్సి వచ్చింది బాస్.''

''సరే ఏదో ఒకటి ఏడు. రేపు మళ్లీ ఇదే సమయానికి ఫోన్ చెయ్...''

కురియన్ ఫోన్‌లో ఏం మాట్లాడాలో చెప్పాడు కాశీప్రసాద్. తర్వాత ఎర్రతేలువైపు చూసి–

''చూడు ఎర్రతేలూ నువ్వు బాంబే నుంచి మాట్లాడుతున్నట్లు ఫోన్‌చెయ్. ఏం మాట్లాడాలో నీకు ముందే చెప్పి ఉంచానుకదా?'' అన్నాడు.

ఎర్రతేలు తలఊపాడు.

కాశీప్రసాద్ నల్లముత్తుతో చెప్పాడు.

''ఇపుడు కాగితం, కలం తీసుకుని నేను చెప్పినప్రకారం రాయి.''

నల్లముత్తు కాగితం, కలం తీసుకుని కాశీప్రసాద్ చెప్పబోయే విషయం నోట్ చేయడానికి రడీ అయ్యాడు.

కాశీప్రసాద్ గొంతు సవరించుకుని చెప్పసాగాడు.

"మిస్టర్ కాశీప్రసాద్, మా మనుషులు నీకు ఫోన్ చేశారు. అయినా నీ నుంచి రెస్పాన్స్‌లేకపోవడంతో మేం లెటర్ వ్రాస్తున్నాం. ఈ లెటర్ అందిన ఆరు గంటల్లోపు నువ్వు పాతికలక్షల రూపాయలుంచిన సూట్‌కేస్‌తో బండమైసమ్మ గుడి దగ్గరకురా. అక్కడ మా మనిషి ఆ డబ్బు రిసీవ్ చేసుకుంటాడు.

ఇట్లు

లిబరేషన్ టైగర్స్ ఆర్గనైజేషన్.

నల్లముత్తు కాశీప్రసాద్ చెప్పిన విషయం కాగితం మీదికి ఎక్కించాడు. తనురాసిన బెదిరింపు ఉత్తరం ఓసారి చదివి దాన్ని కాశీప్రసాద్‌కు అందించాడు.

కాశీప్రసాద్ దాన్ని చదవకుండానే కోపంతో ఉండలా మడిచి దూరంగా విసిరికొట్టాడు.

అయోమయంగా ముఖంపెట్టిన నల్లముత్తుతో అన్నాడు.

''తీవ్రవాదులు నీలంరంగు ఇంకు ఉపయోగించరు. ఇలాంటి ఉత్తరాలు వ్రాయడానికి ఎర్రసిరా ఉపయోగిస్తారు.''

చెప్పడం పూర్తి అయిన తర్వాత రెడ్‌స్కెచ్‌పెన్ నల్లముత్తు మీదికి విసిరాడు.

నల్లముత్తు దాన్ని గాల్లోనే అందుకున్నాడు. ఓ మూలన పడిఉన్న కాగితం ఉండను తీసుకుని అందులోని విషయాన్ని ఎర్రరంగు స్కెచ్‌పెన్నుతో యథాతథంగా మరొక కాగితం మీదికి ఎక్కించసాగాడు. దాన్ని పూర్తిగా రాయడానికి రెండు నిమిషాల సమయం పట్టింది.

నల్లముత్తు రాసిన బెదిరింపు ఉత్తరాన్ని కాశీప్రసాద్ చదివి తల పంకించాడు.

"దీన్ని తీసుకువెళ్లి నా అడ్రస్‌కు పోస్ట్ చెయ్యండి'' అంటూ దాన్ని ఎర్రతేలువైపు తోశాడు.

"సార్‌దాన్ని మీరు ముట్టుకున్నారుకదా! దానిమీద మీ వేలిముద్రలు ఉంటాయేమో'' కురియన్ అనుమానంగా అన్నాడు.

కాశీప్రసాద్ నిర్లక్ష్యంగా నవ్వి చెప్పాడు.

''ఈ లెటర్ తిరిగి నాకే పోస్ట్‌లో అందుతుంది. దాన్ని అందుకున్నప్పుడు సహజంగానే నా వేలిముద్రలు పడతాయి. ఆ విషయం గురించి మీకు అనవసరం. రేపు మళ్లీ మీరు ఫోన్ చేయండి... నాకు బెదిరింపు ఫోన్ వచ్చిన తర్వాత ఎర్రతేలు బాంబేనుంచి మాట్లాడుతున్నట్లు ఫోన్ చేస్తాడు.''

''మేం ఫోన్ చేస్తున్నాంకదా బాస్ మళ్లీ ఈ



బెదిరింపు లెటర్ ఎందుకు?" నల్లముత్తు అడిగాడు.

"పార్వతిని చంపింది తీవ్రవాదులే అని పోలీసులకు బలంగా నమ్మకం కలగడానికి... ఇక ఎర్రతేలు ఫోన్ చేయగానే నేను బొంబే వెళ్ళిపోతాను. అక్కడ నాలుగు రోజులపాటు ఉంటాను.. ఈలోపు ఇక్కడ పార్వతి పని ఫినిష్ అయిపోవాలి గుర్తుందా!"

"ఓకే బాస్."

ముగ్గురూ ఒకేసారి బదులు చెప్పారు.

★ ★ ★ ★ ★ ★ ★

శివాజీ రేడియో స్విచ్ ఆన్‌చేసి వాల్యూం పెంచాడు. మద్రాస్ స్టేషన్‌లో ఏదో తమిళ ప్రోగ్రాం వినపడుతోంది. శివాజీ స్టేషన్ మార్చాడు. అప్పటికే సగం అయిపోయిన ప్రాంతీయ వార్తలు వినపడ్డాయి.

...బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పవాయు పీడనంవల్ల రాష్ట్రం అంతటా ఈ రోజు కూడా భారీవర్షాలు కురిసాయి. నదులు, వాగులు పొంగే అవకాశం ఉంది. సముద్రం మీదికి వెళ్ళిన జాలరులు వెంటనే వెనక్కు రావాలని తుఫాను హెచ్చరిక కేంద్రం..."

శివాజీ విసుగ్గా స్టేషన్ మార్చాడు. వివిధభారతిలో వస్తున్న పాటలు వింటూ దరువువేయసాగాడు.

తండ్రిసాంబయ్య శివాజీ దగ్గిరికివచ్చి చెప్పాడు. "మేం ఇవ్వాళ సాయంత్రం గంగానమ్మ జాతరకు వెడుతున్నాం."

శివాజీ తల ఊపాడు.

సాంబయ్య వెనకేవచ్చిన చంద్రికకు శివాజీ మూడు వందల రూపాయల నోట్లు అందించి చెప్పాడు.

"తిరణాల్లో ఈ డబ్బుతో పట్టుపరికిణీ, జాకెట్టు కొనుక్కోవాలి. తెలిసిందా"

చంద్రిక తల ఊపింది. ఆ అమ్మాయికి పది సంవత్సరాల వయస్సుంటుంది. పేద కుటుంబంలో పుట్టినా ముఖంలో లక్ష్మీకళ తాండవిస్తూ ఉంటుంది.

హిట్ లిస్ట్

శివాజీ చంద్రికను ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు. అతడికి తన చెల్లెలు చంద్రిక అంటే ప్రాణం.

"సాయంత్రం ఎనిమిది గంటలకు బయల్దేరి వెడుతున్నాం. జాలయ్య ఇంట్లో ఓ వారం రోజులుండి వస్తాం."

శివాజీ తల ఊపాడు.

జాలయ్య శివాజీకి మేనమామ అవుతాడు. ఆయన గంగానమ్మ జాతర జరిగే దోసకాయలపాలెంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు.

"ఒకరోజు ఆలస్యం అయినా కంగారు పడకు."

శివాజీ చంద్రికను కిందికి దింపాడు. సాంబయ్య తన పని అయిపోయినట్టు అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

చంద్రిక శివాజీని అడిగింది.

"అన్నయ్యా నేనో లెక్క చెప్తా జవాబు చెప్తావా?"

"అడుగు"

"అయిదులో రెండు తీసేస్తే ఎంత?"

"మూడు"

"కాదు అయిదు. అయిదులో రెండు తీసి మళ్ళీ వేస్తే అయిదేగా?"

చంద్రిక కిలకిల నవ్వింది.

ఇలాంటి ప్రశ్నలకు శివాజీకి సమాధానం ముందే తెలుసు. అయినా తను ఓడిపోతే చంద్రిక చప్పట్లు చరుస్తూ కిలకిల నవ్వడం అతడికి ఎంతో తృప్తినిస్తుంది.

"ఇంకో ప్రశ్న అడగనా"

"ఊఁ అడుగు"

"ఇపుడో పందెం వేస్తాను. నువ్వు ఆ కుర్చీలో కూర్చుని వస్తే అయిదు రూపాయలిస్తా. రాకపోతే నువ్వు నాకు పది రూపాయలివ్వాలి."

"సరే"

శివాజీ కుర్చీలో కూర్చుని లేచి చంద్రిక దగ్గిరికి వచ్చాడు.

"ఏయ్... నువ్వు చేసిన పనేంటి. కుర్చీలో కూర్చుని అలాగే నా దగ్గిరికి రావాలి కాని మామూలుగా నడుచుకుంటూ వచ్చేశావ్."

శివాజీ బుర్ర గోక్కుంటూ పది రూపాయలూ ఇచ్చేశాడు.

"ఎ బి కి కొడుకవుతాడు. కాని బి ఏ కి తండ్రి కాదు. ఇంతకూ బీ ఎవరు?... ఓడిపోతే రూపాయి ఇచ్చుకోవాలి."

శివాజీ ఈసారి కూడా బుర్ర గోక్కున్నాడు.

చంద్రిక చప్పట్లు కొడుతూ రెండు నిమిషాలసేపు నవ్విన తర్వాత చెప్పింది

"బి ఎకి తల్లి అవుతుంది."

"నేను అన్న మాట నువ్వు గడ గడా అనగలవా? పందెం రెండ్రూపాయలు"

శివాజీ సరేనన్నట్టు తల ఊపాడు.

"లక్ష భక్ష్యములు భక్షించిన లక్ష్మయ్యకు ఒక భక్ష్యము లక్ష్యమా?"

శివాజీ గడగడా చెప్పాడు.

"లక్ష్య భక్ష్యములు భక్షించిన లక్ష్మయ్యకు ఒక లక్ష్యము భక్ష్యమా"

ఓడిపోయి శివాజీ రెండ్రూపాయలూ ఇచ్చి అడిగాడు.

"ఇంకా ఉన్నాయా? అయిపోయాయా?"

"మళ్ళీ ఊర్నించి వచ్చాక వదిన నడిగి చెప్తా"

"వదినా?"

"అవును"

చంద్రిక అపుడే లోపలకు వస్తున్న రజని వయిపు చెయ్యి చూపించింది.

"అయితే రోజూ నువ్వు నన్నడిగే చిక్కు ప్రశ్నలన్నీ ఈవిడగారి తెలివితేటలన్నమాట"


చంద్రిక తల ఊపి మెల్లిగా అక్కడ్నించి జారుకుంది.

అరగంట తర్వాత ఇద్దరూ ఉస్మానియా యూనివర్శిటీ లాండ్ స్కేప్ గార్డెన్స్‌లో ఓ సిమెంట్ బెంచీమీద కూర్చుని ఉన్నారు.

"చూడు రజనీ మనం ఇన్నాళ్ళూ జేబు దొంగతనాలు చేసి కాలం గడిపాం. నిన్న అనుకోకుండా మనకు అదృష్టం కలసి వచ్చింది. అదృష్టం ప్రతీసారీ తలుపు తట్టదు. అది మన ముంగిట్లో ఉన్నపుడే క్యాష్ చేసుకోవాలి."

శివాజీ చెప్పడం ఆపాడు. రజని అతడి వంక ప్రశ్నార్థకంగా చూసింది.

"మనం చివరిసారిగా ఒకేఒక దొంగతనం చేద్దాం. ఇక జీవితంలో అలాంటి పనులు చేయవద్దు. ఈసారి ఒక పది లక్షలు సంపాదించి లైఫ్‌లో సెటిల్ అయిపోదాం. ఇక మనం పోలీసుల చుట్టూ, కోర్టులచుట్టూ తిరిగే ప్రశ్నే లేదు. మనం ఈ ఊరు వదిలి ఎక్కడికన్నా వెళ్ళిపోయి కొత్త జీవితం ప్రారంభిద్దాం."



"నువేం అంటున్నావో నాకు అర్థంకావటం లేదు."

"ముందు నే నడిగిన ప్రశ్నకు జవాబు చెప్పు. నగరంలో కల్లా అతి పెద్ద ధనవంతుడు ఎవరో చెప్పు."

"కాశీప్రసాద్"

"మనం కాశీప్రసాద్ భార్యను కిడ్నాప్ చేయబోతున్నాం"

"ఏంటీ నువ్వు అంటోంది?"

"అవును. మనం కాశీప్రసాద్ భార్యను కిడ్నాప్ చేయబోతున్నాం. కిడ్నాప్ చేసిన తర్వాత కాశీ ప్రసాద్‌కు ఫోన్ చేసి బెదిరిస్తాం. అర్జంటుగా ఫలానాచోటుకి పది లక్షలు తీసుకురమ్మనమని లేకపోతే నీ భార్యను చంపేస్తాం అని. అంతేకాదు పోలీసులకు ఫోన్ చేసినా కూడా నీ భార్యను చంపుతాం అని ఫోన్ చేద్దాం. కాశీప్రసాద్‌కు పది లక్షలు ఒక లెక్క కాదు. అతడు మనం చెప్పిన చోటికి పది లక్షలూ తెచ్చిస్తాడు. మనం ఆవిడను వదిలేద్దాం. ఈ పని అంతా చాలా సింపుల్‌గా జరిగిపోతుంది."

"కాని ఇదంతా నువ్వు అనుకున్నంత తేలిక కాదు"

"అందుకు నా దగ్గిర ఒక పథకం సిద్ధంగా ఉంది. మనం అర్జంటుగా 'అర్ధ రాత్రి అప్సరస' సినిమా చూడాలి."

"మధ్యలో అదెందుకు?"

"చూడాలి. ఎందుకంటే ఆ సినిమా షూటింగ్ అంతా కాశీప్రసాద్ ఇంట్లో జరిగింది కనక. కావాలంటే ఈ పత్రిక చూడు."

శివాజీ తన చేతిలోని 'తెలుగు చిత్ర' సినిమా పత్రిక కాపీ అందించి నాలుగో పేజీలోని ఒక వార్త చూపించాడు. ఆ వార్తతో పాటు కాశీప్రసాద్ ఇంటి ఫోటో, ఆ ఇంటి అడ్రస్ కూడా ప్రింట్ చేయబడి ఉంది.

సూపర్‌హిట్ అయిన అర్ధ రాత్రి అప్సరస సినిమా ఆ ఇంట్లోనే షూటింగ్ జరుపుకుందనేది ఆ వార్త సారాంశం.

"ఇపుడు మనం ఆ సినిమాకు వెళ్లబోతున్నాం. మార్నింగ్‌షో స్టార్ట్ అవడానికి ఇంకా అర్ధ గంట టైమ్ ఉంది" అంటూ లేచి నిలబడ్డాడు శివాజీ.

అదే సమయంలో...

తెల్ల రంగు ఫియట్ కారు ఒకటి పబ్లిక్ టెలిఫోన్ బూత్ ముందు ఆగింది. నల్లముత్తు, ఎర్రతేలు, కురియన్ కారు దిగారు.

* * * * *

కురియన్ టెలిఫోన్ బూత్‌లోకి నడిచాడు. కాశీ ప్రసాద్ ఇంటి నెంబర్ తిప్పాడు. ఫోన్ రింగ్ అవుతున్న శబ్దం వినపడుతోంది. కాశీప్రసాద్ లైన్‌లోకి రాగానే కురియన్ భయంకరంగా నవ్వాడు.

"ఊహ్హాహ్హాహా... ఒహ్హోహ్హోహ్హో... ఏహ్హె హ్హెహ్హె"

కాశీప్రసాద్ విసుగ్గా అన్నాడు.

"ఏవిటా నవ్వు! మళ్ళీ తీవ్రవాదుల ముఠా యేనా!... మీ ఆటలు నా దగ్గిర కాదు. మొన్న నాతో టెలిఫోన్స్ జి. యం. మాట్లాడుతూ ఈమధ్య కుర్ర వెధవలు ఆకతాయి తనంగా ఫోన్స్ చేసి బాంబులు పెట్టాం అనీ, విమానాశ్రయంలో పేలిపోతాయనీ... రైల్వేస్టేషన్‌లు భస్మంఅవుతాయనీ బెదిరిస్తున్నారని చెప్పాడు. ఇలాంటి బెదిరింపులవల్ల మూడు దండల రైళ్ళు ఆలస్యంగా నడిచాయని కూడా లోకనాథం గారు చెప్పారు. మీరూ అలాంటి బాపతే అయి ఉంటారు. హనుమంతుడిముందా మీ కుప్పి గంతులు."

"మేం నిజమయిన తీవ్రవాదులం అని నువ్వు నమ్మడం లేదన్నమాట. అయితే ఈ రోజు రాత్రి నీ పెళ్ళాన్ని కిడ్నాప్‌చేసి మర్డర్ చేస్తాం దమ్ముంటే కాచుకో."

"చూడు బాబూ అనవసరంగా ఇలాంటి ఫోన్లు చేసి టైం వేస్ట్ చేయకండి. ధైర్యంఉంటే నా ముందుకువచ్చి మాట్లాడండి."

కాశీప్రసాద్ ఫోన్ క్రెడిల్ చేశాడు.

నలభై అయిదు నిమిషాల తర్వాత ఎర్రతేలు మరొక పబ్లిక్ టెలిఫోన్‌బూత్ నుంచి కాశీప్రసాద్‌కు ఫోన్‌చేసి కంగారుగా మాట్లాడసాగాడు. అతడి గొంతులో ఆందోళన స్పష్టంగా తెలుస్తోంది.

"బావగారూ! నేను సింహాచలాన్ని. బాంబేనుంచి మాట్లాడుతున్నాను. మీ చెల్లికి చాలా సీరియస్‌గా ఉంది. వారం నుంచీ నూట అయిదు డిగ్రీల జ్వరం. మిమ్మల్ని చూడాలని వెంటనే రమ్మనమని కలవరిస్తోంది. మీరు వెంటనే రండి!"

"అలాగే ఇపుడె బయల్దేరి వస్తాను."

కాశీప్రసాద్ ఫోన్ క్రెడిల్ చేశాడు. డైనింగ్‌టేబుల్ మీద ప్లేట్లు సర్దుతున్న వంట మనిషి జయలక్ష్మిని అడిగాడు.

"అమ్మగార్ని ఒకసారి పిలు."

"అమ్మగారు లేరుసార్. డాక్టర్‌కి చూపించుకోవడానికి వెళ్లారు. ఒక అరగంట అయ్యింది."

"అలాగా అయితే నేను ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తా."

కాశీప్రసాద్ పోర్టికోలో ఆపిఉన్న రోవర్‌వైపు నడిచాడు. అక్కడి నుంచి అతడికి ఆఫీసుకి వెళ్లడానికి ఇరవైనిమిషాల సమయం తీసుకుంది. తన సీటులో కూర్చుంటూనే ఇంటికి రింగ్ చేశాడు.

పార్వతి లైన్‌లోకి రాగానే చెప్పసాగాడు

"పార్వతీ నేను ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాను. ఇందాక సింహాచలం ఫోన్ చేశాడు. సుభద్రకు సీరియస్‌గా ఉందిట... అహ కంగారు పడవలసిన అవసరంలేదు.. కాస్త టెంపరేచర్ పెరిగిందిట. చూడాలంటోందిట. నేను ఈ రోజు మధ్యాహ్నం ఫ్లైట్‌కి బాంబే వెడుతున్నాను. రెండు మూడు రోజుల్లో తిరిగివస్తాను. నువ్వేం కంగారుపడకు."


"నన్ను కూడా రమ్మంటారా"

"అక్కర్లేదు. అంతగా అవసరం అయితే బాంబేనుంచి ఫోన్ చేస్తాను."

కాశీప్రసాద్ రిసీవర్ హుక్ మీద ఉంచాడు.

కాశీప్రసాద్ ఆలోచించసాగాడు.

"కురియన్ బెదిరింపు, ఎర్రతేలు బాంబేనుంచి మాట్లాడినట్టు మాట్లాడిన మాటలు, తను ఇపుడు పార్వతితో మాట్లాడిన మాటలు అన్నీ టెలిఫోన్స్ వాళ్ళ ఆఫీస్‌లో రికార్డ్ అయి ఉంటాయి. అక్కడ




"గాంధీ" ముద్దు

మహాత్మా గాంధీని కస్తూరిభాయి గాంధీని ముద్దు పెట్టుకొన్నాడో లేదో గానీ... ప్రపంచ వ్యాప్తంగా 'గాంధీ'గా నటించి సంచలనం సృష్టించిన 'బెన్‌కింగ్‌స్లే' ఇటీవల బొంబాయి డైనాసిటీ కల్చరల్ క్లబ్ ఉత్సవాలకు హాజరయ్యారు. ఆ సందర్భంలో ఆ ఉత్సవాలకు విచ్చేసిన నటి రోహిణి హత్తాంగడిని 'బెన్‌కింగ్‌స్లే ముద్దు పెట్టుకోవటం జరిగింది. తెర వెలుపల జరిగిన యీ "ముద్దు"ని క్లిక్ చేసి ఫొటోగ్రాఫర్ దానిని ప్రత్యేకంగా పాఠకులకు అందించాడు.

-శాంతి

ఒడొనెల్ రికార్డు

షార్జాలో జరుగుతున్న ఆస్ట్రలేషియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ సైమన్ ఒడొనెల్ క్రొత్త రికార్డు సృష్టించాడట. శ్రీలంక బౌలర్ల ధాటిని ఎదుర్కొని కేవలం 18 బంతులకే 50 పరుగులు తీసి అంతకు ముందు పాకిస్తాన్ ఆటగాడు సలీంమాలిక్, న్యూజిలాండ్ ఆటగాడు లాన్స్‌కెయిన్స్‌లు నెలకొల్పిన రికార్డులను బ్రద్దలు కొట్టాడు. మాలిక్, కెయిన్స్‌లు 21 బంతులకు అర్ధ సెంచరీ పూర్తి చేస్తే, ఒడొనెల్ 18 బంతులకే 50 పరుగులు పూర్తి చేసి వాళ్ళను మించిపోయాడు. శ్రీలంక బౌలర్లు బెంబేలెత్తేలా 29 బంతులకు 74 పరుగులు తీసి (అందులో ఆరు సిక్సర్లు, నాలుగు బౌండరీలు) జట్టులో తన స్థానాన్ని పదిలపరచుకున్నాడు ఒడొనెల్!



ఉన్న క్లోసెట్ తనకు మంచి ఎలిబీ అవుతుంది. తన చెల్లెలికి సీరియస్‌గా ఉన్నదని వచ్చిన ఫోన్ బొంబేనుంచికాదనీ ఎవరో పబ్లిక్ టెలిఫోన్‌బూత్ నుంచి లోకల్‌కాల్ చేశారనీ టెలిఫోన్స్ వాళ్ళు కనుక్కుంటారు. అది తీవ్రవాదుల పనే అని పోలీసులు భావిస్తారు. పార్వతి ఇప్పటికి మూడుసార్లు తప్పించుకుంది. ఈ సారి కూడా ఒకేఒక ఎటెంప్ట్‌తో గురియన్ బృందం చంపలేకపోవచ్చు. వాళ్ళకు మూడు రోజులు టైం ఇవ్వడం మంచిది. ఈ మూడు రోజులూ తను బొంబేలో సింహాచలం ఇంట్లో ఉంటాడు. సుభద్ర ఆరోగ్యం గురించి ఫోన్ వచ్చింది అని తను చెప్పిన విషయం విని సింహాచలం కంగారు పడతాడు. అది ఎవరో ప్రాక్టికల్ జోకర్ చేసిన ఫోన్ అని తనుఅంటాడు. వెంటనే ప్రయాణానికి సిద్ధం అవుతాడు. కాని హఠాత్తుగా తనకు బి.పి. పెరిగిపోవడంతో ఆగిపోతాడు.

కాశీప్రసాద్ తనురోజూ వేసుకునే బి.పి. మాత్రల సీసా టేబుల్ మీదే వదిలేశాడు. అవిఒకరోజు కనక వేసుకోకపోతే వెంటనే బి. పి. పెరిగిపోతుంది. మూడు రోజులకుగాని డౌన్‌కాదు. ఆ మూడు రోజులూ అక్కడ గడిపి తిరిగి రాగానే పార్వతి చనిపోయి ఉంటుంది. నేరం తీవ్రవాదుల మీదికి వెళుతుంది. ఆ తర్వాత తను జీవితాంతం మోహినితో హాయిగా కాలక్షేపం చేస్తాడు.

కాశీప్రసాద్ ముఖంలో చిరునవ్వు అలుముకుంది.

అతను ఏదో ఆలోచన వచ్చినవాడిలా కాలింగ్‌బెల్ నొక్కాడు. లోపలికి వచ్చిన పి. ఎ.తో అర్జంటుగా మధ్యాహ్నం బొంబే ఫ్లైట్‌కి ఒక టిక్కెట్టు బుక్ చేయమని చెప్పాడు.

* * *

అర్ధరాత్రి అప్సరస సినిమా మొదట్నుంచి చివరివరకూ సస్పెన్స్‌తో సాగింది. ఆ సినిమాలో

హిట్ లిస్ట్

కాశీప్రసాద్ ఇల్లు ప్రతి అంగుళమూ చూపించారు. సినిమా సెట్టింగులా ఉన్న పెద్ద హాలు. హాల్లోంచి పైకి వెళుతున్న మెట్లు. మెట్లు పక్కనే ఓ అతిపెద్ద తైలవర్ణ చిత్రం.

కుడివైపు మెట్లు మీదుగా పైకివెడితే మాస్టర్ బెడ్‌రూం కనపడుతుంది.

సినిమా అయిపోయిన తర్వాత చెప్పాడు శివాజీ.

"మాస్టర్" బెడ్‌రూంలో కాశీప్రసాద్, అతనిభార్య పడుకుని ఉంటారు. మనం ఇద్దరికీ క్లోరోఫాం వాసన చూపిద్దాం. కాశీప్రసాద్‌ను వదిలేసి అతని భార్యను కార్లో ఎత్తుకుపోదాం"

"కార్లోనా?"

"అవును ఆమెను కార్లో తీసుకుపోదాం. రాత్రిలోగా ఒకకారు సంపాదిస్తాను."

రజనికి అనుమానం వచ్చింది.

"మరి కాశీప్రసాద్ భార్యను ఎక్కడ ఉంచుదాం"

"మా ఇంట్లోనే... ఈ రోజు రాత్రికి మా అమ్మా నాన్నా చెల్లీ గంగానమ్మ జాతర చూడడానికి దోసకాయల పాలెం వెళుతున్నారు. మరో వారం దాకా రారు. అందుకని కాశీప్రసాద్ భార్యను మా ఇంట్లోనే ఉంచుదాం. అంతకన్నా మనకు మంచి ప్లేస్ దొరకదు."

రజని సరే అన్నట్టు తల ఊపింది.

* * *

బొంబే ఎయిర్‌పోర్ట్.

కాశీప్రసాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి టాక్సీలో నేరుగా సింహాచలం ఇంటికి వెళ్ళాడు. సింహాచలానికి బొంబేలో ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ ఉంది.

హఠాత్తుగా ఊడిపడిన కాశీప్రసాద్‌ను చూసి సింహాచలం ఆశ్చర్యపోయాడు. అతడి ఆశ్చర్యాన్ని గమనిస్తూ అన్నాడు కాశీప్రసాద్.

"పొద్దున్న ఫోన్ చేశావ్ కదా! సుభద్రకు చాలా ఎక్కువగా జ్వరం వచ్చిందని... ఇప్పుడు ఎలా వుంది?"

"సుభద్రకు జ్వరమని నేను ఫోన్ చేశానా?"

సింహాచలం ఆశ్చర్యంగా నోరు తెరిచాడు.

"ఏంటి అన్నయ్యా హఠాత్తుగా ఊడి పడ్డావ్. వచ్చే ముందు ఫోన్ చేసేవాడివి కదా?" అప్పుడే వచ్చిన కాశీప్రసాద్ చెల్లెలు అడిగింది.

ఆమెకు సింహాచలం జవాబు చెప్పాడు.

"నీకు ఆరోగ్యం బాగా లేదని మీ అన్నయ్యకు ఎవరో ఫోన్ చేశారట. ఆఘమేఘాల మీద పరిగెత్తుకు వచ్చాడు."

"ఇంతకూ ఆ ఫోన్ ఎవరు చేశారో"

"ఎవరో ఆకతాయి వెధవలయి ఉంటారు."

"సుభద్రకు ఆరోగ్యం బాగా లేదని తెలియగానే నాకు ప్రాణం నిలవలేదనుకో" కాశీప్రసాద్ పెద్ద భారం దిగిపోయినట్టుగా అన్నాడు. సుభద్ర సంతోషంతో నవ్వింది.

"ఏమయితేనేం నువ్వు ఈ రకంగానయినా మా ఇంటికి వచ్చావే. నిన్ను చూసి ఆర్నెల్లు దాటుతోంది తెల్సా?"

కాశీప్రసాద్ సమాధానం చెప్పలేదు. అతడి దృష్టి గోడకు తగిలించి ఉన్న కేలండర్ మీద పడింది. ఆ రోజు ఒకటో తారీకు. ఏప్రిల్ నెల. వెంటనే అప్పటికప్పుడు వచ్చిన ఐడియాతో అన్నాడు కాశీప్రసాద్.

"ఈ రోజు ఏప్రిల్ ఒకటి. బహుశా నాకు తెలిసిన మిత్రుడెవడో నన్ను ఫూల్‌ని చేద్దాం అని అలా ఫోన్ చేసి ఉంటాడు. నేను నిజంగా ఫూల్‌నయిపోయి ఇక్కడకు వచ్చి పడ్డాను."

ఆ మాట అంటూనే కాశీప్రసాద్ కణతలు

రుద్దుకుంటూ ఉన్న ఫళంగా సోఫాలో కూర్చుండిపోయాడు.

"ఏంటన్నయ్యా ఏమయింది?" సుభద్ర కంగారుగా అడిగింది.

"ఏం లేదు. కాస్త బి. పి. పెరిగింది అంతే" అన్నాడు కాశీప్రసాద్.

★ ★ ★ ★ ★ ★

శివాజీ రజనితో సహా ఇంటికి చేరుకున్నాడు.

ఆ పాటికే అతని తల్లిదండ్రులు, చెల్లెలు దోసకాయల పాలెం వెళ్ళిపోయారు.

"మనం కిడ్నాప్ చేయడానికి ఇంకా కొద్ది గంటల సమయం మాత్రమే మిగిలి ఉంది... ముందు ఆకలిగా ఉంది. తినడానికి ఏవన్నా వండరాదూ."

పొట్ట తడుముకుంటూ అన్నాడు శివాజీ.

రజని తల ఊపింది.

ఈలోపు ఆకలి ఎక్కువగా ఉండడంతో శివాజీ వంటగదిలో చూరుకు వేలాడుతున్న వెదురు బుట్టల్లో వెతికాడు. అందులో తను క్రితం రోజు చంద్రిక కోసం కొన్న యాపిల్సూ, ఒక ఫ్రూట్‌బ్రెడ్ కనిపించాయి. శివాజీ ఫ్రూట్‌బ్రెడ్ పైకి తీశాడు. అతడి కెందుకో దాన్ని తినాలనిపించలేదు. రెండు యాపిల్స్ బుట్టలోంచి తీసి చాకుతో కోసి తినసాగాడు. ఒక పెద్ద యాపిల్ తిన్న తర్వాత అతడికి ఆకలి కాస్త తగ్గినట్లనిపించింది.

"నువ్వు తింటావా?" రెండో యాపిల్ రజనికి చూపిస్తూ అడిగాడు. రజని అడ్డంగా తల ఊపింది.

"కూర అయిపో వచ్చింది. మీ అమ్మ పొద్దున వండిన అన్నం రడీగా ఉంది. కాళ్ళు కడుక్కు వస్తే తిందాం" రజని చెప్పింది.

"ఏం కూర వండావ్"

"టమోటా. అందుకే రెండు నిమిషాల్లో అయిపోయింది."

శివాజీ తల ఊపి పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కు వచ్చాడు.

ఇద్దరూ అయిదు నిమిషాల్లో భోజనం ముగించారు.

"కూర బ్రహ్మాండంగా ఉంది" శివాజీ మెచ్చుకున్నాడు. రజని చిరునవ్వు నవ్వింది.

"మనకు అర్జెంటుగా ఒక కారు కావాలి. నువ్వు ఇక్కడే ఉండు. నేను గంటలో వస్తా."

శివాజీ బయటకు నడిచాడు.

★ ★ ★ ★ ★ ★ ★

వెంకటపతి ఫిషర్ ఎలక్ట్రానిక్స్‌లో ఏరియా మేనేజర్‌గా పని చేస్తున్నాడు. సేల్స్ రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగంలో చేరిన వెంకటపతి కేవలం నాలుగు సంవత్సరాల్లో ఏరియా మేనేజర్ స్థాయికి ఎదిగాడు. ఆర్నెల్ల క్రితం ఫిషర్ కంపెనీ అతడికి ఒక మారుతీ కారు ఇచ్చింది. వెంకటపతి ఆఫీస్‌లో పని పూర్తి కాగానే నేరుగా ఇంటికి వచ్చాడు. అపుడు సాయంత్రం ఎనిమిది అయ్యింది.

కంపెనీలో ఏదో పని ఉండడం వల్ల అతడికి చాలా ఆలస్యం అయింది. మేనేజింగ్ డైరక్టర్ ఇంకా రాష్ట్రంలో ఉన్న బ్రాంచీలు అన్నీ చెక్ చేసే పని మీద ఉన్నాడు. తన వెంట వెంకటపతిని కూడా వెంట పెట్టుకుపోవాలని అతడి ఉద్దేశ్యం. ముందు వైజాగ్ బ్రాంచీని ఇన్స్‌పెక్ట్ చేద్దాం వెంటనే తయారయి రమ్మని చెప్పడంతో వెంకటపతి హడావుడిగా ఇంటికి వచ్చాడు. అయిదు నిమిషాల్లో భోజనం ముగించి బట్టలు సర్దుకుని వెళ్ళిపోవాలని అతడి ఉద్దేశ్యం.

ఇంటికి వెళ్ళి భోజనం చేస్తుండగా అతడికి గుర్తుకు వచ్చింది. ఇగ్నిషన్ కీస్ కారులో మర్చిపోయి వచ్చిన విషయం. వెంటనే అతడు భార్యకు విషయం చెప్పి కీస్ కోసం పంపించాడు.


బయటకు వెళ్ళిన అతడి భార్య రెండు నిమిషాల్లో తిరిగి వచ్చింది. ఆమె ముఖంలో కంగారు ప్రస్ఫుటమవుతోంది. తడబడుతున్న మాటల్తో చెప్పింది.

"బయట కారు లేదు... అసలు మీరు కారు తెచ్చారా"

ఆ మాట వినగానే వెంకటపతికి ఒక్కసారిగా గుండె ఝల్లుమంది. అతడు కంగారుగా బయటకు పరుగుతీశాడు.

అతడికి మారుతీని ఎవరో దొంగిలించారనే విషయం అర్థం అయింది. వెంటనే ఇంట్లోకి వెళ్ళి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి కారు పోయిన విషయం చెప్పాడు.

(ఇంకా వుంది)



ప్రశ్నావళి

–కె. రామలక్ష్మి

మహమద్ రఫి, అయితానగర్.

సినీ నటులు తమ మగ పిల్లలనైతే పరిశ్రమలోకి తెస్తారు. ఆడపిల్లలని తేరెందుకు?

● దొంగని తేలు కుట్టినట్టు – చెప్పరు– ఈ రంగపు లొసుగులన్నీ తెలిసినవారు కద!

జి. వి. కృష్ణమూర్తి, సికిందరాబాదు.

ఇంట్లో అందరికీ స్వేచ్ఛ యివ్వాలనే వుంటుంది కాని నా మాట వినకపోతే లోకువై పోతానేమో అనే భయం పీడిస్తుంది నన్ను....

● మీ సుదీర్ఘమైన లేఖ చదివాను.... పదిలినంత తాడు వదిలి– యిష్టం లేనప్పుడు లాక్కోవాలని చూడ్డం– చిన్న పిల్లల పని. పెళ్లి కట్టుడు రాదా భార్య దానికి పొడుగైన (స్వేచ్ఛ?) తాడితో కట్టేయ వడిన గొప్ప అనీ అనుకోవడం – మానసిక రుగ్మతకు సూచన. మీలో మీరు ఆలోచించుకోవడం కాదు స్వేచ్ఛ యిస్తుండడం, కట్టడి చేస్తుండడం – యివన్నీ మీ మనసులో మథనాన్ని తెలియ చేస్తున్నాయి. ముందో మంచి వైద్యుణ్ని చూడండి. నోమాన్ యీజ్ ఫ్రీ– హూ కెనాట్ కమాండ్ హిమ్‌సెల్ఫ్....

టి. రాంప్రసాద్, ప్రొద్దుటూరు.

చిత్రసీమలో ఇప్పుడొస్తున్న యువనటులపై మీ అభిప్రాయం?

● నేనింకా ఎవరి సినిమాలూ చూడలేదు సరియస్‌గా. అయినా సినిమా కుటుంబాల లోంచి వస్తున్న వారికా విద్య వెన్నతో పెట్టినది కాదా?!

యు. యు. ఉరుకుంద, ఎమ్మిగనూరు.

నానాటికీ దిగజారిపోతున్న సాహిత్య విలువలపై మీ అభిప్రాయం!

● వాటిపై ఎవరి అభిప్రాయ మైనా దండగే. ఉవ్వెత్తుగా లేచిన కెరటం– విరుచుకు పడాలికద. తరువాతే – మళ్ళీ యింకో కెరటం బయలు దేరుతూన్నట్టు కన్పిస్తుంది.... మీకు నచ్చే మెచ్చే కెరటం కోసం మీరు వేచి వుండడమే.

రాజకీయ నాయకులు యిలా ఒకరి నొకరు తిట్టు కోవడం బాగుందా?

● ఏం? ఎందుకు బాగులేదు. యీదేశంలో – ఉత్సవాలు కళాభిమానానికి చిహ్నాలయితే యీ తిట్లు మన రాజకీయ పరిజ్ఞానానికి చిహ్నాలు– అనుకోకూడదా!

అరుణ, మెట్‌పల్లి.

స్త్రీ అంతరంగాన్ని ఆవపోసన పట్టిన చలంగారిపై మీ అభిప్రాయం?

● స్త్రీ అంతరంగాన్ని ఆవపోసన పట్టిన దాఖలాలేం ఆయన చెప్పలేదు. రచయితగా మేరువు. మనిషిగా మరుగుజ్జు అని నా నమ్మకం. (విరుచుకుపడకండి మనిషిగా నైతిక విలువలను తిలోదకాలిచ్చి– పోని అని ఓ నవసమాజాన్ని సృష్టించక –– జీవితాలతో చెలగాటా లాడుకున్న రచయితలు గొప్ప వారేమో గాని వ్యక్తులుగా వాళ్ళు చాలా చిన్నవాళ్లని నా నమ్మకం. ఒక్క రచయిత లేంటి? కవి గాయక శిఖామణు లెవరైనా – ద్వంద్వ నీతిని పాటించే వారిని మనం మనిషిగా గౌరవించాలని రూల్ లేదు.)

డి. కె. చదువులబాబు,

పెద్దపసుపుల (కడప)

ఆరుద్రగారు రాయడం తగ్గించారు. కారణం ఏమిటి?

● సమగ్రాంధ్ర సాహిత్యం పని పూర్తి చేస్తున్న కారణంగా– అంతే.

మీ అభిమాన కవి ఎవరు?

● కవి అని లేరు కాని కవిత్వం ఏదైనా చదివే అలవాటునాకు.

జీవితానికి సార్థకత ఎప్పుడు.

● జీవితంలో ఎదురయ్యే ఎగుడు దిగుళ్ళకు కృంగి పోకుండా, ఏర్పరచుకొన్న ఆశయాల అంచులనైనా తాకి, తృప్తిగా బ్రతకకల్గడం సార్థకత. ప్రతి ఎదురు దెబ్బకీ – ఎవరో కారణం అని కనిపెట్టడానికి ప్రయత్నిస్తూ కాలం గడిపే కంటే – ముందుకి సాగే ప్రయత్నంలో - యివి తప్పవేమో నన్న ధైర్యం తెచ్చుకుని ముందుకు సాగే తెంపు సార్థకత. స్వయానా చేసుకున్న పనులకి కృంగి పోవడం ఎదుటి వారికి లోకువై పోవడం అని తెలుసుకుని– కృంగతీస్తున్న వాటిని లొంగ దీసుకుంటూ జీవితం సాగించడం సార్థకతే – ఇంతెందుకు మధ్య తరగతి మనిషి రోజు తళ్ళడం సార్థకతే!

చిందం నారాయణ, సికింద్రాబాదు.

ప్రతి భార్యా భర్త వచ్చే జన్మలో కూడా అతని భార్యగా ఆమె భర్తగా వుండాలని కోరుకుంటారా?

● ఛస్తే కోరుకోరు" మళ్ళీ జన్మలో కూడానా! వద్దు అని మొక్కుకునే కాలంలో జివిస్తున్నారు భార్యలు.

బి. కుమారస్వామి, వరంగల్.

స్త్రీ తల వంచితే సిగ్గు అంటారు. మగవాడు తల వంచితే?

● ఓడిపోయాడంటారనాలని మీ కోరిక కాబోలు. ఈ రోజుల్లో ఆడది తల వంచితే– పిరికితనంగా భావించ బడుతోంది. మగవాడు తల వంచితే– తన జాతి చేస్తున్న దారుణాలకి సిగ్గుపడు తున్నాడా అని భావించ బడుతుంది.


పాశ్చాత్య నాగరికతపై మీ అభిప్రాయం?


● అసలు నాగరికత – సిజనల్, దాన్ని గురించి మనం తలలు బద్దలు చేసుకుంటా మెందుకో నాకు అర్థం కాదు. మనకి 'నాగరికత' సింధు నాగరికతతో ప్రారంభిస్తాం! ప్రతి చిన్న మార్పు – అది ఆహరానికో వస్త్ర – సంప్రదాయం మంట కలిసి పోతోందని – గుండెలు బాదుకుంటాం. ఎప్పుడంటే ఆడది మారకూడదు మనవాళ్లకి!

మంత్రి భాస్కర్, మెట్‌పల్లి.

ప్రజల్లో రచయిత్రిగా మీకు పేరుంది కదా మరి రాజకీయాల్లోకి చేరి దేశానికి ప్రజలకీ సేవ చేయవచ్చు కదా?

● నేనా! ఇంకానయం – రాజకీయంగా రూపాంతరం పొందుతే – ఎప్పుడో వచ్చి పోయుండును! (అయినా మహామహా విప్లవ మేధావులు రంగంలోకి దూకి కష్టపడ్డారా ఏమిటి? అని ధైర్యం చెప్పకండి!!)





ధృవతార. బి.స్వర్ణాంబ

'పెళ్లినాడు అరుంధతీ నక్షత్రం చూపించారు. ఆమె భర్త ననుసరించి మెలిగే స్త్రీ ఆదర్శమూర్తి. ఆమెతో పోల్చుకోవడం కాదు కానీ, నాకు నా భర్తే సర్వస్వం. ఆయనెంతో మంచివారు. భగవంతుడు. ఇంత గొప్ప వ్యక్తిని నాకు భర్తగా ప్రసాదించినందుకు ఎంతో కృతజ్ఞత తెలుపుకోవాలి....''

రమ వ్రాసిన ఉత్తరం చదువుతూంటే నా ఆలోచనలన్నీ రమ చుట్టూ మూగుతున్నాయి. ఉత్తరం ఆపి ఆలోచిస్తున్నాను.

రమ నా క్లాస్‌మేట్. బి. ఏ. తో దాని చదువు ఆగిపోయింది. పెళ్లయ్యాక గృహిణిగా స్థిరపడిపోయింది. వీలున్నప్పుడల్లా వాళ్ల ఊరు వెళ్లేదాన్ని. రమ భర్త శేఖరం చాలా మంచివాడు. వాళ్ల అన్యోన్య దాంపత్యం చూస్తే ముచ్చటేసేది. కాని ఒకే అపశృతి. నలభై ఏళ్లొచ్చినా రమకు పిల్లలు పుట్టలేదు.

"మీ స్నేహితురాలికి పెద్ద బెంగండీ పిల్లలు లేరని. నేనే పిల్లాణ్ణి అనుకోరాదా–" అనేవాడు శేఖరం.

"ఛీ– ఏమిటా మాటలు" అని రమ విసుక్కునేది.

ఒకమారెప్పుడో శేఖరం ఊరికి వెళ్తే రమ ఆ రెండు రోజులూ తెగ బెంగ పెట్టుకుందట! అన్నం మానేసిందట! ఆయనకు ఆ ఊళ్లో మంచి భోజనం దొరికిందో లేదోనని రమ బాధ.

అతను మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో రమ ఎక్కడికైనా వెడితే మరుసటి దినమే వెళ్లి తీసుకొచ్చేవాడు.

పాలు, నీరులా కలిసి పోయారు వాళ్లిద్దరూ.

వరకట్నపు చావులు గూర్చి విన్నప్పుడల్లా రమ కలవరపడిపోయేది. "మా నాన్న ఈయనకు కట్నకానుక లేవీ ఇవ్వలేదు. అయినా ఎప్పుడూ ఆయన దాన్ని గూర్చి ప్రస్తావించలేదు" అనేది.

అటువంటి రమకు ఈనాడు ఎటువంటి స్థితి? శేఖరం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పచ్చకామెర్లు వచ్చి చాలా డీలాపడి పోయాడు. అది బాగయిం తర్వాత విపరీతమైన తలనొప్పి... ఎక్సరేలు. మందులు... ఎన్నివిధాలుగానో చికిత్స జరుగుతోంది. మనిషి చాలా నీరసించి పోతున్నాడు. ఏదీ సరిగ్గా నిర్ధారణ చేయలేకపోతున్నారు డాక్టర్లు.

ఇవన్నీ తెలిసి నేను రమను చూడ్డానికి వెళ్లాను. రమ నన్ను పట్టుకుని బావురుమంది.

"ఈయనకేమైనా అయితే నేను బ్రతకనే"– అంది.

"ఛ– ఏం మాటలవి? పూర్కో– శేఖరానికి ఏమీ కాదు" అని ఓదార్చాను. కానీ శేఖరం పరిస్థితి చూస్తే నాకు ఆందోళనగానే ఉంది.

మెల్లిగా డాక్టర్ల నడిగి విషయం తెలుసుకున్నాను. అతనికి ఆపరేషన్ అవసరం కావచ్చునన్నారు డాక్టర్లు.

శేఖరానికేమైనా అయితే?... రమ బ్రతకదు... నాకు ఆ ఊహే భయంకరంగా అన్పించింది.

ఆ తర్వాత రమతో రెండు మూడు రోజులు గడిపి మా ఊరికి వచ్చేశాను తనకు ధైర్యం చెప్పి.

ఇంటికి వచ్చాక నాన్నగారికి సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వచ్చింది. మద్రాసు వెళ్లిపోయాను. ఆయన్ని ఆస్పత్రిలో చేర్పించారు. రెండు నెలలు ఆయనతో పాటు ఆస్పత్రిలో గడపాల్సి వచ్చింది. ఈ మానసిక ఆందోళనతో పాటు రమ భర్త కెలా ఉందోనన్న ఆలోచన.

నాన్నగారికి కొద్దిగా నిమ్మళించింది. ఇంటికి వచ్చాక తలుపు తీయగానే పోస్ట్‌మాన్ పడవేసిన ఉత్తరాలు కనిపించాయి. అందులో రమ వ్రాసిన ఉత్తరం ఉంది. ఆత్రంగా చింపాను. నిర్ఘాంతపోయాను. మళ్లీ మళ్లీ చదివాను. విషయం అర్థం కావడానికి ఎంతో సేపు పట్టలేదు.

"స్వర్ణా,

శేఖరం ఆరోగ్యం కుదుటపడలేదు. డాక్టర్లు చెప్పిందాన్ని బట్టి ఆయన ఇక బ్రతకడని తేలిపోయింది. (ఈ వాక్యం ఎలా రాస్తున్నానో నాకే తెలియదు). ఆయన లేకపోతే నేనూ లేను. దిగులుతో, ఉపవాసాలతో శుష్కించిన ఈ [illegible] నుండి ప్రాణం పోవడం ఎంతసేపు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. ఉత్తరం నీకు చేరేసరికి నేను నీకు దొరకని దు తీరాలకు వెళ్లిపోతాను. నీ స్నేహితం వచ్చే జన్మ కూడా లభించాలని కోరే నీ రమ."

నా కళ్లమ్మట నీళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. తేదీ చూశాను. ఆ ఉత్తరం రాసి నెల దాటిపోయింది. నా గుండె గబగబా కొట్టుకుంది. రమ తన ఆందోళనలో ఉత్తరం ఇక్కడకు రాసింది. నేను మద్రాసులో ఉన్నట్టు తనకు తెలుసు. అంటే... రమ ఇప్పుడీ లోకంలో లేదు. ఈ విషయం అర్థమయ్యేసరికి నాకు దుఃఖం ఆగలేదు. టేబిల్‌పై తల ఆనించి వెక్కి వెక్కి

షబ్నా కోరిక



ఒక పెద్ద చిత్ర నిర్మాత షబ్నాఅజ్మీని తన చిత్రంలో నటించమని అడిగాడట. అందుకు ఆమె ఒక షరతు విధించింది. తిండి మాత్రం తను చెప్పిన రెస్టారెంట్ నుంచే తెప్పించాలనట ఆ షరతు. మరి ఆ రెస్టారెంట్‌లో తిండి [illegible] కున్నాడో ఏమో. ఆ నిర్మాత [illegible] గుడ్‌బై కొట్టేశాడట. కోరికలకు కూడా అంతుండాలి మరి!

ధృవతార


ఏడ్చాను. కాస్సేపయాక తేరుకొని వెంటనే రమావాళ్ల ఊరికి ప్రయాణమయ్యాను.

బస్సులో కూర్చున్నాను కానీ రమ, రమ లేని ఆ ఇల్లు ఎలా చూడాలని బాధపడ్డాను. అసలు ఆ ఇంట్లో ఎవరుంటారని నేను వెడుతున్నాను. ఎవరైనా బంధువులు వచ్చి ఆక్రమించుకున్నారేమో? ఇలా ఆలోచనలతో నా తల పగిలిపోయింది.

అలా యుగం ప్రయాణించాక రమావాళ్ల ఊరు వచ్చింది. గుండెలు గుబ గుబలాడుతుండగా బస్సు దిగి, రిక్షా ఎక్కి బయలుదేరాను. రమా వాళ్ళున్న ఇల్లు వీధి దగ్గరికి వచ్చేసరికి నా కాళ్ళు నీరసించినట్లయ్యాయి. తల దిమ్మెక్కింది. ఆలోచన శూన్యమయిపోయింది.

'ఎక్కడాపమంటారమ్మా'- అని రిక్షా అతను అడిగితే కానీ నాకు తెలివిరాలేదు. రమ ఇల్లు దాటిపోయింది. రిక్షా ఆపించి దిగాను. కాళ్ళు తేలిపోతున్నాయి. అడుగు పడలేదు. ఎలాగో నిలదొక్కుకుని మెల్లిగా రమా వాళ్లింటి వేపు నడిచాను. ఆ శూన్య గృహాన్ని ఎలా చూడటం? అసలు ఎవరుంటారా ఇంట్లో? నేనెందుకొచ్చా నిక్కడికి? ఎవర్ని చూడాలని?సమాధానం లేని ప్రశ్నలతో నా తల వేగిపోతోంది.

ఆ ఇల్లు పాతకాలంది. ముందు ఎత్తుగా ప్రహరిగోడ. కాస్త దూరం నడిచి లోపలికి వెళ్లగానే వరండా తర్వాత హాలు వగైరా.... ప్రహరిగోడ దాటి లోపలికి వెళ్లాను. వరండాను అనుకొని పెద్ద షామియానా, మామిడాకు తోరణాలు. కాస్త ఎండిపోయినవి.... రంగు రంగుల కాగితాలు....



నాకేం అర్థం కాలేదు. పొరపాటున వేరే ఇంటికి వచ్చానా అనుకున్నాను ఒక క్షణం. కానీ కాదని వెంటనే నిర్ధారించుకున్నాను. అప్పుడే ఎవరో వేరేవాళ్ళు ఇంట్లో దిగినట్టున్నారు. ఎవరై యుంటారు?... ఆలోచిస్తూ హాల్లోకి నడిచాను. అక్కడ ఉయ్యాల బల్ల. నేను, రమ, కూర్చుని హాయిగా కబుర్లు చెప్పుకునేవాళ్ళం. నా కళ్ళు నీళ్ళతో నిండాయి. రమా లేదు అనే భావన నన్ను క్రుంగదీసింది. కళ్ళు తుడుచుకుంటూ అలా నిలబడిపోయాను.

ఇంతలో ఎవరో ఒకావిడ 'ఎవరూ?' అంటూ అటుగా వచ్చి నన్ను చూసి 'ఎవరమ్మా నీవు?' అంది. ఆమెను ఇంతకు ముందు చూసిన గుర్తులేదు. "ఇక్కడ రమ, శేఖరం అని ఉండేవాళ్ళు. ఇంతకు ముందు...." అని నేను చెప్పబోతున్నాను. లోపల నుండి వచ్చిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను.

వెర్రిదానిలా చూస్తూ నిలుచుండి పోయాను. ఆ వచ్చిన వ్యక్తి శేఖరం.

ఈ లోకంలో నే లేడని నేననుకుంటున్న శేఖరం...

జబ్బు మనిషిలా కూడ లేడు. సరికదా, పైపెచ్చు ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు.

నాకళ్ళని నేనే నమ్మలేకపోయాను.

కలా? నిజమా? అర్థం కాలేదు. అయితే ఈయనకు జబ్బు నిమ్మళించిందన్న మాట?.... అయితే రమ ఏ అఘాయిత్యమూ చేసి ఉండదు.

వెంటనే, నా నోట వెలువడిన ప్రశ్న అదే....

'రమ ఎక్కడుంది? మీరు కులాసాగా వున్నారా?" అని.

అతను విషాదంగా నవ్వాడు.

'రండి, కూర్చోండి!-" అన్నాడు.

మంచినీళ్ళు, కాఫీ తెప్పించాడు.

నాకు అవేవీ అఖ్ఖర్లేదన్నాను.

వెంటనే సమాధానం చెప్పడేం? నాలో అసహనం పెరిగిపోయింది.

"శేఖరంగారూ! రమ ఎక్కడ?" అని అడిగాను అరిచినట్లుగా.

అతను తల వొంచుకున్నాడు.

"తను పోయి నెల దాటిందండీ- మీకు ఉత్తరం రాశాను కూడ." అన్నాడు.

అప్పుడు అతని వైపు పరీక్షగా చూశాను. అతని వేషంలో ఏదో విలక్షణత్వం.... అవును..... అది పెళ్ళికొడుకు వేషం. కాళ్ళకు పారాణి, చేతికి కొత్త రిస్ట్ వాచీ-మెరుస్తున్న ఉంగరాలు. మెళ్ళో పులిగోరు హారం.... చెప్పండి. ఏం జరిగింది?- నా అరుపు విని అతను చకితుడయ్యాడు.

తప్పు చేసిన వాడిలా తలదించుకున్నాడు.

"రమ నా పరిస్థితి చూసి భయపడిపోయింది. నేను చచ్చిపోవడం ఖాయమనుకుంది. వెంటనే ఆత్మహత్య చేసుకుంది. రమ మరణం నన్ను క్రుంగదీసింది. అయినా చిత్రంగా నేను కోలుకున్నాను. డాక్టర్లే ఆశ్చర్యపోయారు-"

ఇంతలో ఆవిడ అందుకుంది.

"ఆ పిల్ల పోయాక ఇతన్ని మామూలు మనిషిని చేయడానికి శతవిధాల ప్రయత్నించామమ్మా. పోయిన వాళ్ళతో మనమూ పోలేము కదా? పోరి పోరి, చివరికి పెళ్ళికి ఒప్పించాను...." ఇలా మాట్లాడుతూ ఆమె, 'ఒసే, భానూ, ఇలా రా!" అని లోపలికి కేకేసింది. ఆ భాను లోపల్నుండి వచ్చింది. మెడలో పసుపుతాడు, పాదాలకు పసుపు, నవవధువు లక్షణాలు కనిపిస్తున్నాయి. నాకు తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది.

ఇదా శేఖరం అసలు స్వరూపం? రమ ఇతని కోసమా! త్యాగం చేసింది. జీవితాన్ని ప్రేమకు పణంగా పెట్టింది. కానీ ఫలితం?

నాకు శేఖరాన్ని చూడాలంటేనే అసహ్యం కలిగింది. ఇంకో క్షణం అక్కడుండ బుద్ధికాలేదు. గబుక్కున, వీధి వాకిలి వైపు నడిచాను. శేఖరం, "అదేమిటి? వెళ్ళిపోతున్నారేం?" అంటూ ఆశ్చర్యపోతూ నా వెంటనే వచ్చాడు.

ఆవిడా అర్థం చేసుకుంది- "చూడు తల్లీ, రమ తన భర్తకేమో అయిపోతుందని ప్రాణాలు తీసుకుంది. కానీ ఇతను బ్రతికాడు. నా కూతురు భానుకు నలభై ఏళ్ళు వచ్చాయి. ఎంత వెదికినా పెళ్ళి సంబంధం కుదరలేదు. బీదదాన్ని. వేలకు వేలు కట్నం పోయలేను. ఇటువంటి పరిస్థితిలో ఈయన దేవుడిలా తారసపడ్డాడు. ఇతనికి నలభై ఐదేళ్ళ వయసుంది. ఇంకా ఎంతో జీవితం ముందుంది. ఒంటరిగా ఎలా గడుపుతాడు? అందుకే బతిమాలి మా పిల్లను చేసుకొమ్మన్నాను. దేవుడు కరుణించాడు. ఇతను ఒప్పు కున్నాడు...." నేను ఆమె మాటలు పూర్తిగా వినలేదు. రోడ్డు మీదికి వచ్చేశాను. కనబడిన రిక్షా ఎక్కాను.

"స్వర్ణమ్మగారూ! వెళ్ళిపోకండి-" శేఖరం అరుస్తున్నాడు. నేను వినిపించుకోలేదు.

ఎంత విచిత్రం? శేఖరం కోసం ప్రాణాలు తీసుకుంది రమ. అతను టింగు రంగా అని పెళ్ళికొడుకయ్యాడు. వృద్ధ కన్యలు పెరిగిపోతున్న ఈ దేశంలో మధ్యతరగతి వారికి నలభై అయిదేళ్ళ, ఉద్యోగస్థుడైన పెళ్ళికొడుకు దొరికాడంటే వదులుతారా?

అందుకే శేఖరం మళ్ళీ పెళ్ళి కొడుకయ్యాడు. అతను మాత్రం ఋషి కాడు కదా?

కానీ నన్నొక్క సందేహం ఇప్పటికీ పీడిస్తోంది. ఒక వేళ శేఖరం చనిపోయి, రమ మళ్ళీ పెళ్ళి చేసుకొని వుంటే ఈ సమాజం హర్షించేదా? అసలు ఆమెను చేసుకోవడానికి ఏ మగాడైనా ముందుకు వచ్చేవాడా?

ఇంకా అంత ఎత్తుకు ఎదగలేదు సమాజం. పైగా భార్య పోయిన మూడు నెలల లోపల మగాడు పెళ్ళాడాలని రూలు కూడా వుంది.

"రమా! అపాత్రదానం చేశావు నీ ప్రేమ-" అని మనసు మూలిగింది.

గోవింద జాగింగ్

నటులు గొప్పవారే కావచ్చు కాని వారి దగ్గర పనిచేసే బంట్రోతులను బానిసలుగా చూసేవారు అరుదట. అట్లాంటి వారిలో గోవిందను లెక్కలోవేసుకోవచ్చు. రోజూ తాను మైలుదూరం జాగింగ్ చేస్తాడట. జాగింగ్ వరకు



బాగానేవుంది. అతని వెనకే తన సర్వెంటు ప్యాంటు షర్టు కూడాపట్టుకొనే ఈ మైలుదూరం జాగింగ్ చేయాలట. ఇదెక్కడిచోద్యం! మరీ అంత బానిసగా చూస్తుంటే ఆ సర్వెంటు ఎంతకాలం వుంటాడు?!



గగ్గయ్యా పేరువింటేనే హడల్

తెలుగు చిత్రసీమ తొలి దశలో క్రూర పాత్రలు ధరించి, ఆ పాత్రలకు జీవం పోసి, ప్రేక్షకులకు గగుర్పాటు కల్గించిన అసమాన ప్రతిభా సంపన్నుడు వేమూరి గగ్గయ్య. తెరపై ఈయన రూపం, నటన, పద్య పఠనం తీరుగాంచిన వారికి గగ్గయ్య ఒక రాక్షసుడుగా భయం కలిగించేవాడు. ఆయన నటించిన పాత్రలు జలంధరుడు, శిశుపాలుడు, యముడు, కంసుడు, రావణుడు వంటివి కావడం వల్లనే!

ఆయన నటించిన చిత్రాలు తక్కువయినా ఎక్కువ కీర్తి నార్జించాడు. అటు నాటకరంగంలోను -ఇటు సినిమారంగంలో దుష్ట పాత్రధారణలో వేమూరి గగ్గయ్యదే అగ్రస్థానం...

1945 సం. ప్రాంతంలో విశాఖపట్టణం టౌన్ హాల్లో "సావిత్రి" నాటకం ప్రదర్శన! "ఊరంతా జట్కాబండి సహాయంతో నాటక ప్రచారం గావించారు. ఈ నాటకంలో గగ్గయ్య, పులిపాటి, పూర్ణిమ వగైరా నటవర్గం. హాలు దగ్గర ఉదయం నుంచి టిక్కెట్లు అమ్ముతున్నారు. ఉదయం పదిగంటలకు హాలువద్దకు వెళ్ళి రూపాయి టిక్కెట్టు కొన్నాను. నటవర్గ మంతా వచ్చి వున్నారని తెలియగానే మెట్లెక్కి మీదకు వెళ్లాను.

సముద్ర అలలు చూస్తూ కూని రాగాలు తీస్తూ ఒక ఆజానుబాహు వ్యక్తి అక్కడ నుంచొని వున్నాడు. గ్లాస్కో పంచె, లాల్చీ ధరించి శాంత వదనంతో వున్న ఆ వ్యక్తిని సమీపించి, "ఏమండీ! గగ్గయ్యగారు ఎక్కడ వున్నారండీ!" అని ప్రశ్నించాను.

మందహాసం

ఆయన మందహాసం చేస్తూ, "ఆయనతో నీకేం పని" ఎదురు ప్రశ్న వేశారు. ఆయన నటించిన సినిమాలన్నీ చూస్తున్నాను. అన్నింటిలోను ఆగ్రహావేశాలతో, భయంకర వేషధారణతో కన్పిస్తుంటారు. మామూలుగా అయితే ఎలా వుంటారో అని చూడాలని వచ్చానన్నాను.


ఆయన నవ్వుతూ "నేనే ఆ గగ్గయ్యను" అన్నారు.


నాకు ఆశ్చర్యం వేసింది. సౌమ్యంగా, మందహాసంతో కనిపించే ఈ వ్యక్తేనా గగ్గయ్యని! నా నోట మాట రాలేదు. "రాత్రి నాటకం చూస్తావుగా అప్పుడు తేడా గమనించు... మిగతా ఏక్టర్లు అక్కడున్నారు చూడు" అన్నారు.

* * * *

నాటి మేటి నటుడైన గగ్గయ్య గురించి కనీసం తెలుసుకోవడం ఈనాటి కళాప్రియుల ధర్మం.

గుంటూరుజిల్లా వేమూరులో 15-5-1895 సం. లో గగ్గయ్య జన్మించారు. చిన్నప్పటి నుంచి చదువు మీద కంటే సంగీతంపై మక్కువ అధికంగా వుండేది. తన తండ్రి





మరణించడం, సరైన అదుపాజ్ఞలు లేకపోవడం వల్ల తెగిన గాలిపటంలాగ ఆడుతూ పాడుతూ తిరుగుతుండేవాడు.

గగ్గయ్యను సురభివారి నాటక ప్రదర్శనలు ప్రభావితం చేశాయి. సంగీతంలో అంతో యింతో కృషి చేసి వున్న గగ్గయ్య సురభివారి నాటక సంస్థలో చేరిపోయారు. సురభివారి క్రమశిక్షణలో గగ్గయ్య నటుడిగా పేలద్రొక్కుకున్నారు. ఆంధ్రదేశంలో నే కాక, వివిధ రాష్ట్రాలలోను, రంగూన్‌లోను వీరి నాటకాలు ప్రదర్శించడంతో గగ్గయ్య పేరు ప్రతిష్టలు అధికం కాసాగాయి.

ఎన్నో పెద్ద నాటక సంస్థలు గగ్గయ్యను సాదరంగా ఆహ్వానించాయి. తను నటించే పాత్ర అందర్నీ ఆకట్టుకునే విధంగా పోషించేవాడు.

సినిమాలోకి

గగ్గయ్య ఖ్యాతి సినిమా నిర్మాత-దర్శకుల దృష్టిలో పడింది. ఈస్టిండియా కంపెనీవారి సావిత్రి (1933) లో యముడు పాత్రకు దర్శకుడు సి. పుల్లయ్యగారు నియమించుకున్నారు. చిత్రం విడుదలయ్యాక గగ్గయ్యకు మంచి పేరు ప్రఖ్యాతులు లభించాయి. చిత్రాలలో పాత్రలు లభించాయి.

కృష్ణలీలలు (35) ద్రౌపది వస్త్రాపహరణం (36) సతీ తులసి (36) కృష్ణ జరాసంధ (38) భక్త మార్కండేయ (38) మైరావణ (40) చండిక (40) దక్షయజ్ఞం (41) భక్త ప్రహ్లాద (42) గరుడ గర్వభంగం (43) సీతారామజననం (44) భక్త శ్రీయాళ (48) మొదలగు సుమారు ఇరవై చిత్రాల దుష్ట భూమికలు కడు సమర్థతతో పోషించి, ఆ పాత్రలకు మరొకరు పోటీ లేదని నిరూపించారు. గగ్గయ్య నటించిన చిత్రాలలో "భక్త శ్రీయాళ"లో ఈశ్వరుడు పాత్ర మాత్రం సాత్వికమైంది. అందుకేనేమో ఆ చిత్రం అపజయం పొందింది!

నాటకాల్లోనూ, సినిమాల్లోను నటిస్తూనే, ఎన్నో గ్రామఫోను రికార్డులిచ్చారు. కొన్ని నాటకాలు కూడా 'రికార్డు'లు విడుదల అయ్యాయి. భక్తుల కోరికపై దేవాలయ ప్రాంగణాల్లో హరికథలు చెప్పేవారు. దైవంపై అచంచల విశ్వాసంగల గగ్గయ్యకు, దైవ ద్వేషం గల పాత్రల్లో రాణించి, అంతటి నటుడు మరి లేడనిపించుకోవడంల్లో గల ఆంతర్యం తను సాధించిన అకుంఠిత దీక్ష!

ఆనాటి అగ్రశ్రేణి నటుడుగా దేశమంతటా యశస్సునార్జించి, 1955వ సంవత్సరంలో(30-12-1955) కాన్సర్ వ్యాధి వల్ల భౌతిక దేహం చాలించి కీర్తిశేషులయ్యారు.

వీరి పుత్రుడు వేమూరి రామయ్య నాటకాల్లోను, సినిమాల్లోను, టెలివిజన్‌లోను నటిస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా కీర్తిగాంచడం ముదావహం!

గగ్గయ్యగారి కంఠం నుంచి వెలువడిన 'పో బాల పొమ్మికన్', 'ధిక్కారమును సైతునా' గానం ఈనాటికీ మరిచిపోలేకున్నాం. అసమాన నటశేఖరుడు, గగ్గయ్యను స్మరించుకోవడం, ఆనాటి మావంటి కళాభిమానుల కనీస ధర్మం.

సేకరణ:
ఆరిపాక సూరిబాబు


సోవియట్ పైలట్ గ్రిష్చెంకోకు ఫ్రాన్స్‌లో మజ్జమార్పిడి ఆపరేషన్

చెర్నోబిల్ అణు రియాక్టర్ పేలిన దుర్ఘటనలో ధార్మికశక్తి ప్రభావం వలన నెత్తురు క్యాన్సర్ (ల్యుకేమియా) వ్యాధి పాలబడిన సోవియట్ పైలట్ అనతోలియవ్ గ్రిష్చెంకోకు ఎముక మజ్జ మార్పిడి చికిత్స ఏప్రిల్ 28న ప్రారంభమయింది. ఫ్రాన్సులోని బెసన్‌కాన్‌లో నిపుణులయిన శస్త్రవైద్యులు ఈ చికిత్స ప్రారంభించారు. అమెరికాలోని సియాటిల్ క్యాన్సర్ పరిశోధనా కేంద్రం పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్న గ్రిష్చెంకోను మజ్జమార్పిడి శస్త్ర చికిత్స నిమిత్తం ఫ్రాన్స్ తీసుకురావటం జరిగింది.

చెర్నోబిల్ దుర్ఘటన జరిగిన సందర్భంగా విమానంలోంచి అణురియాక్టర్ పేలిన ప్రాంతంలో కాంక్రీటు సీసం తదితర ధార్మిక శక్తి నిరోధక పదార్థాలు వెదజల్లడం ద్వారా గ్రిష్చెంకో గొప్ప సాహసం ప్రదర్శించారు. అయితే ఈ సందర్భంగా అణుధార్మికశక్తి ప్రభావం ఆయనపై విపరీతంగా పడింది. ఆయనకు ల్యుకేమియా సంక్రమించినట్లు వైద్యులు కనుక్కున్నారు. ఈ విషయం తెలియగానే వేలాదిమంది అమెరికన్‌లు గ్రిష్చెంకో చికిత్స కోసం విరాళాలు ఇచ్చారు. ఈ విధంగా పోగయిన డబ్బుతోనే ఆయనకిప్పుడు చికిత్స జరుగుతోంది.

మజ్జ మార్పిడి చికిత్సకు ముందు గ్రిష్చెంకోకు సియాటిల్‌లో రేడియో థెరపీ, కెమోథెరపీ చికిత్స చెయ్యడం జరిగింది. మజ్జ మార్పిడి చెయ్యాలంటే, రోగికి సరిపోయే స్వభావం కలిగి ఉన్న దాత లభ్యం కావలసి ఉంది. అమెరికాలో 'మజ్జ'ను దానం చెయ్యడానికి సిద్ధపడిన దాతలకేం కొదవలేదు. కానీ వాళ్ల 'మజ్జ', గ్రిష్చెంకో ఎముకల తత్వానికి సరిపడలేదు. ఈ పరిస్థితుల్లో సియాటిల్ క్యాన్సర్ పరిశోధక కేంద్రం వారు ఫ్రాన్సులోని బెసన్‌కాన్ వైద్యాలయం నిపుణుల సహాయం అభ్యర్థించారు. బెసన్‌కాన్ నిపుణుల దగ్గిర 40 వేల మంది 'మజ్జ' దాతల వివరాలు సిద్ధంగా ఉన్నాయి. వాళ్లలోంచి 42 సంవత్సరాల మహిళ ఒకామెను ఎంపికచేసి ఆమె మజ్జను కొంచెం తీసుకుని చికిత్సాక్రమం ప్రారంభించాలని బెసన్‌కాన్ నిపుణులు నిశ్చయించారు.

ఏప్రిల్ 28 ఉదయం మజ్జ మార్పిడి చికిత్స నిమిత్తం, డాక్టర్లు సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. మజ్జను దానం చేసేందుకు ముందు కొచ్చిన మహిళకు మత్తుమందు ఇవ్వడం కూడా జరిగింది. అంతలో పత్రికా విలేఖరులూ, టెలివిజన్ ప్రతినిధులూ, బెసన్‌కాన్ ఆస్పత్రికి హడావుడిగా వచ్చి పడ్డారు. శస్త్ర చికిత్స చేసిన వైద్యులు - పాట్రిక్ హెర్వ్, జీన్‌కాన్‌లు ఈ హడావుడికి అభ్యంతరం చెప్పారు. గ్రిష్చెంకోకు మజ్జదానం చేసేందుకు సిద్ధపడిన మహిళ తన పేరూ వివరాలూ వెల్లడించవద్దని ఖండితంగా చెప్పడం వలన డాక్టర్లు తమ శస్త్ర చికిత్స వివరాలను ఫిల్ము తీసేందుకు అంగీకరించలేదు. 'ఆమె కీర్తి కోసం ఈ పనిచెయ్యడం లేదు. ఒక వ్యక్తి ప్రాణం నిలబెట్టడానికే ఆమె ఇందుకు సిద్ధపడ్డారు. అతగాడు ఫ్రెంచి జాతీయుడా లేక విదేశీయుడా అన్నది అనవసరం' అని డాక్టర్ కాన్ తెలిపారు. ●




కక్ష్యలో మీర్. ఖగోళ భౌతిక మాడ్యూల్ క్వాంత్ ▲ కక్ష్యలో ప్రయోగశాల క్వాంత్

'మీర్'లో ఏమిగలదు?

సోవియట్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం 'మీర్' (శాంతి)లో ఖగోళ భౌతిక, భూభౌతిక వైద్య జీవ శాస్త్ర ప్రయోగాలు మే మూడోతేదిన ప్రారంభమయ్యాయి. ఈ అంతరిక్ష ప్రయోగ కేంద్రానికి అమర్చిన 'వెంటిలేటర్ల'ను కూడా సోవియట్ కాస్మొనాట్‌లు మారుస్తున్నారు.


అత్యంత శక్తిమంతమయిన మౌలిక పదార్థాల రూపకల్పన గురించీ, సమీప అంతరిక్షంలో వాటి వ్యాప్తి గురించీ మరియా మేగ్నటిక్ స్పెక్ట్రోమీటర్‌తో చేసే ఖగోళ భౌతికశాస్త్ర ప్రయోగాలను సోవియట్ కాస్మొనాట్లు ప్రారంభించారు. భూమి అయన మండలాన్ని అయస్కాంత మండలాన్ని అధ్యయనం చెయ్యడానికి సంబంధించిన భూభౌతిక శాస్త్ర ప్రయోగాలను మీర్ కేంద్రంలోని శాస్త్రజ్ఞులు కొనసాగిస్తారు. అత్యుత్తమ





మయిన గాలియమ్ ఆర్సెనైడ్ ఏకస్ఫటికం తయారీకి సంబంధించిన ప్రయోగాలను మీర్ కేంద్రంలోని శాస్త్రజ్ఞులు మే రెండో తేదీనాడు జయప్రదంగా పూర్తిచేశారు.

మీర్ కేంద్రంలో పరిశోధనా కార్యక్రమాలు ముందు అనుకున్న దాని ప్రకారం సజావుగా సాగుతున్నాయి. సోవియట్ కాస్మనాట్లు అనతోలియమ్ సలవ్యోవ్, అలెక్సాంద్ర్ బలందీన్‌లు ఆరోగ్యంగా ఉన్నారు. ●



నైతికపతనం నాగరికతా?

కొల్లిమర్ల సాంబశివరావు

సూర్యుడి కన్నా హోటల్స్‌కి చలాకీ ఎక్కువ కాబోలు. సూర్యుడు నిద్రలేచి, షోకులు చేసి బయలుదేరేటప్పటికే ముందుగా హోటల్స్ అలంకరించుకుని తమ కస్టమర్స్ కోసం ఎదురు చూస్తుంటాయి.

నవయుగ హోటల్ ఆ రోజే రిలీజయిన కొత్త సినిమాహాలులా వుంది. నేనూ శంకర్ అక్కడ కూర్చుని పది నిమిషాలు పైనే అయ్యింది. ఆర్డరిచ్చిన 'టీ' ఇంకా రాలేదు. మేము కూర్చున్నది డైనింగ్ హాల్ కమ్ స్పెషల్ రూమ్. మధ్యాహ్న భోజనాల సమయం కావటంతో భోజనం చేసే కస్టమర్స్ ఎక్కువ వున్నారు. వున్న నలుగురు సప్లయర్స్ బిజీగా సప్లయి చేస్తున్నారు. భోంచేసే వాళ్ళు కామ్‌గా, ఆతృతగా భోంచేస్తున్నారు. టిఫిన్‌లు చేసేవాళ్ళు మాత్రం కబుర్లు చెప్పుకుంటున్నారు. కొందరు తింటూ, కొందరు తిన్న తర్వాత గంటల తరబడి కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ప్రక్క వున్న జనం సంగతి మరచినట్లుగా- కొంతమంది కాలేజీ కబుర్లు, కొంతమంది ఆఫీసుల కబుర్లు, కొంతమంది రాజకీయాలు, వివిధ మంది వివిధ రకాలుగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

'టీ' తెచ్చి మా ముందు పెట్టి వెళ్ళే సప్లయర్‌ని శంకర్ 'హుష్' అంటూ పిలిచాడు. ఆ సప్లయర్ మాకేసి తిరిగి కోపంగా చూసాడు. 'హుష్' అన్నందుకు కోపం వచ్చి వుంటుంది.

"అగ్గిపెట్టె ఇవ్వు కొంచెం" అడిగాడు శంకర్.

"లేదు" సీరియస్‌గా అనేసి వెళ్ళిపోయాడు ఆ సప్లయర్.

"చూడరా! ఎంత పొగరో వాడికి" అన్నాడు శంకర్.

"నువ్వు అలా 'హుష్' అని పిలవడం ఎందుకురా? సప్లయర్ అనో, మిస్టర్ అనో పిలవవచ్చు కదా!" అన్నాను.

"నువ్వు మరీ విచిత్రంగా మాట్లాడతావురా! నేనొక్కడ్నే అలా పిలిచానా? ఎంతో మంది అలాగే పిలుస్తారు తెలుసా?"

నిజమే! ఎంతో మంది చదువుకున్న వాళ్ళు కూడా అలాగే పిలుస్తుంటారు. వాళ్ళకు సప్లయర్ అంటే చాలా మామూలుగా, చిన్న తరగతివాడుగా అనిపిస్తుంది. వాళ్ళ చదువు, సుపీరియారిటీ కాంప్లెక్స్, పొజిషను వాళ్ళ చేత అలా అనిపిస్తుంది.

శంకర్‌తో ఈ మాటలు చెపితే వాడు నవ్వుతూ, "నువ్వు మరీ సెన్సిటివ్‌రా! చిన్న చిన్న విషయాలను కూడా ఏదో ఆలోచిస్తావు. సరే కాని ఈ సిగరెట్ అంటించుకొని వస్తానుండు" అంటూ లేచి వెళ్ళి, సిగరెట్ అంటించుకొని వచ్చాడు. నేను సిగరెట్ అంటించుకున్నాను.

మేము అగ్గిపెట్టె అడిగిన సప్లయర్ ఇంకొక సప్లయర్‌తో "ప్రపంచంలోని భిక్షగాళ్ళలో సగం మంది మన ఇండియాలోనే ఉన్నారటరా! నిజమే అది. ఏభై పైసల సిగరెట్ త్రాగుతారు. దాన్ని అంటించుకొనే అగ్గిపుల్లని అడుక్కుంటారు" అన్నాడు.

అతడి ముఖంలోకి చూసాను ఆశ్చర్యంగా. చదువుకున్న వాడిలా వున్నాడు. శంకర్ ముఖం ఎర్రబడింది



సప్ఫయర్ అన్న మాటలు వినగానే. కోపంగా ఏదో అనబోయాడు. నేనే వారించాను. ఆ సప్ఫయర్ అన్న మాటలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఎందుకంటే అతడన్నది అక్షరాల నిజం!

శంకర్ మూడ్ మార్చాలని "అంతకూ ఏదో ముఖ్యమైన విషయం చెప్పాలన్నావు. ఏమిటో ఇంకా చెప్పలేదు. ఏమిటి అది?" అని అడిగాను.

ఒక ఆనందవీచిక తళుక్కుమని మెరిసింది శంకర్ ముఖంలో. అంటే- ఏదో ఇంట్రస్టింగ్ విషయమే అయి వుంటుంది అది. శంకర్ చెప్పనారంభించాడు. అది చెప్పేటప్పుడు వాడి కళ్లలో గర్వం, ఆనందం కొట్టొచ్చినట్లుగా కనబడుతున్నాయి.

"మొన్న మా అక్కయ్య వాళ్లతో శివాలయానికి వెళ్లాను. అక్కడ ఒక 'ఫిగర్' కనిపించింది. చాలా బాగుంది. నేను చూసి నవ్వాను. సిగ్గుగా తలొంచుకొని వెళ్లిపోయింది. నిన్న వెళ్లాను. చూసి నవ్వాను. నా నవ్వుకు బదులుగా తనూ నవ్వింది. వాళ్ల ఇల్లు ఆ గుడి ప్రాంగణంలోనే వున్నట్లుంది. ఇవాళ ప్రొద్దున్నే నేను వస్తానని వూహించి వుంటుంది. నిన్నటి వేళకు బయట నుంచుంది. అంటే పిట్ట లైన్‌లో పడుతున్నది. లైన్‌లో పడగానే నీకు పార్టీ ఇస్తాను" అని పూర్తి చేసాడు శంకర్.

నా మనస్సులో ఏదో సందిగ్ధత. ఏవో తెలియని వ్యథా వీచికలు కదలాడాయి. ప్రేమించుకోవటం తప్పని కాదు. కాని "పిట్ట", "ఫిగర్", "లైన్‌లో పడుతున్నది." అని శంకర్ చౌకబారు పదజాలం వుపయోగించటమే నా బాధకు కారణం. నేను మౌనంగా వుండటంతో శంకర్, "ఏంరా! మాట్లాడవూ?, రేపు నాతో వచ్చి చూడు ఎలా వుందో ఆ అమ్మాయి. ఏం వస్తావా?" అన్నాడు.

"పుణ్యం చాలా మూట కట్టుకుంటున్నావన్న మాట రోజూ గుడికి వెళుతూ" నవ్వుతూ అన్నాను.

* * * * *

"మరునాడు శంకర్‌తో గుడికి వెళ్లాలని నాకు ఇష్టంలేదు... కాని వెళ్లక

తప్పలేదు. శంకర్ మా ఇంటికి వచ్చి మరీ నన్ను లాక్కెళ్లాడు. నా మనస్సులో ఏదో ఇబ్బందికరమైన ఫీలింగ్! ఒక అమ్మాయిని చూడటానికి గుడికి వెళ్లవలసిన అవసరం ఏర్పడటం వలన. నేను మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే గుడికి వెళతాను. ఏదో మొక్కుబడిగా గుడికి వెళ్లి నమస్కారం పెట్టి రావటం నాకు ఇష్టంలేదు. మరి శంకర్‌తో నేను రాలేను అని ఖచ్చితంగా చెప్పవచ్చు కదా!ఊహూ! అలా చెప్పలేదు. అంటే- నా మనస్సులో ఏదో మూల ఆ అమ్మాయిని చూడాలన్న కోరిక ఉన్నదన్నమాట.

దైవదర్శనం ముగించుకొని మండపం మీద కూర్చున్నాము. అక్కడకు సుమారు ముప్పై మీటర్ల దూరంలో వుందో ఇల్లు. "అదే వాళ్ల ఇల్లు" శంకర్ చెప్పాడు. వాడి ముఖంలో ఆతృత తొంగి చూస్తోంది.

ఇంతలో ఆ ఇంటిలో నుంచి నీళ్ల బిందెతో బయటకు వచ్చింది ఓ యువతి. ఆమెను చూడగానే శంకర్ కళ్లు మెరిశాయి. ఆ అమ్మాయే అనుకున్నాను. చాలా అందంగా వుందా యువతి. అప్పుడే తలంటు స్నానం చేసింది కాబోలు విరబోసుకున్న శిరోజాలతో వికసించిన కమలంలా వుంది. నడుము మీద ఆ బిందె.... నాకు పదహారణాల తెలిగింటి ఆడబడుచు గుర్తుకు వచ్చింది. శంకర్‌ని చూడగానే చిరునవ్వుతో విచ్చుకొన్నాయి ఆమె పెదవులు ఒక్క క్షణం! అంతలోనే ప్రక్కనున్న నన్ను చూసి సిగ్గుగా తలదించుకొని పంపు దగ్గరకు వెళ్లింది. ఆ ముగ్ధత్వమూ, ఆమె అందమైన సిగ్గు ముచ్చటగా వుంది-ఏమైనా! శంకర్ లక్కీ ఫెలో అనుకొన్నాను.

"ఎలా వుందిరా?" అడిగాడు శంకర్.

"వెరీ ఫైన్" అన్నాను.

* * * * *

ఆరోజు రాత్రి మామయ్య వూరునుంచి వచ్చాడు. శెలవులే కదరా! మా వూరికి రా, పది రోజులుండి పోదువు గాని" అని ఆహ్వానించాడు. ఆ మరుసటిరోజే మామయ్యతో కల్సి వాళ్ళ వూరు వెళ్ళాను.

మామయ్య నాకు ఒట్టి మేనమామే కాదు. కాళ్ళు కడిగి కన్యాదానం

నైతికపతనం నాగరికతా?

చేయబోయే మామగారు కూడా! మామయ్యకు నలుగురు కూతుళ్ళు. అందులో రెండవ అమ్మాయి 'సత్య' నా వుడ్‌బీ. సత్య అంటే చిన్నప్పట్నించీ నా కిష్టం. సత్యమీద నాకు ఇష్టం పెరగ టానికి చిన్నతనంలో జరిగిన ఒక సంఘటన కారణం.

నేను ఆరవ తరగతి చేరిన నెల రోజులకు నాన్నగార్కి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. చేరిన నెల రోజులకే టి. సి. ఇవ్వం. క్వార్టర్లీ ఎగ్జామ్స్ అయిన తరువాత ఇస్తా మన్నారు స్కూల్‌వాళ్ళు. అమ్మా, నాన్న వాళ్ళు నన్ను మామయ్య వాళ్ళ ఇంట్లో విడిచి వెళ్ళిపోయారు.

ఒకరోజు పని మనిషి "ఏమ్మా అల్లుడిని ఇంట్లో పెట్టుకున్నారు. ఏ అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తారు?" అని అడిగింది.

మా సత్యనిచ్చి చేస్తాము. పేర్లు కూడా బాగా కలిసినవి. సత్య-కృష్ణ అని. మా వదినకు కూడా సత్య అంటే ఇష్టం" అంటూ మా అత్తయ్య నా వైపు చూస్తూ "ఏరా! మా సత్యని చేసుకుంటావా?" అని అడిగింది అత్తయ్య. అప్పుడే "సత్య నా భార్య" అన్న భావన ముద్రపడిపోయింది. నా మనస్సులో ఆ భావనను అలా పెంచుకుంటూ వచ్చాను.

కాలేజీలో చేరిన కొత్తలో అమ్మ ఒకసారి "కృష్ణా! కాలేజీలో ఎవరినైనా ప్రేమిస్తావేమో! అదేం కుదరదు. మామయ్యకు మాట ఇచ్చాను. సత్యను నీకు చేసుకుంటానని. సత్యనే ప్రేమించు. తెల్సిందా!" అన్నది.

"రోగి పాలు త్రాగాలనుకుంటే డాక్టర్ పాలే త్రాగమన్నాడట." ఆ సామెత గుర్తుకు వచ్చింది నాకు అపుడు. అప్పటినుండి సత్యను యధేచ్ఛగా ప్రేమిస్తున్నాను.

నేను సత్యను మనస్పూర్తిగా ప్రేమిస్తున్నాను. సత్య నన్ను అంతగా ప్రేమిస్తుందా? అన్న అనుమానం వుండేది ఒకప్పుడు. అది ఒక సంఘటనతో తీరిపోయింది.







అమితాబ్ పై 'అమృతా'భిమానం

అమితాబ్ బచ్చన్‌పైన అమృతాసింగ్‌కు ఎనలేని అభిమానమట. అమితాబ్‌ను మానవత్వానికి ప్రతిరూపంగా భావిస్తుం దిట అమృతాసింగ్. ఎప్పుడైనా తాను స్వంతంగా సినిమా తీయాలని అమితాబ్ నిర్ణయించుకుని ఆ చిత్రంలో తనకు ఎటువంటి అవకాశం యివ్వకపోతే యిక తాను సినిమా రంగంనుంచి విరమించు కుంటుందట. అమితాబ్ మీద ఆ అభి మానమేమిటో?

దాదాపు రెండు సంవత్సరాల క్రితం-

అపుడు సత్యవాళ్ళూ, మేము ఒక వూళ్ళోనే వుండేవాళ్ళం. ఆ రోజు సత్య పుట్టిన రోజు. ప్రొద్దున్నే వాళ్ళ ఇంటికి వెళ్ళి సత్యకి గ్రీటింగ్స్ చెప్పి, అత్తయ్య పెట్టిన స్వీట్ తిని సాయంత్రము సినిమాకు వెళదామని చెప్పి వచ్చేశాను.

సాయంత్రం నేను వెళ్ళేసరికి అంతా రెడీగా వున్నారు. క్రొత్త బట్టలతో సత్య మెరిసిపోతోంది. కాని ముఖంలో ఎందుకో నీరసం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. దార్లో అడిగాను.

"ఏం రా! అలా వున్నావు" ప్రక్క నుంచి మా మరదలు "బావా! ప్రొద్దున్నుంచి అక్క ఏం తినలేదు. కడుపునొప్పిట!" అంది.

"కడుపు నొప్పా! టాబ్లెట్ ఏమీ తీసుకోలేదా? ఇపుడు వుందా? టాబ్లెట్ తీసుకురానా?" ఆత్రంగా అడిగాను.

"ఇపుడేం లేదు!" సీరియస్‌గా అంది సత్య.

ఎందుకో సత్య ఈ రోజు ఏదోలా వుంది. ఎందుకు? ఎందుకని? నాకేమి అర్థం కాలేదు.

థియేటర్‌కు చేరుకున్నాము. సత్యవాళ్ళ అక్కయ్య టికెట్స్ తీసుకు రావటానికి వెళ్ళింది. చిన్న మరదళ్ళు ఇద్దరూ ఎవరో క్లాస్‌మేట్స్ కలిశారు కాబోలు! వారితో మాట్లాడుకుంటున్నారు. నేనూ, సత్య వంటరిగా వున్నాము.

"ఎందుకురా! అలా వున్నావు? ఏమిటో నాకు చెప్పవా?" లాలనగా అడిగాను.

"ఏం లేదు" అంది క్లుప్తంగా.

"ప్లీజ్ సత్యా! ఏమిటో చెప్పకుండా నాకు ఎలా తెలుస్తుంది? ప్లీజ్ చెప్పవూ?" అని అర్థించాను.

"ఇవ్వాళ ఏం రోజు బావా?"

"నీ పుట్టిన రోజు!"

"నీ పుట్టిన రోజున నువ్వు ఏమన్నావో మర్చిపోయావా బావా?" బాధగా అడిగింది సత్య. ఆ కోపంలో ప్రేమానురాగాలు, ఆ బాధలో మమత స్పష్టంగా గోచరిస్తున్నాయి.

"నా పుట్టిన రోజునా?" అని ఆశ్చర్యపోయి ఆలోచనలో పడ్డాను ఒక క్షణం. ఒక్కొక్కటి గుర్తుకు వస్తున్నాయి.

నైతికపతనం-నాగరికతా?

నా పుట్టిన రోజు మూడు నెలలు అయింది. ఆ రోజు ఎలా గడిచింది? ప్రొద్దున్నే లేచాను. తలంటు స్నానం చేసాను. సత్య వెనుక నుంచి వచ్చి కళ్ళుమూసి నోట్లో ఏదో స్వీటు.

అంతే! నాకర్థమైంది!!

కోపం, సంతోషం, దుఃఖం, బాధ మొదలైన భావాలన్నీ కలగా పులగం అయిపోయి అదోలా అయిపోయాను. ఆ రోజు నా పుట్టిన రోజు సత్య నా నోట్లో స్వీట్ పెట్టి, "నీ పుట్టిన రోజున నీకు నేనే ముందు స్వీట్ పెట్టాను చూడు బావా!" అన్నది.

"అయితే, నీ పుట్టిన రోజున నేనే నీకు ముందు స్వీట్ పెడతాను" అన్నాన్నేను.

ఆ మాట అపుడే మరిచిపోయాను. తను ఇన్ని రోజులు గుర్తుంచుకొని, ఆ రోజు దానికోసం, ముఖ్యంగా పుట్టిన రోజునాడు ఏం తినకుండా వున్నదంటే... మైగాడ్... సత్య ముఖంలోకి చూచాను. పట్టుదల ఆమెకళ్ళల్లో మెరుస్తుంది. ఇంత పట్టుదల, ఈపాటి వ్యక్తిత్వము, నా మీద ఇంత ప్రేమ! ఆమె జీవితం నా కోసమేనేమో! ప్రేమగా లాలించే తల్లిదండ్రుల్ని బాధలో ఓదార్చే మిత్రులను చూచాను. ఇపుడు సత్యను

కాశ్మీర్‌లో షూటింగ్‌లు-'నో'

షూటింగ్ లొకేషన్సుకు సంబంధించి హిందీ చిత్ర పరిశ్రమ తన జాబితాలోంచి కాశ్మీరును తొలగించిందట. కాశ్మీర్ మీద ఎందుకు వెక్స్ అయిపోయారో మరి! ఇప్పుడు షూటింగ్‌లకు సిమ్లాగాని, కులు మనాలి గాని ఎన్నుకుంటున్నారు. సుభాష్‌ఘయ్ తను తీసే సౌదాగర్ చిత్రం తాలూకు షూటింగును, రణధీర్‌కపూర్ హెన్నా చిత్రం షూటింగును సిమ్లాలో తీస్తున్నారట.

కాశ్మీరుమంచు ప్రకృతిదృశ్యం వాళ్ళకు యిప్పుడేం కనిపించిందో!

చూస్తున్నాను. ఆమె సత్యకాదు. ప్రేమ, అనురాగం, మమత, మంచితనం, కల్మషంలేని మనస్సుల అపూర్వ అవతారమూర్తి నా దేవత. చాలు సత్యతో నా జీవితం ఆనందంగా గడిచిపోతుంది.

"సత్యా!.. అయామ్ సారీ సత్యా!రియల్లీ అయామ్ వెరీసారీ సత్యా!" తప్పుచేసి,మన్నించకపోయినా మనస్సు కుదుటపర్చుకోవాలని అలా ఆర్ద్రతగా అన్నాను. ఇంక టైమ్ వేస్ట్ చేయలేదు. వెంటనే ఓ చాక్‌లెట్ తెచ్చి సత్యనోట్లో పెట్టాను. సత్య కళ్ళల్లో మెరుపు.

"బావా! ఆకలేస్తున్నది!" గోముగా అడిగింది సత్య.

ఇంతలో సత్య వాళ్ళ అక్క టికెట్స్ తీసుకొని వచ్చింది.

"సత్యకు ఆకలేస్తున్నదట! టిఫిన్‌చేసి వస్తాము. మీరు వస్తారా? లోపల కూర్చుంటారా?" అని అడిగాను.

"మీరు వెళ్ళిరండి బావా!" అంది రెండు టికెట్స్ మాకిచ్చి. మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాను ఆమెకు.

సత్యలో నాకు ముఖ్యంగా నచ్చేది ఆమె ప్రవర్తన!

ఎవరన్నా వున్నపుడు ఎంత గంభీరంగా, మౌనంగా వుంటుందో వంటరిగా వున్నపుడు అంతకు రెట్టింపు చిలిపిగా ప్రవర్తిస్తుంది.

ఆ రోజు ఆ విధంగా మా ఇద్దరి జీవితాల్లో మరపురాని సంఘటనగా మిగిలిపోయింది.

★ ★ ★ ★ ★ ★

పదిహేను రోజులు మామయ్యవాళ్ళ వూర్లో ఆనందంగా గడిపి వచ్చాను. శంకర్ మర్నాడు కనిపించాడు. వాడిని చూడగానే నాకు ఆ అమ్మాయి గుర్తుకువచ్చింది.

"హల్లో! శంకర్! ఎలా వుందిరా నీ ప్రణయం? ఎనీ ఇంప్రూవ్‌మెంట్?" నవ్వుతూ అడిగాను.

"సెంట్ పర్సంట్ సక్సెస్!" గర్వంగా భుజాలు ఎగరేసి చెప్పాడు శంకర్.

"అంటే? నీతో మాట్లాడిందా ఆ అమ్మాయి?"

"మాట్లాడటమా?" అని గట్టిగానవ్వి. "మాట్లాడట మేమిటిరా! పని కూడ అయిపోయింది!"

"అసలుపనా? ఏం పని??" ఆశ్చర్యంగా అడిగాను.

"ఇంకా అర్థం కాలేదురా? ట్యూబ్‌లైట్! అదేరా! సృష్టికార్యం!"

అంటే! షాక్ కొట్టినట్లయింది నాకు. తరువాత శంకర్ మాటలు వినిపించ లేదు.

"నిజమేనా? నిజంగా అది జరిగిందా?" అన్న అనుమానం వెయ్యి తలలు వేసింది. శంకర్ చెప్పింది నిజమే అయ్యుంటుంది. వాడు నా దగ్గర అబద్ధం చెప్పడు. అపుడు నాకు–

"ఏమిటి? ఆడా, మగా కలవటం ఓ సామాన్య విషయం అయిపోయిందా?? ఆ అమ్మాయి అమాయక ముఖం కళ్ళముందు మెదిలింది. ఎంత అమాయకంగా, ఎంత ముగ్ధంగా ఉంది!? అదంతా నటనేనా? ఎంతో ఎత్తునుంచి క్రింద పడినట్లయింది నాకు.

స్త్రీ అంటే నాకు చాలా గౌరవం! స్త్రీ గురించి నాకు కొన్ని నిర్దిష్ట భావాలున్నాయి. ఒక కవి సినిమా పాటలో స్త్రీ గొప్పతనం గురించి వివరించి చివరలో "సృష్టించెను ఆ దేవుడు తనకు మారుగా!" అని వ్రాశాడు. ఎంత మంచి భావమూ, ఎంత గొప్ప భావమూ ఉన్నాయి ఆ చిన్న వాక్యంలో. ఆ వాక్యాన్ని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను.

"మరి! ఇప్పుడేమిటి? ఇలా?"

ఒక యువకుడితో 15 రోజుల పరిచయంతో ఎలా ఏకం అయ్యింది పెళ్ళికాకుండా?

తల తిరిగిపోతోంది. పెళ్ళి గురించి, స్త్రీ పురుషుల కలయిక గురించి, చిన్నప్పటి నుంచి ఏవేవో పవిత్రమైన సున్నితమైన భావాలు పెంచుకుంటూ వచ్చాను.

నా ఆలోచన్లను, ఆశ్చర్యాన్ని ఆపి, "ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటావా?" అని అడిగాను.

"వ్వాట్ డుయుమీన్??" కోపంగా అన్నాడు శంకర్.

వాడు ఏ ఉద్దేశ్యంతో అన్నాడో అర్థం కాలేదు: పెళ్ళి చేసుకుంటానన్న భావంతోనా? ఆమెను ఎందుకు చేసుకోవాలన్న భావంతోనా? అనుమానంగా అడిగాను.

"అయితే! ఎపుడు పెళ్ళి? మీ ఇంట్లో ఒప్పుకుంటారా?"

శంకర్ ఆశ్చర్యంగా జాలిగా నా వైపు చూసి,

"ఫూలిష్‌గా మాట్లాడకురా! ఆ అమ్మాయిని నేను చేసుకోవట మేమిటి? నా అంతస్థు ఎక్కడ? ఆమె అంతస్థు ఎక్కడ? అయినా పది రోజుల పరిచయంతో మీద చేయి వేస్తే లొంగిపోయిన ఆ కాముకురాలిని చేసుకోవాలా?"

"చెయ్యి వేస్తే లొంగిపోయిన ఆమె కాముకురాలు, చెయ్యి వేసిన నువ్వు పవిత్రుడివా? శీలవంతుడివా??" వ్యంగ్యంగా, కోపంగా అడిగాను.

"నే నెవర్నీ కాదు, మగాడ్ని!" గర్వంగా అన్నాడు శంకర్.

అపుడు నాకు శంకర్ ముఖంలో సాధు జంతువులను చంపి భక్షించే క్రూర జంతువు కనిపించింది. సీతను చెరపట్టిన లంకేశ్వరుని అవతారం కనిపించింది. ఆడవారిని నమ్మించి, మోసం చేసే మగవాడి అహంకారం కనిపించింది.

నాకు ఒక్కసారి అసహ్యం వేసింది! శంకర్ మీదే కాదు. మొత్తం మగజాతి మీద!

వయస్సు వచ్చిన కూతుర్లను ఇంట్లో పెట్టుకుని రోడ్డు మీద కనపడిన అమ్మాయిల్ని, ఆశగా, కాంక్షగా, ఆకలిగా చూసే కాముకులు!

ఆడపిల్లల్ని ఘోరంగా ఏడిపిస్తూ శాడిస్టిక్ ఆనందాన్ని అనుభవిస్తున్న యువకులు! ఒకసారి అదే స్థానంలో వాళ్ళ చెల్లెల్ని, అక్కల్ని వూహించుకొంటే ఇలా చేయగలరా? చేస్తారేమో! ఇలాగే చేస్తారు. ఇప్పుడు అన్నా చెల్లెళ్ళ పవిత్ర బంధానికే కళంకం తెచ్చే అపర కాముకుల గాథలు తెలుస్తూనే వున్నాయి కదా?!

"ఏమిటి ఇది? ఎందుకిలా జరుగుతోంది?? మన సమాజం ఎటువైపు పయనిస్తోంది? ఇదంతా నాగరికతా?? నాగరికత పెరిగే కొద్దీ, నైతిక విలువలు పూర్తిగా పతనమవుతున్నాయి ఎందుకు?"

"నైతిక పతనం నాగరికతకు చిహ్నమా?"

"ఈ పురుష జాత్యహంకారం ఎపుడు నశిస్తుంది?"

తొమ్మిది నెలలు మోసి, ప్రసవ వేదనను ఆనందంగా అనుభవించి, జన్మనిచ్చి, తన రక్తాన్ని పాలుగా మార్చి ఇచ్చి పెంచే స్త్రీ జాతిని ఎంత ఆదరంగా చూస్తోందీ పురుష జాతి!

ఎంతటి కృతఘ్నులు ఈ పురుషులు!

ఇంక ఆలోచించ లేక మొద్దుబారి పోయింది నా మనస్సు!

●

ఏక్తా షరతులు



దేవానంద్ చిత్రం అవ్వల్ నంబర్ ఫేమ్ ఏక్తా తన నిర్మాతలు ఏం చేయాలో, ఏం చేయకూడదో ఒక చేంతాడంత లిస్ట్ రాసిచ్చిందట. అందులో తన రెమ్యూనరేషన్ చిత్ర నిర్మాణపు ఖర్చులో 10% తెల్ల డబ్బు యివ్వాలట. ఇహ నల్ల డబ్బు నిష్పత్తి ఆయా పరిస్థితులనుబట్టి మారుతుంటుందట. ఇలాంటివే ఎన్నో డిమాండ్లు చేసిందట. ఈమెను అసలు మొదట పరిచయం చేసిన సనిల్‌ఖోస్లాయే తన చిత్రంలో ఆమెను అర్ధ నగ్నంగా ఇంచుమించు నగ్నంగా ఎంతవరకు చూపాలో అంతవరకు చూపించాడట. ఇంక చూపవలసింది ఏమీ లేదంటున్నారు. అట్లాంటపుడు ఈమె డిమాండ్లకు ఎంతవరకు విలువ వుంటుందో!

సీరియల్

వజ్రసంకల్పం

శాతవాహన

(గత సంచిక తరువాయి)

పింకీ మహాశ్చర్యంతో కళ్ళప్పగించి అతనికేసి అలాగే చూస్తూ వుండిపోయింది. ఆమె పెదవులు అప్రయత్నంగా కదిలాయి.

"శ.....క్తి.....ధ......ర్......!"

అతను మాట్లాడలేదు. ఒకసారి గంభీరంగా ఆమె మొహంలోకి చూసి నెమ్మదిగా ఆమె ఎదురుగా కూర్చున్నాడు. వెన్నెల వెలుగులో అతని దేహం బంగారు కాంతితో మిలమిలా మెరిసిపోతోంది. పింకీ చప్పున లేచికూర్చొని అతని మొహంలోకి నమ్మశక్యం కానట్టుగా చూస్తోంది. తన ఎదురుగా కూర్చుని గంభీరంగా తన కళ్ళలోకి గుచ్చి గుచ్చి చూస్తున్న ఈ విచిత్ర వ్యక్తి శక్తిధరేనంటే ఆమెకింకా నమ్మకం కుదరడం లేదు. తను మెలకువలో లేదు. ఏదో స్వప్నంలో వున్నట్టుంది. కొద్ది క్షణాలు అతనికేసి అలాగే చూస్తూ వుండిపోయి అమాంతం అతని మెడకు అల్లుకుపోయింది. కొద్ది క్షణాలు ఆమె నోటి వెంట మాట రాలేదు. అతను ఎంత మాత్రమూ కదల్లేదు. ఆమె తన చుట్టూ అల్లుకున్న స్పర్శ అతనిలో ఎలాంటి అనుభూతి కలిగిస్తోందో తెలీదు. ఎలాంటి భావోద్రేకం ప్రదర్శించకుండా అలాగే బండరాయిలా కూర్చున్నాడు.

"శక్తిధర్! శక్తిధర్! ఇది నిజమేనా!" అస్పష్టంగా అతని చెవుల్లో గొణిగిందామె.

అతను నెమ్మదిగా ఆమెను తన నుంచి వేరు చేసి కొద్దిగా వెనక్కి జరిగాడు. కొద్ది క్షణాలు ఇద్దరూ ఒకరి కళ్ళలోకి ఒకరు నిశ్చలంగా చూస్తుండిపోయారు. ఆమె నెమ్మదిగా అతని భుజం మీద చెయ్యి వేసింది.

"చెప్పు శక్తిధర్! ఇది..., ఇది నిజమేనా? లేక నేను కలగంటున్నానా? నువ్వు....నువ్వసలు శక్తిధర్‌వేనా?"

అతను నెమ్మదిగా తలూపేడు.

ఆమె మొహంలోంచి విస్మయం తొలగిపోలేదు.

"కానీ...., కానీ ఇదెలా సాధ్యం? నాగరిక ప్రపంచంలో అధునాతనంగా జీవిస్తున్న ఆ శక్తిధర్ ఎక్కడ, ఈ బండరాళ్ళ మధ్య బండరాయిలా కనిపిస్తున్న నువ్వెక్కడ? ఇది కలా నిజమా?"

అతను కొద్ది క్షణాలు మౌనంగా వుండిపోయి నెమ్మదిగా అన్నాడు.

"ఆ మాటే నేనూ అడుగుతున్నాను. ఇది కలా నిజమా? హైదరాబాద్‌లో నాకు కనిపించిన అపురూపమైన అమ్మాయి ఈ మారుమూల అడవుల్లో, కొండల్లో వజ్రపాణి వెంట కనిపించడం ఎలా సాధ్యమైంది? చెప్పు-ఇది కలా నిజమా?"

అతని ప్రశ్నకు ఆమె చప్పున సమాధానం చెప్పలేకపోయింది.

"నీ ప్రశ్నకు సమాధానం తర్వాత చెబుతాను. ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పు" అంది.

అతను ఆమె మొహం మీద నుంచి కళ్ళు తిప్పుకుని ఆకాశంలో చల్లగా వెలుగుతున్న చందమామ వైపు చూస్తూ వుండిపోయాడు. ఆమె మాత్రం అతని మొహం మీద నుంచి చూపులు తిప్పుకోలేదు. అతనికేసి అలాగే సూటిగా చూస్తూ వుండిపోయింది. కొద్దిసేపు అతనలా చందమామకేసి చూస్తుండిపోయాక ఏదో నిర్ణయించుకున్న వాడిలా మళ్ళీ ఆమెకేసి కళ్ళుతిప్పాడు.

"ఆ ప్రశ్నకు సమాధానం తెలుసుకుని నువ్వేం చేస్తావు పింకీ? దానికి సమాధానం తెలుసుకోకపోవడమే మంచిది. తెలుసుకుంటే తీవ్రంగా నిరాశపాలౌతావు. మనదారులు కలుసుకునేవి కావని తెలిసి బాధపడేకంటే అసలేమీ తెలుసుకోకుండా తిరిగి వెళ్ళిపోవడమే మంచిది" అన్నాడు.

"అయితే నువ్విక్కడెందుకున్నావో చెప్పవా?"

అతను తల అడ్డంగా వూపాడు.

"ఆ మాటే నేనూ అంటే?" అందామె.

"నీకిష్టం లేకపోతే వివరాలు చెప్పమని బలవంతపెట్టను. కానీ, ఒక్కటి మాత్రం చెప్పగలను. దయచేసి ఇక్కడ్నించి వెళ్ళిపో. ఇది నాగులు తిరిగే కోన. ఆ వజ్రపాణి నిన్నెందుకు రప్పించుకున్నాడో, ఎలా రప్పించుకోగలిగాడో నాకు తెలీదు. అతడొక తాచుపాము. చాలా ప్రమాదకరమైన వ్యక్తి. అతనితో స్నేహం చెయ్యడం నిప్పుల మీద నడవడం లాంటిది. ఏ క్షణంలో నిన్ను నిలువునా దహించి వేస్తాడో తెలీదు. వెళ్ళిపో పింకీ, దయచేసి ఇక్కడికెలా వచ్చావో అలాగే తిరిగి వెళ్ళిపో."

ఆమె మొట్ట మొదటిసారిగా నవ్వింది. అతను నిజంగా శక్తిధరేనన్న నమ్మకం అప్పుడప్పుడే కలుగుతోందామెకు. ఆ వూహే ఎంతో హాయిగా చల్లగా వుంది. అంతవరకూ ఆమె కోల్పోయిన ఆత్మసంయమనం తిరిగి కలగజేస్తోంది. నెమ్మదిగా ఆమె తిరిగి మామూలు పింకీగా మారిపోతోంది. ఆమె మెదడు ఎప్పటిలాగే చురుగ్గా ఆలోచించగలుగుతోంది.

"వజ్రపాణి ఎలాంటివాడో ఏమీ తెలియకుండానే అతని స్థావరంలో అడుగుపెట్టానంటావా? తెలుసు-వజ్రపాణి పులి. మామూలు పులికాదు-మేనీటర్! వజ్రాల కోసం ఎంత దుర్మార్గానికైనా ఒడిగట్టే ప్రమాదకరమైన మనిషి. తెలిసే వచ్చాను" అంది.

శక్తిధర్ ఆశ్చర్యంగా చూశాడు.

ఆమె క్షణంలో ఒక నిర్ణయానికొచ్చేసింది.

"ఆల్‌రైట్! నీ నుంచి ఏదీ దాచను. అంతా చెప్పేస్తాను" అతని చేతి మీద చెయ్యివేసి మృదువుగా నొక్కుతూ అంది. "కానీ ఒక్కషరతు. నువ్విక్కడెందుకున్నావో చెప్పాలి. వజ్రపాణి గురించి నీకెలా తెలుసో చెప్పాలి. ఈ విచిత్రమైన రూపం ఏమిటో,

ఇంతవరకూ సాగినకథ -: 34 విశ్వధరవర్మకు తండ్రి అనంతరం మిగిలిన బీడుభూమిలో దొరికిన అపురూప వజ్రాన్ని అతని దాయాది అయిన వజ్రపాణి చేజిక్కించుకుంటాడు. మణిపురం కొండల్లో వున్న వజ్రపాణి హవేలీలోకి యువరాణి జ్యోతిర్మయీదేవిగా ప్రవేశించిన పింకీ అతిథి మర్యాదలు పొందుతుంటుంది. వజ్రపాణి ఆతిథ్యంలో వున్న పింకీని పులిరాజుగా పిలువబడే శక్తిధర్ అడవుల్లోకి అపహరించుకుపోతాడు.

క్యూబిక్ జిర్కోనియా అధిపతిగా కనిపించి అంతలోకే ఈ కొండల మధ్య ఎలా ప్రత్యక్షమయ్యావో అంతా వివరించాలి. ఓకే?"



అతను మాట్లాడలేదు.

"చెప్పు శక్తిధర్! నువ్విక్కడెందుకున్నావు? ఈ అడివికీ నీకూ ఏమిటి సంబంధం?"

"చెట్టుకూ పండుకూ వున్న సంబంధం"

ఆ మాట అన్నది శక్తిధర్ కాదు. ఆ ఇద్దరూ ఒకేసారి అదిరిపడి ఆ మాట వినిపించిన వైపు చూశారు. ఎదురుగా ఒక వృద్ధుడు నిలబడి వున్నాడు. అతన్ని చూస్తూనే శక్తిధర్ మొహం మరింత గంభీరంగా మారిపోయింది. పింకీ ఆ వృద్ధుడి మొహంలోకి ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది. విశ్వధరవర్మ ఒకడుగు ముందుకేసి ఆ బండరాయి మీద ధ్వజస్తంభంలా నిలబడ్డాడు. ఆయన కళ్లు పింకీ కళ్లలోకి సూటిగా చూశాయి. ఆ కళ్లలో వున్న అపూర్వమైన శక్తికి పింకీ అబ్బురపడింది.

"పువ్వుకూ రెమ్మకూ వున్న సంబంధం" మళ్ళీ అన్నాడాయన. "వేరుకూ వృక్షానికీ వున్న సంబంధం. తల్లికీ బిడ్డకూ వున్న సంబంధం. ఈ అడివి ఇతని తల్లి. నువ్వు నాగరిక ప్రపంచంలో చూసింది ఇతడి నీడని. ఇదే ఇతడి అసలు స్వరూపం. తృప్తి కలిగిందా? ఇక వచ్చిన దారినే వెళ్లవచ్చు" ఆయన గొంతు కర్కశంగా ధ్వనించింది.

శక్తిధర్ చప్పున లేచినిలబడ్డాడు.

"బాబా !"

"హుష్! నేన్నీతో మాట్లాడ్డం లేదు. ఆ అమ్మాయితో మాట్లాడుతున్నాను. ఆమె ఎవరో, నిన్ను వెతుక్కుంటూ ఈ అడివికి ఎందుకొచ్చిందో నాకు బాగా తెలుసు. నిన్ను నాకు కాకుండా చెయ్యడంకోసం ఒక త్రిమూర్తి పన్నిన పథకంలోని భాగమే ఈ అమ్మాయి. శాంతివచనాలు వల్లించి మనసు మార్చి నిన్ను కర్తవ్యం నుంచి మళ్లించడానికి వచ్చిన మంత్రగత్తె."

ఆ మాట వింటూనే పింకీ చివాల్న లేచినిలబడింది. కోపంతో ఆమె మొహం

పాఠకులే సెక్స్ కథలు కావాలంటున్నారా?

సున్నితంగా వుండాలి

పొగ త్రాగితే క్యాన్సర్ వస్తుందంటే ఎవరు పొగత్రాగకుండా ఉంటున్నారు. మత్తుపానీయాలు త్రాగితే ఆయమ తగ్గుతుందంటారు. ఎవరైనా త్రాగకుండా ఉంటున్నారా!



అలాగే సెక్స్ అనేది పత్రికలలో, చదివితే యువత తప్పుదోవ పడుతుందని అది నిషేధింపబడుతుందా పాఠకులు చదవకుండా ఉంటున్నారా? కూరలో ఉప్పు లేకుండా తినటం ఎంత కష్టమో, పత్రికలో శృంగారం లేకుండా చదవటం అంతకష్టం. రచయితలు చక్కటి సున్నితమైన శృంగారపరమైన సన్నివేశాలు మాత్రమే వాడాలి. అలా కాకుండా ఎక్కడబడితే అక్కడ శృంగారాన్ని యిరికించేయటం పొరపాటు. కేవలం సెక్స్ కథలు లేకుండా నడిచే పత్రికలు కూడ నేటికి ఉన్నాయి. ఈ సెక్స్ అనేది ఆహ్లాదకరంగా ఉండాలే తప్ప యువతను తప్పుత్రోవ పట్టించేదిగా ఉండ కూడదని నా అభిప్రాయం.

కొనకండ్ల స్వామిబాబు (ఖమ్మం)

ఎర్రబడిపోయింది.

"క్షమించండి. ఆమాట చెప్పి నన్నిలా అవమానించడానికి మీకు అధికారంలేదు. శక్తిధర్ని వెతుక్కుంటూ నేనీ అడవికి రాలేదు." తీవ్రంగా అంది.

విశ్వధరవర్మ పరిహాసంగా చూశాడు.

"నిజంగా?"

పింకీ మొహం మరింతగా ఎర్రబడిపోయింది.

"మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. నేను శక్తిధర్ కోసం వెతుక్కుంటూ ఇక్కడికి రాలేదు. శక్తిధర్ ఇక్కడ ఇలాంటి విచిత్ర పరిస్థితుల్లో కనిపిస్తాడని నేను ఊహించనుకూడా లేదు."

"అలాగా! అయితే నిన్ను కౌసల్య పంపనే లేదన్న మాట!" వ్యంగ్యంగా అన్నాడాయన.

పింకీ ఆ మాట వింటూనే నిశ్చేష్టురాలైంది.

"ఏం, ఎలా తెలుసుకోగలిగానా అని ఆశ్చర్యపోతున్నావా? నువ్వెవరివో నీ పుట్టుపూర్వోత్తరాలేమిటో నాకు బాగా తెలుసు. హైదరాబాద్‌లో నువ్వు శక్తిని కలుసుకున్నప్పుడే నీ గురించి ఆరా తీశాను. ఇక్కడ నిన్ను చూడగానే నా అనుమానం బలపడింది." అంటూ ఆయన శక్తిధర్ వైపు తిరిగాడు. "శక్తీ! ఈ మంత్రగత్తెను నువ్వు నమ్మవద్దు. నమ్మావా, కర్తవ్యమూఢుడివై భ్రష్టుడివై పోతావు."అన్నాడు.

"అబద్ధం. మీరు చెబుతున్నదంతా అబద్ధం," అరిచింది పింకీ.

విశ్వధరవర్మ ఆమె కళ్లల్లోకి తీవ్రంగా చూశాడు.

"నేను చెప్పింది అబద్ధమైతే మరి నిజమేమిటి? నువ్విక్కడికెందు కొచ్చావు?"

"చెప్పను. మీకు చెప్పాల్సిన అవసరం నాకు లేదు."

"విశ్వధరవర్మ విజయగర్వంతో చూశాడు."

"నీ నోటితో నువ్వే నేనన్నమాట బలపరిచావు. నువ్వు శక్తికోసమే రాకపోతే మరిక్కడికెందుకొచ్చావో చెప్పడానికి భయమెందుకు? అమ్మాయ్, ఇదే నిన్ను హెచ్చరిస్తున్నాను. నువ్వు వెంటనే తిరిగి వెళ్లకపోతే...."

"వెళ్లకపోతే?"

"వెళ్లకపోతే తీవ్రమైన పరిణామాలు సంభవిస్తాయి."

"బెదిరిస్తున్నారా?"

"హెచ్చరిస్తున్నాను."

"అయితే నేనూ మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. అనవసరంగా నన్ను రెచ్చగొడితే ఆ తర్వాత తీవ్రమైన పరిణామాలు సంభవిస్తాయి. శక్తి నావాడు, అతన్ని సాధించి తీర్తాను." సవాలు చేసిందామె.

విశ్వధరవర్మ కళ్లల్లో నిప్పులు కురిశాయి.

"వీల్లేదు. ఏళ్లతరబడి నేను అహర్నిశలూ నిద్రాహారాలు మాని తయారుచేసిన ఈ మహాశక్తి ఒక ఆడపిల్ల మూలంగా నిర్వీర్యంకావడం నేను జరగనివ్వను," గర్జించాడు. "శక్తీ! నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను. పైకి ఎంతో అందంగా కనిపిస్తున్న ఈ పాశవిక బంధాన్ని తెంచుకుని నా వెంటరా! ఇప్పుడే ఈ క్షణంలోనే!"

"బాబా!"

"నేను మరో మాట వినదల్చుకోలేదు. వస్తావా రావా?"

"క్షమించండి బాబా! మీ మాటకు నేనెప్పుడూ ఎదురు చెప్పలేదు. కానీ, ఈమె ప్రాణాలు రక్షించి నేనిక్కడికి తెచ్చాను. ఈ ప్రమాదకరమైన స్థలంలో ఒక ఆడపిల్లను ఒంటరిగా విడిచిపెట్టి మీవెంట రాలేను."

"మూర్ఖుడా! నువ్వీమె ప్రాణాలు రక్షించడం కాదు - అదంతా తెలివిగా ఆలోచించి తయారుచేసిన ఒక పథకంలోని భాగమని అర్థం చేసుకోలేకపోతున్నావు. తక్షణం నా ఆజ్ఞ పాటించు. లేదా...."

"మీరు ఆవేశంలో వున్నారు."

"నేను ఆవేశంలో వుండడం కాదు, నువ్వు భ్రాంతిలో వున్నావు. నిజానికీ అబద్ధానికీ తేడా తెలుసుకోలేని అంధుడివైపోయావు. ఇక మాటలు అనవసరం. ఈమెనిక్కడే విడిచిపెట్టి నావెంట వస్తావా రావా?"

శక్తిధర్ సమాధానం చెప్పలేదు.

విశ్వధరవర్మ ఆవేశంతో వూగిపోతూ గట్టిగా చప్పట్లు చరిచాడు. వెంటనే కొండ రాళ్ల చాటునుండి ఇద్దరు వ్యక్తులు అక్కడ ప్రత్యక్షమయ్యారు. వాళ్లిద్దరి చేతుల్లోనూ పొడవాటి ఖడ్గాలున్నాయి. వాళ్లిద్దరూ విశ్వధరవర్మ తన రక్షణకోసం ఏర్పాటు చేసుకున్న మనుషులు. విశ్వధరవర్మ వాళ్ల చేతుల్లోంచి ఆ ఖడ్గాలు లాక్కుని ఒక ఖడ్గం శక్తిధర్‌కేసి విసిరేశాడు.

"ఒకప్పుడు ఈ చెయ్యి కత్తి తిప్పడంలో ఆరితేరింది. నాకు తెలిసిన విద్య నీకూ నేర్పించాను. నా బొందిలో ప్రాణం వుండగా నిన్నీ భ్రమకు లొంగిపోనివ్వలేను. ఏళ్లతరబడి ఒక్కొక్క ఇటుకే పేర్చి నేను నిర్మించుకొన్న ఆశాసౌధం కూలిపోతుండగా చూసి భరించలేను. రా, నాతో యుద్ధం చెయ్యి. నీకు చేతనైతే నన్నోడించి ఈ మాయావి వెంట వెళ్లు. నీ చేతుల్లో నేను ఓడిపోతే నా సంకల్పం గురించి పూర్తిగా మర్చిపోతాను."

"బాబా!"

"ఇక నీ నోటివెంట ఒక్కమాట కూడా నేను వినదల్చుకోలేదు. రా, యుద్ధం చెయ్యి. ఈ చేతుల్తో నిన్ను మహాశక్తిగా రూపొందించాను. ఈ మహాశక్తి నిర్మాతగా విజయం నన్నే వరిస్తుందో ఆ మహాశక్తికే స్వంతమౌ

ఋందో చూద్దాం. రా!"

"బాబా!"

"శక్తీ! ఇది నా ఆజ్ఞ! కనీసం ఈ ఆజ్ఞ అయినా పాటించు."

శక్తిధర్ పిడికిళ్లు బిగుసుకున్నాయి.

"సరే! మీ ఆజ్ఞ, పాటించడం కోస మైనా మీతో యుద్ధం చేస్తాను. కానీ, నేను మీకు విరోధినికానని గుర్తిస్తే సంతోషిస్తాను." అంటూ నేలమీద పడున్న కత్తి చేతిలోకి తీసుకున్నాడు.

ఆ మరుక్షణం విశ్వధరవర్మ ఛార్జ్‌చేస్తూ వేగంగా అతనివైపు దూసుకొచ్చాడు. తన చేతిలోని ఖడ్గం గాల్లో గిరగిరా తిప్పుతూ శక్తి ధర్ మీద విరుచుకుపడ్డాడు. ఆయన ప్రహారం నుంచి శక్తిధర్ ఒడుపుగా తప్పించుకుంటూ తన చేతిలోని కత్తిని ఆయన మీద ఝుళిపించాడు. మరుక్షణం ఖణేల్మన్న శబ్దంతో ఇద్దరి కత్తులూ కలుసుకున్నాయి.

అనుకోని ఈ పరిణామానికి పింకీ నివ్వెరపోయి చూస్తోంది. ఆ ఇద్దరి మధ్యా తలెత్తిన యుద్ధాన్ని ప్రకృతి మొత్తం నిర్ఘాంతపోయి వీక్షిస్తోంది. క్షణాలు గడిచిపోతున్నాయి. ఇద్దరి కత్తులూ కళ్లకు కనిపించనంత వేగంగా విజృంభిస్తున్నాయి. కొద్ది క్షణాల్లోనే శక్తిధర్ చేతిలోని కత్తి ఎగిరి అవతల పడింది. శక్తి ధర్ కొండచరియ విరిగిపడినట్టు నేలమీద పడిపోయాడు.

విశ్వధరవర్మ చేతిలోని కత్తి పైకి లేచింది.

ఒక్క క్షణం ఆలస్యమైవుంటే ఏం జరిగి వుండేదో తెలీదు. విశ్వధరవర్మ శక్తిధర్ మీదికి కత్తి పైకెత్తుతూనే పింకీ వెర్రిగా ఒక్క కేకపెట్టి పరిగెత్తుకుంటూ శక్తిధర్‌మీద అడ్డంగా వాలిపోయింది. విశ్వధరవర్మ ఆగిపోయి నెమ్మదిగా కత్తి కిందికి దించాడు. క్రోధంతో పింకీని పక్కకు లాగేసి శక్తిధర్ జబ్బపట్టి పైకి లేవదీశాడు.

"శక్తీ! నా చేతుల్లో నువ్వోడిపోయావు. ఇక ఈ భ్రమలన్నీ విడిచిపెట్టి నా వెంటరా!" ఆజ్ఞాపించాడు.

"ఆగండి. శక్తి ఓడిపోవడమంటూ జరగదు. ఇదన్యాయం. అతను కావాలని మీ చేతుల్లో ఓడిపోయాడు." అరిచింది పింకీ.

విశ్వధరవర్మ చప్పున శక్తిధర్ కళ్లలోకి చూశాడు. ఆయన కళ్లల్లో "ఆమె చెప్పింది నిజమేనా?" అన్న ప్రశ్న స్పష్టంగా కనిపిస్తోంది. శక్తిధర్ తలవంచుకున్నాడు.

"నా చేతుల్లో మీరు ఓడిపోవడం మీకే కాదు, నాకూ అవమానమే బాబా!" నెమ్మదిగా అన్నాడు.

విశ్వధరవర్మ తన చేతిలోని కత్తి నేలకేసి విసిరికొట్టాడు.

"నే నంటే నీకంత ప్రేమే వుంటే,

అంత గౌరవమే వుంటే, అంత వినయమే వుంటే ముందే నా ఆజ్ఞ ఎందుకు పాటించలేదు? ఎందుకు నాకు ఎదురు తిరిగావు?"

"క్షమించండి బాబా! నేను మీకు ఎదురు తిరగలేదు. మీ ఆజ్ఞ పాటించడమే నేను చేశాను. కర్తవ్యపాలన ప్రాణం కంటే ముఖ్యమని మీరే నాకు నేర్పారు." అన్నాడు శక్తిధర్.

"ఓహో అలాగా! ఏమిటా కర్తవ్య పాలన?"

"ఒకసారి ప్రాణాలు కాపాడిన అమ్మాయిని ప్రమాదానికిగురిచేసి ఒంటరిగా విడిచిపెట్టి వెళ్లడం కర్తవ్యం అనిపించుకోదు."

విశ్వధరవర్మ పిడికిళ్లు బిగించాడు.

"కర్తవ్యపాలన! అసలు కర్తవ్యపాలన అంటే ఏమిటో తెలుసా నీకు? ఏ కర్తవ్యాన్ని పాలించడానికి నువ్వు పుట్టావో నీకు తెలుసా? తెలీదు. ఇన్నాళ్లూ నీకు నేను చెప్పలేదు. నీకు నేనేమౌతానో నిన్నింత కఠినంగా ఎందుకు పెంచానో ఎప్పుడూ నీకు తెలియజేయలేదు. చెప్పాల్సిన అవసరం ఇప్పుడొచ్చింది."

"అవసరం లేదు బాబా! నాకు తెలుసు." నెమ్మదిగా అన్నాడు శక్తిధర్.

విశ్వధరవర్మ హఠాత్తుగా నిశ్చేష్టుడయ్యాడు.


"నీకు...నీకు నువ్వెవరివో తెలుసా?"

"తెలుసు. మీరు కావాలని నాకు చెప్పకపోయినా తెలుసు. మీ కథ కూడా తెలుసు. ఈరోజు వజ్రపాణి అనుభవిస్తున్న వజ్రాల గనులు ఒకప్పుడు మీవి. ఆ ఆస్తి అప్పట్లో బంజరుగా వుండేది. అందులో వ్యవసాయం చేయాలని సంకల్పించుకుని మీరు బావి తవ్విస్తే అందులో సూర్యనేత్రమనే మహా వజ్రం దొరికింది. వజ్రపాణి మీ కుటుంబ సభ్యులందరినీ హతమార్చి ఆ మహా వజ్రాన్నీ, దాంతోపాటే మీ బంజరు భూముల్నీ అక్రమంగా స్వాధీనం చేసుకుని అనుభవిస్తున్నాడు."

మీ చిన్నకుమారుడి మీద హత్యానేరం పడేలా చేసి ఉరికంబం ఎక్కించాడు. మీ చిన్న కుమారుడే నా తండ్రి. వజ్రపాణిని మీ సంతానం చేతుల్లోనే సర్వనాశనం చేస్తానని మీరు శపథం చేశారు. దానికి అనుగుణంగా నన్ను పసితనం నుంచీ రాటుదేల్చి వజ్రకాయుడిగా తయారుచేశారు."

విశ్వధరవర్మ చాలాసేపు మాట్లాడలేకపోయాడు.

"నీకు...నీకిదంతా ఎలా తెలిసింది? ఎలా తెలుసుకోగలిగావు?" చాలాసేపటి తర్వాత విస్మయంతో నెమ్మదిగా అడిగాడాయన.



సమంజసం కాదు

"ఏ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం. నరజాతి సమస్తం పరపీడన పరాయణత్వం" అన్నది శ్రీశ్రీ సూక్తి అయితే.

"ఏ పత్రిక తిరగేసినా ఏమున్నది గర్వకారణం. ప్రతీ పేజీ సెక్స్ కథల మయం. అన్నది నేటి సూక్తి.

కథల్లో నేడు సెక్స్ సర్వసాధారణం అయిపోయింది. కథకిగాని, సీరియల్‌కిగాని అవసరం ఉన్నా లేకపోయినా కేవలం వ్యాపార ధోరణిలో, పాఠకులను ఆకర్షించటానికి రచయితలు వాడే సాధనం సెక్స్ వర్ణనలు.

"ఆమె బట్టలన్నీ ఊడదీసింది. ఆమె వక్షోజాలు




ఉబ్బెత్తుగా ఉంది నరాలు జివ్వుమనిపించేలా ఉన్నాయి" లాంటి వర్ణనలు ఎందుకు పనికిరావు సరికదా! చదివే పాఠకుడిలో కామోద్రేకాన్ని కల్గించి అతన్ని పశువుని చేస్తాయి.

గతంలో ఎంతోమంది సెక్స్ కథలను ప్రచురించవద్దని చెప్పినా అలాంటి కథలు వస్తూనే ఉన్నాయి. కారణం. పాఠకుడిలో "వీక్‌నెస్." పాఠకులు రాయమంటున్నారు. మేము రాస్తున్నాం అనే రచయితల బిజినెస్.ఎవరో కొందరు తప్ప అందరు పాఠకులు సెక్సు కథలను అనుమతించరు.

ఇలాంటి కథలు పత్రికల్లో ప్రచురించడం వల్ల ఇటు పాఠకులకి, అటు సమాజానికి కూడా ఎంతో నష్టం.

పాఠకులు సెక్స్ కథలు మాత్రమే చదువుతారు అనడం సమంజసం కాదు. వారు అన్ని రకాల కథలు చదువుతారు.

టి. యస్. కృష్ణమోహన్ (అనకాపల్లి)



కేవలం ఆరోపణ

పాఠకులు అంతా సెక్స్ కథలు తప్ప యింకేమీ చదవరు అనేది కొందరి విషయంలో నిజం కావచ్చునుగాని అందరూ అవితప్ప యింకేమీ చద వరు అనడం సబుబుగాలేదు. అలాగని అన్ని పత్రికలు అలా ప్రచురించడంలేదు. కొన్ని పత్రికలు కేవలం సెక్సు విషయాలను, నగ్నమయిన బొమ్మలు, కథలు ప్రచురించడం వలన యువ పాఠకులు వాటిని చదివి పెడత్రోవ త్రొక్కుతున్నారు.



అందువలన ఎక్కువగా పత్రికల్లో అశ్లీల సాహిత్యాన్ని, సెక్సుకథలు ప్రచురించడం, ప్రోత్సహించడం మంచిదికాదు. అశ్లీల సాహిత్యం, సెక్సు గుప్పించకుండా వుండి, మంచి కథలు సీరియల్, శీర్షికలతో వున్న పత్రికను కూడ పాఠకులు ఎంతగానో ఆదరిస్తున్నారు. పత్రికాధిపతులు కూడ ఇటువంటి రచనలు, అశ్లీల కథలు, శృంగార రచనలు ప్రోత్సహించడం మంచిదికాదు. పాఠకుల నందరిని ఒకే త్రాటిపై కట్టి వేయడం మంచిదిగాదు. మంచి కథలకు పాఠకుల హృదయాల్లో ఎప్పుడూ శాశ్వత స్థానం వుంటుంది కాబట్టి కేవలం సెక్సు కథలు తప్ప ఇంకేమీ చదవరు అనడం అర్థంలేని ఆరోపణ అని నా అభిప్రాయం.

అర్వా నాగయ్యనాయుడు (నెల్లూరు)

వజ్రసంకల్పం

"మీరు వజ్రపాణితో ఢీకొనే శక్తిగా నన్ను తయారుచేశారు. నేను అమాత్రం గ్రహిం చలేకపోయినప్పుడు మీ ప్రయత్నమంతా వృధా అయినట్టేగా బాబా!"

విశ్వధరవర్మ అస్పష్టంగా తలూపేడు. ఆయనింకా ఆశ్చర్యంలోంచి తేరుకోలేదని ఆయన కళ్లు చెబుతున్నాయి.

"అయితే...అయితే అంతా తెలిసికూడా, మన కుటుంబం ఆ వజ్రపాణి చేతుల్లో ఎంత దారుణంగా అంతమైపోయిందో తెలిసికూడా, నే ననుభవించిన క్షోభ విన్నాక మహాశక్తిగా తయారు చేయడంలో నేనుపడ్డ తపన తెలిసి కూడా నువ్వు నాకు ఎదురుతిరిగావా?"

"క్షమించండి. నేను ఎదురు తిరగలేదని ముందే చెప్పాను."

విశ్వధరవర్మ మొహం మళ్లీ గంభీరంగా మారిపోయింది.

"సరే! ఇన్ని తెలివితేటలు ప్రదర్శించగ లిగినవాడివి ఈ అమ్మాయి నిన్ను కర్తవ్యం నుంచి మళ్లించడానికి చేసిన ప్రయత్నం మాత్రం అర్థం చేసుకోలేకపోయావన్నమాట. అది నీ తప్పుకాదు. నీ వయసు అలాంటిది. ఈమె ఎవరో నీకు నేను చెబుతాను. నిన్ను పొందగలగడానికి ఎవరి సహాయంతోనైతే నేను నీ తల్లిని జైల్లోవున్న నీ తండ్రి దగ్గరికి పంపగలిగానో ఆ జైలర్ సత్యం కూతురు జ్యోతిర్మయి. పింకీ ఈమె ముద్దుపేరు. నీ తల్లి కౌసల్య సంరక్షణలోనే పెరిగింది. ప్రారం భంలో కౌసల్య కూడా నాలాగే వజ్రపాణిమీద ప్రతికార దాహంతో తపించిపోయింది. కానీ కాలం గడిచేకొద్దీ ఆమె ప్రతికారజ్వాల చల్లారి పోయింది. ఆమెలోని ఉడుకునెత్తురు చప్పబడి పోయింది. ఆమె తన జీవితాదర్శాన్ని మార్చు కుని ఇప్పుడు శాంతివచనాలు వల్లిస్తోంది. ఆ శాంతి వచనాలకు ప్రతి రూపమే ఈ పింకీ. నిన్ను రక్తపాతానికి దూరం చేసి శాంతి కాముకుడిగా మార్చి తన కొడుకుని తాను దక్కించుకోవడానికి కౌసల్య వేసిన పథకం లోని ప్రధాన పాత్రధారి ఈమె. ఇప్పుడు చెప్పు. నిన్ను కర్తవ్యపాలనవైపు నడిపించే ఈ ముసలి తాతే కావాలో, నిన్ను భ్రష్టుడ్ని చేయడా నికొచ్చిన నీ ప్రియురాలే కావాలో నువ్వు ఇప్పుడే నిర్ణయించుకో. ఇద్దరూ కావాలని మాత్రం అనవద్దు. ఒక్క వరలో రెండు కత్తులు ఇమడవని గుర్తుంచుకో!"

శక్తిధర్ ఏదో చెప్పబోతుండగానే పింకీ మధ్యలో అందుకుంది. ఆవేశంతో ఆమె ముక్కుపుటాలు అదురుతున్నాయి.

"ఉపన్యాసం చాలా బాగుంది. మీ గురించి నేను ఇదివరకే విన్నాను. వజ్రపాణి స్వయంగా మీగురించి నాతో చెప్పాడు. మీ గురించి వింటున్నప్పుడు మిమ్మల్ని ఒకసారి కలుసుకోవాలనిపించింది. మీరింత సంకుచి తంగా ఆలోచిస్తారని తెలిస్తే మిమ్మల్ని కలు సుకోడానికి అంత ఆసక్తి చూపివుండేదాన్ని కాదు. మీరు చెప్పిన విషయాన్నిబట్టి శక్తి ధర్ ఎవరో నేను అంటీ అని పిలిచే కౌసల్య ఎవరో బాగా అర్థమైంది. ఆ కౌసల్యకూ మీకూ ఉన్న తేడా కూడా బాగా అర్థ మైంది. ఆమె దివ్యమూర్తి. తనలోని ప్రతికార జ్వాలని విశ్వప్రేమగా మలుచుకోగలి గిన మహావ్యక్తి. మీరో....మీరు సంకుచితులు. పగ, మిమ్మల్ని గుడ్డివాడిగా చేసింది. ఎవరి సహాయంతో మీరు వంశాకురాన్ని పొందగలి గారో ఆమెకే ఆమె కొడుకుని దూరం చేసిన స్వార్థపరులు. ఇప్పుడామె తన కొడుకుని తాను దక్కించుకోవాలనుకుంటే అడ్డుపడు తున్న సంకుచితులు. ఆమె త్యాగమూర్తి. మీరు స్వార్థపూరితులు. ఒక కన్నతల్లి తన కొడుకును దక్కించుకోవాలనుకుంటే అది పథ కంగా మీకు తోచవచ్చు. కానీ, అది కన్నతల్లి ప్రేమ అని నేనంటున్నాను- కాదనగలరా? మీ కన్నబిడ్డల్ని పోగొట్టుకున్నందుకు ఏళ్ల తర బడి మీరిలా తపించిపోతున్నారే - తన కన్న బిడ్డని పోగొట్టుకున్నందుకు - జీవించి ఉండ గానే పోగొట్టుకున్నందుకు - ఆ తల్లి ఎంత తపించిపోతూ ఉండాలి!"

ఆవేశంతో ఆమె ఊపిరి పీల్చుకోకుండా అనేస్తూ వెళ్లిన ఒక్కో మాటా విశ్వధర వర్మ గుండెలోంచి బాణంలా దూసుకెళ్లింది. నిశ్చేష్టుడైపోయి ఆమెకేసి చూస్తుండిపో యాడు. శక్తిధర్ అంతకన్నా ఆశ్చర్యంగా చూస్తున్నాడు. పింకీ చెప్పడం ఆపలేదు -

"అవును, నేను పథకం మీదే ఇక్క డికొచ్చాను. చాలా పెద్ద పథకం మీద వచ్చాను. అయితే మీరనుకుంటున్నట్టు ఆ పథం శక్తిధర్ని మీకు కాకుండా చేయడానికి కాదు. సరిగ్గా మీరు ఏ ప్రతికారం కోసం సంవత్సరాల తరబడి కృషి చేస్తున్నారో అదే ప్రతికారం తీర్చుకోడానికి నేనిక్కడికొచ్చాను."

విశ్వధరవర్మ వులిక్కిపడ్డాడు.

"అంటే?"

"వజ్రపాణిని సర్వనాశనం చెయ్యడం కోసం నేనిక్కడికొచ్చాను."

ఈసారి విశ్వధరవర్మతోపాటు శక్తిధర్ కూడా కొద్ది క్షణాలు అవాక్కైపోయాడు.

"పింకీ! ఏమిటి నువ్వు చెబుతున్నది?" నమ్మశక్యం కానట్టుగా అడిగాడు.

"అవును శక్తిధర్! సరిగ్గా నువ్వు దేని కోసమైతే శ్రమిస్తున్నావో నేనూ అందుకే శ్రమిస్తున్నాను. మనిద్దరి గమ్యాలూ ఒక్కటే.

బహుశా అందుకే మనిద్దరమూ అనుకోని పరిస్థితుల్లో అలా కలుసుకుని దగ్గరయ్యామేమో!" అంది పింకీ.

శక్తిధర్ విస్మయంగా అలా చూస్తూనే ఉన్నాడు. పింకీ అతని కళ్లలోకి సూటిగా చూసింది.

"నువ్విక్కడెందుకున్నావో నాకిప్పుడు పూర్తిగా అర్థమైపోయింది. ఇక నేనిక్కడికెందుకొచ్చానో చెబుతాను. అంతా వివరంగా చెబుతాను. నేనొక సి.బి.ఐ. ఆఫీసర్ని."

"వాట్?!" అరిచాడు శక్తిధర్.

పింకీ తలూపింది.

"నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. కనీసం మా నాన్నకు కూడా తెలియకుండా నేను సి.బి.ఐ.లో చేరాను. అప్పట్నుంచి అతి రహస్యంగా ఒక మిషన్‌మీద పనిచేస్తున్నాను. ఆ మిషన్ ఏమిటో చెబుతాను - వజ్రపాణిని గురించి తెలుసుకోవడం."

ఆమె ఒక్క క్షణం ఆగింది. తన మొహంలోకి విస్మయంగా చూస్తున్న విశ్వధరవర్మకేసి ఒకసారి పరిహాసంగా చూసి మళ్లీ చెప్పనారంభించింది.

"మా డిపార్ట్‌మెంట్‌కి వజ్రపాణి అనే వ్యక్తి గురించి కొంత రహస్య సమాచారం అందింది. ప్రభుత్వం కళ్లుగప్పి ఈ వజ్రపాణి బిలియన్లకు బిలియన్ల రూపాయలు వజ్రాల రూపంలో కూడబెట్టాడనీ, ఎవరికీ తెలియకుండా వజ్రాల గనులు స్వంతం చేసుకున్నాడనీ తెలిసింది. అయితే ఆ రిపోర్ట్సుకి ఆధారం అంటూ లేదు. వజ్రపాణి వజ్రాల వ్యాపారిగా అందరికీ తెలుసు. అయితే బయటి ప్రపంచానికి ఎంత మాత్రమూ తెలియకుండా పెద్ద వజ్రాల గనులకు అధిపతి కాగలిగాడంటే మా డిపార్ట్‌మెంట్‌కి మొదట నమ్మశక్యం కాలేదు. అందుకే దాన్నో రొటీన్ ఇన్వెస్టిగేషన్‌గా భావించి కొత్తగా డిపార్ట్‌మెంట్లో చేరిన నాకాకేసు అప్పగించారు. వజ్రపాణి వ్యాపారవర్గాల్లోనే కాకుండా ప్రభుత్వంలో కూడా పలుకుబడి వున్న వ్యక్తి కాబట్టి చాలా రహస్యంగా ఇన్వెస్టిగేట్ చెయ్యాల్సి వచ్చింది. అందుకే నేను సి.బి.ఐ.లో చేరినట్టు కనీసం మా ఇంట్లో కూడా తెలియజేయలేదు.

మొదట వజ్రపాణి మీద మాకందిన రిపోర్ట్సుకు ఆధారాలే కనిపించలేదు. అంతలో అత్యంత విషాదకరమైన సంఘటన ఒకటి జరిగింది. ఆ సంఘటనతో వజ్రపాణి నిజస్వరూపం ఏమిటో తెలియడమే కాకుండా అతనెంత ప్రమాదకరమైన వ్యక్తో అర్థమైపోయింది.

నీలిమ నా ప్రాణ స్నేహితురాలు. తల్లీదండ్రులు లేని అనాథ. స్కాలర్‌షిప్స్‌తో చదువుతూ ఎప్పుడూ యూనివర్శిటీ ఫస్ట్ వస్తుండేది. ఒక కోటీశ్వరుడు ఆమెను ప్రేమించాడు. అతని పేరు రవిచంద్ర. చాలా మంచివాడు. అతని పెద్ద వాళ్లకు నీలిమతో అతని పెళ్లి ఇష్టం లేకపోయింది. దాంతో కుటుంబం నుంచి వేరుపడ్డాడు. అతని భాగా ఒక వంద కోట్ల రూపాయల ఆస్తి వచ్చింది. దాంతో పాటే ఒక అమూల్యమైన వజ్రం కూడా అతని భాగానికొచ్చింది. రవిచంద్ర ఆ అమూల్య వజ్రాన్ని తమ పెళ్లి కానుకగా నీలిమకిచ్చాడు. అదే ఆమె దురదృష్టానికి నాంది పలికింది. వజ్రపాణి దృష్టి ఆ వజ్రం మీద పడింది. రవిచంద్రతో స్నేహం చేశాడు. ఒకసారి అవకాశం చూసుకుని సాక్ష్యాధారాలేవీ లేకుండా రవిచంద్రను హత్య చేసి ఆ వజ్రాన్ని వశపర్చుకున్నాడు. అంతేకాదు, నీలిమను చెరిచాడు. రవిచంద్రనెవరు హత్య చేశారో ఎవరికీ తెలీదు-నాకు తప్ప. రవిచంద్ర ప్రాణాలు వదలడానికి కొద్ది క్షణాల ముందు కాకతాళీయంగా నేను నీలిమను చూడ్డానికి వాళ్ల బంగళాకు వెళ్లాను. రవిచంద్ర అక్కడ చావుబ్రతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. అతని పక్కనే నీలిమ స్పృహ తప్పి పడుంది. చనిపోయేముందు రవిచంద్ర అసలేం జరిగిందో నాకు చెప్పి చనిపోయాడు. నీలిమ పిచ్చిదైపోయింది. ఆమెను హాస్పిటల్‌లో చేర్పించి రవిచంద్ర హత్య గురించి మా డిపార్ట్‌మెంట్‌కి తెలియజేశాను. అయితే రవిచంద్రని వజ్రపాణి హత్య చేశాడనడానికి నాదగ్గర ఆధారాలు లేవు. అందుకే రహస్యంగా నా ఇన్వెస్టిగేషన్ కొనసాగించాను."

"దానికో పద్ధతి అనుసరించాను. విలాసాలంటే ఇష్టపడేదానిగా అందర్నీ భ్రమింప చేసి ఇంట్లోంచి పారిపోయాను. సొసైటీలో కేడీ అమ్మాయిగా అవతరించాను. ప్రభు అనే వ్యక్తితో నాకప్పుడే పరిచయం ఏర్పడింది. ప్రభుని జతగా చేసుకుని మోసాలు చెయ్యడం మొదలెట్టాను. ఎప్పటికైనా వజ్రపాణి దృష్టిలో కానీ, అతని గ్యాంగ్ దృష్టిలో కానీ పడకపోనని నా నమ్మకం. నా నమ్మకం వృధా కాలేదు. వజ్రపాణి గ్యాంగ్‌లో ఒక ముఖ్యమైన వ్యక్తి జూడా అనేవాడు నన్ను కలుసుకున్నాడు."

"అయితే నేనూహించినట్టు జూడా వజ్రపాణి తరపున నన్ను కలుసుకోలేదు. నాతో చేతులు కలిపి వజ్రపాణిని డబుల్ క్రాస్ చెయ్యాలనే ఉద్దేశ్యంతో కలుసుకున్నాడు. వజ్రపాణి దగ్గరున్న సూర్యనేత్రం అనే వజ్రాన్ని కాజెయ్యాలని మే మిద్దరం కలిసి ఒక పథకం తయారుచేశాం. ఆ పథకం ప్రకారం జూడా నన్నో మాజీ సంస్థానపు యువరాణిగా వజ్రపాణికి నన్ను పరిచయం చేసాడు. నేనో ఇంటర్నేషనల్ టెర్రరిస్టు ముఠాకి ముఖ్యమైన లింకుగా వజ్రపాణిని నమ్మిస్తాడు. టెర్రరిస్టు ముఠాతో వజ్రపాణికి అవసరమేమిటని ఆశ్చర్యపోనవసరం లేదు. వజ్రపాణి తనకున్న సంపదతో తృప్తి పడలేదు. తన దగ్గరున్న మహా సంపదనుపయోగించి ప్రభుత్వాన్ని పడదోసి తనే నియంతగా మారాలని అతని పథకం. దానికి తగిన విధంగా శత్రు దేశాలతో కొన్ని కాంట్రాక్ట్సు కుదుర్చుకున్నాడు. దేశంలో అల్లకల్లోలం సృష్టించి ప్రభుత్వాన్ని పతనం చేయడానికి శత్రుదేశాలతో యుద్ధం తేవడానికీ టెర్రరిస్టు ముఠాలు అతనికి కావాలి. ప్రొఫెషనల్ టెర్రరిస్టులకు కావలసిన డబ్బు అతని దగ్గరుంది. సృష్టిలో కోట్లాది రూపాయల డబ్బుని అతి సూక్ష్మ రూపంలో దాచుకోగలిగిన మార్గం ఒకటే ఉంది - రూపాయల్ని వజ్రాల రూపంలో మార్చుకోవడం. ఆ వజ్రాలు వజ్రపాణి దగ్గరున్నాయి. అదీ అతని పథకం. ఆ పథకానికి అనుగుణంగా అంతర్జాతీయ టెర్రరిస్టు ముఠాలతో సంబంధం ఉన్నదానిగా జూడా నన్నతనికి పరిచయం చేశాడు. అందుకోసమే నేనిక్కడికి ప్రభుతో సహా వచ్చాను. అనుకోకుండా మిమ్మల్ని కలిశాను" అని ముగించింది పింకీ.

కొద్ది క్షణాలు ఎవరూ మాట్లాడలేదు.

వజ్రపాణి వేస్తున్న పథకం గురించి విని శక్తిధర్ వళ్లు గగుర్పొడిచింది.

(ఇంకా వుంది)



అనిల్ కాలు ఫ్రాక్చర్

అనిల్ కపూర్‌కి యిటీవల ఒక షూటింగ్‌లో కాలు ఫ్రాక్చరయింది. 'హమ్మా' చిత్రంలో ఒకఫైటింగ్ సీన్లో డూప్ లేకుండా చేసి కుడి కాలుకి దెబ్బ తగిలించుకున్నాడట. ప్లాస్టర్లు వేసుకున్న అనిల్ 15 రోజులపాటన్నా విశ్రాంతి తీసుకోవాల్సి వుంటుంది. అనుకోకుండా జరిగిన ఈ ప్రమాదం కారణంగా అనిల్ స్వంత సినిమాలు 'రూప్ కి రాణీ' 'చోరోంకా రాజా' చిత్రాల నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది.

తెలుగు విశ్వవిద్యాలయం

నృత్య సంగీతాలలో ఎమ్.ఏ.

"మామూలు విశ్వవిద్యాలయాలకు భిన్నంగా ప్రత్యేక కోర్సుల్ని తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రవేశపెట్టాం. లలిత కళాపీఠంలో సంగీతము, నృత్యం, రంగస్థలం, జానపద, చిత్రశిల్ప కళల్లో డిప్లమో డిగ్రీలను నిర్వహిస్తున్నాము. జ్యోతిష్యాన్ని కూడా కళగా బోధిస్తున్నాము. అలాగే మనదేశంలో మొట్ట మొదటిసారిగా కంపారటివ్ లిటరేచర్‌కి ఓ ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించిన ఘనత తెలుగు విశ్వవిద్యాలయానిదే! ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతుల్ని వృద్ధరించడమే మా విశ్వవిద్యాలయ ప్రధాన ఆశయం" అన్నారు ఇటీవల కలుసుకున్నప్పుడు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.శివరామమూర్తి.

ఇంతకు ముందీయన అంతర్జాతీయ తెలుగు కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేసారు. ఆ తర్వాత డైరెక్టర్‌గా కొన్నాళ్ళు, తెలుగు విజ్ఞానపీఠానికి ప్రత్యేక అధికారిగా కొంత కాలం పనిచేసారు. రిజిస్ట్రార్‌గా 13-10-1988 నుంచి పనిచేస్తున్నారు. భాషా శాస్త్రంలో డాక్టరేటుని పొంది వున్నారు.

"లెక్సికోగ్రఫీ అనే నిఘంటు నిర్మాణశాఖ మా విశ్వవిద్యాలయంలో వుంది. తెలుగు భాషకి చెందిన రకరకాల నిఘంటువుల్ని రూపొందిస్తున్నాము. భాషాభివృద్ధిపీఠంలో నిఘంటు నిర్మాణ శాఖతో పాటు భాషావిజ్ఞానశాఖ, భాషా ప్రణాళిక నవీకరణశాఖ వున్నాయి. రాజమండ్రి సాహిత్య పీఠంలో ప్రాచీన ఆంధ్రసాహిత్యం, నవీన ఆంధ్రసాహిత్యం, భక్తి కవిత, పదకవిత, జానపద సాహిత్యంలకు ప్రత్యేక విభాగాలున్నాయి. గిరిజన విజ్ఞానం, సాహిత్యానికి సంబంధించి ఒకశాఖ వుంది. శ్రీశైలంలో చరిత్ర, సంస్కృతి, పురావస్తు పీఠం వుంది." అంటూ తెలుగు విశ్వవిద్యాలయ ప్రణాళికల్ని వివరించారు డాక్టర్ ఎన్. శివరామమూర్తి.

"ఈ మధ్య బెంగుళూరులో మూడవ అఖిలభారత తెలుగు మహాసభలు చాలా చక్కగా జరిగాయట కదండి..."

"అవునండి. మా విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ తెలుగు సంస్థ అనే విభాగం వుంది. ఇతర రాష్ట్రాలలోని దేశాలలోని శ్రేయస్సుకి ఇది కృషి చేస్తుంది. ఇతర ప్రదేశాలలోని తెలుగువారికి తెలుగుభాషని బోధించడానికి వీలుగా అక్కడి టీచర్స్‌కి పార్ట్‌టైమ్ కోర్సులని నిర్వహిస్తున్నాం. పుస్తకాలు పంపిస్తున్నాము. ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో వున్న తెలుగు వారికి లైబ్రరీస్ కోసం కొంత సొమ్ము ఇస్తున్నాము."

"వృద్ధ కళాకారులకు మీరు పెన్షన్ కూడా ఇస్తున్నారాండి?"

"అన్ని కళలలోను సుప్రసిద్ధులైన వృద్ధ కళాకారులకు నెలనెలా 150 - పెన్షన్‌గా ఇస్తున్నాము. ఈ పెన్షన్ జీవితాంతం వరకు ఇస్తాము. పోషణ లేక అంతరించిపోతున్న జానపద కళల్ని సముద్ధరిస్తున్నాము. స్థానికంగా వున్న కుర్రవాళ్ళకి నిష్ణాతులచే శిక్షణ నిప్పిస్తున్నాము. ఇలా చేయడంవల్ల ఆ కళాకారులకు నెలనెలా కొంత జీతాన్నిచ్చి ఆర్థికంగా అండకల్పిస్తున్నాము. రకరకాల జానపద కళారూపాల్ని వీడియో కేసెట్లలో కూడా భద్రపరుస్తున్నాము.... పరిశోధనా గ్రంథాల ప్రచురణకూ ఆర్థికసాయాన్ని విశ్వవిద్యాలయం ద్వారా అందజేస్తున్నాము" అంటున్నారు డాక్టర్ శివరామమూర్తి.



డాక్టర్ ఎన్. శివరామమూర్తి
రిజిస్ట్రార్
తెలుగు విశ్వవిద్యాలయం

"ఇంకా మీరు తెలుగుజాతికి చేస్తున్న ప్రత్యేక సేవలు ఏమన్నా వున్నాయాండి"?

"తరతరాల తెలుగుజాతి మ్యూజియమ్‌ను ప్రారంభించబోతున్నాము. ఆ నాటి నుంచి ఈనాటి వరకు తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుల చిత్రాలన్నీ ఈ మ్యూజియమ్‌లో పొందుపరుస్తున్నాము. ఈ ప్రదర్శనని మొన్న బెంగుళూరులో జరిగిన మూడవ అఖిలభారత తెలుగు మహాసభలలో ప్రదర్శించాం. అందరి మన్ననలని పొందింది ఈ ప్రదర్శన."

"ఓరియంటల్ కాలేజెస్‌కి కూడా తెలుగు విశ్వ విద్యాలయంతో సంబంధముందాండి?"

"మనరాష్ట్రంలో వున్న 28 ఓరియంటల్ కాలేజీలకు ప్రవేశ పరీక్షని తెలుగు విశ్వ విద్యాలయమే నిర్వహిస్తోంది... ఆ తర్వాత ఈ సంవత్సరం ఎమ్మే సంగీతం, నృత్యం ప్రారంభించాం. బియ్యే మృదంగాన్ని ప్రారంభించాం. ఎమ్మే ఇండియన్ లిటరేచర్, ఎమ్‌ఫిల్ ఇన్‌కంపారటివ్ లిటరేచర్, జర్నలిజమ్ కోర్సులనీ ప్రవేశపెట్టాము. ప్రాచీన తెలుగు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నాము. తెలుగులోని ఉత్తమ సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషలలోకి అనువదింప జేస్తున్నాము. తెలుగు మాతృభాష కానివారు తెలుగు నేర్చుకోవడానికి పుస్తకాల్ని తయారు చేస్తున్నాము. మనదేశంలోని అత్యంత ప్రతిష్ఠాకరమైన జ్ఞానపీఠ అవార్డుని పొందిన డాక్టర్ సి. నారాయణరెడ్డిగారి ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. త్వరలోనే తన సొంత భవనంలోకి వెళ్ళబోతోంది. ఈ మధ్యే తెలుగు విశ్వవిద్యాలయానికి యు.జి.సి. గుర్తింపు కూడా లభించిందనే విషయము మీకు తెలిసే వుంటుంది. డా. సి. నారాయణరెడ్డిగారు ఈ విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్ అయితే గవర్నరుగారు ఛాన్సలర్" అన్నారు డాక్టర్ ఎన్. శివరామమూర్తిగారు.

-విజయచంద్ర

యువతా! కవితా!!

కానుక

(తోటి ఖైదీ. బెల్జియన్ మిత్రుడు ఆంద్రీ కోసం)

రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొని మరణించిన రష్యన్ ఫ్రంట్‌లైన్ పొయెట్స్‌లో మస్సాజలీల్ ముఖ్యుడు. నాజీలు ఇతన్ని 1944లో ఉరితీశారు. నిర్బంధంలో ఉండగా జలీల్ మంచి కవిత్వం రాశాడు. అందులో ఒకటి–

మాతృభూమిలో
జీవితం తియ్యగా ఉన్న రోజుల్లో
పువ్వుల మధ్య గడిపిన ఆ సమయాల్ని
మళ్ళీ వెనక్కు తీసుకు రాలేను నేస్తం–
ఇక్కడ
ఆ ఆనందమూ లేదు
తోటలూ లేవు
ఇళ్ళూ లేవు
స్వేచ్ఛ అసలే లేదు

ఇక్కడ పువ్వులుకూడా వేగంగా వాడిపోతున్నై
ఇక్కడ నేల కూడా నిర్బంధంలో మూలుగుతోంది

కానీ
నా చైతన్యం మాత్రం
సత్యంలా స్వచ్ఛంగా పరిశుభ్రంగానే ఉంది
అందుకే నా హృదయంలో వికసిస్తున్న పాటల్ని
నీకు కానుకగా ఇవ్వనీ
వాటికి మరణం లేదు
అవి
చెరసాలలో ఈ ఆత్మ పూస్తున్న చెలిమి పువ్వుల్ని
నా మాతృదేశానికి తప్పక అందిస్తాయి.

రష్యన్ కవిత : మస్సాజలీల్
అనువాదం : కొప్పర్తి

ఆవేదన

పరాయి ప్రభువుల
అత్తరికపు అరళ్ళను
చిరునవ్వుతో ఎదుర్కొన్నది
అలనాడు తల్లి భారతి!
కన్న కొడుకుల్లాంటి
స్వతంత్ర పాలకుల
దౌర్జన్యాలకు, దుర్మార్గాలకు,
హృదయ విదారకంగా
విలపిస్తున్నది నేడు స్వతంత్ర భారతి!!

-వసుమర్తి రాంమోహన్

పగటి వేషగాడు

పగటి వేషగాడికి
రాజకీయ వేషధారికి
అట్టే తేడా లేదు!
ఒకడు-
మనల్ని నవ్వించి
పైసలేరుకుంటాడు!!
మరొకడు-
మనల్ని కవ్వించి
కోట్లు కూడేసుకుంటాడు!!!

-ఆప్తచైతన్య



క్రియాశీలి

నకనకలాడే
ఆకలి పొట్టకు
కరకర నమిలే
రొట్టిముక్కను
ఇస్తాను
భగభగ మండే
కవిత్వాన్ని
గలగల మాటల
పయిత్యాన్ని
ఇవ్వను
ఒట్టి మాటలతో
కాలయాపన చేసి
ఎదురు చూపుల
నిట్టూర్పులతో
వేసారిపోనివ్వను!

'వియోగి'

యూనివర్సల్ ట్రూత్

శిర్షోదయంతో మొదలిడి
కపాల మోక్షంతో ముగుస్తుంది జీవితం!
ఇదో కయూనివర్సల్ ట్రూత్
అయినప్పటికీ ప్రతివాడూ
తనొక ఎక్సెప్షన్ అనుకుంటాడు.

ఈ శరీరం అగ్నిహోత్రుడికి
ఆహుతవుతున్నపుడు
ప్రాణం గాలిలో ఏకమైనపుడు
అస్థికలు మట్టిపాలైనపుడు
చితాభస్మం నీటిలో కలిసిపోయినపుడు
ఆత్మజ్ఞానం ఆకాశంలో లీనమై పోయినపుడు.

అందం, ఆస్తి ఆదుకోవు
వంశం, గోత్రం అడ్డురావు
బంధం, అనుబంధం తోడురావు
జాతస్య మరణం ధ్రువం.

అయితే కొందరు బ్రతుకుతూ చస్తారు
కొందరు చస్తూ బ్రతుకుతారు
కొందరేమో చచ్చినా చావరు
మరుభూమిలో ఓ మజిలీవేసి
పంచభూతాలను పలుకరించి
మళ్ళీ మనలో కొచ్చేస్తారు
లబ్ధ ప్రతిష్ఠులౌతారు.

-కె. సీతారామగిరి

ఉద్యోగం

ఎన్నో ఇంటర్ "వ్యూ"లు
'భార్య' అనే ఉద్యోగం కోసం!
ఎన్నిసార్లు రాయాలో
'పెళ్ళి చూపుల' పరీక్షలు?

ఉద్యోగం ఇవ్వకుండా
చెయ్యిచ్చే 'బాస్'లంతా
ఎదుట– దీనవదనమై
కూర్చున్న 'అభ్యర్థిని' దుస్థితి
గమనించి, మిన్నకుంటారేం?

'కట్నం' అనే లంచం భారిగా
ముడితే మాత్రం
వెంటనే 'సెలెక్ట్' కాబడుతుంది
'డ్యూటీలో' కూడా జాయిన్
కావొచ్చు– మరు మాసంలోనే!

–వై. ఎస్. నాగమణి

ఎవరో విజేత

ఎం. విజయకుమారి



ఈ వారం దెయ్యం కథ

"అమ్మా! శాంతీ కొంచెం మంచినీళ్లు పట్రా తల్లీ!" అంటూ వాలుకుర్చీలో కూలబడి తను తెచ్చుకున్న పత్రిక ముఖచిత్రం చూస్తున్నారు జగన్నాథంగారు.

గ్లాసుతో నీళ్లు అందిస్తూ "కొత్త పత్రిక అప్పుడే వచ్చేసిందా నాన్నా? ఒక్కసారి సీరియల్ చదివేసి ఇచ్చేస్తానుండండి" అంటూనే తండ్రి చేతిలో పత్రిక లాక్కుంది శాంతి. "అప్పుడే తొమ్మిది దాటింది. కాలేజికి వెళ్లవా ఏం? నా వంట అయిపోయింది. ఏదీ ఆ పత్రిక ఇటివ్వు" అంటూ శారదాంబగారు శాంతి చేతిలో పత్రిక తీసుకొని గోడకి చేరబడ్డారు. ఇంతలో స్నానానికి వెళ్ళబోతున్న కృష్ణ టవలూ, సబ్బూ గిరాటేసి తల్లి చేతిలో పత్రిక లాక్కుని గదిలో దూరి తలుపేసుకున్నాడు. సీరియల్ గబగబా చదివి పరుపు కింద పత్రిక దాచేసి కాలేజికి టైమయిపోతోందని పరుగులు తీశాడు.

"కొంపలో ఉన్నానని పేరేగానీ ఒక్కనాడూ పత్రిక రాగానే చదవనిచ్చిన పాపాన పోరు" విసుక్కుంటూ కూతురికి అన్నం పెట్టడానికి లేచారు శారదాంబగారు.

"అయినా పత్రిక కొని బజారులోనే చదివి ఇంటికి తీసుకురావాలి గానీ లేకపోతే ఈ గడుగ్గాయిలు చదవనిస్తారా? వీళ్లకి కాలేజీ పుస్తకాలకన్నా ఇవి ఎక్కువై పోయాయి" విసుక్కుంటూ కూర్చీలోంచి లేచి "ఒరేయ్ కిష్టిగా ఆ పత్రిక ఇలా తగలెయ్ కాలేజీకి పోతూ కూడా పుస్తకం దాచుకుంటావేం" అని ఒక్క గావుకేక పెట్టేరు జగన్నాథంగారు. "పరుపు క్రింద పడేశా తీసుకోండి నాన్నా" సైకిల్ తీసుకుంటూ అరిచాడు కృష్ణ. ఎంత వెతికినా పుస్తకం మాత్రం దొరకలేదు ఆయనకి. "నువ్వు గానీ తీశావేమిటే వాడటు వెళ్లగా చూసి శారదా! వంటింట్లోకి వచ్చేరాయన." "ఇది మరీ బాగుంది, మీ ఎదురు గానే కదా వాడు నాచేతిలోది తీసుకోగానే నేనిలా వచ్చాను. పత్రిక వచ్చిన రెండు మూడు రోజుల వరకు నాచేతికే రాదు" కూతురికి మజ్జిగ పోస్తూ "నువ్వు గాని తీశావా? అన్న భావంతో శాంతి ముఖంలోకి చూశారావిడ." "నాకసలు తెలీదు గానీనే కాలేజీకి పోతున్నా"నంటూ హడావిడిగా బైటపడింది శాంతి. పిల్లలు బయటకు వెళ్లేక జగన్నాథంగారు, శారదాంబగారు కూడా వెతికిన చోటు వెతక్కుండా రెండు గంటల సేపు పత్రిక కోసం ఇల్లు తిరగేశారు. కానీ ఎక్కడా దొరకలేదు. ఇంతలో ఎలా మాయం అయిందబ్బా అని ఆశ్చర్యపోయారు. సాయంత్రం పిల్లఖు వచ్చాక మళ్లీ వెతకడం, ఒకరినొకరు తిట్టుకోడం జరిగేయి కానీ పత్రిక దొరకలేదు. మర్నాడు ప్రక్కయింట్లో శాస్త్రిగారిని అడిగి తెచ్చుకొని ఆ వారానికి పత్రిక చదవడం పూర్తి చేశారు.

**   **   **

"ఏమండీ! ఇవాళ్టికి కాఫీ మీరు కలిపేద్దురూ ఇద్దరికీ కొంచెం తలనొప్పిగా ఉంది" కాలేజీ నుంచి అప్పుడే వచ్చిన సుశీల భర్త శాస్త్రికి ఆదేశించి పత్రిక తీసుకొని సోఫాలో కూర్చుంది. "మేడమ్ గారికి పత్రిక దొరికిందా? అయితే ఒట్టి తలనొప్పే నన్నమాట. నేను ఛస్తే కలపను, నేనూ ఇప్పుడేగా వచ్చేను. నువ్వే కలిపి తీసుకురా, ఈలోపుగా సీరియల్స్ రెండూ చదివేసి ఇచ్చేస్తా" భర్తగా హుకుం జారీ చేస్తూ ఆవిడ చేతిలో పత్రిక తీసుకొని ప్రక్కనే కూర్చున్నాడు. తప్పదురా నాయనా అనుకుంటూ లేచి, వంటింట్లోకి నడిచిందావిడ. శాస్త్రిగారు ఒక ప్రైవేట్ కంపెనీలో స్టెనోగా పనిచేస్తున్నారు. సుశీల గవర్నమెంట్ కాలేజీలో బోటనీ లెక్చరర్. ఒక్కర్తె కూతురు, హైస్కూల్లో టెన్త్ చదువుతోంది. ఆ పిల్ల వస్తూనే "హాయ్ డాడ్. మేగజైన్ అప్పుడే వచ్చేసిందా! ఒక్కసారి ఇవ్వండి డాడీ! ఓన్లీ హాఫయాన్ అవర్‌లో చదివేసి ఇస్తా" అంటూనే బ్యాగ్ సోఫాలో పెడేసి పుస్తకం తీసుకొని బాత్‌రూంలోకి పోయింది. షెల్ఫ్‌లో పెట్టి ముఖం కడుక్కొని టవల్‌తో ముఖం తుడుచుకుంటూ పుస్తకం కోసం చూసింది. అక్కడలేదు. ఏడుపు గొంతుతో "ఏమిటి మమ్మీ! అప్పుడే లాక్కుపోయావా! నాకేం తెలీదు.నాకు ముందు పుస్తకం ఇస్తేనే ఇవాళ భోంచేసేది నేను" హఠం వేసి మంచం మీద అడ్డంగా పడింది ముద్దుల కూతురు ఉమ.

"ఇదెక్కడి గోలేతల్లీ! నేనింకా కిచెన్ లోంచి బైటకు రానేలేదు నామీద విరుచుకుపడుతున్నావు. అయినా బాత్‌రూం తలుపువేసుకుంటే నేనెలా తీసేననుకున్నావ్? ఇదిగో ఈయనే తీసి ఉంటారు వెనకే వచ్చి" అంటూ కాఫీ కప్పు పెద్ద శబ్దంతో టీపాయ్ మీద ఉంచింది సుశీల.

"ఇది చాలా అన్యాయం సుశీలా! బేబి చేతిలోది నేనెప్పుడైనా తీసుకున్నానా! అన్నింటికీ బేబియే ఫస్టున ఉండాలంటాను కదా!" అయితే పత్రిక ఏమయినట్లు, ఆశ్చర్యంగా ఉందే, పత్రిక వెతికి ఇస్తానని హామీ ఇచ్చి ఉమని బ్రతిమలాడి టిఫిన్ తినిపించింది సుశీల. ఒక గంటసేపు ఇల్లు ఇటునుంచి అటు మార్చినా ఏమీ లాభం లేకపోయింది. ఏం చేస్తాం! ప్రక్క జగన్నాథం గారిని అడిగి ఈ వారానికి చదువుదాం! ఇప్పుడే వస్తానుండు" అంటూ శాస్త్రిగారు బైటపడ్డారు.

"ఏమిటండోయ్ శాస్త్రిగారూ! ఇలా వచ్చేరు. ఏమిటి విశేషం? కుర్చీ దగ్గరగా జరుపుతూ "ఇదిగో శారదా ఇంకొక కప్పు కాఫీ పట్రా శాస్త్రిగారు వచ్చేరు" అంటూ లోపలికి ఒక కేకవేశారు.

"ఏం లేదు జగన్నాథంగారూ! పత్రిక కొని ఇంటికి తెస్తూనే మాయింట్లో గోల



మొదలు. ఎవరికి వారే మొదట చలవాలని,ఆ కీచులాటలో ఈ వారం పత్రిక ఎక్కడ పోయిందో...ఇల్లంతా వెతికినా దొరక లేదు. బేబీ తీసుకొని బాత్‌రూంలో షెల్ఫ్‌లో పెట్టేనంటుంది. చాలా ఆశ్చర్యంగా ఉంది. మీరు పత్రిక నిన్ననే కొన్నట్లున్నారు. ఒక్కసారి ఇద్దురూ!" కాఫీ కప్పు అందుకుంటూ "కులాసానా ఒదినగారూ" అన్నాడు శారదాంబను పలకరిస్తూ.

"ఏమిటీ? మాయింట్లో క్రితం వారం ఇదే గొడవ అయి మళ్లీ ఆ పత్రిక కనిపిస్తే ఒట్టు. ఈ వారం మీ యింట్లోనా? బాగుంది. ఇదేదో మిస్టరీలాగుంది. పత్రిక మా యింట్లో నిన్న రాత్రికే చదివేశారు తీసుకెళ్లండి" అని పత్రిక తెచ్చి శాస్త్రిగారికి చేర్రాయన.

** ** **

"ఏమిటయ్యా టూనాట్ సెవెన్ ఇన్ని కంప్లయింట్స్ ఉన్నాయేమిటి ఈరోజు" అంటూ ఒక్కొక్కటీ తిప్పి చూస్తున్న ఇన్స్‌పెక్టర్ గంగరాజుకి మతిపోయింది. దాదాపు ఏభై ఉన్నాయి. అన్నీ పత్రికలు చాలా మిస్టీరియస్‌గా మాయం అవుతున్నాయి కనుక ఏక్షన్ తీసుకోమని అర్థింపులు.

"ఇదెక్కడి గోలయ్యా! డబ్బో, బంగారమో పోయిందని కేసు పెట్టడం తెలుసు కానీ పత్రిక పోయిందని పైగా ఏభై మంది కంప్లయింటా? ఎక్కడి వాళ్లు వీళ్లంతా"

సుభాష్ నగర్ కాలనీ వాళ్లు సార్. మీరు లేరంటే ఇంకొక అరగంటకి వస్తామని ఈ కాగితాలు మీ టేబిల్‌మీద ఉంచమని ఇచ్చి వెళ్లారు.

"ఇచ్చిన వాళ్లకి బుద్ధి లేకపోతే నీకుందర్దయ్యా తీసుకుందికి? దీనివలన మన కేమైనా మిగులుతుందా ఏడుపా" ఇంకా ఏదో అనబోతున్న ఇన్స్‌పెక్టర్ లోపలికి వస్తున్న వాళ్లని చూసి ఆగిపోయాడు. నవ్వు ముఖాన పులుముకుంటూ "రండిసార్, ఇంకా ఎవరో అనుకున్నా" నాలుగేళ్ల క్రితం రిటైర్ అయిన ఎస్పీ లోకనాథం, గవర్నమెంట్ డాక్టర్ ప్రకాశ్, తహసీల్దారు గుర్నాధంగారు, జగన్నాధం, శాస్త్రిగార్లను రిసీవ్ చేసుకుంటూ కూర్చోబెట్టేడు మర్యాదగా.

"చూడండి ఇన్స్‌పెక్టర్‌గారూ! ఆ కంప్లయింట్స్ ఇచ్చింది మేమే. చాలా ఆశ్చర్యకరమైన విషయం ఇది. నా సర్వీసులో ఇలాంటిది వినలేదు. వరసగా ఆరునెలల నుంచి వారానికి ఒక ఇంట్లో పత్రిక మాయం అవుతోంది. ముందు ఏదోలే అని ఊరుకున్నాం. కానీ వరసగా ఒకరి యిల్లు తర్వాత మరొకరింట్లో మాయం అవుతోంది. ఎంత ప్రయత్నించినా దొంగ లెవరో దొరకడం లేదు. అప్టరాల్

పత్రికే కదా అంటారేమో! మార్కెట్‌లో అది దొరకడమే గగనమైపోతోంది. ప్రతీ వారం వాళ్లనీ వీళ్లనీ ఏమడుగుతాం? అయినా దీని అంతం చూడవలసిందే! ఇది మీ 'డిపార్టుమెంట్‌కే ఒక ఛాలెంజ్ అనుకోండి. మీరెలాగైనా ఆ దొంగను పడితేగానీ మా కాలనీలో మనశ్శాంతి ఉండదు" సుదీర్ఘంగా ఉపన్యసించి ఊపిరి తీసుకున్నారు ఎస్పీగారు.

"ఓకే! ఓకే! వైనాట్? మీరు చెప్పడం మేం చెయ్యకపోడమూనా! నెక్స్ట్ వీక్ పత్రిక మార్కెట్‌లోకి రాగానే మీరంతా కొనుక్కొని వెళ్లండి. మీరు చెప్పిన ప్రకారం ఈ వారం కాలనీ చివరి యింట్లో పత్రిక పోవాలి. తగిన ఏర్పాట్లు నేను చూస్తాను. దీన్తో ఆ పత్రిక దొంగ, వాడితల్లో జేజమ్మ దిగి వస్తారు. మీరు నిశ్చింతగా ఉండండి సార్" వినయంగా చెప్పేసరికి అంతాశెలవు తీసుకున్నారు. అన్నట్లుగానే గట్టి బందోబస్తు ఏర్పాటు చేసేడు ఇన్స్‌పెక్టర్. ఈసారి కాలనీ ధాటేక ఉన్న ఇంట్లో పత్రిక పోయిందని, ఆ వరసన నాలుగిళ్ల నుంచి నాలుగు వారాలు పత్రికలు పోయినట్లు కంప్లయింట్స్ వచ్చేసరికి జుట్టు పీక్కున్నాడు ఇన్స్‌పెక్టర్. దొంగ దొరకడు. కంప్లయింట్స్ రావడం మానవు. ఆఫ్టరాల్ పత్రిక దొంగను పట్టలేక పోతున్నందుకు పోలీసు డిపార్ట్‌మెంట్ చేతకానిదని

ఎవరీ విజేత

ప్రజలు దుయ్యబడుతున్నారు.

** ** **

పత్రిక మొదలుపెట్టి ఏభై సంవత్సరాలైన సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుగుతాయని, ఆ పత్రిక కోసం కొత్త రకంగా హాస్యరస దెయ్యాలకథల పోటీ పెడుతున్నామని, మొదటి బహుమతి వెయ్యి రూపాయలు, రెండవ బహుమతి ఏడువందల యాభై, మూడవ బహుమతి ఐదు వందలు ఉంటాయని నూతన రచయితలను ప్రోత్సాహపరుస్తూ ఒక ప్రకటన చేసేరు పత్రికాధికారులు. ఇంకేముంది? నెల తిరిగేసరికి వందలకొలది కథలు వచ్చి పడ్డాయి. గడువు పూర్తయింది. పదిమంది సభ్యులు కూర్చొని వాటి లోంచి మూడు కథలు ఎంపిక చేసారు. మరుసటి పత్రికలో బహుమతి గ్రహీతల ఎడ్రసులు వేస్తూ విజయవాడలో జరిగే ఉత్సవాలకు అందరికీ ఆహ్వానం పంపుతూ, బహుమతులను అక్కడికి స్వయంగా వచ్చి తీసికోవలసిందిగా ప్రకటన చేశారు.

ప్రథమ బహుమతి గ్రహీత శ్రీ డి.కె. అంబర్‌వీధి, తారాపురం అని వేశారు. పూర్తి పేరు ఉండాలని, ఫోటో పంపమని ఆ ఎడ్రస్‌కి పత్రికాధికారులు రాసిన ఉత్తరానికి జవాబు రాలేదు. ఫంక్షన్‌లో బహుమతి తీసుకుందికి వస్తారు కదా అనుకున్నారు వాళ్లు. ఉత్సవాలు ఆరంభం అయ్యాయి. మొదటి రోజు బహుమతి ప్రదానం. గౌరవాధ్యక్షులుగా నగర మేయర్‌ని ఆహ్వానించారు. పత్రికా సంపాదకుని ఉపన్యాసంతో సభ ప్రారంభమయింది. "ప్రియమైన పత్రికా పాఠకులారా! అభిమానులారా! పత్రిక యాభైవ పుట్టిన రోజు సందర్భంగా మేము జరుపుతున్న ఈ స్వర్ణోత్సవాలకు మీరంతా వచ్చి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నందుకు మా ధన్యవాదాలు. ఈసారి

కథల పోటీ ప్రత్యేకత మీకు తెలిసినదే! వెరైటీగా ఉంటుందని చేసిన మా ప్రయత్నంలో అసంఖ్యాకంగా వచ్చిన హాస్యరస, భయానక దెయ్యాల కథలను ఎంపిక చెయ్యడం మాకొక పెద్ద పరీక్ష అయింది. దేనికదే బాగున్నప్పటికీ వాటిలో మూడు కథలను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. బహుమతి గ్రహీతలు వారి పేర్లను పిలిచినప్పుడు స్టేజిమీదకు వచ్చి అధ్యక్షులు వారందజేసే బహుమతులను గ్రహించవలసిందిగా కోరుతున్నాము. ఈ కార్యక్రమం తరువాత జరిగే వినోద కార్యక్రమాలు కూడా తిలకించి సభను జయప్రదం చెయ్యవలసిందిగా కోరుతున్నాను" అంటూ మొదటి బహుమతిని 'గగన చరులు' అన్న నవరస భరిత దెయ్యాల కథకు ఇవ్వడమైనది. రచయిత



ప్లాట్‌ఫామ్ 'భీష్ముడు'

అది మద్రాసు. అక్కడ అతడు ఓ బిచ్చగాడు. అయితే అందరిలా అమ్మా...బాబు...ధర్మం అంటూ అడుక్కోడు. ఓ శిలువపై మేకులు కొట్టినట్టు పడుకొని వింతగొల్పే రీతిలో ఆకర్షణీయంగా అడుక్కొనేవాడు.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న టి. వి. మహా భారత్ పిల్లలనుంచి పెద్దలవరకు అనుసరించి ఆ పాత్రల ప్రభావం వారిపై పడి అలాంటి దుస్తులు ధరించటం, పిల్లలు బాణాలు, విల్లులు చేతపట్టి తిరగటం జరిగింది.

మద్రాసులోని రామయ్యాన్ అనే బిచ్చగాడు టి. వి. మహా భారత్‌లోని 'భీష్ముడు'వలే అంపశయ్యామీద పండుకొన్నట్లు 'ముళ్ళు' శయ్యలాగా చేసుకొని పడుక్కొని అడుక్కోవటం ప్రారంభించాడు. అక్కడ 'రామయ్యాన్'ను ప్లాట్‌ఫామ్ భీష్ముడు అని పిలుస్తుంటారు అందరూ వేళాకోళంగా. డబ్బులు మాత్రం దండిగానే పడతాయి.

- శాంతి

శ్రీ డి.కె. గారిని వేదిక మీదకు రావలసిందిగా కోరుతున్నాను. వెయ్యి రూపాయలు గల పళ్ళెం అధ్యక్షులు వారి కిస్తూ సభ వైపు దృష్టి సారించారాయన. ప్రేక్షకులంతా 'ఎవరా ఈ డి.కె.' అని వెను తిరిగి చూస్తున్నారు.

"ఇక్కడే ఉన్నాను. అధ్యక్షుల వారికి నమస్కృతులు మీ కుడివైపుకు తిరిగి ఆ పళ్ళెం ఇటు అందివ్వండి" అన్న కంఠం వినిపించింది. కానీ వేదిక మీద పత్రిక కార్యవర్గ సభ్యులు, అధ్యక్షుల వారు తప్ప ఎవరూ కనిపించలేదు. ఉప సంపాదకుడివైపు తిరిగి "ఏమిటండోయ్! చాలా కామ్‌గా కథ రాసేసి ఫస్టు ప్రయిజ్ కూడా కొట్టేశారే!" నవ్వుతూ అన్నాడు సంపాదకుడు.

"పొరపాటు సార్! డి.కె. అంటే దండ మూడి కోదండం అనుకున్నారా! ఇటీజ్ ది కింగ్ ఆఫ్ ది డెవిల్స్, అంబర్ స్ట్రీట్" ఇప్పు డర్థం అయిందనుకుంటా నేను మనిషిని కానని చాలా కూల్‌గా వినిపించిందీసారి స్వరం. "ఏ...ఏ...ఏమిటి, ను...నువ్వు.... మ..మ.. నిషివి కావా!" అప్పటికే చెమటలు పట్టిన ముఖం తుడుచుకుంటూ, వణుకుతూ చేతిలో పళ్ళెం జారవిడిచేరు అధ్యక్షుల వారు. కానీ ఆశ్చర్యంగా ఆ పళ్లెం గాలిలో నిలిచింది. సభలో ఎవరికీ నోటమాట లేదు. ఎవరికి వారే బ్రతుకు జీవుడా అని జారుకోబోతున్నారు.

"ఇది చాలా అన్యాయం! ఒక దెయ్యం రాసిన కథకు ఫస్ట్ ప్రయిజ్ ఇవ్వడమా!" గొంతు పెగుల్చుకొని అరిచాడు రెండవ బహుమతి గ్రహీత కృష్ణమూర్తి కుర్చీలోంచి లేచి.

"అన్యాయమా! ఏదీ మళ్లీ అను. దెయ్యాల కథలపోటీ పెట్టడం బాగుందా? నేను పార్టిసిపేట్ చెయ్యడం బాగులేదు. అయినా మా గురించి మీకేం తెలుసునని రాస్తారు? మా ప్రపంచం గురించి మేము వర్ణించినట్లు మీ మానవులు వర్ణించలేరన్న సంగతి నాకథకు ఫస్టు ప్రయిజు ఇవ్వడంలోనే తెలుస్తోంది. అదీ కాక నిబంధనలలో దెయ్యాలు పాల్గొనకూడదని ఏమీ లేదే! ఒక దెయ్యం కూడా మీ పత్రికాభిమానిగా ఉన్నందుకు, బహుమతి గెల్చుకున్నందుకు సంతోషించి నోరు మూసుక్కూర్చో!" చెవి దగ్గరగా గట్టిగా వినిపించడంతో కృష్ణమూర్తి మొదటి కుర్చీలో కూలబడ్డాడు. సభలో ఉన్న వాళ్లు భయంతో వణికిపోతూ బైటకు పోడానికి ప్రయత్నం చేస్తున్నారు.

"ఎవరూ కదలడానికి వీల్లేదు కూర్చోండి" ఈసారి వేదిక మీద కంఠస్వరం వినిపించింది. 'ఇదొక్కటి గోలరా బాబూ మన చావుకే వచ్చేం ఇక్కడికి' అనుకుంటూ గుండె లుగ్గబట్టుక్కూర్చున్నారు అందరూ.

"ఏవయ్యా ఫొటో గ్రాఫరూ! ఇటొక స్నాప్ లాగు, అధ్యక్షుల వారూ? ఆ పళ్లెం ఇటు అందిస్తున్నట్లు నిల్చోండి. అధికార పూర్వక శాసనాన్ని పాటించేరు అధ్యక్షులు. కానీ ఆయన ముఖం పాలిపోయి పెదవులు వణుకుతూ, చెమటలు కారుతూ ఎంత త్వరగా బైటపడదామా" అన్నట్లుంది.

"థాంక్యూ! బైదిబై ఇంకొక విషయం. ఇన్స్‌పెక్టర్ గంగరాజూ నీ ఇన్వెస్టిగేషన్ ఎంతవరకూ వచ్చింది? ఆ పత్రిక దొంగ దొరికాడా? హ..హ్హ... హ్హ.. నువ్వేం పట్టుకుంటావు గానీ ఇది విను, సోదరులారా! నేను క్రితం జన్మలో పత్రికాభిమానిని. అది ఉంటే నాకు నిద్రాహారాలు కూడా ఉండేవి .కాదు. రచయితవుదామన్న ఉద్దేశ్యంతో ఎన్నో కథలు రాశాను. కానీ వీళ్లు, ఈ పత్రికా సంపాదకులు నా కథలన్నిటినీ పిడపురుగుల్లా చూస్తూ చెత్తబుట్టకి దాఖలు చేశారు. అయినా నాకు పత్రిక మీద అభిమానం పోలేదు. దురదృష్టవశాత్తు ఒక ప్రమాదంలో అర్థాయుష్షతో పోయేను. ఇప్పుడు కూడా నాకు పత్రిక ఉంటేనే రోజు గడుస్తుంది. ఆ పత్రిక దొంగను నేనే. చావ ఉంటే నన్ను పట్టుకోండి. అయినా నేనేం మిమ్మల్ని బాధపెట్టడం లేదే! వారానికి ఒకరింట్లో పత్రిక తీసుకుపోతున్నా, కాబట్టి దొంగని వెతకాలన్న ప్రయత్నం మానుకొని నాకు సహకరించండి. బ్రతికి సాధించలేనిది చచ్చాక అయినా చాలా గ్రాండ్‌గా సాధించగలిగాను మా ప్రపంచంలో కూడా పత్రిక సరు క్యులేషన్ పెరుగుతున్నందుకు మీ కందరికీ ఇది గర్వకారణం. అరరె! చాలా ఆలస్యం అయిపోయింది. ఉగాది నవలల పోటీకి ప్లాట్ ఆలోచించి ఈ డబ్బుతో కాగితాలు కొనుక్కోవాలి! మళ్లీ అప్పుడు కలుద్దాం బై" ఖాళీ పళ్లెం టేబిల్ మీదకి చేరింది గాలిలో తేలుతూ. సభ ఊపిరి తీసుకుంది. ●



లవ్ గేమ్



చల్లా సుబ్రహ్మణ్యం

(గత సంచిక తరువాయి)

నవ్య హడావుడిగా నాలుగడుగులు వేసి-చప్పున వెనక్కి తిరిగి అంది.

"కెమెరా ఏది?"

కె.డి.రావ్ ఉలిక్కిపడ్డాడు-సోఫా మీద చూశాడు. అక్కడలేదు. జేబులు తడుముకున్నాడు-సోఫా కింద చూశాడు. ఎదురుగా ఉన్న టీపాయ్ మీద వున్న యాష్ ట్రే ఎత్తి చూశాడు. యాష్ ట్రేలో చూశాడు. ఫ్లవర్ వాజ్‌లో వెదికాడు.

ఆమెకు కంపరమెత్తింది.

"ఏమైంది? మర్చిపోయారా?" తీవ్రంగా అడిగింది.

అతను కంగారుగా టీపాయ్ కింద దూరి హడావుడిగా వెదుకుతూ-

"నో-డిటెక్టివ్స్‌కి కెమెరా ఆరో ప్రాణం-మర్చిపోవడం ఉండదు" అన్నాడు.

"మరయితే ఏమైంది?" కోపంగా అంది.

"అదే చూస్తున్నాను. ఇప్పటి వరకూ నా మెడలోనే వుండాలి. ఇంతలో ఏమైందో అర్థమై చావడం లేదు-" జుట్టును గుప్పెట బిగించాడు.

"ఖర్మ-ఇప్పుడెలా?" తలపట్టుకుని అంది నవ్య.

"కొంప తీసి-గమ్మత్తు చేద్దామని సరదాగా మీరు తీయలేదు గదా?" కుక్కర్ విజిల్‌తో అడిగాడు.

"నాన్సెన్స్-నీతో గమ్మత్తుగా సరదా చేయాల్సిన ఖర్మ నాకు పట్టలేదు-" ఆమెలో సహనం నశించింది.

"సమయానికి రాణి కూడా లేదే" దిక్కులు చూస్తూ అన్నాడతను.

"ఎందుకు?"

"ఆమె అయితే-ఇలాంటి సమయాల్లో క్షణంలో వెయ్యోవంతులో నిర్ణయం తీసుకుంటుంది" అన్నాడు గర్వంగా.

"ఇక్కడికి దగ్గర్లో మీకుతెలిసినస్టూడియో వాళ్లుగానీ ఫ్రెండ్స్‌గానీ లేరా?"

"డిటెక్టివ్‌కి మిత్రులెవరూ వుండరు. అంతా శత్రువులే-" గంభీరంగా అన్నాడు.

"అయితే ఇప్పుడేం చేయాలో చెప్పి చావు-" కసిరిందామె.

అతని ముఖం నల్లగా మాడిపోయింది. దిక్కుముఖం వేసుకుని దిక్కులు చూస్తూ-

"అదే ఆలోచిస్తున్నాను-" అన్నాడు.

"ఇంకెంత సేపు-"

"ఐడియా వచ్చేదాకా-"

"ఎప్పుడొస్తుంది?"

"దానిష్టం-"

"అయితే నీ చావు నువ్వు చావు నేను వెళ్తున్నాను-" విసురుగా వెళ్లబోయింది.

"మేడం...." ఆర్తనాదం చేశాడు కె.డి.రావ్.

"ఏవిటి?" అంది వెనక్కి తిరిగి.

"ఆవేశపడకండి.డిటెక్టివ్ లేకుండా ఒంటరిగా వెళ్లడం శ్రేయస్కరం కాదు-" గంభీరంగా అన్నాడు.

"అయితే ఇద్దరం వెళ్దాం పద-"అందామె.

అప్పుడు వినిపించిందతనికి.

"ఎక్స్‌క్యూజ్ మీ..." వెనక్కి తిరిగాడు.

రిసెప్షనిస్ట్ అందంగా నవ్వుతూ అంది

"మీ కెమెరా నాకిచ్చారు-మర్చిపోయారా?"

ఒక్క గంతులో ఆమెను సమీపించి కెమెరా అందుకుని నవ్యను చూసి నవ్వుతూ అన్నాడు.

"చూశారా? డిటెక్టివ్ లెప్పుడూ పొరపాటు పడరు మేడం-ముందు జాగ్రత్తగా కెమెరా ఆ అమ్మాయికిచ్చి దాచిపెట్టమన్నాను-"

"నిద్రపోయి ఆ విషయం మర్చిపోయావ్" అసహనంగా అందామె.

"నిద్రా-నేనా? ఎప్పుడు?" అమితాశ్చర్యంతో గుడ్లు పెద్దవి చేశాడు.

ఆమెకు అతనితో వాదించే ఓపికలేక-

"ఇట్సాల్‌రైట్ వెళ్దాం పదండి-"

లిఫ్ట్ వేపు వెళ్లబోతున్న ఆమెను వారించి అన్నాడు కె.డి.రావ్.

"లిఫ్ట్‌లో వద్దు-ఇలా మెట్ల మీదుగా వెళ్దాం పదండి" గంభీరంగా అన్నాడు.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది.

"నాకు లిఫ్ట్‌లో కళ్లు తిరుగుతాయి."

"సరే అఘోరించు-" విసుగ్గా మెట్ల వేపు నడిచిందామె.

చక చకా ఇరవై మెట్లెక్కి వెనక్కి తిరిగి చూసింది.

మూడో మెట్టు దగ్గర ఆయాసపడుతూ నిట్టూర్చుతూ-చెమట తుడుచుకుంటూ-నాలుగో మెట్టు ఎక్కే ప్రయత్నంలో ఉన్నాడతను.

"ముందు నేను వెళ్తాను-నువ్వు తీరిగ్గారా-" అందామె కోపంగా.

"అలా వెళ్తే-ఫొటో తీసేదెవరు?" అన్నాడతను.

"నేను తీసుకుంటాను. ఆ కెమెరా ఇలా ఇవ్వు" అందామె కిందికి దిగుతూ.

నవ్వుతూ అన్నాడతను.

"ఈ కెమెరా నాకు యుగంధర్ ప్రెజెంట్ చేశారు. దీన్ని ఆపరేట్ చేయడం

ఇంతవరకూ సాగినకథ -: 15 క్రొత్తగా పెళ్లయిన స్వాగత్‌కు భార్య నవ్య నుంచి ఊహించని వ్యతిరేకత ఎదురౌతుంటుంది. నవ్యను తనదారికి తెచ్చుకునే విషయంలో స్వాగత్‌కు మేనమామ భాగ్యరాజ్ సహకరిస్తాడు. సెక్రటరీ శైలజతో స్వాగత్ హోటల్లో కులుకుతున్నాడని డిటెక్టివ్ కబురుపెట్టడంతో నవ్య హోటల్‌కు చేరుకుంటుంది.

అందరికీ చేతకాదు. నా ఒక్కడి వల్లే అవుతుంది-"

"అసలు ఫొటోలు తీస్తుందా?" అనుమానంగా అంది.

కుక్కర్ విజిల్ వినిపించింది.

"క్షణంలో వెయ్యోవంతులో రెండు వేల కాపీలు తీస్తుంది-" అన్నాడు.

"సరే....త్వరగా నడు...." కోపంగా అరిచిందామె.

నాలుగో మెట్టెక్కి ఐదో మెట్టు దగ్గర 'హుష్' అని నిట్టూర్చాడు.

ఆమె సహనం పూర్తిగా కోల్పోయింది.

"లిఫ్టెక్కి కళ్లుమూసుకో-కళ్లు తిరగవు-" అంది.

"అపుడు కడుపులో తిప్పి వాంతవుతుంది-" అన్నాడు దిగులుగా.

విసుగ్గా నుదుటి మీద కొట్టుకుంది నవ్య.

ఆమెలో ఆశ పూర్తిగా సన్నగిల్లిపోయింది. వాళ్లు రూంలో ఉన్నారో లేదో-ఇతను నిద్రపోయేటప్పుడు వెళ్లిపోయుంటారేమో.... ముందు తను వెళ్లి వాళ్ళున్నారో లేదో చూసొస్తే.....

ఆమె ఇంక ఆలోచించలేదు. ఓ సారి వెనక్కు తిరిగి చూసింది.

ఆరో మెట్టు అతి కష్టం మీద ఎక్కుతున్నాడు కె.డి.రావ్.




"షిట్-" కసిగా అనుకుని-వేగంగా సెకండ్ ఫ్లోర్‌కొచ్చింది. ఆతృతగా రూం నెంబర్స్ చూస్తోంది.

201 నుంచి ప్రారంభమయ్యాయి రూమ్స్. ఆమె అత్యంత ఉద్వేగంతో దాదాపు పరుగులాంటి నడకతో-రూం నెంబర్స్ చూస్తూ వెళ్తోంది. 256 దగ్గర ఆ ఫ్లోర్ అయిపో యింది. అసహనంగా మళ్లీ మెట్లెక్కి థర్డ్ ఫ్లోర్ కొచ్చింది.

ఆమె పరుగెత్తుతోంది.....క్షణాలు గడిచే కొద్దీ ఆమెలో విచక్షణ పూర్తిగా నశించి పోతోంది.

భరించలేని టెన్షన్ ఆమెలో ఆలోచనా శక్తిని హరించి వేసింది. కారిడార్‌లో ఉన్న ఇద్దరు ముగ్గురు వ్యక్తులు ఆమెను అమితా శ్చర్యంతో చూస్తున్నారు.

ట్రేలో కాఫీ కప్స్ పెట్టుకుని చేత్తో పట్టు



కుని అటుగా వస్తున్న వెయిటర్‌ను చూసు కోకుండా వేగంగా వెళ్లి అతన్ని ఢీకొట్టింది. క్షణంలో అతని చేతిలోని సామాగ్రంతా నేల మీద పడి ముక్కలయ్యాయి.

ఆమె క్షణం కూడా ఆగలేదు. కనీసం సారీ కూడా చెప్పకుండా అలాగే రూం నెంబర్స్ చూస్తూ పరుగెత్తసాగింది. అప్పుడే లిఫ్ట్‌లోంచి బయటికొచ్చిన మేనేజర్ నవ్యను చూశాడు.

అతని భ్రుకుటి ముడిపడింది.

పగిలిన కప్పులు-వగైరాలు అతనికి పరిస్థి తిని తెలియజేశాయి.

వేగంగా వస్తున్న ఆమెను తటాలున చేయిపట్టుకుని ఆపి అడిగాడు.

"ఎవర్నువ్వు-ఎక్కడికెళ్తున్నావ్?"

ఒకే ఒక్క క్షణం చూసిందామె.

అంతే-

బలంగా అతని చేతిని విదిలించుకుని పరుగెత్తింది. మేనేజర్ ఆశ్చర్యపోయాడు. కారిడార్‌లో ఉన్న ఫోన్ దగ్గరకెళ్లి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు.

నవ్య వేగంగా పరుగెడుతూ రూం నెంబర్లు చూస్తోంది.

300-

ఆమె పరుగాపి నడవసాగింది.

301-

ఆయాసంతో రొప్పుతోందామె. చెమ టతో వళ్ళంతా తడిసి జుట్టురేగి-భరించలేని ఉద్విగ్నతతో-

302 ముందు కొచ్చి నిలబడింది.

యస్-

ఇప్పుడు అతని నిజస్వరూపం తాను చూడబోతోంది. కెమెరా లేక పోయినా ఫర్వా లేదు. వాళ్లిద్దర్నీ చూసి తాను పెద్దగా కేకలు వేస్తే చాలు జనం మూగుతారు. అందరిలో అతని జాతకం బయటపెడుతుంది. ఆ శైల జెవరో-అతనెవరో పది మందికీ చెప్పి-అందరి చేత ఉమ్మేయిస్తుంది. రేపు కోర్టులో-ఇప్పుడు చూసిన ఇంత మందిలో కనీసం ఒక్కరైనా వచ్చి సాక్ష్యం చెప్పకపోరు-

ఆమె డోర్ మీదచెయ్యేసి నెట్టింది. రాల్లేదు.

అంటే లోపల తలుపేసుకుని-రసలోకాల్లో విహరిస్తున్నారన్నమాట. కసిగా నవ్వుకుంది.

తృప్తిగా నిట్టూర్చింది. ఆనందంతో ఆమె శరీరం ఉప్పొంగింది.

బలంగా హేండిల్ పట్టుకుని నెట్టింది తలుపును.

నెమ్మదిగా తెరుచుకుంది తలుపు ఆమె క్షణం కూడా ఆలస్యం చేయలేదు.

ఒక్క అడుగులో-లోపలికెళ్లింది.

అక్కడ-

స్వాగత్ లేదు.

శైలజ గోడకానుకుని తననే అమితాశ్చ ర్యంతో చూస్తోంది.

స్వాగత్ బయటకెళ్లుంటాడు-లేదా లోపల బాత్రూంలో ఉండి వుంటాడు.

ఆమె పట్టరాని ఆవేశంతో వణికిపో యింది.

అందరిలా తన జీవితం సాఫీగా సాగక పోవడానికి ఆ రాక్షసుడితో పాటు ఇదిగో... వీళ్లంతా కారకులే-తన జీవితాన్ని నిలువునా నాశనం చేస్తున్న కిరాతకులు వీళ్లంతా.

కోపంతో విసురుగా వెళ్లి-ఆమె భుజాలు పట్టుకుని ఆవేశంతో అడిగింది నవ్య.

"చెప్పవే చెప్పు-ఏడీ-నీ మొగుడు-ఎక్కడ దాచావ్-చెప్పు..."

శైలజ మాట్లాడలేదు.

బ్యాలన్స్ చేసి అతి జాగ్రత్తగా నిలబెట్టిన స్తంభం-బ్యాలన్స్ తప్పి కిందపడుతున్నట్టు-

నెమ్మదిగా-ఆమె మీదికి ఒరిగింది శైలజ.

నవ్య ఆశ్చర్యపోయింది.

ఆమెను తప్పించే ప్రయత్నంలో ఆమె చేయి శైలజ వీపుకు తగిలింది.

అప్పుడు చూసిందామె.

శైలజ వీపులో బలంగా దిగబడిన కత్తిని-

చిక్కటి నెత్తుటితో ఎర్రగా తడిసి-

రక్తం అంటిన తన చేతిని-నిర్జీవంగా వున్న శైలజనూ చూసి కొన్ని క్షణాల నిశబ్దం తర్వాత-

ఆ హోటల్ ప్రతిధ్వనించేలా-

'కెవ్వు'మని అరిచింది నవ్య.

సరిగ్గా అప్పుడే-అక్కడికొచ్చిన కె.డి.రావ్ చేతిలోని కెమెరా ఫ్లాష్ క్లిక్ మంది.

*** *** *** *** ***

"మైగాడ్"

పబ్లిక్ ప్రాసిక్యూటర్ సవ్యసాచి ఆశ్చ ర్యంతో అన్నాడు. అతని చేతి వేళ్లు-ఫోన్ మీద బలంగా బిగుసుకున్నాయి.

"ఎలా జరిగింది?" నుదుటి మీద చెమ టను తుడుచుకుంటూ అడిగాడు.

"ఎలా జరిగిందో-ఎందుకు జరిగిందో అదంతా తెలీదు. ఎవరో ఆమెను ఉద్దేశ పూర్వకంగా ఆ హత్యలో ఇరికించి వుంటా రని నా గట్టి నమ్మకం ప్లీజ్...నువ్వే హెల్ప్ చేయాలి......"

ఉద్విగ్నతతో అన్నాడు స్వాగత్.

"నన్నేం చేయమంటావ్ స్వాగత్- ఎఫ్.ఐ.ఆర్. వగైరా ఫార్మాలిటీస్ పూర్తయ్యే వరకు ఆమె పోలీసు స్టేషన్లో వుండాలి-"

"అవెప్పటికి పూర్తవుతాయ్?" ఆదు ర్దాగా అడిగాడుస్వాగత్.

"చెప్పలేం-పోలీస్ డిపార్ట్‌మెంట్ విషయం నీకు తెలీనిదేముంది? ఇట్ మే టేక్ నియర్లీ....."

"ప్లీజ్ సవ్యసాచి-అవన్నీ నాకు చెప్పొద్దు. ఆమె ఓ గంటలో పోలీస్ స్టేషన్నుంచి బయటపడాలి. నీ పరపతి-నీ తెలివి తేటలు-అన్నీ ఉపయోగించు. యునో...షి ఈజ్ మై వైఫ్...."

అతని కంఠంలోని ఉత్కంఠతను-కంగారును-భార్యపట్ల అనురాగాన్ని గమనించాడు సవ్యసాచి.

కొద్ది క్షణాలు ఆలోచించాడు.

"వెల్ స్వాగత్-అయితే ఇప్పుడే నేను ఆ ఇన్‌స్పెక్టర్‌కి ఫోన్...."

"ప్లీజ్-నో ఫోన్ కాంటాక్ట్స్-పర్సనల్‌గా వెళ్లు-"

"ఓకే-నేను వెంటనే పోలీస్ స్టేషన్ కెళ్లి ఆ ఫార్మాలిటీస్ వెంటనే జరిపించమని చెప్తాను. ఈలోగా నువ్వు బెయిల్ అప్లికేషన్ సబ్‌మిట్ చేయి....."

"ఎవరికి చేయను?"

"ప్రదీప్ సక్సేనా అని ఓ క్రిమినల్ లాయరున్నాడు. బహుశా పేరు వినే వుంటావ్. ఇలాంటి కేసుల్లో ఆయన స్పెషలిస్ట్-ఇంత వరకూ ఆయన టేకాఫ్ చేసిన......"

"ఎక్కడుంటాడాయన?" ఆదుర్దాగా అడిగాడు స్వాగత్-

ఒక్క క్షణం తర్వాత చెప్పాడు సవ్యసాచి.

"ప్రస్తుతం ఫోర్టీన్త్ కోర్టులో వుంటాడు. సాయంత్రం నాలుగింటి వరకే వుంటాడాయన. ఆ తర్వాత ఆయన్ని పట్టుకోవడం చాలా కష్టం.....ఇంకో నలభై నిముషాలే టైముంది. నువ్ వెంటనే వెళ్ళి ఆయన్ని కలుసుకో-నాపేరు చెప్పు....నేను ఈలోగా ఫార్మాలిటీస్ పూర్తి చేయిస్తాను, డోంట్ వర్రీ....కంగారుపడకు...ఇలాంటి పరిస్థితుల్లోనే మనిషి....."

స్వాగత్ ఫోన్ పెట్టి-మరుక్షణం కార్లో కూర్చున్నాడు.

*** *** *** *** ***

అతని మనస్సు వేగంగా ఆలోచిస్తోంది.

పొంతన లేని ఆలోచన్లతో అతని మనస్సు క్రమంగా ఆలోచించే శక్తిని కోల్పోసాగింది. యాంత్రికంగా డ్రైవ్ చేస్తున్నాడు.

మా సాబ్ టాంక్ దగ్గర-అక్కడ రోడ్డు కడ్డంగా-

ఓ పది గజాల దూరంలో నిలబడున్న ఓ స్త్రీని చూసి-

బ్రేక్ వేశాడు స్వాగత్.

ఆమె ఒక్క ఉదుటున అతని దగ్గర కొచ్చి-దించిన డోర్‌గ్లాస్ లోంచి చూస్తూ-

"ప్లీజ్-అర్జెంటుగా రెడ్‌హిల్స్ వెళ్లాలి-డ్రాప్ చేయరూ?" అంది.

లవ్ గేమ్

స్వాగత్ వాచీ చూసుకున్నాడు.

ఇంకా ఇరవై ఐదు నిముషాల టైముంది.

ఆమె అతని అంగీకారంతో నిమిత్తం లేకుండా డోర్ తీసి అతని పక్కన కూర్చుంది.

స్వాగత్ కారుస్టార్ట్ చేశాడు.

క్రీగంట చూశాడామెను. స్నఫ్ కలర్ చీరెలో-చాలా అందంగా-హుందాగా వుంది.

"హెల్-ఈ ఆటోలతో తలపగిలిపోతోంది. మనకవసరమైనప్పుడు ఒక్కడు రాడు. అక్కర్లేనప్పుడు వెంటబడి మరీ అడుగుతారు" చిరాగ్గా అందామె.

స్వాగత్ చిన్నగా నవ్వాడు.

"సారీ ఫర్ ద డిస్టర్బెన్స్ సర్. ఇంతకు ముందు రెండు కార్లాపి లిఫ్ట్ అడిగాను. ఎవరూ ఒప్పుకోలేదు. కారున్న వాళ్లలో కూడా

మంచి వాళ్లుంటారని మిమ్మల్ని చూశాక తెలిసింది-" అంది నవ్వుతూ.

అతను తల తిప్పి ఆమెను చూశాడు.

ఆమె నవ్వు అంత అందంగా ఎందుకుందో అతనికర్థమైంది.

పైవరుస కుడిపక్కన ఉన్న పన్ను మీద పన్ను ఆమె నవ్వుకు కొత్త అందాన్ని సంతరింపజేస్తోంది.

"నాపేరు అపర్ణ-సైకాలజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్నాను-" అంది అతన్ని చూసి.

"అయాం స్వాగత్-" రోడ్డు మీద దృష్టిని కేంద్రీకరించి అన్నాడతను. పకాలున నవ్విందామె.

ఆశ్చర్యంగా చూశాడు స్వాగత్.

"చూశారా. కారులో కూర్చున్నప్పుడు రోడ్డు మీద కారుకడ్డంగా నడుస్తున్న వాళ్లను చూస్తే కోపం వస్తుంది. అదే నేను రోడ్డు మీద నడిచేటప్పుడు-కారు హారన్ వినిపిస్తే-కారున్న వాళ్ళ మీద విపరీతమైన కోపం వస్తుంది. మనిషి మనస్తత్వం ఎంత విచిత్రమైందో చూశారా?" అంది.

"సైకాలజీ స్టూడెంట్ అనిపించుకున్నారు-" అన్నాడు స్వాగత్ నవ్వుతూ-మరి కొద్ది సేపట్లో ఆమె చూపించిన ఇంటి ముందు కారాపాడు.

ఆమె కారుదిగి లోపలికి చూస్తూ అంది.

"ప్లీజ్-ఒక్క నిముషం లోపలి కొచ్చి కాఫీ తీసుకుని వెళ్లకూడదూ?"

"థాంక్స్ ఎంత ఒక్క నిముషం-" అతని చేయిపట్టుకుని అడిగింది.

సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన.

ఆ ఇంట్లోంచి-

నలుగురు వ్యక్తులు వేగంగా బయట కొచ్చి-ఆమె చెయ్యిపట్టుకుని పక్కకులాగారు-అందులో ఓ వ్యక్తి అన్నాడు.

"సిగ్గులేదురా-పెళ్లికాని ఆడపిల్లతో కార్లో షికార్లు చేయడానికి-"

స్వాగత్ షాక్‌తో అలాగే చూస్తుండిపోయాడు.

"ముందు కారు దిగు-నీ విషయం ఏవిటో ఈరోజే తేలిపోవాలి-" మరొక వ్యక్తి విసురుగా అతని చేయిలాగుతూ అన్నాడు.

ఆ చిన్న వీధిలో-అంతా ఇళ్లలోంచి బయటికొచ్చి జరుగుతున్న సన్నివేశాన్ని ఉత్సుకతతో చూస్తున్నారు.

"ఎవరు మీరు? ఏవిటీ దౌర్జన్యం?" కోపంగా అన్నాడు స్వాగత్.

"దౌర్జన్యం నీదిరా-మా చెల్లెల్ని వెంటేసుకుని-పెళ్లి చేసుకుంటానని నమ్మించి-పార్కులూ-సినిమాలకూ తిప్పుతూ-ఇంకెంత కాలం మమ్మల్ని మోసగించాలని చూస్తావ్?" పెద్దగా అరిచాడా వ్యక్తి.

స్వాగత్ కారు దిగాడు. ఆమెను చూశాడు.

ఆమెలో ఏ భావమూ లేదు. ప్రేక్షకురాలిలా చూస్తోంది.

"చూడండి. ఈమెవరో నాకు తెలీదు. కారాపి లిఫ్ట్ అడిగితే తీసుకొచ్చాను. అంతే-" అనునయంగా చెప్పాడు స్వాగత్.

పెద్దగా నవ్వారు ఆ నలుగురూ.

"మాకు తెలుసు. అవసరం తీరిన తర్వాత ప్రతి మగాడు చెప్పే డైలాగే నువ్వూ చెప్తున్నావ్-నడు ఇంట్లోకి...." విసురుగా అన్నాడో వ్యక్తి.

"ఎందుకు?" విసురుగా అడిగాడు స్వాగత్

"మీ పెళ్లి చేయడానికి-" అంతకన్నా విసురుగా అన్నాడా వ్యక్తి.

"హెల్-మీకెలా చెప్పాలా నాకర్థం కావడం లేదు. ఈ గొడవంతా ఎందుకు? మీ చెల్లెల్నే అడగండి. చెప్పండి మేడం..... జరిగింది వివరంగా చెప్పండి..." అన్నాడు

అరవై ఏళ్ల తెలుగు చిత్రాలు

1931 సంవత్సరంలో తొలిసారిగా తెరపై బొమ్మలు మాట్లాడ్డం ఆరంభించాయి. తొలి వత్సరం ముద్దుగా ఒకే ఒక చిత్రం 'ప్రహ్లాద' విడుద లయింది. తదాదిగా ప్రతీ సంవత్సరం ప్రవర్ధమాన మవుతూ, ప్రస్తుతం సంవత్సరానికి ఇంచు మించుగా 130 చిత్రాల వరకు ప్రేక్షకుల ముందుకువచ్చి పలుకరిస్తున్నాయి. నాటినుంచి నేటివరకు ఏఏ సంవత్సరంలో ఎన్ని చిత్రాలు వచ్చాయో సంఖ్యాపరంగా వివరిస్తున్నాను. 'ద' అనేవి డబ్బింగ్ చిత్రాలుగా గమనించండి.

సంవత్సరం	చిత్రాల సంఖ్య	సంవత్సరం	చిత్రాల సంఖ్య
1931	1	1962	46+18 ద
1932	2	1963	45+15 ద
1933	6	1964	42+12 ద
1934	3	1965	50+19 ద
1935	6	1966	34+13 ద
1936	11	1967	40+16 ద
1937	10	1968	56+22 ద
1938	10	1969	53+10 ద
1939	12	1970	49+17 ద
1940	12	1971	66+19 ద
1941	13	1972	56+15 ద
1942	11	1973	61+10 ద
1943	6	1974	59+11 ద
1944	6	1975	72+13 ద
1945	5	1976	86+18 ద
1946	10	1977	72+17 ద
1947	6	1978	80+15 ద
1948	7	1979	94+16 ద
1949	6	1980	163+ 8 ద
1950	16+ 2 ద	1981	99+30 ద
1951	20+ 2 ద	1982	90+44 ద
1952	26+ 2 ద	1983	107+26 ద
1953	28+ 6 ద	1984	118+49 ద
1954	27+ 2 ద	1985	110+67 ద
1955	22+ 2 ద	1986	119+43 ద
1956	27+ 5 ద	1987	121+18 ద
1957	33+ 6 ద	1988	110+22 ద
1958	31+10 ద	1989	92+55 ద
1959	38+12 ద		
1960	55+18 ద		
1961	26+28 త		

సేకరణ :
అరిపాక సూరిబాబు

స్వాగత్.

ఆమె తలదించుకుని చెప్పింది.

"అవును-నన్ను పెళ్లి చేసుకుంటాన న్నాడు-ఎన్నో మాయమాటలు చెప్పి-నమ్మిం చాడు. చివరకు-చివరకు తన అవసరానికి నన్ను వాడుకుని ఇప్పుడు నేనెవరో తెలీదం టున్నాడు. అందుకే ట్రాప్ చేసి ఇక్కడకు మీ దగ్గరకు తీసుకొచ్చాను-"

ఒక్కో మాటా బుల్లెట్ లా అతని గుండెల్లో దూసుకుపోతుంటే-

అవాక్కయి చూస్తున్నాడు స్వాగత్.

అప్పటికే పదిహేను మంది వరకూ పోగ య్యారక్కడ.

ట్రాప్!!

అవును. తను ట్రాప్ చేయబడ్డాడు.

అసహనంగా తల విదిలించి వాచీ చూసు కుని ఉలిక్కిపడ్డాడు. ఇంకా కేవలం పదిహేను నిముషాలు మాత్రమే టైముంది.

పది నిముషాల్లో తాను ప్రదీప్ సక్సేనాను కలుసుకోవాలి. లేకపోతే ఈ రోజుకు ఇక ఆయన్ని కలవడం అసాధ్యం. అంటే ఈరో జంతా నవ్య పోలీసు స్టేషన్లోనే వుండాలి-

"వెల్-చాలా అందమైన కట్టుకథ అల్లి-నన్ను మోసగించాలని చూస్తున్న మీ నటనా కౌశలానికి నా అభినందనలు. మీరూ-చెల్లెలూ గోటూ హెల్-ఐడోంట్ కేర్-"

విసురుగా అని-కారు డోర్ తీయబోతున్న అతని భుజం మీద అప్పుడు పడిందో చెయ్యి-

తల తిప్పి చూశాడు.

ప్రొఫెషనల్ గూండాలా వున్న ఓ వ్యక్తి చిన్నగా నవ్వుతూ-

"ఆడపిల్ల జీవితాన్ని నాశనం చేసి-త ప్పించుకోవడం అంత తేలిక కాదు ఎదవ నాయాలా......" అన్నాడు.

"బాస్టర్డ్....ఏం కూశావ్‌రా..." ఆవే శంతో విసురుగా అతని దవడ మీద కొట్టాడు స్వాగత్.

అంతే-

నలుగురూ ఒక్కసారిగా స్వాగత్‌ని ఎటాక్ చేశారు.

అపరరుద్రుడే అయ్యాడు స్వాగత్.

ఐదు నిముషాల్లో-అందర్నీ మట్టికరి పించి-తననే ఆశ్చర్యంగా చూస్తున్న ఆమెను చూసి-

"రాంగ్ నెంబర్ మిస్-నీ చీప్ ట్రిక్‌కి మరొకరి దగ్గర్నుంచయితే డబ్బు కొట్టేయగ లిగే వారే! బెటర్ లక్ నెక్స్ట్‌టైం-బై......"

విసురుగా కారు స్టార్ట్ చేసి వేగంగా ముందుకు దూసుకుపోయాడు స్వాగత్.

కోర్టు ఆవరణలో కారాపి-

వేగంగా వెళ్లి-అప్పుడే కోర్టుమెట్లు దిగి వస్తున్న ఓ లాయర్‌ని అడిగాడు.

"మిస్టర్ ప్రదీప్ సక్సేనా ప్లీజ్-"

లవ్ గేమ్

ఆ లాయర్ అతన్ని ఓ క్షణం చూసి నెమ్మదిగా అన్నాడు.

"అయాం ప్రదీప్ సక్సేనా-వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ!!"

*** *** *** *** ***

ఒకటి-

రెండు-

మూడు-

"నవ్యా......"

విశాలమైన ఆ కోర్టు ఆవరణలో నాలుగో మెట్టు దిగుతూ వెనక్కి తిరిగి చూసింది నవ్య.

"హి ఈజ్ మిస్టర్ ప్రదీప్ సక్సేనా-మన లాయర్-"

స్వాగత్ పరిచయం చేశాడు.

ఆరడుగుల ఎత్తులో-లావుగా-తెల్లగా-బట్ట తలతో వున్న ఆయన్ని చూసి రెండు చేతులూ జోడించింది నవ్య.

ఆమె కళ్లలో కనిపిస్తున్న నిర్లిప్తత గమనించి సక్సేనా సానుభూతిగా అన్నాడు.

"డోంట్ వర్రీ మై చైల్డ్-ఎవ్రిథింగ్ విల్ బి నార్మల్-గాడ్ బ్లెస్ యు......"

భార్గవి ఆమె చేయి పట్టుకుని నడిపిస్తోంది.

స్వాగత్-భాగ్యరాజ్ సక్సేనాతో మాట్లాడుతున్నారు.

కారులో కూర్చుని చూస్తోంది నవ్య.

స్వాగత్ లాయర్ చేతులు పట్టుకుని ఏదో అంటున్నాడు. అతను స్వాగత్ భుజం మీద సానుభూతితో తడుతున్నాడు.

ఓ ఐదు నిముషాల తర్వాత-స్వాగత్ భాగ్యరాజ్‌లు వచ్చి కారెక్కారు.

స్వాగత్ కారు స్టార్ట్ చేశాడు.

ఇంటికి వచ్చాక అడిగాడు స్వాగత్-

"చెప్పు నవ్యా-అసలా హోటల్ కెందుకెళ్లావ్-ఎవరు వెళ్లమన్నారు?" చిరాగ్గా పచార్లు చేస్తూ అడిగాడు.

నవ్య మాట్లాడలేదు.

తలదించుకుని కూర్చుంది.

"చెప్పమ్మా-మీ ఫ్రెండ్ శ్రీమతి వెళ్లమందా?" అడిగాడు భాగ్యరాజ్-

నవ్య మాట్లాడలేదు.

"శ్రీమతా?" ఆశ్చర్యంగా అడిగాడు స్వాగత్.

తాము బయటి నుంచి వచ్చే సరికి నవ్య బయల్దేరడం-ఎక్కడికని అడిగితే-శ్రీమతి కొత్త డిజైన్ నగలు చూపిస్తానందని చెప్పడం....అన్నీ వివరంగా చెప్పాడు భాగ్యరాజ్.

స్వాగత్ ఆలోచనలో పడ్డాడు.

నవ్యకసలు నగలంటే పెద్ద ఆసక్తి లేదు. ఆ విషయం పెళ్లిలోనే తెలిసింది. అలాంటప్పుడు కొత్త డిజైన్ నగల కోసం శ్రీమతి దగ్గర కెళ్తున్నానని చెప్పడం కేవలం ఏదో సాకై వుండాలి. అందుకే ఇంట్లోంచి బయటపడడానికి-ఆ మాట చెప్పి వుంటుంది. అయితే ఇక్కడి నుంచి డైరెక్ట్‌గా హోటల్‌కి వెళ్లి వుంటుంది.

అసలామెకు ఆ హోటల్ కెళ్లాల్సిన అవసరం ఏమొచ్చింది?

శైలజ ఆ హోటల్లో వుందన్న విషయం ఈమె కెవరు చెప్పారు?

అతనికంతా అయోమయంగా-గందరగోళంగా అనిపించింది. భాగ్యరాజ్ మౌనంగా సిగార్ కాల్చుకుంటున్నాడు. భార్గవి దిగులుగా నవ్యను చూస్తోంది. సూర్యం తలపట్టుకుని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో ఫోన్ మోగింది.

పక్కనే కూర్చున్న నవ్య అందుకుని-

"హలో-" అంది.

"హలో....ఎవరు మాట్లాడేది?" వినిపించిందో స్త్రీ కంఠం.

"నేను నవ్యను.....మీరు?"

"నవ్యంటే-స్వాగత్ భార్యవి కదూ....."

"అవును మీరెవరు?"

"తాళి కట్టించుకున్నదే భార్య అయితే-అది లేకుండా-స్వాగత్‌కున్న అనేక మంది భార్యల్లో-నేనూ ఒకదాన్ని అన్నట్టు ఏవిటి పాపం....నువ్వేదో హత్యానేరంలో చిక్కుకున్నావట?"

నవ్య మాట్లాడలేదు.

"డోంట్ వర్రీ-నీ మొగుడు అసాధ్యుడు మర్డర్ కేసు బనాయించగలడు-అంత తేలిగ్గానూ విడిపించగలడు. ఇంతెందుకు-అసలు నీ మొగుడి పేరు కృష్ణుడైతే బావుండేది-"

నవ్య వేళ్లు రిసీవర్ మీద బిగుసుకున్నాయి. రోషంతో-అవమానంతో ఆమె ముఖం కందిపోయింది.

ఆమె ఫీలింగ్స్ గమనిస్తున్న స్వాగత్ కంగారుగా అన్నాడు.

"ఎవరు నవ్యా.....ఎవరు మాట్లాడేది?"

ఆమె మౌనంగా ఫోన్ అతని చేతికిచ్చింది.

"హలో......" అన్నాడు స్వాగత్.

అవతల నుంచి నవ్వు వినిపించింది.

"నిజాన్ని భరించలేక పాపం మీ ఆవిడ నీకిచ్చిందా ఫోన్?"

"ఎవరు నువ్వు?"

"పది వేల మంది గోపికల్లో ఓ గోపిక పేరు చెబితే-కృష్ణుడు గుర్తుపట్టగలడా?"

"నాన్సెన్స్-ఎవర్నువ్వు?"


"సువర్ణ!"

(ఇంకా వుంది)



డ్రీమ్‌గర్ల్ హిందీ చిత్రం

టి.వి. సీరియల్ 'నూపుర్' విజయవంతం అయిన తర్వాత హిందీ కథా చిత్రం తీయాలని సంకల్పించిందట హేమమాలిని. సీరియల్ విజయవంతం కావటం తనకు ఎంతో ఆనందం చేకూర్చిందని, మరో 3 సీరియల్స్ తీస్తానని చెప్తోందట. తాను తీయబోయే కథా చిత్రం పేరు రహస్యంగా వుంచింది. కాని ఆ చిత్రంలో హీరో ధర్మేంద్ర కాదట. కారణం ధర్మేంద్ర తనమాట వినడం టోంది డ్రీమ్‌గర్ల్.



ఆశాబంధము

తిరిగితి నెన్నో దేశమ్ములఁ బడి
దొరకునె? చక్కని నెలవంచున్.
రాగము లెన్నో హాయిగఁ బాడితి
రక్తి దేనఁ గల్గునో యంచున్.

ఎక్కితి నెన్నో పర్వతమ్ములన్
చుక్కల బట్టుదునో యంచున్
వే విధమ్ములౌ ప్రేమల పోలితి
ప్రేమగుట్టు గాంతునో యంచున్.
ఇచ్చితి నెందఱికో హృదయపు ధన
మో విపందు పందునొ యంచున్
ఎన్నో పూవుల పూజల సల్పితి
నీశ్వరు కృపఁగాంతునొ యంచున్.

-బసవరాజు వేంకటప్పారావుగారు, బి. ఏ.

(1920 మే సంచిక నుంచి)

కవి

కనకు కనకు కలలు
వినకు వినకు చెడుమాటలు

కవయిత్రి

కడుపు కాలుతుందా ఆకలేసి
వద్దు వద్దు చెత్త ఇడ్లి
యింటి కెళ్ళిన తరువాత
త్రీ వెరయిటీస్ లాగించెయ్.

రచయిత

రంభ పొందు కోసం
చక్కర్లు కొట్టకు
యింటింటికి వెళ్ళి
తత్తర పడకు

పాలు

రాజుల సొమ్ము రాళ్ళ పాలు
పెళ్ళాం నగలు తాకట్టు పాలు
నెల జీతం 'బార్' పాలు
సంసారం అల్లరి పాలు!

–చొప్పరపు సత్యనారాయణ, (మంటాడ)

బస్సులు బస్సులు

మన రోడ్ల మీద
బస్సులకుదెయ్యాలు పడతాయి!
ప్రయాణీకులకు బస్సులు
సర్కస్ ఫీట్లు నేర్పే కోచింగ్ సెంటర్లవుతాయి!
నిండు గర్భిణీలు బసెక్కారా
బస్సు సీట్లే ఆస్పత్రి మంచాలవుతాయి!
కడుపులో కాస్త వేసుకుని బస్సెక్కితే
సుడిగుండా లుద్భవించి నోళ్ళు భళ్ళు మంటాయి!
బస్సు రాడ్‌ను పట్టుకుని
మనం ఉయ్యాల లూగుతాము!
ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా
శరీరాల మీద పేచ్చీలు పడతాయి!
అంతరిక్షంలో నౌకను నడపడం
పెద్ద గొప్పేమి కాదు
దమ్ముంటే – ఈ రోడ్లపై
బస్సులు నడపమనండి ఆ రాకేష్ శర్మని!
చంద్ర తలంపైనడవడం
ఘనకార్య మేమీ కాదు
ఖలేజా ఉంటే – ఈ రోడ్లపై
నడిచి చూడ మనండి ఆ ఆర్మ్‌స్ట్రాంగ్‌ని!
ఈ రోడ్లపై బస్సు ప్రయాణీకుల
సహనానికీ – శాంతి గుణానికీ
నా శతకోటి వందనాలు!

–భగ్వాన్, (లంకలకోడేరు)

సినిమా

హింసా శరణం గచ్ఛామి
బ్రేక్‌డాన్స్ శరణం గచ్ఛామి
కోట్లు శరణం గచ్ఛామి


సినీ నటి

పేరు శరణం గచ్ఛామి
డబ్బు శరణం గచ్ఛామి
వేశ్య శరణం గచ్ఛామి

పోలీసు

టోపి శరణం గచ్ఛామి
లంచం శరణం గచ్ఛామి
అధికారం శరణం గచ్ఛామి

–చలపాక ప్రకాష్ (విజయవాడ)







అడ్వొకేట్: బి.భాస్కరరావు ఎం.ఎ., ఎల్.ఎల్.బి.

కె. రమేష్, హైదరాబాద్.

ప్రశ్న: నేను ఒక డిగ్రీ కాలేజీలో డిగ్రీ రెండు సంవత్సరములు చదివి హాస్టల్‌లో ఉంటూ వచ్చాను. మూడో సంవత్సరంనకు ప్రమోట్ కాలేదు. అందుచేత కాలేజీకి వెళ్ళకుండా హాస్టల్ ఫీజు చెల్లిస్తూనే భోజనం చేశాను. ఐ. పి. ఎస్. వంటి చదువులకు ఇది నేరమై అడ్డు వస్తుందా?దయచేసి తెలుపవలెను.

జవాబు: మీరు డిగ్రీ పూర్తి చేసినట్లు వ్రాయలేదు. డిగ్రీ ప్యాస్ అయిన తర్వాత సివిల్ సర్వీసెస్ పరీక్షకు వెళ్ళండి. ఈ సంవత్సరం 28 సంవత్సరముల లోపు వారు ఈ పరీక్షకు వెళ్ళవచ్చును. ప్రిలిమినరీ పరీక్షకు దరఖాస్తులు పంపవలసిన ఆఖరు తేదీ ఫిబ్రవరి 21. మీరు డిగ్రీ ప్యాస్ అయి పరీక్షకు దరఖాస్తు పంపి వుంటే కష్టపడి చదవండి. మీరు హాస్టల్‌లో మూడో సంవత్సరం ఫీజు చెల్లించి భోజనం చెయ్యడం సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఎంతమాత్రం అడ్డురాదు. మీకు శిక్ష పడలేదు కదా!

శంకర్‌నాధ్, న్యూ నల్లకుంట, హైదరాబాద్

ప్రశ్న: హైదరాబాద్‌లో ఉన్న మా ఇంటిని 1987 ఆగస్టులో ఒకరికి అద్దెకు ఇచ్చాము. వారు 6 రూపాయల స్టాంప్ పేపర్ మీద ఒక సంవత్సరంకు అద్దెకు తీసుకుంటున్నట్లు ఎగ్రిమెంట్ వ్రాసి ఇచ్చారు. 3 సంవత్సరముల నుండి వారే కొనసాగుతున్నారు. ప్రతి నెలా వారు ఉత్తరంలో డ్రాఫ్టు పంపుతుండేవారు. గత సంవత్సరం నుండి అద్దె కట్టడంలేదు. ఖాళీ చెయ్యమన్నా చెయ్యలేదు. వారిపై కేసు వెయ్యాలంటే ఏ కోర్టులో వెయ్యాలి. వినియోగదారుల రక్షణ ఫోరమ్ అని ప్రతి జిల్లాలో ఉన్న కోర్టులో కేసు పెట్టవచ్చా? హైదరాబాద్‌లో దాని ఎడ్రస్ తెలుపవలెను?

జవాబు: మీ ఇంటిలో అద్దెకు ఉన్నవారు అద్దె చెల్లించలేదు. గనుక హైదరాబాద్‌లోని రెంట్ కంట్రోలర్ కోర్టులో ఎవిక్షన్ కొరకు దావా వెయ్యండి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లక్ష్మీనారాయణ మదన్‌లాల్ కేసులో అద్దె బాకీ వున్నందున ఇల్లు ఖాళీ చెయ్యవలెనని 1986 లో తీర్పు చెప్పారు. మీ కేసు డిస్ట్రిక్ట్ ఫోరమ్‌లో వెయ్యకూడదు. వినియోగదారుని రక్షణ చట్టము (కన్స్యూమర్ ప్రొటక్షన్ ఏక్ట్, 1986) క్రింద ప్రతి జిల్లాలోను జిల్లా జడ్జి అధ్యక్షుడుగా మరియు ఇద్దరు నాన్- అఫిషియల్ మెంబర్లు కలిపి జిల్లా ఫోరమ్‌లు ఏర్పాటు అయినవి. ఈ డిస్ట్రిక్ట్ ఫోరమ్‌లో వినియోగదారులకు అన్యాయం జరిగినట్లు అయితే కంప్లయింట్ పెట్టవచ్చును. ఈ జిల్లా ఫోరమ్ లక్ష రూపాయల వరకు కంపెన్సేషన్ చెల్లించమని తీర్పు చెప్పవచ్చును. హైదరాబాద్‌లో స్టేట్ కమీషన్ ఉన్నది. ఈ స్టేట్ కమీషన్ జిల్లా ఫోరమ్‌ల నుండి వచ్చిన అప్పీలు విచారిస్తుంది. పది లక్షల రూపాయల వరకు కంపెన్సేషన్ ఇవ్వవలెనని తీర్పు చెప్పగలదు. ఢిల్లీలో నేషనల్ కమిషన్ ఉన్నది. స్కూటర్లు, టి. వి. లు, టెలిఫోన్ లేదా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ వారి వలన కన్స్యూమర్‌కు నష్టం కలిగినట్లయితే కంప్లయింట్ పెట్టవచ్చును. ఆటో డ్రైవర్ మీటర్‌మీద వెళ్ళనప్పుడుకంప్లయింట్‌పెట్టవచ్చును. ఇక మనము కొన్న వస్తువులలో తూకము, నాణ్యత, పరిమాణము, పరిశుద్ధత లోపించినా కంప్లయింట్ పెట్టవచ్చును. నేను ఈ వినియోగదారుని రక్షణ చట్టము (1986), నిబంధనలు, వ్యాఖ్యానములతో లా గ్రంథము వ్రాశాను. విశాఖపట్నం ఆంధ్రా లా హౌస్‌వారు ప్రచురిస్తున్నారు.

ఎస్. సింహాచలం, నర్సీపట్నం (విశాఖజిల్లా)

ప్రశ్న: మా తల్లిదండ్రులు నన్ను 3 నెలలు అబ్బాయిగా ఉన్నప్పుడు మా చిన్నాన్నగారికి దత్తత ఇచ్చారు. కాని దత్తత చేసికొన్నట్లు కాగితాలు, ఏవీ వ్రాయలేదు. మా నాన్నగారు 1979లో మరణించారు. మా అమ్మగారు ఉన్నారు. నన్ను పెంచిన కొన్నాళ్ళకు ఆడపిల్ల పుట్టినది. అప్పటి నుండి అశ్రద్ధగా చూశారు. నేను 8వ తరగతి ప్యాసయ్యాను. 18 సంవత్సరములు నిండిన తర్వాత మా చిన్నాన్న పేరుపై పెండ్లి కార్డులు కొట్టి నాకు పెండ్లి చేశారు. కొన్నాళ్ళకు నన్ను, నా భార్యను ఇంటి నుండి తరిమివేశారు. నాకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చినది. నాకు ముగ్గురు పిల్లలు. మా చిన్నాన్న వచ్చే నెలలో రిటైర్ అయిపోతున్నాడు. ఈ డబ్బును మా బావమరిది, మా పిన్ని కాజేయబోతున్నారు. ఈ విషయమై నాకు వాటా వచ్చేటట్లు సలహా ఇవ్వరూ?

జవాబు: మిమ్ము దత్తత చేసుకొన్నట్లు పత్రము లేదు. సాక్ష్యాధారాలు ఉన్నట్లయితే దావా వెయ్యవచ్చును.

శ్రీ కొండ నవీన్, గూడూరు

ప్రశ్న :"అన్వేషణ" ప్రాథమిక హక్కుగా ఏవి దేశాలలో పొందుపర్చారు?

జవాబు : మన భారత రాజ్యాంగములో మాత్రం లేదు!

ఆంధ్రసచిత్ర వారపత్రిక

న్యాయ చట్టం-ప్రశ్నలు జవాబులు

ప్రశ్న: ....

పేరు: ....

పూర్తి చిరునామా: ....

....

విలువ

చెంగల్వ

"నమస్కారమండి!" అన్న గొంతు విని తలెత్తి చూసాను.

"ఓ౯. మీరా! రండి" అంటు ఎదురు వెళ్లి సాదరంగా ఆహ్వానించాను.

వచ్చింది శరత్‌చంద్ర. అతనితో నా పరిచయం ఏమంత ఎక్కువ కాదు. అయినా అతనో రచయిత అని తెలిసాక అదో రకమైన ఆత్మీయత లాంటిది ఏర్పడింది. నాకున్న సాహిత్యాభిరుచి అందుకు కారణమేమొ లేదా నాకు తెలిసిన రచయిత అతనొక్కడే కావటమొ.

"బావున్నారా? ఏంటి సంగతులు" అడిగాడు శరత్‌చంద్ర.

"బావున్నానండి, ఎవరి దగ్గర్కి వచ్చారు?" డైరెక్ట్‌గా ఎందుకని అడగలేక అలా అడిగాను. అతన్ని కలిసి దాదాపు ఓ రెండు నెలలు అయివుంటుంది.

ఏం మాట్లాడక పోవటం చూసి అతని మొహంలోకి చూసాను. ఎటో చూస్తున్నాడు. మనిషి కాస్త చిక్కిపోయాడు. గడ్డం చేసుకో లేదు.

"ఒక్క నిమిషం" అని లేచి లోపలికి నడిచాను. ఏదో అడగటానికి వచ్చి మొహమాట పడుతున్నట్లున్నాడు. అమ్మో! ఒక వేళ అదే అడగటానికి వచ్చాడేమొ.... నా గుండె వేగం ఒక్క సారిగా పెరిగిపోయింది. స్వతహాగా నేను మంచివాడినే. ఆ ఒక్క విషయంలో తప్పించి ఇతరులకి చేతనైనంతగా సహాయపడాలనే మనస్తత్వం నాది. నాకున్న ఇన్‌ఫ్లుయెన్స్‌తో చాలా మందికి ఉద్యోగాలు ఇప్పించాను, లోన్లిప్పించాను, ఎన్నో వ్యాపార ఒప్పందాలు కుదిర్చాను. ఎందరివో కూలిపోతున్న సంసారాలు నిలబెట్టాను. నా సలహాలు పాటించి ఎందరో బాగు పడ్డారు. ఎటొచ్చి ఆ ఒక్క విషయంలో మాత్రం ఎవరికి ఇంత వరకు సహాయం చేయలేదు. అందుకే నన్ను కొందరు పిసినారి శ్రీకాంతరావు అని అంటారు. అదేంటో ఎవ్వరైనా సరే నన్ను డబ్బు అడిగితేచాలు, ఏదో చేదు తిన్నట్టు అయిపోతుంది. ఎంత ప్రయత్నించినా "లేదు", "సారి", "ఆ విషయం తప్పించి ఇంకేమన్నా సరే అడగండి, తప్పకుండా చేసి పెడతాను" అన్న మాటలు తప్పించి ఇంకేవి రావు. అందుకే పిసినారి శ్రీకాంతరావు పెళ్లి చేసుకోక పోవటానికి కారణం కూడా అదే అంటారు. కాస్త సహృదయులు అంటే నా సహాయం పొందిన వారు మాత్రం చంద్రుడికి మచ్చలాగా శ్రీకాంతరావుగారికి పిసినారి తనం అదో రకమైన శోభ తెచ్చింది అనటం కూడా విన్నాను. ఇక్కడ శోభ అంటే అవి తిట్లో - మెచ్చుకోలో అర్థం సందర్భానుసారం మారుతు ఉంటుంది.

ఓ గ్లాసులో మంచినీళ్లు తీసుకెళ్లి "తీస్కోండి" అని శరత్‌చంద్ర చేతికి అందించాను.

"అబ్బె - అవసరం లేదండి" అంటూనే అందుకున్నాడు.

అవి త్రాగాక, సాలోచనగా అడిగాను "ఇందాక ఏదో చెప్పారు."

"ఏం లేదండి! మీరు కొంచెం సహాయం చేయాలి" అన్నాడు చాలా ఇబ్బంది పడిపోతున్నట్టు.

"ఏం చేయమంటారు చెప్పండి!" సవినయంగా అడిగాను.

"ఒక్క విషయం అంటె ధన సహాయం తప్పించి" రెండో మాట నా గొంతునుండి బయటకి వచ్చినట్టు లేదు, కారణం శరత్‌చంద్ర పట్ల నాకున్న గౌరవ భావం కావచ్చు లేదా అతన్నా స్థితిలో చూడటం వల్ల జాలి వేసిందనచ్చు. అలాగని నేనతనికి ధనసహాయం మాత్రం చేయలేను. డబ్బంటె నాకు ప్రాణం, ఎలా ఇవ్వగలను చెప్పండి. అంతెందుకు ఒక సారి మా నాన్నగారు వచ్చి "ఒరెయి! క్రితం సంవత్సరం పంట సరిగ్గా లేదు. ఈ సంవత్సరం కూడా వర్షాలు తగినంత పడే అవకాశాలు లేవని అంటున్నారు. అందుకే మన పొలానికి బావి తవ్వించి పంప్‌సెట్ వేయించాలనుకుంటున్నాను, ఓ ఏడెనిమిది వేలు నువ్వు సర్దాలిరా!" అన్నారు. నాకు ఏడెనిమిది వేలు ఓ లెక్కకాదు. ఆయన తదనంతరం ఆ పొలం- ఆస్తి నాకే వస్తాయని నాకు తెలుసు. కానీ అవేవి నాకు వద్దని ఏనాడో నాన్నగారికి చెప్పేసాను ఎందుకంటె నాకు నైతికంగా వాటిమీద ఏ హక్కులేదు. కారణం ఎప్పుడో, నాకు పది పన్నెండేళ్ల వయసులో ఓ సారి పొలానికి వెళ్లాను. ఆ తరువాత ఇంత వరకు వాటి ఛాయలకి వెళ్లలేదు.

నిర్మొహమాటంగా నేను డబ్బు సర్దను అని చెప్పేసాను. ఆయన ఆశ్చర్యపోయారు. ప్రలోభ పెట్టారు. నేను లొంగలేదు. బెదిరించాడు. నేను భయపడలేదు. చివరికి తనాస్తి అంతా అనాధశరణాలయానికి రాసేస్తా నన్నాడు. నేను సంతోషంగా అంగీకరించాను. కొన్ని శాపనార్థాలు పెట్టి మరీ వెళ్లి పోయాడు. అలాంటి నేను ఇంకెవరికన్నా ధనసహాయం చేయటం అన్న మాట వట్టిది. ఇక్కడ ఇంకో విషయం మీకు తెలియాలి. మా అమ్మ నాన్నగార్లకు నేను ఒక్కడినే సంతానం. నాకు పదేళ్ళ వయస్సులోనే అమ్మ మరణించింది. పన్నెండు ఏళ్లు వచ్చేవరకు మా ఊరి బడిలోనే చదువుకున్నాను. ఆ తరువాత చదువుకోటానికి దగ్గర్లోనే ఉన్న టౌన్‌కి పంపించారు నాన్నగారు. పోను నాలుగు మైళ్లు, రాను నాలుగు మైళ్ళు గుర్రపుబండి ప్రయాణం. దాంతో చాలా అలసిపోయే వాడిని, అది గమనించిన నాన్నగారు నన్ను టౌన్లోనే ఉంటున్న మా ఊరి మునసబు గారి అబ్బాయి సుందరంతో పాటే ఉంచేసాడు. సుందరం నాకంటె ఓ ఆరేడు ఏళ్లు పెద్ద, చాలా విశిష్టమైన వ్యక్తి. పగలంతా ప్రెస్‌లో పని చేసి రాత్రిళ్లు కాలేజిలో చదువుకునే వాడు. అతని సహచర్యం నా జీవితాన్ని ఓ మలుపు తిప్పిందని చెప్పచ్చు. కొన్ని రోజులు గడిచాక చిన్నగా అన్ని విషయాలు చెప్పసాగాడు. స్వశక్తిపై ఆధారపడి చదువుకోవటం చాలా గొప్ప విషయం అని, అందరు అలా చేయలేరని చెప్పాడు. తల్లితండ్రులపై ఆధార పడకుండా వారి కోరికలు తీర్చగలగటం, అంటే బాగా చదువుకొని మంచి ఉద్యోగం సంపాయించటం లాంటివి, ఇలాంటి అవకాశాలు చాలా, అరుదుగా వస్తాయని అన్నాడు. ఊరందరికి ఆదర్శం అవుతామని చెప్పాడు. ఆ ఉపదేశాల్లోని లోటుపాట్లు తెలిసే సరికి ఆలస్యం అయిపోయిందే అనుకోండి, అది వేరే విషయం.

మరో సంవత్సరం గడిచింది. సుందరం నా మనసుని పూర్తిగా ఆక్రమించుకున్నాడు. ఊరు వెళ్లినప్పుడు నాన్నగారు ఇచ్చిన డబ్బుని తిరస్కరించాను. సుందరంలా బ్రతకటానికి నిశ్చయించినట్లు చెప్పాను. ఆయన ఆశ్చర్యపోయారు. అంత వరకు సుందరం స్వతంత్రంగా బ్రతుకుతున్నట్లు ఆయనకి కూడా తెలియదు. మునసబు గారే చదివిస్తున్నారు అనుకున్నారు. "పిచ్చి పిచ్చి వేషాలు వేయక, డబ్బు తీసుకెళ్లి వళ్లు దగ్గర పెట్టుకొని చదువుకో" అన్నారు. నేను ఒప్పుకోలేదు. అది మొదటిసారి నేను ఆయన్ని ఎదిరించటం. మాట- మాట పెరిగింది. ఆయన నాపై చేయి చేసుకున్నారు. నాకు పౌరుషం వచ్చి ఆ రాత్రే ఎవరికి చెప్పకుండా టౌన్‌కి చేరుకున్నాను. సుందరం తనతోటే ఉండమన్నాడు. మళ్లీ నాన్నగారు వచ్చి బలవంతంగా తీసుకు వెళతారేమో అన్న భయం వ్యక్తపరిచి, అతనికి తెలిసిన వారున్న వేరే టౌన్ ఏదన్నా ఉంటే అక్కడ వారి ఎడ్రస్ చెప్ప మన్నాను. ముందు సుందరం ఒప్పుకోలేదు. నాన్నగారు చెప్పినట్లు వినమని సలహా ఇచ్చాడు. కానీ నేను పట్టు బట్టటంతో విజయవాడలో ఓ హోటల్ సర్వర్‌గా పని చేస్తున్న స్నేహితుని ఎడ్రస్ ఇచ్చాడు. అలా ప్రారంభం అయింది నా స్వంత జీవితం. ఎలాగన్నా సరే కష్టపడి డిగ్రీ పూర్తి చేసి, మంచి ఉద్యోగం సంపాయించి తిరిగి ఊరికి వెళ్లాలన్నది నా ఆశయం. ఎన్నో ఊళ్లు

తిరిగాను, ఏమిటేమిటో పన్లు చేసాను. మొత్తానికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసాను. చదువు పట్ల నాకున్న ఆసక్తి గమనించి సదాశివరావు మాస్టారు చాలా రకాలుగా సహాయపడ్డారు. చివరికి ఆయన సహాయంతోనే ఇప్పుడు పని చేస్తున్న కంపెనీలో క్లర్కుగా చేరాను. నేడు నేనే దానికి మేనేజర్ని.

నా స్వానుభవం మీద తెలుసుకున్న విషయం ఏమిటంటే "ప్రపంచంలో డబ్బు తరువాతే అన్ని."

మొదట్నించి డబ్బుకై కిటకిటలాడి పైకి రావటం మూలాన పొదుపు అతి ఎక్కువగా పాటించటం అలవాటైంది. చాలా సార్లు డబ్బు అప్పిచ్చి మోసపోయాను. ఇక జీవితంలో ఎవరికి ధనసహాయం చేయకూడదని నిశ్చయించుకున్నాను.

కొందరు వడ్డీ కూడా ఇస్తామన్నారు. నా దృష్టిలో వడ్డీ తీసుకోవటం జలగలా రక్తాన్ని పీల్చటం లాంటిది. దానికి కూడా ఒప్పుకోలేదు.

ఇక పెళ్లి చేసుకోక పోవటానికి ప్రత్యేకంగా కారణం ఏమిలేదు. చేస్కుందాం, ఇంకా చాలా వయసుంది.

"రావుగారు – రావుగారు" అని నా భుజాల్ని పట్టుకొని ఊపేస్తున్నాడు శరత్‌చంద్ర. అతని ముందు అంతటి ఆలోచనల్లో మునిగిపోవటం కొంచెం సిగ్గుగా తోచింది.

"సారి అండి! ఏవో జ్ఞాపకాలు– ఆలోచనలు!" అన్నాను.

"అందుకేనండి పెళ్లి చేసుకోమని చెప్పేది." అన్నాడు నవ్వుతు. నవ్వుతూనే అడిగాను "ఇంతకి ఏంటి చెప్పారు."

అతని మొహంలో నవ్వు మాయం అయింది.

"ఏం లేదండి! ఓ ఎనిమిది వందలు కావాలి, నా రెమ్యునరేషన్ రాగానే ఇచ్చేస్తాను." ఎంతో అవమానం జరిగినట్లు అడిగాడు.

నా గుండెల్లో రాయి పడింది.

నేనేం మాట్లాడక పోవటం చూసి తనే చెప్పసాగాడు– దాదాపు మూడు వేలు రావాలండి "కాంతిదీపం" నుండి. హరికేవో ఆర్థిక ఇబ్బందులు గత ఎనిమిది నెలలుగా అక్కడ నుండి ఏమి రాలేదండి. మిగతా చోట్ల నుండి అప్పుడప్పుడు ఎమ్. ఓలు వస్తున్నాయి గానీండి సరిపోవటం లేదు. మొన్నీ మధ్యే ఓ నవల "సుప్రభాతం" ఎడిటర్‌గారికి ఇచ్చాను తప్పకుండా పబ్లిష్ చేస్తానన్నాడు. అదే జరిగితే ఓ రెండు వేల వరకు వస్తుందండి. ఇవే కాకుండా ఇంకా చాలా ఎమ్. ఓలు రావాలండి. ఒకటి మాత్రం నిజమండి నా రచనలు ఏవి తిరిగి రావు కానీ రెమ్యునరేషనే టైంకి అందటం లేదండి." ఓ సారి నా మొహంలోకి చూసి తిరిగి మొదలు పెట్టాడు." మా ఇంటి అద్దె కట్టి నాలుగు నెలలు అయిందండి. ఇంటాయన వచ్చి కూర్చున్నాడు. అద్దె ఇవ్వకపోతే సామాన్లు బయట పారేస్తానన్నాడు. మీరే ఆదుకోవాలి."

నాగుండె వేగం పెరిగి పోయింది. "అది తప్ప ఇంకేమన్నా సరే అడగండి తప్పకుండా చేసిపెడతాను [illegible] మాటలకి [illegible]. మీరలా మాట్లాడకండి, నన్ను ఈ పరిస్థితుల్లో ఆదుకోగలిగిన వారు మీరొక్కరే, ఇప్పటికే తెలిసిన వారందరి దగ్గర అప్పు తీసుకున్నాను." తల వంచుకొని చెప్పాడు.

"తీర్చలేదని" నాకు అర్థమైంది.

నా నుండి ఏ జవాబు లేదు.

"పోనీ ఓ పని చేస్తాను సార్!"

ఎంతటి దీనస్థితిలో ఉన్నాడో ఆ సంబోధన వల్ల అర్థమైంది.

"నా ఎడ్రస్ మారిందని అన్ని పత్రికలకి ఉత్తరాలు రాసి, కొత్త ఎడ్రస్ అని మీ ఎడ్రస్ ఇస్తాను. పోస్ట్‌మెన్‌కి కూడా మీ ముందే చెప్పి కావాలంటే ఆథరైజేషన్ లెటర్ కూడా ఇస్తాను. మీ అప్పు తీరిన తరువాత నాకు వచ్చే రెమ్యునరేషన్ తీసుకుంటాను. ప్లీజ్! కాదనకండి సార్, ఇంకెప్పుడు మిమ్మల్ని ఒక్క నయాపైసా కూడా అడగను–" అంటు కుర్చీలోంచి లేచి నా దగ్గర్కి వచ్చేసాడు.

"సారి చంద్రంగారు! నా దగ్గర ఇప్పుడంత డబ్బులేదు" అన్నాను.



ఇవ్వటం నాకిష్టం లేదు.

"ప్లీజ్ మీరలా అనద్దు, మీరు ఆదుకోకపోతే వీధినపడతాను. పోనీ ఇంకో పని చేయండి ఇప్పుడు [illegible] పది కథలున్నాయి [illegible] రెండు [illegible]లున్నాయి. అవి మీరు [illegible] ఎంత కొంత ఇవ్వండి మీకు రచయిత కావాలని ఎంతటి కోరికో నాకు తెలుసు సార్! అని ఓ క్షణం ఆగాడు." వాటిలో కొద్దిపాటి మార్పులు మీ ఇష్టం ఉంటే చేస్కోండి, లేదా వాటని అలానే మీ పేరు మీదే పంపించుకోండి. నేనెవరికి ఈ సంగతి చెప్పను. వాటి మీద ఎంత రెమ్యూనరేషన్ వచ్చినా మీరే తీసుకోండి. ఒక్క పైసా కూడా నాకు ఇవ్వవలసిన అవసరం లేదు. నా తల్లి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను ఈ విషయం నా ప్రాణం పోయినా ఎవ్వరికి చెప్పను." అతడి గొంతులో నిజాయితి ఓ రకంగా నన్ను కదిలిచ్చి వేసింది. నాకు రచయిత అవ్వాలన్న కోరిక ఎన్నాళ్ళుగానో ఉంది. అప్పుడెప్పుడో ఓ సారి నాక్కూడా కథలు రాయటం నేర్పించమని ఈ శరత్‌చంద్రనే అడిగాను. "అదేమంత బ్రహ్మవిద్య కాదండి, తల్చుకుంటే మీరు కూడా వ్రాయచ్చు" అన్నాడు. ఆ తరువాత కొంతకాలం నేను ప్రయత్నించి చేతకాక వదిలేసాను. అనుకోకుండా ఇప్పుడా అవకాశం వచ్చినట్టు అన్పించింది.

శరత్‌చంద్ర రచనలు ఎంత గంభీరంగా ఉంటాయో అంత ఆహ్లాదంగాను ఉంటాయి. నిత్యం మన చుట్టు తిరుగాడుతు ఉండే వారిలో నుండి కొన్ని పాత్రల్ని ఎన్నుకొని వాటి ద్వారా ఏదో ఓ నీతి బోధిస్తున్నే కథ నడుపుతాడు.

అయినా అతను రాసిన కథల్ని నా పేరు మీద పంపించుకోవటానికి నా మనసు ఒప్పుకోలేదు. కానీ నన్ను కూడా సమాజం ఓ రచయితగా గుర్తిస్తుంది, నా కీర్తి పెరుగుతుంది. అసలు నా వంటి బాధ్యతాయుతమైన పదవిలో వుండి రచనలు చేస్తున్నారంటే వారికి లభించే గౌరవాభిమానాలే వేరు.

"నీ రచనలని నా కెప్పుడిస్తావు!" అంగీకారాన్ని ఇన్‌డైరెక్ట్‌గా తెలిపాను. ఏకవచనం ప్రయోగించినా ఏం పట్టించుకోలేదు. కాదు పట్టించుకునే స్థితిలో లేడు శరత్‌చంద్ర.

"ఇప్పటంటి ఇప్పుడే తెచ్చివ్వగలను సార్, కానీ ఇంటాయన కూర్చొనున్నాడు." తన అసమర్థతని తెలియచేసాడు.

"ఎంత కావాలన్నావు."

"ఎనిమిది వందలు సార్!" గొంతులో కొంచెం అనుమానం నేను లోపలి గదిలోకి నడిచాను. నే

చేస్తోంది తప్పు అని ఓ ప్రక్క అంతరాత్మ గొంతు చించుకొని అరుస్తోంది. రచయిత అన్న పదం నా పేరుకి జోడించబడితే వచ్చే కీర్తి నాలోని స్వార్థానికి సూర్యుని వెలుగులా కనిపించి అంతరాత్మని తరిమి కొట్టింది.

బీరువాలోంచి డబ్బులు తీసాను, మూడు వేలకి

విలువ

పైగానే ఉన్నాయి.

[illegible]

బయటికొచ్చి శరత్‌చంద్రకి అందించాను. అతను లెక్క పెట్టుకునే లోపే "మిగతావి రేపు పొద్దున్నే వచ్చి తీసుకెళ్ళు" అన్నాను. "రచనలు ఇచ్చాకే మిగతాది" అని అతనికి అర్థం అయ్యే ఉంటుందని నాకు తెలుసు. అతని కళ్ళు అదో రకమైన కాంతి నింపుకోవటం గమనించాను. గండం గట్టెక్కినట్లే అన్న భావం కనపడింది.

అది మొదలు శరత్‌చంద్ర తను రాసిన ఏకథైనా, నవలైనా తీసుకొచ్చి నాకు ఇచ్చేవాడు. అది చదివి నాకు తోచినంత ఇచ్చేవాడిని. ఆ తరువాత మరో రెండు సార్లు చదివి అక్కడక్కడా శైలి మార్చి, ఏవన్నా మార్పులు అవసరం అనుకుంటే అవి కూడా చేసి నాపేరు మీద పత్రికలకి పంపించసాగాను.

మనిషి!

ఆ వరిగడ్డి కుప్పలు
ఏనుగులు నిలుచున్నట్లున్నాయి!
అవును... మరి ఎడ్లు వాటిని
తినేసి బలాన్ని పుంజుకుంటాయి,
నేలనుదున్ని పంటలను
పండిస్తాయి!
కాని పరబ్రహ్మ స్వరూపమైన
అన్న పానీయాలను సేవిస్తూ
మనిషిమాత్రం
విషాన్ని గ్రుమ్మరిస్తాడు!
ఆ నీచస్వభావాన్ని
వదలుకున్ననాడే
ప్రకాశమానంగా వెలుగొందుతాడు!

-జి. శ్రీశైలం

చిన్నగా నాక్కూడా ఓ రచయితగా గుర్తింపు వచ్చింది. నేను పొందిన మరో లాభం ఏమిటంటే ఏ కథకి గానీ నవలకి గానీ నేను శరత్‌చంద్రకి ఇచ్చిన డబ్బుకంటె నాకు ఎక్కువ పారితోషికమే లభించేది. ఆ రెంటిటిలో తేడాలన్ని ఓ డైరీలో రాసిపెట్ట సాగాను.

ఓ సంవత్సరం గడిచింది.

ఏ నాడు శరత్‌చంద్ర ఇంత కావాలి అని అడగలేదు. పైగా ఇచ్చిన మాట ప్రకారం ఎవ్వరికి ఈ విషయం చెప్పలేదు.

హటాత్తుగా నాకు ఓ రోజున ఓ ఉపాయం తట్టింది. "నేనే ఎందుకు కథలు రాయకూడదు" అని– వెంటనే ఆచరణలో పెట్టాను. శరత్ కథల ప్రభావం దానిపై స్పష్టంగా కనిపించింది. శరత్‌కి కబురు పెట్టాను. వచ్చాక నేను రాసిన కథ చూపెట్టాను. చదివి కొన్ని మార్పులు సూచించాడు. అవి అంతవరకు నాకు తట్టనందుకు సిగ్గు పడ్డాను. ఆ రోజే పోస్ట్ చేసాను.

తన స్వంత ఊరిలో ఏదో పని ఉందని శరత్‌చంద్ర ఆ మర్నాడు రైలు ఎక్కాడు.

అనుకున్న విధంగా అనుకోండి, లేదా అంతకు ముందు ఉన్న కీర్తి - ప్రతిష్ఠల కారణంగా ఆ (స్వంత) కథ అచ్చైంది. ఆ తరువాత సంచికలో నా (స్వంత) కథకి సంబంధించి కొన్ని విమర్శలు వచ్చాయి. ఎప్పటి స్థాయిలో లేదని కొందరు పాఠకులు ఉత్తరాలు రాసారు. అంతకుముందు అంటె ఆ కథని అచ్చులో చూసుకున్నప్పుడు నాకు కలిగిన ఆనందం ఇంతా అంతా కాదు. అది వర్ణించలేను. కానీ దాన్ని పంచుకోవటానికి నాకు ఎవరు కనబడలేదు. ఎవరితోటి ఆ ఆనందానికి కారణం చెప్పలేను, అలాగని మామూలుగా ఉండలేను.

విమర్శలకి సమాధానం చెప్పాల్సిన అవసరం లేక పోయినా, నాకు తెలియాలికదా? శరత్‌చంద్ర కోసం కలవరించసాగాను. మరో రెండు రోజుల తరువాత వచ్చాడు అతను. అతని చేతిలో నా (స్వంత) కథ అచ్చైన సంచిక ఉంది. అతని మొహంలో తాండవిస్తున్న నిష్కపటమైన ఆనందాన్ని చూసి ఆశ్చర్య పోయాను. నా జీవితంలో అంతటి ఆశ్చర్యపడే అవకాశం లేదు.

"చూసారా మీరు కూడా వ్రాయగలరు అని చెబితే ఆ రోజు నమ్మలేదు. నాకు చాలా సంతోషంగా ఉందండి" అంటు తను తెచ్చిన ఓ స్వీట్‌ని నాకు అందించాడు.

నాకు మాటలు రాలేదు. ఇక మీదట తన కథలు తీసుకోరేమో (కొనరేమో) అన్న అనుమానం గాని భయం గాని మచ్చుకైనా అతనిలో కనబడలేదు. నా కథ అచ్చైనందుకు అతడు మాటల్లో వ్యక్త పరచిన దానికంటే ఎక్కువ సంతోషంగా ఉన్నాడు.

నా మనసు వికలమై పోయింది. ఇటువంటి విశాల హృదయం ఉన్న ఉన్నతుణ్ణా నేను ఇంతకాలం స్వార్థానికి వాడుకుంది. సంచలనాత్మక రచయితగా పేరు పొందింది నేను, కృషి ఇతనిది. నాలో అంతర్మథనం ఆరంభమైంది.

"ఒక నిమిషం కూర్చో" అని చెప్పి లోపలి గదిలోకి నడిచాను. బీరువా తెరచి డైరీలో శరత్ ద్వారా సంపాయించింది ఎంతో చూసాను. పెద్ద మొత్తమే. చెక్ బుక్ తీసుకొని ఆ అంకె వేసి సంతకం పెట్టాను. అది తీసుకెళ్ళి శరత్ చేతిలో పెట్టాను.

అతనికి ఏమి అర్థం కాలేదు.

"నన్ను క్షమించండి శరత్‌చంద్రగారు. దయచేసి మీరేమీ మాట్లాడకండి. మీ దృష్టిలో తప్పు కాదన్నా నేను చేసింది మాత్రం తప్పు... ఇది మీ రచనల ద్వారా నేను సంపాయించిన డబ్బు మాత్రమే. కీర్తికి విలువ కట్టలేను. అందుకని నేనే మీకు రుణపడి ఉన్నాను. మీ కెప్పుడు అవసరం ఉన్నా నిర్మొహమాటంగా అడిగి తీస్కోండి" అన్నాను. నాకు నిజంగా చాలా సంతృప్తిగా ఉంది ఇప్పుడు..

పాముపగ



కాకాని కమల

"ఆ.... గాలివాన వచ్చేదెప్పుడు? మీ కామందు చచ్చేదెపుడు? ఊరంతా దోచుకు తిన్నాకనా? ఆడికంట పడ్డ ఆడది మస్సైపోతూంది. అయినా అదేమని ఎవ్వరూ అడగరు సరికదా ఆడి ఎనకున్న బలగాన్ని డబ్బుని చూసి సలాం చేస్తున్నారు....."

"సలాం చెయ్యక మరేం చెయ్యమంటావ్? దొరకి కావల్సినంత డబ్బుంది. సర్కారోళ్ల పలుకుబడి వుంది. మనకి అవ్వి లేవు?"

"లేకపోతే పోనీ! నీతి నిజాయితీ అయితే వుంది గదా?" గంగడు నవ్వాడు.

"ఏం చేసుకోను పనికొస్తాయి అయ్యా! ఈ రోజుల్లో మనం మంచోళ్లకి భయపడనక్కర్లేదు. మనం భయం పడాల్సింది సెడ్డోళ్లకే... ఎందుకంటావా? చిన్న మాటసెప్తా ఇను....

.... రామచిలకలు వున్నాయి. అవ్వి అందరి జాతకాలు చెప్తాయి. కాని దాని బతుకు పంజరంలోనే. కాయకసరు తింటాయ్. ఎవర్ని ఏమనవు. అయినా అందరి కన్ను వాటి మీదే!

"కాని కాకులున్నాయి. అవ్వి దొంగవి. అన్ని ఎత్తుకుపోతా వుంటాయి. ఆఖరికి పిండాలు కూడా తినిపోతాయ్. అయినా వాటిని ఎవ్వరూ ఏమనరు. సరికదా అన్ని తలమీద తంతాయని, ముక్కులతో పొడుస్తాయని, సబ్బులు చెంచాలు ఎత్తుకుపోతాయని జాగరకత పడతారే గాని ఆ కాకుల్ని చంపాలని ఎవురైనా అనుకుంటారా?

చిలకల్ని పట్టి పంజరంలో పెట్టినట్టు కాకుల్ని ఖైదు చెయ్యాలని అనుకుంటారా ఎవురైనా?

ఎందుకంటి ఏం చెప్తాం?

ఇదీ అంతే!

అయినా మనిద్దరి మధ్యా వాదమెందుకు?. దొర వెధవ. ఆడు మంచాడు అని నేను మాత్రం అన్నానా? ఆణ్ని పాము పగబడితే నాకు మాత్రం సంతోషంగా లేదా? కాని ఏం చేస్తాం? ఆడి కంద కొలువు చేసేటోళ్లం. గనక ఆడు ఏం చెప్పిన కాదనక చెయ్యాలి. సర్లే.... ఇప్పటికే ఆలీసెం అయ్యింది. తలుపేసుకో...." అంటు గంగన్న ముల్లుకర్ర టకటక నేలని కొడుతూ వీధి గడప దాటి దొర ఇంటి వైపు కదిలాడు.

(గత సంచిక తరువాయి)

చీకట్లో కనుమరుగు అయిపోతున్న భర్తని చూస్తూ నిరాశగా నిట్టూర్చింది ఆదెమ్మ.

ఆమె సిగలో అరవిరిసి ఘుమఘుమ లాడుతున్న బొండు మల్లెలు నిశ్శబ్దంగా తలలు పక్కకి వాల్చాయి.

* * * * *

గంగన్న వెళ్లేసరికే పాముల సర్పయ్య వూర్నించి రావటం, భూషణం దొరతో వ్యవహారం చర్చించటం, ఆ మర్నాడు మొదలయ్యే కార్యక్రమం గురించి వివరించటం జరిగింది.

కారుచీకట్లో మెరిసే చిన్న కాంతి చుక్కలా పాముల సర్పయ్య నూరిపోసిన ధైర్యంతో చావు భయంతో బిగుసుకున్న భూషణం దొర శరీరంలో ఆశారేఖ చిగురెయ్యసాగింది. అంతా ఆ మర్నాటి సూర్యోదయం కోసం ఎదురు చూస్తూ ఆ రాత్రి జాగరణ ప్రారంభించారు.

సాయంత్రం.....
ఐదుగంటలు దాటుతూంది.
సంజె వెలుగు జగత్తంతా పరుచుకొంటోంది.

విషపు జంతువులు నెలవులు తప్పి సంచరించే వేళ......

ఊరుచివర....పొలాలమధ్య.....తను కొత్తగా కొన్న బంజరులో భూషణం ఏ పాము పుట్ట మీదైతే గునపం దెబ్బ వేసి తాచుపాము పగకి గురి అయ్యాడో -

సరిగ్గా ఆ పుట్ట ముందు జనం ఇసక వేస్తే రాలనట్లు ఊళ్లోని పిల్ల-పాపా, ముసలి-ముతక అంతా విడ్డూరం చూట్టానికన్నట్లు భూషణం బంజరులో నేలమాళిగలోకి తవ్వబడిన పాముల పుట్ట ముందు గుమిగూడారు.

ఆ రోజు ఉదయం సూర్యోదయానికి ముందునుంచి ఆ పుట్టముందు పూజలు జరుగుతున్నాయ్.

ఆ పూజ తంతు అంతా ఏకదీక్షగా నిర్వహిస్తున్న పురోహితుడు పాముల సర్పయ్య.

పుట్ట ముందంతా శుభ్రంగా ఆవుపేడతో అలికి 'నాగబంధం' ముగ్గు పెట్టారు.

ఆ ముగ్గు ముందు ఇరవై ఏడు చుక్కలతో జంట సర్పాల ముగ్గు ఇంకొకటి వేశారు.

భూషణం తలారా స్నానంచేసి పట్టు పీతాంబరం కట్టుకున్నాడు. పాముల సర్పయ్య భూషణం మెళ్ళో రుద్రాక్ష కాయలతో కలిపి అల్లిన నాగరంజని చెట్టు మూలికల దండని వేశాడు.

ఆ రోజంతా భూషణం వుపవాసమే.


ఒక చిన్న గ్లాసుతో ఆవుపాలు తప్పించి ఇంకేమీ నోట్లో పోసుకోలేదు.

పుట్టముందు వేసిన 'పద్మాల ముగ్గులో' పాముల సర్పయ్య చెవిలో చెప్పిన మంత్రం పఠిస్తూ కూర్చున్నాడు.

ఆయనకి కాస్త దూరంలో సర్పయ్య పుట్ట ముందు కూర్చుని ఆ రోజు ఉదయం నుంచి పూజలు చేస్తున్నాడు.

తాచు పగ పట్టిందంటే ఇరవై నాలుగు గంటల్లోగా సాధిస్తుంది.





అయితే అది పగ సాధించకముందే దాన్ని తన శక్తి యుక్తుల్తో మట్టు పెట్టాలని వ్యూహం పన్నుతున్నాడు సర్పయ్య.

తవ్విన పుట్టచుట్టు నాగవశీకరణ మూలి కల్ని పాతాడు. మంత్రం తంత్రం చదివి నాగేంద్రుని దండకం చదివి శక్తుల్ని ఆవాహన చేశాడు.

నాగరాజుకి ఎంతో ఇష్టమైన చిమ్మిలి, చలిమిడి, పానకం, వడపప్పు, పాలు, అరటి పళ్ళు వగైరా పుట్టముందు నైవేద్యం పెట్టాడు.

పుట్టముందు ఒక పథకం ప్రకారం మొదలు పెట్టిన పూజ సాయంత్రం పొద్దు వాటారే సమయానికి పూర్తయ్యింది.

పూజానంతరం....ఇంక అసలు కార్యక్రమం మొదలయ్యింది.

అప్పటికి....

సంజె వెలుగు క్రమంగా అంతరిస్తూంది.

కను చీకట్లు ముసురు కుంటున్నాయ్.

పంట పొలాల మీదుగా చల్లగాలి తిరిగింది.

పున్నాగ తోపుల్లోంచి అరవిరిసిన మొగలిపూల పరిమళం ఊరిచివర ప్రదేశాన్నంతా మత్తుగా క్రమ్ముకోసాగింది. ఆ ఘాటైన సువాసనల్ని ఆఘ్రాణించటం కోసం నాగజాతి చెట్లల్లోంచి పుట్టల్లోంచి బయటికివచ్చి పరవశంతో మైమరచి నాట్యం ఆడే ప్రదోషకాలం ఆసన్నమయ్యింది.

పాముల సర్పయ్య పుట్టముందు ముంగాళ్ళమీద కూర్చున్నాడు. ఒక్కసారి ధ్యానంగా కళ్లు మూసుకొని తమ కులదైవాన్ని స్మరించుకొని నాగస్వరం చేతుల్లోకి తీసుకున్నాడు.

ఒంట్లోని శక్తి యావత్తు వూపిరిలో బిగపట్టి నాగస్వరం వాయించటం మొదలు పెట్టాడు.

పాంబూరా (నాగస్వరం) చేతుల్లోకి తీసుకునే ముందు భూషణంకేసి తిరిగి హెచ్చరికగా అన్నాడు.

"దొరా! పాపు గనక వస్తే బెదరమాకు....కదలబోకు....ఆ ముగ్గుదాటి బయటికి రావద్దు. వచ్చావో....నాగు నిన్ను కసిదీరా కాటు వెయ్యక మానదు. ఆ ముగ్గులో మంత్రం జపిస్తూ కదలకుండా ఏకాగ్రంగ కూసున్నావో....మిగతా సంగతి నేం జూసుకుంటా" అభయం ఇస్తున్నట్లు హెచ్చరించి తిరిగి పాంబూరా అందుకొని నోటి దగ్గర పెట్టుకున్నాడు.

ఇంక....అంతే!

ఆ పాంబూరా నోటి దగ్గర పెట్టుకొని వ్రేళ్లతో నొక్కుతూ నాగస్వరం వాయించటం మొదలు పెట్టాడు.

షణ్ముఖప్రియ రాగంలో ఎత్తుకున్నాడు.

క్షణాలు గడిచి పోతున్నాయ్.

గంటలు దొర్లిపోతున్నాయ్. ఆరున్నొక్క

కృతులతో నాగస్వర వాయిద్యం రానురాను పై స్థాయికి చేరుకుంటోంది.

కేదారగౌళ, షహనా, శంకరాభరణం, నాగానందిని, పున్నాగవరళి....ఒకదాని వెంట ఒకటిగా రాగాలు నాగస్వరంలో జీవం పోసుకుంటున్నాయి.

"శిశుర్వేత్తి
పశుర్వేత్తి
వేత్తిగాన....
రసః ఫణిః"

అన్నట్లు చెట్టు పుట్టలు సైతం....ఆ గానానికి పరవశించి పోతున్నాయా అన్నట్టు స్తబ్ధంగా మారిపోతున్నాయి.

ఊరి చివర....ఆ పంట పొలాల మధ్య....మత్తైన మొగలి పూల సువాసనల్లో మైమరపిస్తూ....ఆ నాగస్వర గానం పంచమ శృతిలో ప్రకృతిని పులకరింప చేస్తోంది.

సమస్త ప్రాణులు ఆ గానామృతాన్ని ఆస్వాదించటంలో పరవశించిపోతున్నాయి.

ఒక గొప్ప విద్వాంసుడు తనలోని శక్తినంతా కూడదీసుకుని నాదాలు పలికిస్తున్నాడా అన్నట్లు పాముల సర్సయ్య నోటి దగ్గర పాంబూరా అద్భుతంగా సంగీత రాగాల్ని పలికిస్తూ చెట్లని పుట్టల్ని రాళ్లని రప్పల్ని సైతం కరగిస్తూ రసవాహినిలా పరవశింప చేస్తూంది.

పాము పగ

చుట్టూ మూగిన జనం ఆ అద్భుత గానామృతాన్ని గ్రోలి మైమరిచి పొయ్యారా అన్నట్లు వూపిరి తియ్యటంకూడా మర్చిపోయి శిలా ప్రతిమల్లా నిల్చుండిపొయ్యారు.

ఏ క్షణంలో ఏం జరుగుతుందో అన్నట్లు అంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

పాముల సర్సయ్య నోటితో నాగస్వరం వూదుతున్నా మనసులో మంత్రాన్ని పఠిస్తున్నాడు.

కళ్లు పాముకోసం వెదుకుతున్నాయి.

నాగస్వరం వూది వూది....సర్సయ్య మెడదగ్గర కండరాలు వుబ్బి ఎర్రగా మారుతున్నాయి.

నల్లగా బక్కగావుండే అతని ఛాతీ పూరీలా పొంగుతూంది.

గంటల తరబడి వూపిరి బిగబట్టి బూరా వూదటానికి అతనిలోని శక్తి చాలటంలేదు.


అయినా సర్సయ్య పాట ఆపలేదు. పాంబూరా చేతపట్టి నాగస్వరం వాయిస్తూనే వున్నాడు.

చుట్టు క్రమంగా చీకట్లు ముసురుకుంటున్నాయి.

చల్లగాలి తెరలు తెరలుగా వీస్తోంది.

ఆ గాలితో పాటే మత్తుగా మొగలిపూల పరిమళం....

ఆ పరిమళాల మధ్య ఆ గాలి తెరల మధ్య నాగస్వర వాయిద్యం....ప్రకృతిలో శ్రావ్యంగా మారు మ్రోగుతూంది.



చుట్టు పెద్ద పెద్ద పాముల పుట్టలు..... బ్రహ్మజెముడు పొదలు....దూరంగా తాటి తోపుల మధ్య మొగలి పొదలు....

ఆ నాగస్వరం తేలితేలి పుట్టల్ని చెట్టుల్ని పొదల్ని కదిలిస్తూంది. క్రమంగా చీకట్లు క్రమ్ముకోవటంతో పుట్టల్లోని నాగులు ఆ గానానికి మైమరిచి నెమ్మదిగా కలుగుల్లోంచి బయటికి తొంగిచూస్తున్నాయి.

ఒకటొకటిగా పడగలు విప్పుతున్నాయ్.

మొగలిపొదల్లో చుట్టలు చుట్టుకొని మత్తుగా పడుకొన్న నాగులుసైతం పరవశంతో పడగలు విప్పి నాట్యభంగిమలో శరీరాల్ని తిప్పటం మొదలుపెట్టాయి. వున్నట్టుండి భూషణం బంజరులో నేలమాళిగకి త్రవ్విన పుట్ట అడుగునుంచి సన్నని కదలిక మొదలయ్యింది....

పెళ్ళులు పెళ్ళులుగ భూమిలోంచి మట్టి విరిగిపడసాగింది.

పాముల సర్పయ్య మరింత వుత్సాహంతో బూరా వూదసాగాడు.

"దిగరా దిగరా నాగన్నా--
దివ్యసుందర నాగన్నా......"

రారమ్మని తనని ఎవరో పిలుస్తున్నట్లు.... నేలమాళిగలో మట్టి మరింతగ పొరలు పొరలుగ విచ్చుకోసాగింది.

తావళం తిప్పుతున్న భూషణం ఒళ్లు ఝుల్లుమంది. కళ్ళు విశాలంగా అయ్యాయి.

నాలికమీద మంత్రోచ్చారణ వేగం పెరిగింది.

అదుపుతప్పుతున్న గుండె వేగాన్ని నిగ్రహించుకుంటూ దైవాన్ని స్మరించసాగాడు.

నేల మాళిగలో పుట్ట మన్ను పెళ్ళులు పెళ్ళులుగ విరిగిపడి చూస్తూవుండగానే గుల్లబారిన నేలలోంచి ఒక పెద్ద కలుగు ఏర్పడింది.

అది గమనించిన పాముల సర్పయ్య చేతిలోని నాగస్వరాన్ని మరింతగ బిగపట్టి శరీరంలోని శక్తి అంతా నోటిలోకి తెచ్చుకొని పై స్థాయిలో మరింత హృద్యంగా వాయించసాగాడు.

బుస్స్..... బుస్స్....మంటూ మూడు బారల నల్లతాచు పడగలు విప్పి భయంకరంగా పూత్కారం చేస్తూ కలుగులోంచి సర్రుమని బయటికి వచ్చి కోరలుసాచి పడగ విసరసాగింది.

రెండు దోసిళ్ళు పట్టినట్లు దాని పెద్ద పడగ....

ఆ పడగమీద నాగముద్ర....

దానిపడగ కుడివైపున పెల్లుబికిన మాంసం కండ, గాయంలోంచి ఎర్రగా కారి చారికలు కట్టిన నెత్తుటి మరకలు ఎండిన ఆ నెత్తురు చూడగానే భూషణంకి తను వేసిన గునపం దెబ్బ జ్ఞాపకం వచ్చి గుండె గుభిల్లుమని గభాల్న ముగ్గులోంచి లేచి బయటికి పరిగెత్తబొయ్యాడు.

కాని పాముల సర్పయ్య కళ్ళు ఎర్రగా చేసి "లేవద్దు" అన్నట్లు చూపులతోనే హుంకరించటంతో మళ్ళీ చతికిలపడినట్లు కూర్చుండిపొయ్యాడు.

పాములసర్పయ్య మాత్రం అదరక బెదరక రెట్టించిన వుత్సాహంతో పొంబూరా వూదుతూ కూర్చున్న చోటునుంచి లేచి పుట్ట వెనక్కి దూరంగా 'నాగబంధం' ముగ్గువైపు జాగ్రత్తగా అడుగులు వెయ్యసాగాడు.

నల్లతాచు పడగలు విప్పి ఆడుతూంది.

దాని శరీరం పూర్తిగా కలుగులోంచి బయటికి వచ్చేసింది.

పాములవాడి నాగస్వరానికి బద్ధురాలైనట్లు దాని శరీరంలో కదలికలు మొదలయ్యాయి.

పాటకి పరవశిస్తున్నట్లు దాని పడగ ఆడుతూంది.

పాముల సర్పయ్య నాగస్వరాన్ని దాని పడగముందు దగ్గరగా పెట్టి పాడుతున్నాడు.

బూరా ఎటు తిరిగితే దాని పడగ అటు తిరుగుతూంది.

నల్లతాచు పాములవాడినే చూస్తూంది.

పాములవాడు నల్లతాచునే కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తున్నాడు.

సర్పయ్య చేతిబూరాలోని పాటలో నాగుల్ని పరవశింపచేసే మైమరపు వుంది.

వాడి చూపులో వశీకరణ వుంది. నిశ్శబ్దంగా పఠించే మంత్రంలో పాముల్ని బంధించే శక్తి వుంది.

ఈ మూడు కల్సి ఆ పగబట్టిన నల్లతాచుని పరవశింప చేస్తున్నాయి.

ప్రతి ఒక్క గొప్పవాడిలోనూ ఏదో ఒక చిన్న బలహీనత వుంటుంది.

ఆ బలహీనత ఆ గొప్పతనాన్ని పడగొడుతుంది.

తాచు భయంకరమైన జంతువు. కాలకూట విషం కక్కుతుంది.

అయినా దాని బలహీనత నాగస్వరం.

ఇప్పుడు ఆ స్వరం సర్పయ్య చేతిలో వుంది.

అందుకు పాము చెప్పినట్టు ఆడుతోంది.

పాముల సర్పయ్య పై స్థాయికి పోతూ నాగస్వరం వాయిస్తున్నాడు. పాము కళ్లల్లోకే చూస్తూ నెమ్మదిగా అడుగు వెనక్కి, బయటకు వేస్తున్నాడు.

నల్లతాచు ఆ పాటకి ఒడలుమరిచి శరీరాన్ని ఆడిస్తూ పడగవిప్పి నెమ్మదిగా కలుగులోంచి బయటికి వచ్చి పుట్టదాటి సర్పయ్య వైపుకి జరుగుతూ ఆడుతోంది.


సర్పయ్య అడుగులు వెనక్కి వెనక్కి వేస్తూ నాగబంధం ముగ్గు దగ్గరకి వచ్చి ఆగి రెట్టించిన వుత్సాహంతో బూరా వాయించటం మొదలుపెట్టాడు.

పాము అలికిన నేల మీంచి పాకుతూ నెమ్మదిగా పుట్ట దాటి నాగబంధం ముగ్గు దగ్గరికి వచ్చి ఆగిపోయింది.

ఒక్కసారి ఏదో జ్ఞాపకం వచ్చినట్లు నాలుకలు బయటికి సాచి పడగ విసిరింది.

"బుస్స్...బుస్స్......" మంటూ భయంకరంగా పూత్కారం చేసింది. అంతవరకూ నాగస్వరానికి సర్వం మైమరచిపోయిన తాచు ఒక్కసారి ఆ మైమరపు నుంచి వాస్తవంలోకి వచ్చినట్లు పడగవిప్పి బుస్సన పూత్కారం చేస్తూ, తల తిప్పి భూషణం కేసి చూస్తూ కసిగా కోరలు సాచింది.

సరిగ్గా అదేసమయంలో పాముల సర్పయ్య మంత్రాన్ని పఠిస్తూ నాగవశీకరణ మూలికని పట్టుకుని తాచు చుట్టూ నెమ్మదిగా తిప్పుతూ



మళ్లీ ఎడంచేత్తో పాంబూరా అందుకుని నోటి దగ్గర పెట్టుకున్నాడు.

ఆ మూలిక ప్రభావంతో తాచు తిరిగి భూషణంమీంచి చూపు తిప్పి సర్పయ్య పాటకి పరవశించసాగింది.

సర్పయ్య చేతుల్లో కదులుతున్న నాగస్వరానికి అనుగుణంగా పడగ కదిలించసాగింది.

పాముల సర్పయ్య మూలిక అలాగే పట్టుకొని, నాగస్వరం ఆపకుండా పాము చుట్టూ తిరుగుతూ, మధ్యమధ్య ఒడుపుగా పాముని, నాగబంధం ముగ్గులోకి తొయ్యసాగాడు.

నాగస్వరానికి మైమరచిన తాచు సర్పయ్య తనని చెయ్యిపట్టి ముగ్గులోకి తొయ్యటం గమనించటంలేదు.

సర్పయ్య తనచుట్టూ గుండ్రంగా తిరుగుతుంటే పాము కూడా అతనికి అభిముఖంగా తల తిప్పుతూ నాట్యం చెయ్యసాగింది.

అలా తిరుగుతూ తిరుగుతూ అంగుళం అంగుళం జరుగుతూ తాచు ఏ విధమైన ప్రతిఘటన లేకుండా నాగబంధం ముగ్గులోకి వచ్చింది!

అంతే!

తాచు మంత్రానికి పూర్తిగా బద్ధురాలు అయిపోయింది.

ముగ్గులోకి దిగిపోయింది.

ఇప్పుడు అది కాలకూట విషంకక్కే నల్ల తాచు కాదు.

ఒక గాలి తీసిన తోలుతిత్తి.

సర్పయ్య ఒక్కసారిగా నోటి ముందు నుంచి బూరా తీసి 'జై నాగరాజా' అంటూ ఒక్కకేకపెట్టి రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ నాగస్వరం ఊదటం మొదలుపెట్టాడు.

దాంతోపాటే కాస్త దూరంలో కూర్చున్న సర్పయ్య కొడుకు నాగన్న లేచి చేతిలోని తోలు డప్పుని తండ్రి పాటకి అనుగుణంగా వాయించటం మొదలుపెట్టాడు.

నాగబంధం ముగ్గులో నల్లతాచు చుట్టలు చుట్టుకుని అలాగే పడగ విప్పి నిశ్చలంగా వుండిపోయింది.

ఇప్పుడు అది పూర్తిగా మంత్రానికి బద్ధురాలు అయిపోయింది.

నాగస్వరానికి పరవశించి పడగ వూపటానికి కూడా సర్పయ్య అనుమతి కావాలన్నట్లు దీనంగా సర్పయ్య మొఖంలోకి చూస్తూంది.

అలా పది నిమిషాలు గడిచిన తరువాత సర్పయ్య చేతిలోని మూలికతో పాము చుట్టూ మూడుసార్లు తిప్పి, తన దగ్గరవున్న కమండలం లోంచి మంత్రజలాన్ని దానిమీద చిలకరించాడు. గర్వంగా చిరునవ్వుతో భూషణం కేసి చూస్తూ చేతిలోని పాంబూరాతో నల్లతాచుని ముగ్గులోంచి బయటికి నెట్టాడు. కాని పాము ప్రతిఘటిస్తున్నట్లు ముగ్గులోంచి బయటికి రాలేదు. లోలోపలే ముడుచుకుంది.



భూషణంతోపాటు చుట్టూ చేరిన జనం కూడా ఆ అద్భుతాన్ని చూసి నోరెళ్ళబెట్టారు.

అంతవరకూ ఆ పాముని చూస్తూ గజగజా వణికిపోయిన భూషణం కాస్త వూపిరి వచ్చినట్లు కదిలాడు.

సర్పయ్య నవ్వుతూ "ఇంక భయం లేదు దొరా! లెగుండ్రి! ఇప్పుడు యిది పాము కాదు. తాడు. దీన్ని బుట్టలో పెట్టమంటారో, సంపెయ్యమంటారో సెప్పండ్రి" అన్నాడు గర్వంగా.

భూషణం ఖంగారుగా చూశాడు.

"ఇంకా బుట్టలో ఎందుకురా.....సంపెయ్యక" అన్నాడు.

"ఏదైనా ఒకటే దొరా! కాని సంపటం ఎందుకు దొర. కోరలు పీకి ఆడించుకుంటా!"

"ఒరి నీ దుంపదెగ! ముందు దాన్ని సంపరా" గావుకేక పెడుతూ కర్ర అందించాడు.

కర్ర అందుకుంటూ ముగ్గులోని పాముకేసి యాధాలాపంగా చూసిన పాముల సర్పయ్య అదిరిపడినట్లు అడుగు వెనక్కు వేశాడు.

సరిగ్గా అదే సమయంలో ఒక అద్భుతం జరిగింది.

అంతవరకు తోలుముక్కలా పడివున్న తాచు ఒక్కసారి సర్రున తోక మీద లేచి పడగ విప్పి, విస్సురుగా 'టప్'మని నేలకి కొట్టుకుంది.

ప్రపంచసుందరి

ఒక వైపు అందాల పోటీలను విమర్శిస్తూనే మరో వైపు భారీయెత్తున ఈ పోటీలను నిర్వహిస్తూ వుండటం, ఈ పోటీల్లో అనేకమంది తమ ఒంపుసొంపుల్ని చూపించటం మనం చూస్తూనే వున్నాం. ఇది యిలా వుండగా ప్రపంచ సుందరిగా ఎన్నికైన ఘనత మన దేశానికి చెందిన రీటాఫారియాకు దక్కుతుందట. ఆమె 1966 లో ఈవ్స్ వీక్లీ నిర్వహించిన మిస్ ఇండియా పోటీల్లో మనదేశ సుందరిగా ఎన్నికైంది. ఆ తర్వాత లండన్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీలో ఈమే ప్రపంచసుందరిగా ఎన్నికైందిట. అంటే ప్రపంచ సుందరిగా ఎన్నిక కావాలంటే ఫోటోలో మాదిరిగా వుండాలేమో?

అలా మూడుసార్లు వెంటవెంటనే పడగని నేలకి టపటప కొట్టుకుంది.

మూడవ దెబ్బకి దాని పడగ పూర్తిగా చితికి నజ్జునజ్జు అయిపోయింది.

నాగ బంధం ముగ్గు అంతా నల్లతాచు నెత్తురుతో తడిసిపోయి ముగ్గు కరిగిపోయింది.

పాము క్షణంలో విగతజీవి అయ్యింది.

కొద్ది క్షణాలముందు పడగ విప్పి తోక మీద లేస్తూ అందంగా నాగనృత్యం చేసిన తాచు నిర్జీవం అయిపోయింది.

పాముల సర్పయ్యతోపాటు భూషణం తదితరులు ఆ దృశ్యాన్ని చూస్తూ దిగ్భ్రాంతిగా నిల్చుండిపోయ్యారు.

భూషణం గభాల్న దూకినట్లు పాము దగ్గరకి వచ్చి "ఏందిరా యిది?" అన్నాడు గాభరాగా.

పాముల సర్పయ్య నోట మాట పడిపోయిన వాడిలా నీళ్లుకారిపోతూ రెండు చేతులూ జోడించి మోకాళ్లమీద ఒంగుతూ చచ్చిపడివున్న నల్లతాచు ముందు మోకరిల్లాడు.

"ఏందిరా సర్పిగా యిది?" భూషణం మళ్లీ ఖంగారుగా అడిగాడు.

సర్పయ్య వేదాంతిలా అన్నాడు.

"ఏముంది దొరా! ఇది నల్లతాచు. దాని పడగమీది నాగముద్ర చూస్తిరి కదా? ఇది దేవజాతి సర్పం దొరా! దానికి రోషం ఎక్కువ. పగబట్టిందంటే కాటు వెయ్యక మానదు. పగ తీర్చుకోలేకపోయింది......యిదుగో......యిట్లనే పడగ నేలకి కొట్టుకొని విషం కక్కుకొని చస్తుంది దొరా."

"అ.....ట్లా.....నా.....రా?"

"అవును దొరా. నాతాన వున్న నాగ వశీకరణ మూలిక తిరుగులేనిది. మణి గొప్ప మహత్తుగలది. మంత్రం మరింత పట్టున్నది.

అందుకే పాము లొంగిపోక తప్పలేదు.

పగబట్టిన మడిసి ఎదురుగానే వున్నా సంపలేనని, పగ దీర్చుకోలేనని తెల్సుకొని రోషంతో అదే తన పడగని నేలకి కొట్టుకొని చచ్చిపోయింది దొరా. నాగజాతిలోని గొప్పదనమే అది" అంటూ చేతులు జోడించి తలని భూమికి ఆన్చాడు సర్పయ్య.

పొట్ట కూటికోసం పాముల్ని పట్టే, కోరలు పీకి, విషం పిండే క్రూరుడే అయినా సర్పజాతి దేవలోకానికి చెందినదని నమ్మే మనిషి సర్పయ్య.

అందుకు మంత్ర తంత్రాలకి అవి లొంగుతాయని వాదిస్తాడు. ఆ నల్లతాచు రోషానికి, మృతికి జోహారులందిస్తున్నట్లు సర్పయ్య కళ్ళ నిండా నీళ్ళూరాయి.

చుట్టూ మూగిన ఊరి ప్రజలు కూడా దిగ్భ్రాంతులైనట్లు బొమ్మల్లా చూస్తూ నిల్చుండిపోయ్యారు.

అప్రయత్నంగా అందరిహస్తాలు ముకుళించుకున్నాయి.

భక్తి భావంతో వారి హృదయాలు పులకరించాయి.

పాము మరణంతో భూషణంకి ఏనుగెక్కినంత ఆనందంగా వుంది.

వెయ్యి జ్యోతుల కాంతిలో ముఖం వెలిగిపోతూంది. లోకాల్ని జయించిన వీరుడిలా

పాము పగ

రివిగా మీసం మెలివేస్తూ విగతజీవియైన పాముకేసి నిర్లక్ష్యంగా చూస్తున్నాడు.

అంతవరకు పాము కాటుతో భూషణం మరణం ఖాయం అనుకుంటున్న ఊరి ప్రజలు పామే మరణించటంతో నిర్విణ్ణులయ్యారు.

జలగలా ఊరిని పట్టి పీడిస్తున్న భూషణం పీడ పాముకాటుతో విరగడై పోతుందని ప్రతి ఒక్కరూ లోలోన సంతోషించారు. కాని

అసలు రంగు

అమ్మాయి రూపవతీ గుణవతీ
అయితేచాలు! కట్నానికి గుడ్‌బై!!
అని ఆదర్శాలు వల్లించే అబ్బాయి
అసలురంగు తెలిసేదల్లా-
కాపురాని కొచ్చిన అమ్మాయి
చిత్రహింసలు భరించలేక
అగ్గిపుల్ల- కిరోసిన్ డబ్బాని
ఆశ్రయించినపుడే! పత్రికల్లో
సంచలనవార్తకి చోటిచ్చినపుడే!!

-'జ్వాలా'గోపీనాథ్

వాళ్ల ఊహలు తారుమారు అయ్యాయి.

అందుకే-

మృత్యువుని జయించి రీవిగా మీసం మె వేస్తున్న తమ గ్రామపెద్ద భూషణం ద కేసి ఎవ్వరూ చూడటంలేదు. ప్రశంసించట లేదు.

నల్లతాచు మరణం వాళ్లని కదిల్చివేసింది గుండెలు నీరయినట్లు అలా దిగ్భ్రాంతిగ పాముకేసి చూస్తూ వుండిపొయ్యారు.

ఇప్పుడది వాళ్లకి పాములా కాక ప పాపలా కనిపిస్తుంది. వాళ్ళ చూపుల నిండ దైన్యం నిండిపోయింది.

ఎన్నో కుటుంబాలని కూల్చివేసి వా ఉసురు పోసుకుంటున్న భూషణం బ్రతికాడు


"కాని రోషంవున్న ఒక విషసర్పం. ఆ క్రూరుడి చేతిలో చావటం యిష్టంలేక నిజ యితీతో ఆత్మార్పణ చేసుకొంది. నిజంగ పాము దేవలోకానికి చెందినదే" అన్న భావ వాళ్ల చూపులనిండా ద్యోతకమవుతోంది.

ఉన్నట్లుండి గుంపులో నుంచి కదలిక వచ్చింది.

మరుక్షణం -

"నాగరాజుకి జై....." అన్న నినాద లతో ఆ బంజరు ప్రాంతమంతా మారు మ్రోగింది.

(అయిపోయింది)


బళ్ళు తెరిచారు! - శేఖర్.
మీ నాన్న కావాలా? ఎందుకూ?
మరేం లేదు సార్! వైట్ పేపర్లూ, పెన్సిల్లూ, బ్రౌన్ షీట్లూ తెమ్మని రోజూ చెప్తూంటే మర్చిపోతున్నారు - ఒకసారి గుర్తుచేద్దామని వచ్చా!
ఇన్‌చార్జి ప్రిన్సిపాల్
MANAGER
పోయిన సారి డొనేషన్ కట్టేగా స్కూల్లో జాయిన్ అయ్యింది! ఇప్పుడు మళ్ళీ డొనేషన్ ఎందుకు?
పోయిన సారి కట్టిందంతా మొన్న తుఫానుకి పడిపోయిందట అందుకు!
ఈసారి కాన్వెంట్లో సీటెలా రాదో చూస్తా!!!
మీరు కూడా మీ అబ్బాయికి స్కూల్లో సీటు సంపాయించలేకే ఇక్కడికొచ్చారా స్వామి?!!
సెలవులన్నాళ్ళూ పచారి షాపునుంచి సరుకులన్నీ నేనే మోసుకొచ్చాను కాబట్టే ఇప్పుడు స్కూలుకి పుస్తకాల బరువు మోసుకెళ్ళే అలవాటు తప్పలేదు తెల్సా!
నా ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలో కూడా ఇంత కష్టమైన ప్రశ్నల్ని నేను ఫేస్ చేయలేదురా బాబూ!!
DINGDONG CONVENT
సీటు కోసం ఇంటర్వ్యూలు

పుస్తకాల సృష్టి

గుడిపాటి వెంకటచలం

ఆర్. ఎస్. సుదర్శనంగారి కలానికి రెండు వైపులా "వాడి" వుంది. విమర్శకుడు, రచయిత- ఒకరితో వొకరు తగాదాపడకుండా ఆయనలో దర్శనమిస్తారు! గుడిపాటి వెంకటచలం గురించి "చలం" కథల గురించి- అతని జీవితాన్ని- జీవించిన కాలాన్ని వదలిపెట్టకుండా సాహిత్య దృష్టితో విశ్లేషిస్తూ 130 పేజీలలో సమగ్రంగా చెప్పగలిగిన ఆర్. ఎస్. సుదర్శనంగారు యీ పుస్తకంలో "చలం" జీవించిన సమాజంలో అతనితో కలిసి- కలవకుండా జీవించిన సాహితీమూర్తులను కొంతమందిని సంస్కరణ వాదులను సందర్భోచితంగా మనకు చూపెడతారు. కథా కథనశైలిలో – చకచకా చదివించే రీతిలో 'చలం' గురించి శ్రీ సుదర్శనం యిందులో యీతరం పాఠకులకి చాలా సంగతులు చెపుతారు! నిజమే చలం వివాదాస్పదుడే కాని ఎంత ఉదారంగా విశాల హృదయంతో యీ సత్యాన్ని సుదర్శనంగారు ఆవిష్కరించారు?- ఈ పుస్తకం "చలం" విషయంలో ఎవరికిగల అభిప్రాయాలు వాళ్లకి వున్నప్పుడు కూడా "రక్తి"గా చదివిస్తుంది! ప్రచురణ సాహిత్య అకాడమి- వెల 5 రూపాయలు.

* అరవై వసంతాల శార్వరి

పుటలు: 240, వెల: ముప్పయి రూపాయలు, ప్రతులకు: మాస్టర్ సి.వి.వి. యోగ పాఠశాల, 1-1-694/2/ఎ, గాంధీనగర్, హైదరాబాద్-500 380.
శార్వరి వ్యక్తిత్వాన్ని శ్లాఘిస్తూ అనేక మంది రచయితలు అందించిన అభిప్రాయాలు ఈ సంకలనంలో పొందుపరచబడినాయి.

* మా సంతోష చంద్రశాల

పార్వతీపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ సంకలనం వెలువరించబడింది. గిరిజన విద్యాలయాల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని ఈ పుస్తకం తీసుకురావటం జరిగింది.

* వానవచ్చె-వరదవచ్చె

ఖండ కవితా మంజరి: కవి: ఊట్ల కొండయ్య, పుటలు: 50, వెల: ఐదు రూపాయలు, ప్రాప్తి స్థానం: పింగళి-కాటూరి సాహిత్యపీఠం, కేర్ మాధవి ప్రింటర్స్, కుత్బిగూడ, హైదరాబాద్-500 027.

* గులాబి

రచయితలు: దేవరకొండ సుబ్రహ్మణ్య శాస్త్రి, రాచకొండ వి.యస్. సుబ్బలక్ష్మి, పుటలు: 26, వెల: ఐదు రూపాయలు, ప్రతులకు: శ్రీ కళాభారతి, బొబ్బిలి-532 558.

రాజమండ్రిలో జరిగిన శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి రచించిన 'శ్రీరామ వాణి' ఆవిష్కరణ మహోత్సవ చిత్రం. ఆవిష్కర్త శ్రీమతి డి.వి. రమణ, సభాధ్యక్షులు శ్రీ పుణ్యమూర్తుల వెంకట రామచంద్రరావు, వక్తలు శ్రీ ఆర్.బి. పెండ్యాల, శ్రీ పి.బి. వీరాచారిలను కూడా చిత్రంలో చూడవచ్చు.



42 దేశాలలో గాంధీజీ

వివిధ దేశాల స్టాంపుల మీద మన ప్రముఖులు'



వివిధ రంగాల్లో ప్రముఖులను గుర్తించుకోడానికీ, చిరస్మరణీయుల పట్ల గౌరవ సూచకంగానూ ఆయా దేశాలు వారి స్టాంపులను ముద్రించడం ఆనవాయితీ.

విశ్వవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులార్జించిన వాళ్ల స్టాంపులను కేవలం వాళ్ల స్వదేశం మాత్రమే కాక ప్రపంచంలోని ఇతర దేశాలు కూడా స్టాంపు రూపేణా గౌరవిస్తాయి.

అమెరికా ప్రెసిడెంట్ అబ్రహాం లింకన్, నటుడు ఛార్లీ ఛాప్లిన్ వంటి వారి స్టాంపులను మనదేశం విడుదల చేసినట్టే- మనదేశంలో ప్రముఖులను విదేశీ ప్రభుత్వాలు స్టాంపుల మీద ముద్రించాయి.

ఉదాహరణకు ఇక్కడ ఇచ్చినవి మాత్రమే కాకుండా, సుమారు డజను మంది మన దేశప్రముఖులు విదేశీ స్టాంపుల మీద చోటు చేసుకున్నారు. ఈ లిస్ట్‌లో గాంధీజీ ఫస్ట్. సుమారు 42 దేశాలు ఆయన స్టాంపు ముద్రించాయి. తర్వాత స్థానం రవీంద్రనాధ్ టాగూర్‌ది. 40 దేశాలు ఆయన స్టాంపు విడుదల చేశాయి. బుద్ధుని దగ్గర్నుంచి మాజీ రాష్ట్రపతి జైల్‌సింగ్ దాకా ఓ డజను మంది భారతీయుల స్టాంపులు దాదాపు 100 వరకూ- ఇతర దేశాలు స్టాంపులుగా ముద్రించి వారిని గౌరవించాయి.

–భాగవతుల సుబ్రహ్మణ్యం



ఈ ముఖాలు వేసిన దేశాలివి

జైల్ సింగ్ - దక్షిణ కొరియా

గాంధీ - వెనిజులా

స్వామి శివానంద - - మారిషస్

విజయలక్ష్మీ పండిట్ - - లైబీరియా

జనరల్ తిమ్మయ్య - - సైప్రస్

లాల్ బహదూర్ శాస్త్రి - (హంగేరీ) - మగ్యార్

మహావీర జైన - - జర్మనీ

సర్ సి.వి. రామన్

ఇందిరాగాంధీ - రష్యా



రేఖ సమావేశాలు



రేఖ తన ఇంటర్వ్యూలకోసం జనం ఆరా టపడటం చూసి తానే సమావేశాల్ని ఏర్పాటుచేసి ఆ సమావేశ విశేషాల్ని స్వయంగా సినిమా పత్రికలకు పంపిస్తోం దట. ఆ విశేషాలతోపాటు భర్త ముఖేష్ అగర్వాల్‌తో తీయించుకున్న ఫొటోలు క్యాప్షన్లతో సహా పంపుతుందట మళ్లీ ఎడిటర్లు యిబ్బంది పడకుండా. ఇదో రకం ప్రచారం కాబోలు!

వీక్లీ పోస్టు

(4వ పేజీ తరువాయి)

సస్పెన్స్ సీరియల్స్

వాణీ విశ్వనాథ్ ఒకే రూపును రెండుగా చిత్రించడం రియల్లీ సూపర్బ్. దుస్తులు ఇబ్బంది పెట్టినా ఫర్వాలేదు. అలనాటి సురభి కమలాబాయి నటనా స్మృతుల నందించిన శ్రీ సూరిబాబు అభినందనీయులు. దెయ్యం కథలో ఆఖరిలో కొస మెరుపు (డేవిడ్ ఉత్తరం) అద్భుతం. నవ్వుల నది...లో మిసెస్ చతుర్ముఖ, మిసెస్ శివ ఇంటర్వ్యూలు కలయా? నిజమా? "హిట్‌లిస్టు"లో పార్వతి ప్రాణం బహు గట్టిదనిపిస్తోంది. గళ్ళ నుడికట్టు, ఎడిటోరియల్ ఎక్స్‌ట్రా టు ఎ. పి. వీక్లీ!ఫెంటాస్టిక్!!

-బి. ఆర్. మూర్తి, మచిలీపట్నం

కుటుంబమంతా

మీనాక్షి శేషాద్రి సంచికతో వెలువడిన జ్ఞానోదయం-కథ చాల బాగున్నది. ఇంత మంచి కథలు మన పత్రిక ఒక్కటే అందించకలదని నిరూపించుకున్నది. అందు గురించే మన పత్రికకు ఏ పత్రిక సాటి లేదు. ఇంకా ఇలాంటి మంచి కథలు మాకు అందిస్తారు అని ఆశిస్తున్నాను. శాతవాహనగారి వజ్రసంకల్పం నాకు చాలా బాగా నచ్చినది. మాకు తెలియని ఎన్నో వజ్రాల గురించి తెలియపరుచున్నారు. శాతవాహనగార్కి నా అభినందనలు. మన్నెం శారదగారి సూపర్ హీరో సూపర్‌గా ఉంది. మా వారికి కూడా ఎంతగానో నచ్చినది. అందుకు నిదర్శనం ఆయన వీక్లీ తేగానే సూపర్‌హీరో చదువుతారు. ఇంక లవ్ గేమ్ అంటారా దానికి అదేసాటి. సీరియల్‌లో ఇంకా మసాలవేస్తే ఇంకా మజాగా ఉంటుంది. ఇన్ని మంచి కథలు, సీరియల్స్ అందిస్తున్న మీ అందరికి మా కుటుంబం తరుపున నా అభినందనలు.

-కొచ్చెర్ల రాగవమ్మ, కాకినాడ

సీరియల్స్

అందాలతార భానుప్రియ అందంగా ఉంది (పత్రిక ఆలస్యమౌతుంది). సీనియర్ రైటర్ మన్నెం శారదగారి 'సూపర్‌హీరో' మా మనసుల్ని దోచుకుంటుంది. తన భార్య గురించి, కొడుకును పట్టించుకోని గోపాలరావు ఎన్నికల సమయంలో నటుడిగా మంచి పొజిషన్‌లో ఉన్న తన కొడుకు విజయేంద్రను వాడుకోవాలన్న ప్లాను ఫెయిల్ అయింది. తల్లి ఆజ్ఞతో విజయేంద్ర మున్ముందు ఏం చేస్తాడోనన్న సస్పెన్సుతో శారదగారు తన కలంలోని బలాన్ని చక్కగా ఉపయోగిస్తున్నారు. అలాగే ఇంకో మంచి రైటర్ 'చల్లా'వారి 'లవ్‌గేమ్' కూడా చక్కని సరసంతో నడుస్తోంది, శ్రీమతి సలహాతో నవ్య బర్త్‌డే ఫంక్షన్‌లో నటించడానికి ఒప్పుకోవడం, శైలజ దంపతుల అన్యోన్యతను 'నటన' అని తెలియక అవాక్కవడం బాగుంది. ఆఖరుగా నవ్య స్వాగత్‌ను తన చెప్పుతో కొట్టాలని ప్రయత్నించడం అంటూ... పాఠకులను సస్పెన్స్‌లో ఉంచారు. నవరసాలతో సరదాగా ఉంది సీరియల్. 'జి.పి' గారి 'హిట్‌లిస్ట్' ఎత్తులు జిత్తులతో బాగుంది. శివాజీ, రజనిల దొంగతనాలు సినిమా హాల్లో నెక్లెస్ దొంగతనం ఫ్యాషన్‌షోలో 'రజని' చేరటం మున్ముందు ఏం జరుగుతుందోనని పాఠకులు ఊహించలేకుండా ఉన్నారు. అలాగే ద్రౌపది, వజ్రసంకల్పం చక్కని సీరియల్స్, ఐదు సీరియల్స్ ఆణిముత్యాల్లా ఉండి సాహితీ విలువలు కలిగి ఉన్నాయి. ఇలాంటి మంచి సీరియల్స్ ఎన్నుకున్నందులకు ఎడిటర్‌గార్కి థాంక్స్. 'టానా' పోటీలలో గెలుపొందిన కథలు, కవితలు చక్కగా ఉన్నాయి. నేడున్న వీక్లీలో ఆంధ్రసచిత్ర వారపత్రిక అగ్రస్థానంలో ఉంది.

-శ్రీమతి పోలోజు ధనలక్ష్మి (బోడుప్పల్)

అగ్రిమెంటు

'టానా' మన పత్రిక సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో వచ్చిన కథలన్నీ అద్భుతంగానే వున్నాయి. ఈ వారం వచ్చిన 'అగ్రిమెంట్' కథకూడా ఆ కోవకు చెందినదే. కట్నాల మత్తులో దాబుకుపోయే బడాబాబులకు చక్కని గుణపాఠం ఈ కథ.

కనిటి రామకృష్ణారావు (ఖమ్మం)

సినిమా... సినిమా...

"పద్మావతీ కల్యాణం"

వై. హరికృష్ణ సారధ్యంలో శ్రీకృష్ణకమల్ ప్రొడక్షన్స్ వారి "పద్మావతీ కల్యాణం" చిత్రానికి మే 5న ప్రారంభోత్సవం జరిగింది నరేష్, జగ్గయ్య, చంద్రమోహన్, సత్యనారాయణ, గొల్లపూడి మారుతీరావు, రాళ్ళపల్లి, అల్లు రామలింగయ్య, వేలు, సాయికుమార్, చక్రవర్తి, చిట్టిబాబు, శ్రీవిద్య, మంజుల నటిస్తున్నారు. గొల్లపూడి మారుతీరావు మాటలు, చక్రవర్తి సంగీతం, ఆర్ రామారావు చాయ, సోమనాధ్ శిల్పంతో రేలంగి నరసింహారావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు

పూర్ణతేజా క్రియేషన్స్‌లో రాజేంద్రప్రసాద్, వంశీ

"కోలపల్లి ఈశ్వరరావు, ఎం ఐ. కిషన్‌ల 'హరిశ్చంద్రుడు అబద్ధమాడితే' నవల ఆధారం రాజమండ్రిలో జూన్ 21 నుంచి ఒకే షెడ్యూల్లో షూటింగ్ ముగుస్తుంది," అన్నారు వంశీ. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో పి. భాస్కరరెడ్డి చిత్ర స్రవంతి సమర్పణలో నిర్మించే పూర్ణతేజా క్రియేషన్స్ చిత్రంలో రాజేంద్రప్రసాద్ హీరో. సిరివెన్నెల సీతారామశాస్త్రి గీతాలు, ఇళయరాజా సంగీతం, హరి అనుమోలు చాయ, గొట్టి ముక్కల పద్మారావు నిర్మాణం, ఉమాశంకర్‌బాబు కూర్పుతో మండవ గోపాలకృష్ణ ప్రమోటర్

"అగ్నిసాక్షి"

"నేడు పంజాబ్, జమ్ము కాశ్మీర్‌లో జరుగుతున్న వేర్పాటు మతతత్వ ధోరణులను వ్యతిరేకిస్తూ సాగే చిత్ర కథ," అన్నారు ఎం ఎ అజీజ్. ఈయన స్వీయ దర్శకత్వంలో రాజమండ్రిలో నిర్మిస్తున్న శ్రీ సరోజిని చిత్రాలయ వారి "అగ్ని సాక్షి" చిత్రంలో అర్జున్, శాంతిలత, మంజు, దగ్గుబాటి రాజా, చలపతిరావు, త్యాగరాజు, కె కె శర్మ, వంకాయల, కిరణ్, బాబు, వాహిని, జయశీల, రేఖ, డిస్కోశాంతి పాల్గొంటున్నారు. డాక్టర్ ఎ. వి. కృష్ణారెడ్డి కథకు ఓంకార్ స్క్రిప్టు రాశారు. రాజ్- కోటి సంగీతం, మహీధర్ ఛాయ, శివసుబ్రహ్మణ్యం నృత్యాలు, ముస్తఫా సాహసాలు, సురేష్‌కుమార్ సహదర్శకత్వం, వేమూరి రవి కూర్పు.

కృష్ణ దర్శకత్వంలో "బాలచంద్రుడు"

"అక్క జీవితాన్ని నిలబెట్టడానికి తమ్ముడుచేసిన సాహసం ఈ చిత్ర కథ," అన్నారు కృష్ణ ఈయన స్క్రీన్‌ప్లే, కూర్పు, దర్శకత్వంలో పద్మావతి, మంజుల నిర్మిస్తున్న పద్మాలయా క్రియేటర్స్ "బాలచంద్రుడు" చిత్రంలో మహేష్‌బాబు, శరత్‌కుమార్, గీత ప్రభృత నటవర్గం భీశెట్టి కథ, పరుచూరి సోదరుల మాటలు, రాజ్- కోటి సంగీతం, శ్రీను- శివసుబ్రహ్మణ్యం నృత్యాలు, త్యాగరాజన్ సాహసాలు, పుష్పాల గోపీకృష్ణ చాయ నిర్వహిస్తున్నారు (జి వి. జి.)

"నాయకురాలు"లో ఓ దృశ్యం



శ్రీతులసి

హిమబిందు తాజాదనం మీ చర్మములో ఉన్నదా ?

హిమబిందువలె మీ చర్మాన్ని తాజాగా, మృదువుగా వుంచడానికి శతాబ్దాలుగా ఆయుర్వేదం తులసియొక్క గుణాలను ఔషధరూపంలో లభింపజేస్తోంది. ఈ గుణాలను శ్రీతులసి ఇప్పుడు మీకు క్రీము రూపంలో అందిస్తోంది.



శ్రీతులసిలో గల తులసి చర్మం లోపలి భాగాలకు చొచ్చుకుపోయి మొటిమలు, గాయాలు, కోతలు మరియు ఇతర చర్మ వ్యాధులను నయం చేస్తుంది. క్రమం తప్పక శ్రీతులసి వాడినట్లయితే మీ చర్మం స్వచ్ఛముగా మచ్చలు లేకుండా వుంటుంది. మరి ఇవే శ్రీతులసి గుణాలు. హిమబిందు వంటి తాజాదనాన్ని ఈరోజే మీ సొంతం చేసుకోండి.



పింపుల్స్ కట్స్ బర్న్స్



శ్రీతులసి స్వాభావికం సురక్షితం ఉపయుక్తం

హిరావత్ ఇండస్ట్రీస్, విశాఖపట్నం-10